సత్యమేవ జయతే

సాక్షి

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 62

శనివారం 24-5-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



లైఫ్@360

ఉత్సాహాన్ని తిందాం...



ఆడుతు పాడుతు పని చేస్తే అలుపూ సొలుపేమున్నది అని ఓ పాట ఉంది. అలాగే నాకు అది ఇష్టం, ఇది ఇష్టం లేదు అని అనకుండా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కొన్ని రకాల ఆహార పదార్థాలను తరచు తింటుండటం వల్ల ఉత్సాహంగా... ఉల్లాసంగా ఉండడంతోపాటు మెరుపులీనే చర్మం, మంచి ఆరోగ్యం మన సొంతం అవుతాయి. అవేమిటో చూద్దాం...

టొమాటో...

దీనిలోని లైకోపిన్ కాన్సర్ నిరోధకంగా పనిచేస్తుంది. గుండె, రక్తనాళాలకి సంబంధించిన అనారోగ్యాన్ని కూడా నిరోధిస్తుంది. మన చర్మానికి ఎండ తాలూకు ప్రభావాలనుండి రక్షించడంలో మిగతా పోషకాలతో పాటు టమాటోల పాత్ర చెప్పుకోదగినదే.





నట్స్...

ముఖ్యంగా వాల్‌నట్స్ లో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, ప్లాంట్ స్టెరోల్స్ సమృద్ధిగా ఉంటాయి. కొలెస్టరాల్ లెవల్ తగ్గించడంలో వీటి పాత్ర అమోఘం. వాల్నట్స్‌లో పీచుపదార్థం అధికం. మెగ్నీషియం, కాపర్, ఫోలేట్, విటమిన్-ఇ, ఉండి శక్తిమంతమైన యాంటి ఆక్సిడెంట్స్‌ని అందిస్తాయి. బ్లడ్ ప్రెషర్‌ను తగ్గిస్తుంది. ఆస్టియోపొరోసిస్ రాకుండా ఆపుతుంది. గుండె ఆరోగ్యాన్ని, చర్మానికి ఎండ నుండి కలిగే హానినుండి కాపాడుతుంది. ఆల్మండ్స్ చర్మకాంతికి తోడ్పడతాయి.



గ్రీన్ టీ...

ఇది ఓ సూపర్ డ్రింక్. రక్తపోటును నియంత్రణలో ఉంచుతుంది. చర్మాన్ని అంత త్వరగా ముడతలు పడనివ్వదు. కళ్ళకు మెరుపు అందిస్తుంది. కేటరాక్ట్ ముదరటాన్నీ నెమ్మదింపచేస్తుంది.



బీన్స్...

ప్రోటీన్స్, పీచుపదార్థం, విటమిన్లు, మినరల్స్, ఫైటోన్యూట్రియెంట్స్. ఇవన్నీ బీన్స్‌లో సమృద్ధిగా ఉంటాయి. అలాగే కొవ్వుకు సంబంధించిన చెడు లక్షణాలు ఉండవు. బీన్స్ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. షుగర్ లెవల్స్ సమతుల్యంగా ఉండేటట్లు చూస్తూనే సురక్షితమైన, నిలకడ అయిన నెమ్మదిగా ఖర్చయ్యే శక్తిని అందిస్తుంది. కొలెస్ట్రాల్ లెవెల్స్‌ని కొంతమేరకు తగ్గిస్తాయి. బీన్స్‌తో చేసిన కూరలు తిన్నప్పుడు కడుపు నిండినట్లు ఉంటోంది గాని అధిక క్యాలరీలు లేకపోవడం వలన బరువు పెరిగే సమస్యే ఉండదు.



ఆకుకూరలు...

ఆకుకూరలు చాలా రకాల క్యాన్సర్‌ల నుండి కాపాడుతాయి. వీటిలో విటమిన్ బి, సి, ఇ, ఫోలేట్, పొటాషియం, పీచుపదార్థం సమృద్ధిగా ఉంటాయి. ఎముకల ఆరోగ్యానికి మంచిది. కాల్షియంని శరీరం ఇముడ్చుకోవటానికి తోడ్పతాయి. కేటరాక్ట్‌ను నిరోధించడంలో పాలకూర తోడ్పడుతుంది.



ఎవరైనా తెలివితేటలను ఉపయోగించి సమస్య నుంచి బయటపడితే వారిని అపర చాణక్యుడు అని అంటాం. ఎందుకంటే భారతీయులలో చాణక్యుడికి గొప్ప స్థానం ఉంది. ఎందుకంటే చాణక్యుడు గొప్ప సలహాదారు, వ్యూహకర్త, తత్వవేత్త. అలాగే వేదాలు, పురాణాల గురించి పూర్తి అవగాహన ఉన్నవాడు. ఆయన జీవితంలో ప్రతి సందర్భాన్ని పురస్కరించుకొని కొన్ని నీతి సూత్రాలు బోధించాడు. అందులో కష్టాల్లో ఉన్నపుడు ఎలా మసులుకోవాలనే విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు.

ప్లానింగ్ @ చాణక్య

కొందరు సమస్యలను చూసి పెద్దగా టెన్షన్ పడరు. వాటిని తేలికగా ఎదుర్కొని పరిష్కరిస్తారు. మరికొందరు భయాందోళనలకు గురవుతారు. కష్టాలను ఎదుర్కొనలేక తమను తాము అసమర్థులుగా అనుకుంటారు. అటువంటి వారు ఆచార్య చాణక్యుడు చెప్పిన ఐదు విషయాలను తప్పక తెలుసుకోవాలి.

పక్కా ప్లానింగ్...

ఎవరికైనా సరే, సమస్యలు, సంక్షోభాలు తలెత్తినప్పుడు వాటినుంచి తప్పించుకుని తిరగాలని చూడకూడదు. వాటిని ఎదుర్కొనేందుకు పటిష్టమైన వ్యూహాన్ని రూపొందించుకుని ఉండాలి. అప్పటికప్పుడు ఆలోచించడం కాకుండా తగిన ప్లానింగ్‌తో ఉంటే ఆ సమస్య నుంచి తేలికగా బయటపడగలరు.

సంసిద్ధత...

చాణక్యుడు ఏం చెబుతాడంటే ఎవరైనా సరే, కష్టాలు వచ్చినప్పుడు బెంబేలత్తకుండా చాలా జాగ్రత్తగా ఉండాలి. ఊహించని కష్టాలు చుట్టిముట్టినపుడు సవాలక్ష సవాళ్లను ఎదుర్కోవలసి ఉంటుందని ముందే ఊహించి వాటిని ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలి. దీనినే కీడెంచి మేలెంచడం అంటారు. సమస్య నుంచి పారిపోవడం కంటే కూడా దానిని ఎదుర్కొనేలా ఎవరికి వారు సంసిద్ధంగా ఉండాలి.



ఓర్పు, నేర్పు...

చాణక్య విధానం ప్రకారం, ఎవరూ కూడా తన ప్రతికూల పరిస్థితుల్లో సైతం ఎప్పుడూ సహనం కోల్పోకూడదు. ఎప్పుడూ సానుకూల కోణంలో ఆలోచించాలి. మరీ ముఖ్యంగా, ఏదైనా ఇబ్బంది ఎదురైనప్పుడు ఓపిక పట్టాలి. నేర్పుతో దానిని అధిగమించేందుకు ప్రయత్నం చేయాలి. పరిస్థితి ఏమైనప్పటికీ, ఆ సమయంలో సహనం కోల్పోకుండా మంచి రోజులు వచ్చే వరకు ప్రశాంతంగా వేచి ఉండటం వల్ల ఉత్తమ ఫలితాలను పొందవచ్చు.

కుటుంబ సభ్యుల సంరక్షణ...

చాణక్య నీతి ప్రకారం, సంక్షోభ సమయాల్లో కుటుంబం పట్ల బాధ్యతను నెరవేర్చడం కుటుంబ పెద్ద లేదా కుటుంబ సభ్యుల మొదటి కర్తవ్యం. కుటుంబ సభ్యులను సంరక్షిస్తూనే, వారికి ఏదైనా సంక్షోభం ఏర్పడినప్పుడు దానినుంచి బయట పడేసేందుకు చర్యలు తీసుకోవడం అవసరం.

డబ్బు ఆదాపై దృష్టి పెట్టడం...

ఎల్లప్పుడూ డబ్బును ఆదా చేయాలి. ఆపద సమయాల్లో డబ్బు మిమ్మల్ని ఆదుకుంటుంది. సమస్యల్లో చిక్కుకున్నప్పుడు డబ్బు లేకపోతే చాలా ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఈ సూత్రాన్ని చాణక్యుడు దేశ కోశాగారం కోసం చెప్పినప్పటికీ అది మన ఇంటి కోశానికి కూడా పని చేస్తుంది.

పై సూత్రాలను మనసులో పెట్టుకుని వాటి ప్రకారం కుటుంబాన్ని నడిపించుకుంటే మనం కూడా అపర చాణక్యుల మవుతాం.

చాణక్యుడిని గొప్ప వ్యూహకర్త అంటారు. ఎందుకంటే భారత రాజకీయాలు, చరిత్ర దిశను మార్చడంలో ఈయన ప్రధాన పాత్ర పోషించారు. తన జీవితకాలంలో ఆయన విధాన సలహాదారుగా, వ్యూహకర్తగా, రచయితగా, రాజకీయవేత్తగా వివిధ పాత్రలు పోషించారు. మానవ స్వభావం, జీవితం గురించి ఆయన చెప్పిన సిద్ధాంతాలు నేటికీ చాలా ప్రయోజనకరంగా ఉంటున్నాయి.

వీటిని కుక్ చేయెద్దు

ప్రెజర్ కుకర్ ప్రతి ఇంటిలోనూ ఉంటుంది. వంటకు ప్రెజర్ కుకర్‌ను ఉపయోగించని వారుండరు. అయితే ఈ ఐదు వస్తువులను ప్రెజర్ కుకర్‌లో ఎప్పుడూ ఉడికించకూడదని పరిశోధకులు చెబుతున్నారు.



పాలు మరిగించరాదు

పాలు, క్రీమ్ వంటి పాల ఉత్పత్తులను ప్రెజర్ కుకర్‌లో అస్సలు వండకూడదు. ఇలా చేయడం వల్ల వాటి రుచి చెడిపోతుంది. పోషకాలు కూడా తగ్గుతాయి. ఇలా కుకర్‌లో కాచిన పాలు ఆరోగ్యానికి హాని కరం. పాలు వేడి చేయడం సులభం అయినా సరే కొంతమంది పాలను కుకర్‌లో వేడి చేస్తున్నారు. పైగా పాలను వేడి చేసేందుకు స్పెషల్ కుకర్లు మార్కెట్‌లో లభిస్తున్నాయి. అయినా సరే ఇలా వేడి చేసిన పాలు ఉపయోగించడం ఆరోగ్యానికి హానికరం కావచ్చు.

వేయించిన పదార్థాలు

ఫ్రెంచ్ ఫ్రైస్, పకోడీలు వంటి వేయించాల్సిన ఆహార పదార్థాలను కుక్కర్‌లో వండకూడదు. వేయించిన వీటిని ప్రెజర్ కుకర్‌లో ఆవిరి మీద ఉడికిస్తే కరకరలాడే అనుభూతిని ఇవ్వదు. ఎందుకంటే వీటిని కుక్కర్‌లో డీప్ ఫ్రై చేయలేరు.ఇలా చేయడం వల్ల వాటికి మంచి రుచి రాదు. అందుకే వీటిని ఎప్పుడూ కుకర్‌లో తయారు చేసుకోవద్దు. అంతేకాదు అధిక నూనెతో వంటలు చేయడం వలన పేలుడు సంభవించే ప్రమాదం ఉంది. ఎందుకంటే కుకర్ సీల్, భద్రతా విధానాలు అధిక ఉష్ణోగ్రత ప్రతిచర్యలను తట్టుకోలేవు.

పాస్తా , నూడుల్స్

పాస్తా, నూడుల్స్ త్వరగా ఉడికించవచ్చు. ఇవి ఉడికిన తర్వాత మెత్తగా అవుతాయి. కనుక వీటిని ఎప్పుడూ ప్రెజర్ కుకర్‌లో ఉడికించకూడదు. అవి ఎక్కువగా ఉడికితే.. మెత్తం పేస్ట్‌లా మారతాయి. అందువల్ల వీటిని ప్రెజర్ కుకర్‌లో ఉడికించవద్దు.

ఆకుకూరలు

పాలకూర, కాలే వంటి ఆకుకూరలను కుకర్‌లో ఎప్పుడూ ఉడికించకూడదు. ఎందుకంటే ఆకుకూరల్లో విటమిన్ సి, ఐరన్, కాల్షియం, విటమిన్ ఎ వంటి అనేక పోషకాలు ఉంటాయి. అయితే ప్రెజర్ కుకర్‌లో వీటిని ఉడికించడం వల్ల ముఖ్యమైన పోషక పదార్థాలు తగ్గుతాయి. ఇది ఆరోగ్యానికి హానికరం.

కేక్

ప్రెజర్ కుకర్‌లో కేక్ కాల్చడం సరైనది కాదు. తరచుగా ప్రజలు ఓవెన్ లేకపోతే ప్రెషర్ కుక్కర్‌లో కేక్‌ని తయారు చేస్తున్నారు. అయితే ఇలా చేయడం పూర్తిగా తప్పు ఎందుకంటే ప్రెషర్ కుకర్ అనేది వంట కోసం తయారు చేయబడింది. బేకింగ్ కోసం కాదు. కనుక కుకర్‌లో కేక్ ఎప్పుడూ కాల్చకూడదు.

● ఇంటిప్స్



● వేసవిలో కుండీల్లో మొక్కలు త్వరగా వడలి ఎండిపోయినట్లుగా అనిపించడం సహజం. మొక్కలు అలా వడలిపోకుండా ఉండాలంటే ఎండుకొబ్బరి పీచును కుండిలోని మొక్కల మొదట్లో వేసి నీళ్ల పోయాలి. ఇలా చేయడం వల్ల కొబ్బరిపీచు నీటిని పీల్చుకుని ఉంటుంది. దీంతో మొక్కలు అవసరమైనప్పుడల్లా కొబ్బరిపీచు నుంచి నీరు తీసుకుని తాజాగా ఉంటాయి.



● కాలం ఏదైనా పగబట్టినట్లుగా దోమలు కుడుతుంటాయి. వీటిపీడ వదిలించుకోవాలంటే ..కొద్దిగా ఆయిల్‌ను వేడిచేసి స్టవ్ మీద నుంచి దించి.. దానిలో గుగ్గిలం వేసి కరగనివ్వాలి. ఇప్పుడు ఒక ఉల్లిపాయ తొక్కతీసి దారానికి వేలాడదీయాలి. ఈ ఉల్లిపాయకు గుగ్గిలం కరిగిన నూనె రాసి ఇంట్లో ఒక చోట వేలాడదీస్తే ఉల్లి, గుగ్గిలం ఆయిల్ వాసనకు దోమలు పారిపోతాయి.

సాక్షి సినిమా



● ఐశ్వర్యా రాయ్



● భగవద్గీత శ్లోకంతో...


వినోదం ఆరంభం



● చిరంజీవి

చిరంజీవి హీరోగా రూపొందుతున్న 'మెగా 157' (వర్కింగ్ టైటిల్) చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఆరంభం అయింది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. అర్చన సమర్పణలో సాహు గారపాటి, సుష్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. చిరంజీవితో పాటు ఇతర నటీనటులపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు అనిల్ రావిపూడి. ''చిరంజీవి ఫ్యాన్స్ ఎప్పటి నుంచో ఆయన్ని మళ్లీ పూర్తి స్థాయి వినోదాత్మక పాత్రలో చూడాలనుకుంటున్నారు. ఆ నేపథ్యంలో రూపొందుతోన్న చిత్రం 'మెగా 157'. ఈ మూవీని 2026 సంక్రాంతికి రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

జూన్‌లో గ్యాంబ్లర్స్



● సంగీత్ శోభన్

'మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్' చిత్రాల ఫేమ్ సంగీత్ శోభన్ హీరోగా రూపొందిన చిత్రం 'గ్యాంబ్లర్స్'. కేఎస్‌కే చైతన్య దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ప్రశాంతి చారులింగ హీరోయిన్‌గా, రాకింగ్ రాకేశ్ ముఖ్యపాత్రలో నటించారు. సునీత, రాజ్‌కుమార్ బృందావనం నిర్మించారు. నిర్మాణానంతర పనులు తుది దశకు చేరుకున్న ఈ చిత్రాన్ని జూన్ 6న విడుదల చేయనున్నట్లు ప్రకటించి, సంగీత్ ఫస్ట లుక్‌ను విడుదల చేశారు. కేఎస్‌కే చైతన్య మాట్లాడుతూ– ''మిస్టరీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'గ్యాంబ్లర్స్'. థ్రిల్లింగ్ అంశాలు, ట్విస్ట్‌లు ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తాయి. సంగీత్ నటనలోని మరో కోణాన్ని ఆవిష్కరించేలా ఈ చిత్రం ఉంటుంది'' అన్నారు. ''కొత్త కాన్సెప్ట్‌తో పూర్తి థ్రిల్లింగ్ అంశాలతో రూపొందిన మా సినిమా అలరిస్తుందనే నమ్మకం ఉంది'' అని సునీత, రాజ్‌కుమార్ తెలిపారు.


భగవద్గీత శ్లోకంతో ఐశ్వర్యా రాయ్

● కాన్స్‌లో ప్రత్యేక ఆకర్షణ ● చిన్న చేదు అనుభవం... చిరునవ్వుతో హుందాతనం

బెనారస్ చీర, కెంపుల హారం, నుదట సిందూరంతో ఫ్రాన్స్‌లో జరుగుతున్న 78వ కాన్స్ చిత్రోత్సవాల్లో మెరిశారు ఐశ్వర్యా రాయ్. కాగా రెండో అవుట్‌ఫిట్‌గా పొడవాటి గౌనుని ఎంచుకున్నారు ఐశ్వర్య. గౌరవ్ గుప్తా డిజైన్ చేసిన ఈ బ్లాక్ మోడ్రన్ ఫ్రాక్‌పై ధరించిన పొడవాటి క్రేప్ మీద భగవద్గీత శ్లోకం 'కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన...'ని ఎంబ్రాయిడరీ చేయించుకుని, ఇండియన్ ట్రెడిషన్ పట్ల తన మమకారాన్ని చాటారు. ఈ ఫ్రాక్‌లోనూ ఐశ్వర్యా రాయ్ బాగున్నారంటూ ప్రశంసలు లభించాయి. అలాగే భారతీయత ఉట్టిపడేలా భగవద్గీత శ్లోకాన్ని డిజైన్ చేయించడం పట్ల అభినందనలు లభించాయి. అయితే రెడ్ కార్పెట్ పై నడుస్తున్నప్పుడు ఈ బ్యూటీకి చిన్న చేదు అనుభవం ఎదురైంది. రెడ్ కార్పెట్ పై హాలీవుడ్ తారలు హెలెన్ మిర్రెన్, కారా డెలివిన్‌లు ఐశ్వర్యతో ఫొటో దిగారు. ఆ తర్వాత అక్కణ్ణుంచి వెళుతూ, హెలెన్ పొరపాటున ఐశ్వర్య క్రేప్ మీద కాలు వేశారు. అది గమనించని ఐష్ ముందుకు నడవగా, భుజాల మీద నుంచి క్రేప్ జారింది. ఊహించని ఈ సంఘటనకు ఐష్ కంగారు పడిపోకుండా హుందాగా చిరనవ్వుతో క్రేప్‌ని సరిచేసుకోవడం వీక్షకులను ఆకట్టుకుంది. 'ఇలాంటప్పుడు కొందరు కంగారు పడిపోతారు, కొందరు చిరాకుపడతారు... కానీ ఐశ్వర్య హుందాగా ప్రవర్తించారు' అంటూ ఈ అందాల రాశిపై వీక్షకులు ప్రశంసలు కురిపించారు. ఇక ఈ నెల 13న ఆరంభమైన కాన్స్ చిత్రోత్సవాలు నేటితో ముగుస్తాయి.

అట్లాస్ సైకిల్ షురూ

''కౌసల్యా కృష్ణమూర్తి, అథర్వ' చిత్రాల ఫేమ్ కార్తీక్ రాజు హీరోగా 'అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే' సినిమా షురూ అయింది. రాజా దుస్సా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో 'అనగనగా' మూవీ ఫేమ్ కాజల్ చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీ రామకృష్ణ సినిమా బ్యానర్‌పై గాలి కృష్ణ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి హీరో చైతన్య కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత డి. సురేష్‌బాబు క్లాప్ కొట్టారు. దర్శకుడు భీమనేని శ్రీనివాసరావు గౌరవ దర్శకత్వం వహించగా, దర్శక-నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ స్క్రిప్ట్‌ని యూనిట్‌కి అందజేశారు. అనంతరం రాజా దుస్సా మాట్లాడుతూ– ''ఇదొక పీరియాడికల్ మూవీ. హాస్యంతో పాటు ఎమోషనల్‌గానూ ఉంటుంది. 1980లో వరంగల్‌లో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కిస్తున్నాం'' అన్నారు. ''80వ దశకంలో జరిగే కథతో ఈ చిత్రం రూపొందుతోంది'' అన్నారు కార్తీక్ రాజు. ''వైవిధ్యమైన కథతో ఈ చిత్రం రూపొందుతోంది'' అని కాజల్ చౌదరి పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవంలో డైరెక్టర్ క్రాంతి మాధవ్ అతిథిగా పాల్గొన్నారు. తమ్మారెడ్డి భరద్వాజ, భీమనేని శ్రీనివాసరావు, సురభి ప్రభావతి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సహ నిర్మాతలు: మల్లవరం వెంకటేశ్వర రెడ్డి, రూప కిరణ్ గంజి, కెమేరా: గంగానమోని శేఖర్, సంగీతం: సురేష్ బొబ్బిలి.



● సురేష్‌బాబు, కాజల్ చౌదరి, కార్తీక్ రాజు

యువతకి థ్యాంక్ యూ



● తమ్మారెడ్డి భరద్వాజ, ధనుష్

ధనుష్ రఘుముద్రి, హెబ్బా పటేల్ జంటగా నటించిన చిత్రం 'థ్యాంక్ యూ డియర్'. తోట శ్రీకాంత్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రేఖా నిరోషా, వీర శంకర్, నాగ మహేశ్ ఇతర పాత్రలు పోషించారు. మహాలక్ష్మి ప్రొడక్షన్స్ పై పప్పు బాలాజీ రెడ్డి నిర్మించారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని దర్శక-నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ రిలీజ్ చేసి, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ''ఈ సినిమా నా కెరీర్‌లో కీలకమైనది'' అన్నారు ధనుష్ రఘుముద్రి. ''మా చిత్రం ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది'' అని పప్పు బాలాజీ రెడ్డి చెప్పారు. ''మా సినిమా యువతని ఆకట్టుకుంటుంది'' అని పేర్కొన్నారు లైన్ ప్రొడ్యూసర్ పునీత్ రెడ్డి.

ప్రేక్షకుల మీద భారం వేయకూడదు - నిర్మాత ఎస్‌కేఎన్



● నిఖిల్, ఎస్‌కేఎన్, అమర్, జోగి నాయుడు, రంగధామ్

''ప్రస్తుత పరిస్థితుల్లో తెలుగు సినిమా పరిస్థితి ఇబ్బందికరంగా ఉంది. మనమంతా కలిసి సినిమాను కాపాడుకోవాలి'' అని నిర్మాత ఎస్‌కేఎన్ కోరారు. నిఖిల్ దేవాదుల హీరోగా నటించిన చిత్రం 'ఘటికాచలం'. అమర్ కామేపల్లి దర్శకత్వంలో ఎం.సి. రాజు నిర్మించిన ఈ సినిమాను మాస్ మూవీ మేకర్స్‌పై దర్శకుడు మారుతి, ఎస్‌కేఎన్ ఈ నెల 31న రిలీజ్ చేస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఎస్‌కేఎన్ మాట్లాడుతూ– ''ప్రేక్షకులు థియేటర్స్‌కు రావడం తగ్గిపోయింది. ఇందుకు కారణం టికెట్ ధరలు, పాప్‌కార్న్ ధరలు. ప్రేక్షకుల మీద భారం వేయకుండా వారికి వీలైనంత తక్కువలో ఎలా వినోదం అందించాలనే విషయంపై పరిశ్రమలోని పెద్దలంతా దృష్టి సారించాలి. ప్రేక్షకులు థియేటర్స్‌కు వస్తే ఎగ్జిబిటర్స్ బాగుంటారు. మన తెలుగు సినిమాను బతికించుకునే ప్రయత్నం చేయాలి. ఇక హారర్ చిత్రాలు ఇష్టపడే ప్రేక్షకులు 'ఘటికాచలం'ను థియేటర్లోనే చూడండి'' అన్నారు. ''ఈ చిత్రంలో హారర్, సస్పెన్స్, థ్రిల్లర్ అంశాలు ఉన్నాయి'' అన్నారు అమర్ కామేపల్లి. ''హీరోగా నా మొదటి చిత్రం 'ఘటికాచలం'' అన్నారు నిఖిల్ దేవాదుల. కెమేరామేన్ ఎస్ఎస్ మనోజ్, నటులు రంగధామ్, షాన్, రైటర్ శ్రీనివాస్ మల్కార్ తదితరులు మాట్లాడారు.

హలో చెప్పడానికి కోవిడ్ వచ్చింది




● నికితా దత్తా

నటి శిల్పా శిరోద్కర్ తనకు కరోనా సోకిందని దాదాపు ఐదు రోజుల క్రితం పేర్కొన్న విషయం తెలిసిందే. తాజాగా శుక్రవారం బాలీవుడ్ నటి నికితా దత్తా తాను కూడా కరోనా బారిన పడ్డానని సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. ''మా అమ్మకు, నాకూ... మా ఇద్దరికీ పాజిటివ్ అని నిర్ధారణ అయింది. మా ఇద్దరికీ హలో చెప్పడానికి కోవిడ్ వచ్చింది. ఆహ్వానం లేకుండా వచ్చిన ఈ అతిథి ఎక్కువ రోజులు ఉండదనే అనుకుంటున్నాను. చిన్న క్వారంటైన్ తర్వాత కలుద్దాం. అందరూ జాగ్రత్తగా ఉండండి'' అని పేర్కొన్నారు నికితా దత్తా. కాగా... ఇటీవల విడుదలైన హిందీ చిత్రం 'జ్యువెల్ థీఫ్'లో నటించారు నికిత. ఈ చిత్రంలో సైఫ్ అలీఖాన్ హీరోగా నటించారు.

ఓటీటీ ఇది చూడొచ్చు

ఇది ఓ వాస్తవ గాథ

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హిందీ చిత్రం డిప్లొమాట్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



వాస్తవ కథలను సినిమాగా తీయడం ఓ సవాల్ అనే చెప్పాలి. అందులోనూ నిజంగా జరిగిన సున్నిత ఘటనలను సినిమా రూపంలో తీయాలంటే దర్శకుడికి కత్తి మీద సామే. అలాంటి ప్రయత్నమే 'డిప్లొమాట్' సినిమాలో చేశారు దర్శకుడు శివమ్ నాయర్. ఈ మూవీ చూస్తున్నంతసేపూ ఆ కథను మనం దగ్గరగా చూస్తున్న అనుభూతి కలుగుతుంది. ఎందుకంటే ఈ సినిమాలో దర్శకుడు నటీనటులతో జీవింపచేశారు. జాన్ అబ్రహాం ప్రధాన పాత్రలో నటించగా సాధియా కతీబ్ మరో పాత్రలో నటించారు. ఇక ఈ సినిమాలో ఏం ఉందో చూద్దాం. ఇదో యథార్థ గాథ. 2017లో ఉజ్మా అహ్మద్ అనే భారతీయ వివాహితను పాకిస్తాన్‌కు చెందిన తాహిర్ అనే యువకుడు మాయ మాటలతో తమ దేశం రప్పించుకుంటాడు. కేన్సర్ బారిన పడ్డ ఉజ్మా కూతురు వేరే దేశంలో ఉంటుంది. తన కూతురి ఆరోగ్యం కోసం డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో తాహిర్ వలలో పడుతుంది ఉజ్మా. పాకిస్తాన్ వెళ్లాక ఉజ్మాకు అతని అసలు రంగు తెలుస్తుంది. తరువాత తాహిర్ ఆమెపై అత్యాచారం జరిపి, చిత్రహింసలు పెడుతుంటాడు. ఈ దశలో ఆ అమ్మాయి అతని దగ్గర నుండి తప్పించుకుని పాకిస్తాన్‌లోని ఇండియన్ ఎంబసీలోకి శరణార్థిగా ప్రవేశిస్తుంది. అక్కడ ఉన్న ఇండియన్ ఎంబసీ అధికారి అయిన జేపీ సింగ్‌కు తన గోడు వెళ్ళబోసుకుంటుంది. ఇంతలో తాహిర్ నానా రకాలుగా ఎంబసీలోకి రావడానికి ప్రయత్నించి చివరకు ఉజ్మా మీద, ఇండియన్ ఎంబసీ మీద కేసు పెడతాడు. అక్కడ నుండి కథ పలు మలుపులు తిరిగి, చివర్లో ఉజ్మాను భారతదేశానికి జేపీ సింగ్ ఎలా క్షేమంగా చేర్చాడన్నదే సినిమా. ఇక్కడ ఉజ్మా వల్ల భారత్-పాకిస్తాన్ మధ్య దౌత్యపరమైన ఇబ్బందులు చాలానే వస్తాయి. వాటిని అధిగమించి ఈ భారతదేశ బిడ్డను పాకిస్తాన్ నుండి ఎలా చేర్చాడు అన్నది కళ్ళకు కట్టినట్టు చూపించారు దర్శకుడు. సినిమా చివర్లో నిజమైన ఉజ్మాతో పాటు అప్పటి ఎంబసీ అధికారిని... వారి చిత్రాలతో చూపించడం చాలా బావుంది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమ్ అవుతున్న ఈ 'డిప్లొమాట్' నిజంగా సూపర్ థ్రిల్లర్. వర్త్‌ఫుల్ వాచ్ ఫర్ వీకెండ్.

– హరికృష్ణ ఇంటూరు



'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 62

శనివారం 24-5-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



బెంగళూరుకు రైజర్స్ బ్రేక్

మెరిసిన ఇషాన్, కమిన్స్, ఆర్‌సీబీపై సన్‌రైజర్స్ ఘనవిజయం -15లో



ఇక్కడి సంస్కృతికి ఫిదా

హెడ్ టు హెడ్ చాలెంజ్‌లో గెలిచిన సుందరీమణుల పరిచయం -14లో



అసాధారణ అభివృద్ధి

ఈశాన్యంలో అభివృద్ధిని మరింత వేగవంతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

- వివరాలు 6లో▶



'మైసూర్'లో 'పాక్' మాయం!

'మైసూర్‌పాక్'లో దాయాది పేరు ధ్వనిస్తోందనే కారణంతో జైపూర్‌లోని మిఠాయి వ్యాపారులు ఆ పేరును 'మైసూర్‌శ్రీ'గా మార్చేశారు.

- వివరాలు 6లో▶



యాపిల్‌కు ట్రంప్ అల్టిమేటం

ఐఫోన్లను భారత్‌తో సహా మరెక్కడ ఉత్పత్తి చేసినా 25 శాతం దిగుమతి సుంకం తప్పదని ట్రంప్ తాజాగా అల్టిమేటం జారీ చేశారు.

- వివరాలు 6లో▶



ల్యాండింగ్ ఆలస్యమై..

రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్ దాడుల నేపథ్యంలో భారత దౌత్య బృందం ప్రయాణిస్తున్న విమానం గాల్లోనే చక్కర్లు కొట్టింది.

- వివరాలు 6లో▶

న్యూస్‌రీల్

నిలోఫర్ సూపరింటెండెంట్ రవికుమార్ సస్పెన్షన్



నిలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ సస్పెండ్ అయ్యారు. ఆస్పత్రి ఆవరణలో ప్రైవేట్ మందుల దుకాణం కోసం ఆయన స్థలాన్ని కేటాయించడం వివాదాస్పదమైన విషయం తెలిసిందే.

- వివరాలు 3లో▶

రెండ్రోజుల్లో కేరళకు నైరుతి



బంగాళాఖాతంలో చురుకుగా సాగుతున్న రుతుపవనాలు రానున్న రెండ్రోజుల్లో కేరళను తాకే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. అలాగే, 27న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది.

- వివరాలు 2లో▶

రణమా.. శాంతిమంత్రమా?



మావోయిస్టు దళపతి నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ తర్వాత మావోయిస్టులు, ప్రభుత్వం మధ్య శాంతి చర్చలు జరుగుతాయా లేక రణమే కొనసాగుతుందా అనే చర్చ జరుగుతోంది. ఘటనపై ఇరుపక్షాల నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

- వివరాలు 8లో▶

పుష్కరాలకు పోటెత్తిన భక్తజనం



సరస్వతి పుష్కరాలకు ముగింపు తేదీ దగ్గర పడుతుండటంతో భక్తజనం భారీగా తరలి వస్తోంది. 9వ రోజు 2 లక్షల మందికి పైగా భక్తులు పుణ్య స్నానాలు చేశారు. శుక్రవారం భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. భక్తులు కాలి నడకనే త్రివేణీ సంగమానికి చేరుకున్నారు.

- వివరాలు 5లో▶

ఇదంజోక్



యాభై సార్లయినా మోదీని కలుస్తా

ఎన్నికలప్పుడే రాజకీయం.. తర్వాత అభివృద్ధే లక్ష్యం

జహీరాబాద్ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

- ఎవరేమనుకున్నా కేంద్రం సహకారం తీసుకుంటాం
- ప్రజలు అండగా నిలిస్తే తెలంగాణను నంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం
- హైదరాబాద్‌ను టోక్యో, న్యూయార్క్‌లతో పోటీ పడేలా చేస్తాం
- ప్రతిపక్షాల సహకారం కూడా కావాలన్న సీఎం
- నియోజకవర్గంలో రూ.494 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం



మహిళా సంఘాలకు ఇందిరా మహిళా శక్తి చెక్కును అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ తదితరులు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: 'ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు..ఎన్నికలయ్యాక అభివృద్ధి చేయడమే లక్ష్యం.. కేంద్రం సహకారాన్ని తీసుకుంటాం.. ఎవరు ఏమనుకున్నా సరే.. మోదీని ఒక్కసారి కాదు 50 సార్లు అయినా కలుస్తాం..రాష్ట్రానికి రావాల్సిన నిధులు తెచ్చుకుంటాం ..కావాల్సిన అనుమతులు తీసుకుంటాం.. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించుకున్నప్పుడే, కలిసి మెలసి పనిచేసినప్పుడే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుంది. చెరువు మీద అలిగి కడుక్కోకుంటే ఎలా?..దిగిపోయిన ఆయన (కేసీఆర్) చెరువు మీద అలిగి ఫామ్ హౌస్‌లో పడుకుంటే ఏమైంది?.. ప్రజలు ఇంటికి పంపే పరిస్థితి వచ్చింది.. నేను అలాంటి తప్పులు చేయను.. ఎవరు ఏమనుకున్నా పర్వాలేదు..' అని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో రూ.494 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జహీరాబాద్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు.

ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా మారుస్తాం

'రాష్ట్ర ప్రజలు మాపై విశ్వాసంతో ఓట్లేసి గెలిపించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు అమలు చేస్తూ పారదర్శక పాలన అందించడం ద్వారా వారి విశ్వాసాన్ని కాపాడుకుంటాం. ఐటీ, ఫార్మా, ఇతర పరిశ్రమలు రావడం ద్వారా ఆదాయం పెరుగుతుంది. ఈ ఆదాయాన్ని పేదలకు పంచాలనే లక్ష్యంతో మేం పని చేస్తున్నాం.

ప్రజలు మాకు అండగా నిలిస్తే తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చి దిద్దుతాం. ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా మారుస్తాం. హైదరాబాద్ నగరాన్ని న్యూయార్క్, టోక్యో వంటి నగరాలతో పోటీ పడే విధంగా అభివృద్ధి చేస్తాం. ఫ్యూచర్ సిటీ, ఆర్‌ఆర్‌ఆర్, మెట్రో, ఫార్మాసిటీ అన్నిటినీ అభివృద్ధి చేసి

మిగతా 8వ పేజీలో ▶

ఏడేళ్ల తర్వాత..!

- నీతి ఆయోగ్ భేటీలో పాల్గొననున్న తెలంగాణ ముఖ్యమంత్రి
- ఢిల్లీ వెళ్లిన రేవంత్‌రెడ్డి
- నేడు తెలంగాణ రైజింగ్–2047 విజన్ ఆవిష్కరణ
- రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించనున్న సీఎం

8 లో

కేసీఆర్ దేవుడు.. ఆయన చుట్టూ దెయ్యాలు

లీకైన లేఖ నాదే.. రెండు వారాల క్రితమే రాశా

- నా లేఖే లీకైతే పార్టీలోని సామాన్యుల పరిస్థితేంటి?
- అందరూ అనుకుంటున్నదే లేఖలో ప్రస్తావించా
- లేఖ లీక్ వెనుక కుట్ర ఉంది
- కేసీఆర్ నాయకత్వంలోనే ముందుకు వెళ్తాం
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత స్పష్టీకరణ



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మీడియాతో మాట్లాడుతున్న కవిత

సాక్షి, హైదరాబాద్/ శంషాబాద్: 'కేసీఆర్ దేవుడు.. ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయి. వారివల్ల పార్టీకి నష్టం జరుగుతోంది. నేను రెండు వారాల క్రితం మా పార్టీ నాయకుడికి లేఖ రాసిన మాట వాస్తవం. ఆ లేఖ బయటకు లీక్ కావడం బాధాకరం. కేసీఆర్ కుమార్తె రాసిన లేఖనే లీకైతే ఇక పార్టీలోని సామాన్యుల పరిస్థితేంటి? దీనిపై చర్చ జరగాలి' అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ, ఆ పార్టీ అధినేత కేసీఆర్ కూతురు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆమె కేసీఆర్‌కు రాసిన లేఖ రెండురోజుల క్రితం బహిర్గతం కావడం రాష్ట్రంలో సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ఈ లేఖపై బీఆర్‌ఎస్ పార్టీ అగ్ర నాయకులు మౌనంగా ఉన్నా.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు రకరకాల వ్యాఖ్యానాలు చేశారు. లేఖ లీకవక ముందు కవిత తన కుమారుడి గ్రాడ్యుయేషన్ ఉత్సవం కోసం అమెరికా వెళ్లారు. శుక్రవారం రాత్రి తిరిగి వచ్చిన ఆమె.. శంషాబాద్ విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడారు. పార్టీలో కింది నుంచి పైస్థాయి నాయకుల వరకు వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలనే తాను రాసిన లేఖలో ప్రస్తావించినట్లు స్పష్టం చేశారు.

కుట్రలు, కుతంత్రాలు

పార్టీలో కుట్రలు, కుతంత్రాలు జరుగుతున్నాయని ఈ మధ్య తాను చెప్పిన విషయం లేఖ బహిర్గతం ద్వారా మరోసారి స్పష్టమైందని కవిత అన్నారు. గతంలో కూడా లేఖ ద్వారా తన అభిప్రాయాలను కేసీఆర్‌కు చెప్పినట్లు వెల్లడించారు. 'నేను నా కుమారుడి గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి వెళ్లిన తరువాతే నా లేఖ లీకైనట్లు హంగామా జరిగింది. పార్టీలో

మిగతా 8వ పేజీలో ▶



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్. చిత్రంలో సీతక్క తదితరులు

తప్పు చేయకుంటే భయమెందుకు?

ఘోష్ కమిషన్ ఇచ్చిన నోటీసులకే వణికిపోవడమెందుకు?

- బీఆర్‌ఎస్ నేతలు వికృత చేష్టలకు పాల్పడుతున్నారు
- 'మేడిగడ్డలో బాంబులు' విషయం కేటీఆర్ కాళేశ్వరం కమిషన్ ముందు చెప్పాలి: మంత్రి ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ నేతలు వికృత, వికార చేష్టలకు పాల్పడుతున్నారని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. తప్పు చేయకుంటే భయమెందుకని, కాళేశ్వరంపై విచారణ జరుపుతున్న పీసీ ఘోష్ కమిషన్ నోటీసులకు వణికి పోవలసిన అవసరం ఏముందని ప్రశ్నించారు. జ్యుడీషియల్ కమిషన్‌ను తప్పు పట్టడం సరికాదని అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కమీషన్లకు కక్కుర్తిపడి ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు తరలించిందని, రీడిజైన్ చేసి మూడేళ్లలోనే ప్రాజెక్టు కూలిపోయేందుకు కారణమయ్యిందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అదనంగా వెచ్చించిన డబ్బులతో పాలమూరు– రంగారెడ్డి, బీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి, కోయిల్‌సాగర్, ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టులన్నీ పూర్తయ్యేవని అన్నారు. శుక్రవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

జేబులు నింపుకోవడానికే కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టు రైతులకు నీళ్లు ఇవ్వడానికి కాదు జేబులు నింపుకోవడానికేనని

మిగతా 7వ పేజీలో ▶

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చలేదు



సుప్రీంకోర్టు పనితీరుపై జస్టిస్ ఓకా ఆవేదన

- పూర్తిగా సీజేఐ కేంద్రంగా కార్యకలాపాలు
- హైకోర్టుల్లోనే మెరుగైన ప్రజాస్వామ్యం
- వీడ్కోలు ప్రసంగంలో సంచలన వ్యాఖ్యలు
- 'సీజేఐ–కేంద్రిత' ఇమేజీని వదిలించుకోవాలి
- పారదర్శకత, హేతుబద్ధత తక్షణావసరాలు
- లిస్టింగ్ నుంచి పనితీరు దాకా కన్పించాలి
- అధికారాలను పూర్తిగా వికేంద్రీకరించాలి
- కీలక సూచనలు చేసిన న్యాయమూర్తి

“సుప్రీంకోర్టుకు ఇది ఉత్సవ సమయం కాదు. ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన సందర్భం. సుప్రీంకోర్టు అధికారాలను పూర్తిగా వికేంద్రీకరించాలి. కేసుల లిస్టింగ్ పారదర్శకంగా జరగాలి. లిస్టింగ్, కోర్టు కార్యకలాపాల నిర్వహణలో టెక్నాలజీ వాడకం మరింతగా పెరగాలి.

6 లో

పిల్లలూ.. పంచదారతో జాగ్రత్త

బడుల్లో 'షుగర్ బోర్డ్'ల ఏర్పాటుకు సీబీఎస్‌ఈ ఆదేశం

- అవసరానికి మించి చక్కెర తీసుకుంటున్న విద్యార్థులు
- అవగాహనతోనే వాడకానికి కళ్లెం
- ఆరోగ్యంపై ఇప్పటికే కొన్ని బడుల్లో తరగతులు
- పోషకాహారం, పరిశుభ్రతపై పాఠాలు

7 లో



తెలంగాణలో 'తృణధాన్య పరిశోధన సంస్థ'

- గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్ ఏర్పాటు
- మరో మూడు సంస్థలు మంజూరు చేసిన కేంద్రం
- బీఆర్‌ఎస్ పార్టీ మునిగిపోతున్న నావ
- రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయే
- మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి కొత్తగా మూడు కేంద్ర సంస్థలు మంజూరయ్యాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణలో పెద్ద సంఖ్యలో కేంద్ర సంస్థలు ఏర్పాటయ్యాయని మిగతా 7వ పేజీలో ▶

తెలంగాణ కులగణనను దేశవ్యాప్తం చేయండి

- ఆ మోడల్ అనుసరణకు కేంద్రంపై ఒత్తిడి తేవాలి
- కాంగ్రెస్ నేతలకు ఖర్గే, రాహుల్ దిశానిర్దేశం
- రాష్ట్రంలో నిర్వహించిన సర్వేపై మహేశ్‌గౌడ్ వివరణ
- అమలుకు తీసుకుంటున్న చర్యలను వివరించిన వైనం



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో సామాజిక న్యాయాన్ని సాధించే దిశగా తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వేను దేశ వ్యాప్తంగా ప్రచారం చేయాలని కాంగ్రెస్ సీనియర్ నేతలు, పార్టీ అధికార ప్రతినిధులకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన ప్రతిపక్ష మిగతా 7వ పేజీలో ▶

ముగ్గెట్టా పోసేది..?!



కరీంనగర్ జిల్లా రాళ్లపేటలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసుకున్న లబ్ధిదారు

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి వెనుకాడుతున్న పేదలు

- చేతిలో చిల్లిగవ్వ లేదంటూ వాపోతున్న వైనం
- 'ఇంటి విస్తీర్ణం', పరిమితి కూడా ప్రతిబంధకంగా మారుతున్న తీరు
- 600 ఎస్‌ఎఫ్‌టీ ఇల్లు మాకొద్దంటున్న మరికొందరు
- 47,235 ఇళ్లకు అనుమతిస్తే.. పనులు ప్రారంభించింది 17,982 మందే..

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు ఊపందుకోవడం లేదు. చేతిలో చిల్లి గవ్వ లేని నిరుపేద లబ్ధిదారులు ముగ్గు పోసుకునేందుకు ముందుకు రావడం లేదు. గృహ విస్తీర్ణాన్ని 600 చదరపు అడుగులకు పరిమితం చేయడం కూడా ఈ పథకం ప్రగతికి ప్రతిబంధకమవుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వీటికి తోడు సిమెంట్, ఇటుక, స్టీలు వంటి వాటి ధరలు భారీగా పెరగడంతో లబ్ధిదారులు పనులు ప్రారంభించేందుకు వెనుకాముందు అవుతున్నారు. నిరుపేదల సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్న విషయం విదితమే. తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా మండలానికి ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ఇళ్ల నిర్మాణానికి అనుమతి ప త్రాలు పొందిన 47,235 మంది లబ్ధిదారుల్లో ఇప్పటి వరకు 38% మంది అంటే 17,982మంది మాత్రమే నిర్మాణ పనులు ప్రారంభించారు. కాగా కొందరు తమకు ఇళ్లు వద్దని చెబుతుండటం గమనార్హం.

పెట్టుబడి కొరత..చిన్న ఇల్లు ఆలోచన

లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపట్టాలంటే కొంత మొత్తంలో అయినా డబ్బు అవసరం. బేస్‌మెంట్ వరకు కట్టాలంటే కనీసం రూ.1.50 లక్షలు

మిగతా 7వ పేజీలో ▶

ఇదీ ఇందిరమ్మ ఇళ్ల పనుల ప్రగతి..

- **582** – తొలి విడతలో మంజూరు చేసిన గ్రామాలు (గ్రేటర్ హైదరాబాద్ మినహా)
- **70,322** – మంజూరు చేసిన గృహాలు
- **47,235** – ఇంటి నిర్మాణానికి అనుమతి పత్రాలు జారీ చేసిన గృహాలు
- **17,982** – ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసుకున్న లబ్ధిదారులు (38%)
- **6,132** – పునాదుల వరకు నిర్మాణం పూర్తయిన ఇళ్లు

సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ బ్యాగ్‌మ్యాన్

- ఈడీ చార్జిషీట్‌తో ఆయన బండారం బయట పడింది
- ప్రజల దృష్టి మళ్లించేందుకు రోజుకో కొత్త నాటకం
- ఏడాదిన్నరలో రూ.వేల కోట్లకు చేరిన సీఎం అవినీతి
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శ



సాక్షి, హైదరాబాద్: నేషనల్ హెరాల్డ్ కేసులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చార్జిషీట్‌లో చేర్చటంతో ఆయన అవినీతి బండారం బయట పడిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పార్టీకి ఏటీఎంలా మిగతా 8వ పేజీలో ▶

క్లుప్తంగా...

జెట్ స్పీడ్‌లో గురుకుల అడ్మిషన్లు

ఐదో తరగతిలో ఇప్పటికే 75 శాతం సీట్ల భర్తీతో సరికొత్త రికార్డు



సాక్షి, హైదరాబాద్: సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో ఐదో తరగతి ప్రవేశాల ప్రక్రియలో సొసైటీలు సరికొత్త రికార్డును సొంతం చేసుకున్నాయి. సాధారణంగా గురుకుల విద్యా సంస్థల్లో ఐదో తరగతి ప్రవేశాల ప్రక్రియ జూన్‌లో ప్రారంభమై ఆగస్టు నెలాఖరు వరకు సాగుతుండేది. దీంతో విద్యార్థులు కొన్ని ప్రారంభ తరగతులకు దూరమయ్యేవారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ ముందస్తు కార్యాచరణతో చర్యలు చేపట్టింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో అడ్మిషన్లకు సంబంధించి అర్హత పరీక్ష నిర్వహణలో ఎస్సీ గురుకుల సొసైటీ సమన్వయం చేస్తోంది. ఇందులో భాగంగా 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఫలితాల ప్రక్రియ విడుదలతో పాటు అర్హుల జాబితాను మే నెలలోనే విడుదల చేయడంతో అడ్మిషన్ల ప్రక్రియ వేగవంతమైంది. ఈ నెల మూడో వారంలోనే తొలివిడత ప్రవేశాల ప్రక్రియను గురుకుల సొసైటీలు పూర్తి చేసి రికార్డు నెలకొల్పాయి. నాలుగు గురుకుల సొసైటీల్లో ఐదోతరగతిలో మొత్తం 51,408 సీట్లు ఉన్నాయి. వీటిలో తొలివిడతలో 75 శాతం సీట్లు నిండాయి. మిగిలిన సీట్లకు రెండో విడత కౌన్సెలింగ్ అతి త్వరలో ప్రారంభిస్తారు.

టీజీఎడ్‌సెట్‌కు నేటితో గడువు ముగింపు


కేయూ క్యాంపస్: తెలంగాణ బీఈడీ కళాశాలల్లో టీజీఎడ్‌సెట్–2025 ఆన్‌లైన్ దరఖాస్తులకు రూ.500 అపరాధ రుసుముతో శనివారంతో గడువు ముగియనుంది. శుక్రవారం వరకు 38,700 దరఖాస్తులు వచ్చాయి. అభ్యర్థులు తమ దరఖాస్తుల్లో ఏమైనా సవరణలుంటే.. ఈనెల 25న చేసుకోవచ్చని టీజీఎడ్‌సెట్ కన్వీనర్, కాకతీయ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ బి.వెంకట్రామ్‌రెడ్డి తెలిపారు. అభ్యర్థులు ఈనెల 26 నుంచి హాల్‌టికెట్లను వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్://ఎడ్‌సెట్.టీజీసీహెచ్ఈ.ఏసీ.ఇన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జూన్ 1న ప్రవేశ పరీక్షను రెండు సెషన్లలో ఆన్‌లైన్ (కంప్యూటర్ బేస్డ్)లో నిర్వహించనున్నారు.

నేడు పాలిసెట్ ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన టీజీ పాలిసెట్–2025 ఫలితాలు శనివారం విడుదల కానున్నాయి. మాసబ్‌ట్యాంక్‌లోని సాంకేతిక విద్యాభవన్‌లో ఉదయం 11 గంటలకు టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ శ్రీదేవసేన, ఎస్‌బీటెట్ ఇన్‌చార్జి సెక్రటరీ శ్రీనివాస్ ఫలితాలను విడుదల చేయనున్నారు. కాగా, ఈనెల 13న జరిగిన పాలిసెట్ ప్రవేశ పరీక్షకు 1,06,716 మంది నమోదు చేసుకోగా, 98,858 మంది హాజరయ్యారు.

ఏ బాధ్యతలు అప్పగించినా నిర్వర్తిస్తా

ఎంపీ డీకే అరుణ



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ఏ బాధ్యతలు అప్పగించినా వాటిని సమర్థవంతంగా నిర్వహిస్తానని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కన్సల్టేటివ్ కమిటీ తెలంగాణ చైర్‌పర్సన్‌గా అరుణను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆమె శుక్రవారం 'సాక్షి'తో మాట్లాడారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, వనరులు తెచ్చి, తెలంగాణ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. కాగా, కాంగ్రెస్ పార్టీ కుట్రలో భాగంగానే బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత లేఖ బయటకు వచ్చిందని అరుణ విమర్శించారు. ఆమె శుక్రవారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత తన తండ్రి కేసీఆర్‌కు లేఖ రాయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. కేసీఆర్‌ను కలిసే పరిస్థితి కవితకు లేదా? అన్నారు. ఇది రాజకీయ ఎత్తుగడలో భాగమేనని, కాంగ్రెస్ పార్టీయే.. కవిత పేరుతో బయట పెట్టినట్లు అనుమానం కలుగుతోందని అరుణ అనుమానం వ్యక్తం చేశారు.

లైసెన్స్‌డ్ సర్వేయర్ల తొలి విడత లిస్ట్ రెడీ

సాక్షి, హైదరాబాద్: లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకాల్లో మరో అడుగు ముందుకు పడింది. సర్వేయర్ల శిక్షణ కోసం దర ఖాస్తు చేసుకున్న వారిలో తొలి విడ త శిక్షణకు ఎంపికైన వారి జాబితాలు సిద్ధమయ్యాయి. ఈ జాబితాలను మీసేవ పోర్టల్‌తో పాటు జిల్లా సర్వే కార్యాలయాలు, కలెక్టర్ కార్యాలయాల్లో ఉంచామని, ఈ జాబితాల్లో పేర్లు ఉన్న అభ్యర్థులు ఈ నెల 26న జిల్లా సర్వే కార్యాలయాల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరు కావాలని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ సంస్థ వైస్ ప్రిన్సిపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అభ్యర్థులు ఎస్సెస్సీతో పాటు ఇతర విద్యార్హత, కుల ధ్రువీకరణ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

మందలా చేరికలు.. మందకొడి బోధన

డీమ్డ్ వర్సిటీల్లో లోపించిన నాణ్యత



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని డీమ్డ్ విశ్వవిద్యాలయాల్లో ఇంజనీరింగ్ విద్య నాణ్యతపై ఆడిట్ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ విషయాన్ని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమైంది. డీమ్డ్ వర్సిటీలపై రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణ లేకపోవడం వల్ల జరుగుతున్న నష్టాన్ని ఏఐసీటీఈకి వివరించాలని నిర్ణయించింది. ఈ అంశంపై విద్యాశాఖ, సాంకేతిక విద్య శాఖ అధికారులు గురువారం చర్చించారు. ప్రభుత్వ సూచనల మేరకు ఏఐసీటీఈకి లేఖ రాసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. డీమ్డ్ వర్సిటీల్లో నాణ్యతా ప్రమాణాలు దెబ్బతింటున్న తీరు, దీనివల్ల విద్యార్థులకు జరిగే నష్టాన్ని అందులో వివరించాలని నిర్ణయించారు. ముఖ్యంగా ఎమర్జింగ్ కోర్సుల నాణ్యతపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటాసైన్స్, సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో ప్రమాణాలు లేని బోధన జరుగుతోందని ప్రభుత్వం గుర్తించింది.

- ఎమర్జింగ్ కోర్సులపై ప్రచార అట్టహాసమే
- కాలం చెల్లిన కోడింగ్‌తో నిలువెల్లా దగా
- తొలి మెట్టులోనే వెనక్కు పంపుతున్న టెక్ సంస్థలు
- వీటిపై నియంత్రణ ఉండాల్సిందేనని రాష్ట్ర వాదన
- ఏఐసీటీఈకి లేఖ రాసేందుకు సన్నాహాలు

అడ్డగోలు ప్రవేశాలు

తెలంగాణలో మొత్తం పదివరకు డీమ్డ్ వర్సిటీలున్నాయి. వీటిలో కొన్ని ఆఫ్ క్యాంపస్ బ్రాంచీలున్నాయి. డీమ్డ్ హోదా ఉన్న సంస్థలు తెలంగాణలో బ్రాంచీలు పెట్టాయి. భూమి, మౌలిక వసతులు, కొన్నేళ్లుగా సాధించిన ర్యాంకుల ఆధారంగా డీమ్డ్ హోదాను ఏఐసీటీఈ ఇస్తుంది. ఈ హోదా వచ్చిన వర్సిటీలు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు పొందాల్సిన అవసరం లేదు. అడ్మిషన్లు కూడా వాళ్ల ఇష్టమే. ఇష్టానుసారం అన్ని బ్రాంచీల్లోనూ సీట్లు పెంచుకోవచ్చు. డీమ్డ్ హోదా కోసం సంస్థలు వ్యూహాత్మకంగా జాతీయ ర్యాంకులు వచ్చేలా చూసుకుంటున్నాయి. ర్యాంకులిచ్చే జాతీయ సంస్థలకు ఇవి అనేక ప్రలోభాలకు గురిచేస్తున్నాయనే ఆరోపణలున్నాయి. ఈ వర్సిటీలో చదివిన విద్యార్థులు అన్‌స్కిల్డ్ ఉద్యోగాల్లో చేరినా, వాటిని ర్యాంకింగ్ డేటాలో స్కిల్డ్‌గానే చూపిస్తున్నాయి. ఇలా హోదా తెచ్చుకున్న తర్వాత నియంత్రణ లేకుండా విద్యార్థులను చేర్చుకుంటున్నాయి. ఒక్కో యూనివర్సిటీ ఇంజనీరింగ్‌లో ఏకంగా 3 వేలకుపైగానే విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తోంది. ఇందులో ప్రధానంగా డేటాసైన్స్, ఏఐఎంఎల్, సైబర్ సెక్యూరిటీ వంటి ఎమర్జింగ్ కోర్సులే ఉంటున్నాయి. అయితే, ఇంతమందికి సరిపడా ఫ్యాకల్టీ ఎలా తెస్తున్నారు? బోధించేవాళ్ల నాణ్యత ఎంత? అనే అంశాలపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. డీమ్డ్ వర్సిటీల్లో చదివిన విద్యార్థుల ఉపాధి అవకాశాలపై ఇటీవల రాష్ట్ర సాంకేతిక విద్యా విభాగం డేటా తెప్పించి పరిశీలించింది. కంప్యూటర్ సైన్స్ చదివిన వారిలో కనీసం 32 శాతం కూడా సరైన ఉద్యోగాలకు ఎంపికవ్వడం లేదని గుర్తించారు.

కాలం చెల్లిన కోడింగ్

గత ఏడాది డీమ్డ్ వర్సిటీల నుంచి ఇంజనీరింగ్ పట్టా పొందిన విద్యార్థులు కొన్ని రకాల కోడింగ్ మాత్రమే చేయగలుగుతున్నారు. ఏఐ వచ్చిన తర్వాత పాతతరం కోడింగ్, డీకోడింగ్ అవసరమే లేకుండా పోయింది. అడ్వాన్స్‌డ్ కోడింగ్‌ను సాఫ్ట్‌వేర్ కంపెనీలు కోరుకుంటున్నాయి. ఇవేవీ డీమ్డ్ వర్సిటీ విద్యార్థుల్లో కన్పించడం లేదని సాంకేతిక విద్య అధికారులు అంటున్నారు. డిస్క్రియేట్ మేథమెటిక్స్, డేటా స్ట్రక్చర్, కంప్యూటర్ ఆర్గనైజేషన్ అండ్ ఆర్కిటెక్చర్, డేటా స్ట్రక్చర్ లేబొరేటరీపై బేసిక్స్ తప్ప, ఏఐ సమాంతర బోధనపై ఏమాత్రం దృష్టి పెట్టడం లేదని గుర్తించారు. కొన్ని సంస్థల కోసం జరిగే ఇంటర్వ్యూల్లో కీలకమైన బిజినెస్ ఎకనమిక్స్ అండ్ ఫైనాన్షియల్ అనాలసిస్‌పై కనీస పరిజ్ఞానం కూడా విద్యార్థుల్లో ఉండటం లేదని టెక్ కంపెనీలు అంటున్నాయి.

పనికి మాలిన ప్రాజెక్టులు

ప్రతీ కంపెనీ ఇప్పుడు ఏఐ టెక్నాలజీకి అనుసంధానమయ్యాయి. దానిని నిర్వహించే ఉద్యోగ అర్హతలకు కొన్ని ప్రాజెక్టులు ఇంజనీరింగ్‌లోనే చేయాలి. అయితే, డేటా అనలిటిక్స్ లేబొరేటరీల్లో సాధారణ ప్రాజెక్టులు మాత్రమే పూర్తి చేస్తున్నారు. ఫీల్డ్ వర్క్‌లో చేసే ప్రాజెక్టుల్లో ఎక్కడా ఏఐ కోడింగ్, మాడ్యూల్స్‌పై అధ్యయనం చేసిన దాఖలాలు డీమ్డ్ వర్సిటీ విద్యార్థుల్లో ఉండటం లేదని సాంకేతిక విద్య అధికారి ఒకరు తెలిపారు. సైబర్ సెక్యూరిటీలో ఎథ్నికల్ హ్యాకింగ్, థ్రెట్ ఇంటెలిజెన్స్, డిజిటల్ ఫోరెన్సిక్స్ వంటి సబ్జెక్టుల్లో కనీస పరిజ్ఞానం కన్పించడం లేదని అధికారులు సేకరించిన డేటా స్పష్టం చేస్తోంది. బోధన నాణ్యతపై ఆడిటింగ్ జరిగితే తప్ప డీమ్డ్ వర్సిటీలు చేస్తున్న అన్యాయం వెలుగులోకి రాదని ఒక ఉన్నతాధికారి తెలిపారు.

హెడ్ టు హెడ్‌లో విజేతలు వీరే

సత్తా చాటిన మిస్ వేల్స్, మిస్ టర్కీ, మిస్ ట్రినిడాడ్, మిస్ జాంబియా

నాలుగు ఖండాల నుంచి నలుగురు సుందరీమణుల ఎంపిక
- పోటాపోటీగా ముగిసిన చాలెంజ్



విజేతలు వరుసగా.. ఇడిల్‌బిల్గెన్ (టర్కీ), మిల్లీ మే ఆడమ్స్ (వేల్స్), ఫెయిత్ బ్వాల్య (జాంబియా), అన్నా లిసె నాంటన్ (ట్రినిడాడ్)

సాక్షి, హైదరాబాద్: మిస్ వరల్డ్ పోటీల్లో కీలకమైన హెడ్–టు–హెడ్ ఛాలెంజ్ ఫైనల్ హైదరాబాద్‌లోని ట్రైడెంట్ హోటల్‌లో పోటాపోటీగా జరిగింది. యూరప్, ఆఫ్రికా, ఆసియా అండ్ ఓషియానియా, అమెరికా అండ్ కరేబియన్ నుంచి ఐదుగురు చొప్పున మొత్తం ఇరవై మంది పోటీదారులు సామాజిక అంశాలపై తమ అభిప్రాయాలను, తాము చేస్తున్న కార్యక్రమాలను తమదైన శైలిలో జడ్జిలకు వివరించారు. జడ్జిలు తమకు వేసిన ప్రశ్నలకు వారు జవాబిచ్చారు. వాటి ఆధారంగా నాలుగు ఖండాల నుంచి నాలుగు దేశాలకు చెందిన సుందరీమణులను హెడ్–టు–హెడ్ విజేతలుగా ఎంపిక చేశారు.

అమెరికా–కరేబియన్ నుంచి మిస్ ట్రినిడాడ్

హెడ్–టు–హెడ్ ఛాలెంజ్ ఫైనల్లో భాగంగా అమెరికా–కరేబియన్ ఖండంలోని బ్రెజిల్, సురినామ్, కేమెన్ ఐలాండ్స్, గయానా, ట్రినిడాడ్ అండ్ టొబాగో నుంచి వచ్చిన పోటీదారులకు 'తెలంగాణలో మహిళా సాధికారత – భద్రత' పై ప్రపంచానికి మీరు ఏ సందేశాన్ని ఇస్తారనే ప్రశ్న వేశారు. ఈ గ్రూపులో ఉత్తమ జవాబు ఇచ్చిన మిస్ ట్రినిడాడ్ అండ్ టొబాగో తుది రౌండ్‌కు ఎంపికయ్యింది. ప్రగతి, సాధికారత ఒకటే. భారత్ ముఖ్యంగా హైదరాబాద్ ఈ దిశగా చేయడుతున్న చర్యలు అభినందనీయం. సగం జనాభా వెనుకబడి ఉంటే విజయం సాధించలేమనే ఉద్దేశంతో మహిళలను ప్రోత్సహిస్తూ ముందుకు నడిపిస్తున్న తెలంగాణ స్ఫూర్తిదాయకం..' అంటూ సమాధానం ఇచ్చింది.

ఆఫ్రికా నుంచి మిస్ జాంబియా

ఆఫ్రికా ఖండానికి సంబంధించి దక్షిణాఫ్రికా, నమీబియా, సోమాలియా, ఉగాండా, జాంబియా పోటీదారులకు..'సోషల్ మీడియా జీవితంలోని అనేక అంశాలను, ముఖ్యంగా యువతను ప్రభావితం చేస్తోంది. ఈ విషయంలో మీరు ఎలా ప్రామాణికంగా ఉంటారు'అనే ప్రశ్న వేశారు. ఈ గ్రూపు నుంచి తుది పోరుకు ఎంపికైన మిస్ జాంబియా మాట్లాడుతూ'ప్రపంచం మారవచ్చు, కానీ మీరు మారాల్సిన అవసరం లేదు. మీరలాగే ఉండండి. ప్రపంచం దాన్ని స్వీకరించనివ్వండి. సమాజం పరిణామం చెందవచ్చు, కానీ మన నిజ స్వభావాన్ని కోల్పోకూడదు' అని చెప్పారు.

యూరప్ నుంచి మిస్ వేల్స్..

యూరప్ గ్రూప్‌లో స్పెయిన్, వేల్స్, ఫ్రాన్స్, జర్మనీ, ఐర్లాండ్ దేశాల సుందరీమణులు పాల్గొనగా..'మీ దేశంలో యువ జీవితాలను మెరుగుపరచడానికి మీరు ఒక మార్పును అమలు చేయగలిగితే అది ఏమిటి? అదే ఎందుకు?' అనే ప్రశ్న వేయగా.. ఈ బృందంలో ఎంపికైన మిస్ వేల్స్.. 'ఆరోగ్య సంరక్షణ, విద్య ప్రధానం. మా కుటుంబంలో విశ్వవిద్యాలయానికి వెళ్లిన మొదటి వ్యక్తిని నేనే. ఉగాండా, భారతదేశంలో వైద్య సేవలు, ముఖ్యంగా యాసిడ్ దాడి బాధితుల కథలు, నా లక్ష్యానికి స్ఫూర్తినిచ్చాయి. విద్య అత్యంత శక్తివంతమైన సాధనం..' అని చెప్పడం ద్వారా విజేతగా నిలిచారు.

ఆసియా నుంచి మిస్ టర్కీ

ఇక ఆసియా అండ్ ఓషియానియా నుంచి శ్రీలంక, థాయిలాండ్, టర్కీ, లెబనాన్, జపాన్ కంటెస్టెంట్‌లకు.. 'బ్యూటీ విత్ ఎ పర్పస్' ప్రాజెక్ట్‌తో పనిచేయడం మీ దృక్పథాన్ని ఎలా మార్చింది?' అనే ప్రశ్న జడ్జిలు వేశారు. ఈ గ్రూపులో విజేత మిస్ టర్కీ.. 'నేటి ప్రపంచంలో సాంస్కృతిక వారసత్వం అత్యంత ముఖ్యమైనది. కాన్సులేట్లు, రాయబార కార్యాలయాలు నిర్వహించే అంతర్జాతీయ ఈవెంట్ ద్వారా సంగీతం, కళలు, వంటకాలు, సంప్రదాయాలతో మనం సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడటమే కాకుండా, ఐక్యతను పెంపొందించుకోగలం. సాంస్కృతిక తేడాలు అడ్డంకులు కావు.. వంతెనలు..' అని చెప్పారు.

మీరు తెలంగాణను ప్రపంచానికి ఎలా పరిచయం చేస్తారు?

తుది పోరుకు ఎంపికైన మిస్ టర్కీ, వేల్స్, జాంబియా, ట్రినిడాడ్ అండ్ టొబాగోలకు జడ్జిలు చివరగా ఒక ప్రశ్న వేశారు. 'భారతదేశంలోని అతి చిన్న రాష్ట్రమైన తెలంగాణను సంస్కృతి, వారసత్వం, ఆవిష్కరణల పరంగా ప్రపంచానికి ఎలా పరిచయం చేస్తారు?' అని అడగ్గా.. నలుగురూ జవాబిచ్చారు.

ఆవిష్కరణల కేంద్రం

తెలంగాణ సాంకేతిక, వైద్య ఆవిష్కరణల కేంద్రం. ఇది ప్రగతిశీల, శక్తివంతమైన రాష్ట్రం, మహిళల హక్కులు, భద్రత, విద్యకు ప్రాధాన్యత ఇస్తుంది. తెలంగాణ ప్రపంచానికి 'సాధికారత, ఆవిష్కరణ, లింగ సమానత్వంతో శక్తివంతమైన సందేశాన్ని పంపుతుంది.

– మిస్ టర్కీ

నా దేశాన్ని ఆహ్వానిస్తా

తెలంగాణ గురించి చెప్పడమే కాదు.. ఈ రాష్ట్ర గొప్ప సంస్కృతిని ప్రత్యక్షంగా అనుభవించడానికి నా దేశాన్ని ఆహ్వానిస్తాను.

– మిస్ వేల్స్

కళలు, సంస్కృతితో మమేకం

తెలంగాణ ప్రజలు కళలు, సంస్కృతితో మమేకమైన వారు. నాకు వారి ప్రామాణికతను ప్రతిబింబించే అనేక బహుమతులు లభించాయి. మిస్ వరల్డ్ నినాదం 'బ్యూటీ విత్ ఎ పర్పస్' కాగా.. తెలంగాణ ఆ స్ఫూర్తిని పూర్తి స్థాయిలో కలిగి ఉంది.

– మిస్ జాంబియా


దయ, సంస్కృతి నిండిన ప్రజలు

నా దేశం లార్డ్ అఫ్ ది సన్ దేశంగా ప్రసిద్ధి చెందింది. తెలంగాణ సన్ అఫ్ ది లార్డ్. ఇక్కడ ప్రజలు దయ, సంస్కృతితో నిండి ఉన్నారు.

– మిస్ ట్రినిడాడ్ అండ్ టొబాగో

డిగ్రీ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ

మార్కెట్ డిమాండ్‌కు తగ్గట్టుగా బోధన ప్రణాళిక
- ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి
- ఎమర్జింగ్ స్కిల్స్‌పై నాస్కామ్–ఉన్నత విద్యామండలి మధ్య ఎంఓయూ



ఎంఓయూ పత్రాలు చూపుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, నాస్కామ్ సీఈఓ అభిలాషా గౌర్, బాలకిష్టారెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: డిగ్రీ పూర్తి చేసిన ప్రతీ విద్యార్థి ఉపాధి పొందేలా నైపుణ్య శిక్షణ ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వానికి ఓ విజన్ ఉందన్నారు. విశ్వవిద్యాలయాలు కూడా నైపుణ్య శిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని.. రాష్ట్రాన్ని ఐటీ నైపుణ్య కేంద్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఉన్నత విద్యలో ఎమర్జింగ్ టెక్నాలజీలకు సంబంధించిన నైపుణ్యాలను విద్యార్థులకు అందించేందుకు వీలుగా నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీలు (నాస్కామ్), రాష్ట్ర ఉన్నత విద్యామండలి మధ్య శుక్రవారం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో నాస్కామ్ సీఈవో డాక్టర్ అభిలాష గౌర్, మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి ఎంఓయూపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ఉన్నతవిద్య బోధన ప్రణాళికలో మార్పులు అవసరమని.. ఆ దిశగా కసరత్తు జరుగుతోందన్నారు. రాష్ట్రంలోని 250 కాలేజీల్లో డిగ్రీలు తీసుకున్న ప్రతి విద్యార్థి సైతం ఉపాధి పొందేలా నైపుణ్యంతో కూడిన బోధన ఉండాలన్నారు. ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ కేంద్రాలుగా మార్చి 100 శాతం ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ఉన్నత విద్యలో గుణాత్మక మార్పు: ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి


నాస్కామ్ తోడ్పాటుతో చేపట్టిన నైపుణ్య శిక్షణ ఉన్నత విద్యలో గుణాత్మక మార్పు తెస్తుందని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి ఆకాంక్షించారు. డిజిటల్ మార్కెటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఫిన్‌టెక్, ఏఐ వంటి ఎమర్జింగ్ కోర్సుల్లో నైపుణ్య శిక్షణ విద్యార్థుల ఉన్నతికి తోడ్పడుతుందన్నారు. ఇప్పటికే బోధన ప్రణాళికలో మార్పులకు శ్రీకారం చుట్టామని.. అంతర్జాతీయ ప్రమాణాలతో ఉన్నత విద్యను తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. పారిశ్రామిక భాగస్వామ్యంతో అత్యున్నత నైపుణ్యాన్ని విద్యార్థులకు అందించడమే ఎంఓయూ ముఖ్య ఉద్దేశమన్నారు.

ఎమర్జింగ్ స్కిల్ ఎంతో అవసరం: డాక్టర్ అభిలాష గౌర్

ఎమర్జింగ్ కోర్సులు చేస్తున్న విద్యార్థులకు మార్కెట్ అవసరాలకు తగ్గట్లుగా నైపుణ్యం ఎంతో అవసరమని నాస్కామ్ సీఈవో డాక్టర్ అభిలాష చెప్పారు. ఐటీ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధి అవకాశాలే లక్ష్యంగా యూనివర్సిటీలతో కలిసి విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. కార్యక్రమంలో మండలి వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ ఇ.పురుషోత్తం, ప్రొఫెసర్ ఎస్.కె. మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, వివిధ వర్సిటీల వీసీలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పనైపోయింది

మంత్రి కోమటిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ పనైపోయిందని.. ఆ పార్టీ గురించి ప్రజలు ఆలోచించట్లేదని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎద్దేవా చేశారు. అందుకే అంతర్గతంగా వారే ప్లాన్ చేసుకొని లేఖ పేరుతో డ్రామాలు ఆడుతున్నారని ఆయన ఆరోపించారు. శుక్రవారం మినిస్టర్ క్వార్టర్స్‌లో విలేకరులతో మంత్రి కోమటిరెడ్డి మాట్లాడారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు రాజకీయ కారణాలతో కొట్టుకోరని.. కొట్టుకుంటే ఆస్తుల పంపకాల కోసమే కొట్టుకుంటారన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడైన ఐపీఎస్ మాజీ అధికారి ప్రభాకర్‌రావు అమెరికా నుంచి తెలంగాణకు వస్తే బినామీ ఆస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయో తెలుస్తాయని చెప్పారు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం తెచ్చారంటే ఒప్పుకోనని.. ప్రత్యేక రాష్ట్రం కోసం తాము చేస్తున్న ఉద్యమంలోకి దూరి.. మాయమాటలు చెప్పి ఆనాడు అధికారంలోకి వచ్చారన్నారు. కేసీఆర్ 30 ఏళ్లు, కేటీఆర్ మరో 30 ఏళ్లు, హిమాన్షు 10 ఏళ్లు కలిపి మొత్తం 70 ఏళ్లు అధికారంలో ఉంటామని ఆయన కలలు కన్నారని.. కానీ తొమ్మిదిన్నరేళ్లకే తెలంగాణ ప్రజలు తిరస్కరించేసరికి ఏం మాట్లాడాలో వారికి తెలియడం లేదన్నారు.

హైకోర్టు గెజిటెడ్ ఆఫీసర్స్ అధ్యక్షునిగా ప్రద్యుమ్న

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు గెజిటెడ్ ఆఫీసర్స్ సంఘం అధ్యక్షునిగా ప్రద్యుమ్న కుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షురాలిగా మాధవి, కార్యదర్శిగా అన్నపూర్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నవీన్‌కుమార్, కోశాధికారిగా కిరణ్‌కుమార్, ఉప కార్యదర్శులుగా ఝాన్సీ లక్ష్మి, వెంకటేశ్వర్‌రావు, కార్యవర్గ సభ్యులుగా చంద్రిక, సుజాత, మంజుల రాణి, వినోద్‌కుమార్, గఫూర్, రబ్బానీ, చంద్రకాంత్, శ్రీనివాస్, రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు.

ఎడమకాల్వ 'యూటీ' పనుల్లో

వేగం పెంచాలి

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



పనులపై సూచనలు చేస్తున్న మంత్రి పొంగులేటి

కూసుమంచి: పాలేరు రిజర్వాయర్ వద్ద సాగర్ ఎడమ కాల్వకు నిర్మిస్తున్న అండర్ టన్నెల్ (యూటీ) పనుల్లో మరింత వేగం పెంచాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని పాలేరు వద్ద యూటీ పనులను శుక్రవారం తనిఖీ చేసిన ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. వానాకాలం సమీపిస్తున్నందున అవసరమైతే రోజుకు రెండు షిఫ్టుల్లో పనులు చేపట్టాలన్నారు. జూలై మొదటి వారంకల్లా పనులు పూర్తి చేసి సాగునీటి విడుదలకు సిద్ధం చేయాలని ఎస్ఈ వెంకటేశ్వర్లుకు సూచించారు. గత ఏడాది కురిసిన భారీ వర్షాలతో యూటీ కొట్టుకుపోగా, పూర్తిగా తొలగించి తాత్కాలికంగా కట్ట వేసి రైతులకు సాగునీరు అందించామన్నారు. ఇప్పుడు రూ.14.20 కోట్లతో శాశ్వ త ప్రాతిపదికన యూటీని నిర్మిస్తున్నామని తెలిపారు. అనంతరం పాలేరులో పలువురికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు.

రెండ్రోజుల్లో కేరళకు నైరుతి

- అత్యంత చురుగ్గా రుతుపవనాలు
- 27న బంగాళాఖాతంలో అల్పపీడనం వాయుగుండంగా 'అరేబియా' అల్పపీడనం!
- మోస్తరు వర్షాలకు చాన్స్.. ఎల్లో అలర్ట్ జారీ

సాక్షి, హైదరాబాద్: నైరుతి రుతుపవనాల కదలిక అత్యంత చురుకుగా ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం బంగాళాఖాతంలో చురుకుగా సాగుతున్న రుతుపవనాలు రానున్న రెండ్రోజుల్లో కేరళను తాకేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని పేర్కొంది. మరోవైపు ఈ నెల 27న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. ఈ అల్పపీడనం క్రమంగా బలపడే అవకాశం ఉందని తెలిపింది. నైరుతి రుతుపవనాల సమయంలో బంగాళాఖాతంలో ఏర్ప డే అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలకు అవకాశం ఉంటుంది. గురువా రం తూర్పు మధ్య అరేబియా సముద్రం, దక్షిణ కొంకణ్–గోవా తీర ప్రాంతం సమీపంలో ఏర్పడిన అల్పపీడన ప్రాంతం మరింత బలపడి శుక్రవారం ఉదయం 5.30 గంటలకు స్పష్టమైన అల్పపీడనంగా మారిందని, ఇది క్ర మంగా బలపడి శనివారం ఉదయానికల్లా వాయుగుండంగా మారే అవకా శం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో రానున్న రెండ్రోజులు రాష్ట్రంలోని పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదు కావొచ్చని సూచించింది. ఈ మేరకు రాష్ట్రానికి ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

సాధారణం కంటే తక్కువ ఉష్ణోగ్రతలు

శుక్రవారం రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యాయి. ప్రధాన నగరాల్లో ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే.. ఖమ్మంలో అత్యధికంగా 36.0 డిగ్రీ సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, కనిష్టంగా మెదక్‌లో 20.0 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రెండురోజులు కూడా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5 డిగ్రీ సెల్సియస్ వరకు తక్కువగా నమోదు కావొచ్చని వాతావరణ శాఖ తెలిపింది.

వక్ఫ్ సవరణ చట్టంతో

ప్రమాదంలో మసీదులు

ముస్లిం పర్సనల్ లాబోర్డు మహిళా సదస్సులో అసదుద్దీన్ ఒవైసీ



సాక్షి, హైదరాబాద్: వక్ఫ్ సవరణ చట్టంతో మసీదులు, దర్గాలు, ఖబరస్తాన్‌లు ప్రమాదంలో పడే అవకాశాలున్నాయని ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. చట్టంలోని నిబంధనలను ఉపయోగించుకొని ఆర్ఎస్ఎస్ మసీదులపై వివాదాలను రేకెత్తించే ప్రమాదం లేకపోలేదన్నారు. హైదరాబాద్ హాకీ మైదానంలో గురువారం రాత్రి ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో 'వక్ఫ్ బచావో.. దస్తూర్ బచావో'నినాదంతో జరిగిన మహిళా సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వక్ఫ్ సవరణ చట్టం అమల్లోకి వస్తే మసీదులన్నీ మాయమవుతాయని, ఇప్పటికే ఆర్ఎస్ఎస్..మసీదులు, దర్గాలను టార్గెట్ చేసి జాబితా రూపొందించిందని చెప్పారు. సవరణ చట్టం అమల్లోకి రాగానే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి విచారణ కోరే అవకాశం ఉందన్నారు. కలెక్టర్ విచారణకు ఆదేశిస్తే అది పూర్తయ్యే వరకు ఆ స్థలం మసీదుగా పరిగణించబడదన్న ప్రమాదం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు.

రేపు మానవహారం: వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఈ నెల 25న మధ్యాహ్నం 2గంటల నుంచి 2:30 వరకు మానవహారం నిర్వహిస్తున్నట్టు ఒవైసీ ప్రకటించారు. ముస్లింలంతా మానవహారంలో పాల్గొనాలని సూచించారు. ప్రాథమిక హక్కులకు వ్యతిరేకంగా వక్ఫ్ సవరణ చట్టం ఉందని.. బీజేపీ ప్రభుత్వం ముస్లింలను శత్రువులుగా చూస్తోందని విమర్శించారు. వక్ఫ్ బోర్డులు అంతర్గతంగా మతపరమైన స్వభావాన్ని కలిగి, పూర్తిగా మతపరమైన విధులను నిర్వర్తిస్తాయన్నారు. ఇస్లాం ఐదవ స్తంభం జకాత్ ద్వారా దాతృత్వం వక్ఫ్‌తో ముడిపడి ఉందని చెప్పారు. సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకునేంత వరకు ఆందోళన ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు మౌలానా ఖలీద్ సైఫుల్లా రెహమానీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్.. అది టిష్యూ పేపర్‌కు తక్కువే!

- 'ఈనాడు' పత్రికపై వైఎస్ జగన్ వ్యాఖ్యలు వైరల్
- 'సెకీ' ఒప్పందంపై తప్పుడు కథనం ద్వారా అడ్డంగా దొరికిపోయిన ఈనాడు
- దీనిపై సోషల్ మీడియాలో సెటైర్లు.. అధికార, ఉద్యోగ వర్గాల్లోనూ విస్తృత చర్చ





సోషల్ మీడియాలో వైరలవుతున్న పోస్టులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సోలార్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ)తో చేసుకున్న ఒప్పందంపై కొద్ది రోజులుగా విషం కక్కుతున్న 'ఈనాడు' మరో తప్పుడు కథనం అచ్చేసి అడ్డంగా దొరికిపోయిన తీరుపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయ్యాయి. సెకీ మేనేజింగ్ డైరెక్టర్ రామేశ్వర్ ప్రసాద్ గుప్తాను ఇటీవల కేంద్ర ప్రభుత్వం పదవి నుంచి తొలగించడానికి.. ఏపీతో చేసుకున్న ఒప్పందమే కారణమని సదరు ఈనాడు దుష్ప్రచారంలో భాగంగా 'సెకీ ఒప్పందానికి సన్మానం జరిగింది' అంటూ తప్పుడు కథనం వండి వార్చింది. వాస్తవానికి 2021 డిసెంబర్1న ఏపీ ప్రభుత్వం సెకీతో ఒప్పందం చేసుకుంది. 2023 జూన్ 13న రామేశ్వర్‌ప్రసాద గుప్తా సెకీ సీఎండీగా నియమితులయ్యారు. ఇప్పుడు ఆయన్ను కేంద్రం పదవి నుంచి తొలగిస్తే గత ప్రభుత్వ ఒప్పందంతో ఏం సంబంధం ఉంటుంది? నిజానికి గుప్తా నియామకానికి రెండేళ్ల ముందే ఈ ఒప్పందం జరిగింది. ఈ వాస్తవాన్ని తొక్కిపెట్టి కేవలం గత ప్రభుత్వం, వైఎస్ జగన్‌పై బురద చల్లాలనే లక్ష్యంతో గుప్తా తొలగింపునకు ఈ ఒప్పందంతో ఈనాడు నిస్సిగ్గుగా ముడి పెట్టింది. గురువారం మీడియా సమావేశంలో వైఎస్ జగన్ 'ఈనాడు' తీరును కడిగి పారేశారు. 'దున్నపోతు ఈనిందంటే దూడను కట్టేయమన్నట్లుగా ఉంది. దీన్నిబట్టి ఈనాడు స్థాయి టాయిలెట్ పేపర్‌కు ఎక్కువ.. టిష్యూ పేపర్‌కు తక్కువ అనిపిస్తుంది.. అంతా మాఫియా రాజ్యం.. మీడియా అని చెప్పుకోవడానికి సిగ్గు పడాలి' అంటూ నిప్పులు చెరిగారు. ఈ వ్యాఖ్యలు శుక్రవారం సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయ్యాయి. ట్విటర్, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టా తదితర ప్లాట్‌ఫాంల ద్వారా ఒకరి నుంచి మరొకరికి పెద్ద సంఖ్యలో ఫార్వర్డ్ అయ్యాయి. ఎక్కడ నలుగురు కలిసినా ఈ వ్యాఖ్యల ప్రస్తావన వచ్చింది. యూనిట్ విద్యుత్ రూ.2.49తో అందించే సెకీ ఒప్పందంపై ఇంతగా విషం చిమ్ముతున్న ఈనాడు.. దాదాపు అంతకు రెట్టింపు ధర యూనిట్ రూ.4.60తో చంద్రబాబు ప్రభుత్వం యాక్సెస్ అనే ప్రైవేటు సంస్థ నుంచి విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకుంటే మాత్రం పల్లెత్తు మాట అనలేదని చర్చించుకున్నారు.

రాష్ట్రంలో 9,294 లైసెన్స్‌డ్ ఆయుధాలు

- ఆయుధ లైసెన్స్‌ల జారీపై సమీక్షలో డీజీపీ జితేందర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు మొత్తం 7,125 ఆయుధ లైసెన్స్‌లు జారీ చేయగా, 9,294 లైసెన్స్‌డ్ ఆయుధాలు ఉన్నట్టు డీజీపీ జితేందర్ తెలిపారు. గత మూడేళ్లలో కేవలం 510 లైసెన్స్‌లు మాత్రమే జారీ చేశామన్నారు. రాష్ట్రంలో జారీ చేసిన ఆయుధ లైసెన్స్‌లు, లైసెన్స్‌ల జారీలో నిబంధనల అమలు, ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తెలంగాణలోకి ఆయుధాల పంపిణీ తదితర అంశాలపై డీజీపీ జితేందర్ శుక్రవారం పోలీస్ ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్‌ల జారీ విషయంలో నిబంధనల మేరకు అప్రమత్తంగా వ్యవహరించాలని పోలీస్ కమిషనర్లు, ఎస్పీలను ఆదేశించారు. లైసెన్స్ పొంది సకాలంలో ఆయుధం కొనుగోలు చేయనివారు, ఆయుధం కొనుగోలు చేసి సంవత్సరాల తరబడి రౌండ్లు ఉపయోగించని వారు, లైసెన్స్‌లను రెన్యూవల్ చేయని వారికి నోటీసులు జారీ చేయాలన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లిన లైసెన్స్‌దారులు తమ లైసెన్స్‌లను సంబంధిత జిల్లాలో తిరిగి నమోదు చేయాలని, వారి ఆచూకీ తెలియకపోతే హైదరాబాద్‌లోని వారి చిరునామాకు నోటీసులు పంపాలని డీజీపీ చెప్పారు. కాగా, నూతన నేర చట్టాల అమలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులపై డీజీపీ జితేందర్ సమీక్షించారు.

నిలోఫర్ సూపరింటెండెంట్ | రవికుమార్ సస్పెన్షన్

- ఆస్పత్రి ఆవరణలో ప్రైవేట్ మెడికల్ షాపు కోసం శాశ్వత నిర్మాణం కట్టించే ప్రయత్నం
- వెలుగులోకి తెచ్చిన 'సాక్షి'
- కొత్త సూపరింటెండెంట్‌గా డాక్టర్ విజయ్‌కుమార్ నియామకం

సాక్షి, హైదరాబాద్: నిలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ సస్పెండ్ అయ్యారు. నిలోఫర్ ప్రధాన ఆస్పత్రి ఆవరణలో చిన్న పిల్లలు ఆడుకునే పార్కు స్థలంలో ఓ ప్రైవేట్ మందుల దుకాణం కోసం సూపరింటెండెంట్ హోదాలో ఆయన స్థలాన్ని కేటాయించారు. రాత్రికి రాత్రే అక్కడ పక్కా కాంక్రీట్ నిర్మాణం కూడా పూర్తి చేశారు. ఈ విషయం తెలిసి 'సాక్షి'ఆయన్ను ప్రశ్నించగా..సీఎంఓ ఆదేశాల మేరకు మంత్రి, కలెక్టర్‌లతో చర్చించిన తర్వాతే స్థలం కేటాయించినట్టు తెలిపారు. ఇదే విషయాన్ని 'సాక్షి'ఈనెల 22న 'రాత్రికి రాత్రే కట్టేశారు'శీర్షికన కథనం ప్రచురించింది. ప్రైవేట్ మందుల దుకాణం నిర్మించుకునేందుకు అనుమతి ఇవ్వడమేగాకుండా సీఎంఓ, మంత్రి, కలెక్టర్ల పేర్లను వాడడం పట్ల ప్రభుత్వం సీరియస్ అయ్యింది. 22న ఆ అక్రమ కట్టడాన్ని రెవెన్యూ అధికారులు కూల్చివేయించారు. కాగా ఈ అంశాన్ని ఆరోగ్యశాఖ తీవ్రంగా పరిగణించింది. సూపరింటెండెంట్ వివరణ ఇచ్చుకునే ప్రయత్నం చేసినా, ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా శుక్రవారం ఆయన్ను సస్పెండ్ చేస్తూ ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో కొత్త సూపరింటెండెంట్ గా అదే ఆస్పత్రిలో సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ విజయ్‌కుమార్‌ను నియమించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇటీవల ఆయన వరంగల్ ఎంజీఎం నుంచి నిలోఫర్‌కు వచ్చారు.

నిలోఫర్‌లో అన్నీ అవకతవకలే...

నిలోఫర్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా రవికుమార్ గత ఏడాది జూలై 24న బాధ్యతలు స్వీకరించారు. అప్పటికే సీనియర్ ప్రొఫెసర్‌గా అదే ఆస్పత్రిలో పని చేసిన అనుభవం ఆయనకు ఉంది. సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత క్లినికల్ ట్రయల్స్ అంశం దగ్గర్నుంచి తాజాగా బ్లడ్ బ్యాంక్‌లో అవినీతి, మెడికల్ పరికరాల కొనుగోళ్ల వరకు పలు అక్రమాలు చోటు చేసుకున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ మేరకు ఇప్పటికే మూడుసార్లు ప్రభుత్వం ఆయనకు మెమోలు జారీ చేసింది. అయినా తన పని తీరు మార్చుకోకపోగా, ప్రైవేట్ మందుల దుకాణం నిర్మాణ విషయంలో నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కడంతో ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. దీంతో రవికుమార్‌పై వేటు వేసింది.

మరో ఇద్దరు అధికారులకు స్థానచలనం

- అవినీతి ఆరోపణలతో సూర్యాపేట డీఎంహెచ్‌ఓ కోటా చలంను డీహెచ్ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.
- పేట్ల బురుజు సూపరింటెండెంట్ రజినీరెడ్డిని కూడా ప్రభుత్వం బదిలీ చేసింది. ఒకేరోజు ముగ్గురు అధికారులకు స్థానభ్రంశం కలిగించడం వైద్యశాఖలో తీవ్ర చర్చనీయాంశమైంది.

సర్వ కోర్కెలను విడనాడి వాటి ధ్యాస ఏ మాత్రమూ లేకుండు వాడును, అట్లే మోహమును, అహంకారమును లేనివాడును తప్పక శాంతి పొందును.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 24 మే 2025

శ్వేతసౌధంలో మళ్లీ 'పంచాయితీ'

అతిథుల్ని పిలిచి బహిరంగంగా వాగ్యుద్ధానికి దిగటం ఏ రకంగా దౌత్యనీతి అవుతుందో, దాన్ని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎక్కడ నేర్చారో ఎవరికీ తెలియదు. కానీ ఆయన దాన్ని కొనసాగించదల్చుకున్నారని దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రాంఫోసాతో వైట్‌హౌస్‌లో తాజాగా సాగిన జగడం నిరూపిస్తోంది. మొన్న ఫిబ్రవరిలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ట్రంప్ ఇదే మాదిరి తగువు పెట్టుకున్నారు. ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న దురాక్రమణ యుద్ధంలో తప్పంతా ఉక్రెయిన్‌దే అన్నట్టు తేల్చి, దాన్ని వెంటనే నిలిపేయాలని ఒత్తిడి తెచ్చారు. అడుగడుగునా అవమానిస్తూ మాట్లాడారు. మళ్లీ మూణ్ణెల్లకు అదే వైట్‌హౌస్‌లో ట్రంప్ ఆ డ్రామాకే తెరతీశారు. నిజానికి ఇరు దేశాల అధినేతలు కలుసుకుని చర్చించినాక వారిద్దరూ కలిసి మాట్లాడే మీడియా సంయుక్త సమావేశం లాంఛనప్రాయమైనది. నాలుగు గోడలమధ్యా నిర్మొహమాటంగా మాట్లాడుకున్నా, వాదులాడుకున్నా... మీడియా సమావేశంలో పరస్పరం ప్రశంసించుకోవటాలు, రెండు దేశాల మధ్యా కుదిరిన ఒప్పందాల విశిష్టతను అతిగా చూపించుకోవటాలు జరిగిపోతాయి. ఇందువల్ల రెండు దేశాల్లోనూ అధినేతలకు ప్రశంసలు దక్కుతాయి.

కానీ ఇలాంటివి ట్రంప్‌కు పట్టవు. ప్రపంచానికి తాను మకుటంలేని మహారాజునని, ఎవరినైనా ఏమైనా అనగలనని అమెరికా శ్వేతజాతి ఓటరు మహాశయులకు ఆయన చెప్పదల్చుకున్నారు. అందుకే అతిథులుగా వచ్చిన అధినేతలను కెమెరాల ముందు ఇష్టానుసారం మాట్లాడటం అలవాటు చేసుకున్నారు. పోనీ ఆయన నిలదీస్తున్న అంశాలు గొప్పవేమీ కాదు. వాటిల్లో చాలామటుకు నకిలీవీ... నిరాధారమైనవీ. సామాజిక మాధ్యమాల్లో ఎవరెవరో పెట్టే తప్పుడు పోస్టింగులే వాటికి ఆధారం. ఉక్రెయిన్‌లో దేశాధినేతను మార్చి, ఆయన ద్వారా రష్యాను చీకాకుపెట్టి చివరకు అది రెచ్చిపోయి దాడిచేసే స్థితి కల్పించింది అమెరికాయే. అటు తర్వాత రష్యాను ప్రపంచంలో ఏకాకిని చేయటానికి ప్రయత్నించి, ఉక్రెయిన్‌కు పెద్దయెత్తున ఆయుధాలు అమ్ముకున్నది అమెరికాయే. నాటో దేశాలను సైతం ఈ రొంపిలోకి దించింది కూడా ఆ దేశమే. జో బైడెన్ హయాంలో ఇవన్నీ జరిగినట్టు తెలిసినా, ట్రంప్ ఏమీ తెలియనట్టు నటించారు. ఉక్రెయిన్‌నే వేలెత్తి చూపారు. ఇప్పుడు రాంఫోసాతో సైతం అదే తరహాలో వ్యవహారం నడిపారు.

దక్షిణాఫ్రికాలో శ్వేతజాతీయుల ఊచకోత సాగుతున్నదనీ, వాటిల్లో చాలాభాగం బయటకు రావటం లేదనీ ట్రంప్ వాదించారు. ఒకప్పటి శ్వేతజాతి పాలనలో నల్లజాతీయులపై అఘాయిత్యాలు జరిగాయని ఒప్పుకుంటూనే ఇప్పుడు నల్లజాతి పాలనలో శ్వేతజాతీయుల్ని ఆ మాదిరే హింసిస్తున్నారని చెప్పుకొచ్చారు. మీ వద్ద ఆధారాలున్నాయా అని రాంఫోసా అడిగితే, లేవని అంగీకరిస్తూనే ట్రంప్ ఒక వీడియో ప్రదర్శించారు. అందులో నల్లజాతి వామపక్ష నాయకుడు జూలియస్ మలేమా 'శ్వేతజాతి ఆఫ్రికన్లను హతమార్చండ'ంటూ నినాదాలిస్తున్న దృశ్యాలు కనబడ్డాయి. మొత్తం గంటసేపు జరిగిన ఈ మీడియా సమావేశంలో రాంఫోసా ఎక్కడా ఆవేశానికి పోకుండా ఎంతో సంయమనంతో ట్రంప్‌కు జవాబిచ్చే ప్రయత్నం చేశారు.

నిజానికి దక్షిణాఫ్రికాలో ఇప్పటికీ నాలుగింట మూడొంతుల వ్యవసాయ భూములు 8 శాతం కన్నా తక్కువ జనాభాగల శ్వేతజాతీయుల చేతుల్లో వున్నాయి. జనాభాలో 80 శాతంగా వున్న నల్లజాతీయులకు వ్యవసాయ భూముల్లో వాటా కేవలం 4 శాతం మాత్రమే. కానీ ట్రంప్ మాత్రం దక్షిణాఫ్రికా ప్రభుత్వం శ్వేతజాతీయుల భూముల్ని గుంజుకుని వాటిని నల్లజాతీయులకు పంచుతున్నదని ఆరోపించారు. శ్వేతజాతి దురహంకార పాలనలో నల్లజాతీయుల నుంచి అక్రమంగా చేజిక్కించుకున్న భూములు వెనక్కిప్పించాలని స్థానికులు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నా అక్కడి ప్రభుత్వం అంగీకరించటం లేదు. దానికి బదులు స్వచ్ఛందంగా అమ్మటానికి సిద్ధపడే శ్వేత జాతీయులకు పలు రాయితీలిస్తున్నది. శ్వేతజాతి రైతుల ఊచకోత సాగుతున్నదన్న ట్రంప్ వాదన కూడా పూర్తి అబద్ధం. నేరాల రేటు చూస్తే ప్రపంచంలోనే దక్షిణాఫ్రికా ముందుంది. అక్కడ సగటున రోజుకు 72 హత్యలు జరుగుతాయి. ఆరుకోట్ల జనాభాగల ఆ దేశంలో హతుల్లో అత్యధికులు నల్లజాతీయులు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం నిరుడు 26,232 మంది హత్యకు గురైతే అందులో కేవలం 8 మంది మాత్రమే శ్వేతజాతి రైతులు. వాస్తవాలు ఇవికాగా ట్రంప్ వైట్‌హౌస్ వేదికగా ఒక దేశాధినేతపై ప్రపంచమంతా చూస్తుండగా దబాయించటం ఎంత దారుణం! నిజానికి రెండు దేశాలూ చర్చించి పరిష్కరించుకోవాల్సినవి చాలావున్నాయి. శ్వేతజాతి రైతుల ఊచకోత ప్రచారాన్ని నమ్మటంతో బైడెన్ హయాంలోనే నిధులు ఆపేశారు. ట్రంప్ వచ్చాక 25 శాతం సుంకాల విధింపును ప్రకటించారు. ఆ దేశంలోని సహజ వనరులపై ట్రంప్ కన్నుపడింది. వీటిపై అర్థవంతమైన చర్చలు జరగకుండానే తప్పుడు ప్రచారంపై వాదులాట సాగింది. గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న ఊచకోతపై ధైర్యంగా అంతర్జాతీయ న్యాయస్థానం తలుపుతట్టింది దక్షిణాఫ్రికాయే. రాంఫోసా అదృష్టం బాగుండి ట్రంప్‌కు ఆ సంగతి గుర్తురాలేదు. లేకుంటే మరింతగా విరుచుకుపడేవారు. వర్తమాన ప్రపంచంలో పలు దేశాధినేతలు తప్పుడు సమాచారాన్నీ, వదంతుల్నీ ప్రచారంలో పెట్టి అధికారంలోకొచ్చినవారే. ఈ ఎత్తుగడలే మరోసారి అందలం ఎక్కిస్తాయని... రాజ్యాంగాన్ని సవరించి మూడోసారి అధ్యక్షుడు కావాలని కలగంటున్న ట్రంప్ విశ్వసిస్తున్నారు. ఇలాంటపుడు అమెరికాలో అడుగుపెట్టడానికీ, ట్రంప్‌తో చీవాట్లు తినటానికీ ఏ దేశాధినేతయినా ధైర్యం చేయగలరా?

సలహా కోరితే సమాధానమివ్వాలా?

విశ్లేషణ


సంజయ్ హెగ్డే

మన రాజ్యాంగం వేర్వేరు వ్యక్తులకు వేర్వేరు విషయాలను సూచిస్తుంది. రాజకీయ వర్గాలకు, ప్రతికూలమైన తీర్పులను ఎత్తి చూపడానికి ఒక సాధనం కావచ్చు. న్యాయ వ్యవస్థకు మాత్రం ఇదొక వేగుచుక్క. చట్టపరమైన ప్రశ్నలపై సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరడానికి రాష్ట్రపతిని అనుమతించేదే ఆర్టికల్ 143. తాజాగా బిల్లులను పరిష్కరించడంలో గవర్నర్లు, రాష్ట్రపతి అధికారాలకు సంబంధించిన 14 ప్రశ్నలు వేస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము న్యాయసలహా కోరి దీన్ని ఉపయోగించారు.

సాధారణ సందర్భాల్లో ఇది వివాదాస్పదం అయ్యేది కాదు. కానీ ఈ ప్రశ్నలు తమిళనాడు గవర్నర్ ఉదంతంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో తేల్చిచెప్పిన అంశాలనే తిరిగి పరిశీలించేలా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇది ఒక క్లిష్టమైన ప్రశ్నను లేవనెత్తుతోంది. రాష్ట్రపతి కోరుతున్న న్యాయ సలహా అనేది చట్టబద్ధమైన రాజ్యాంగ చర్యా లేదా సుప్రీం తీర్పును దొడ్డిదారిలో సమీక్షించే ప్రయత్నమా?

కోర్టు సమాధానం చెప్పనక్కర్లేదు!

ఇటీవల తమిళనాడు కేసు విషయంలో– మంత్రి మండలి సహాయం, సలహా ప్రకారమే గవర్నర్ పనిచేయాలనీ, బిల్లులను ఆమోదించే ప్రక్రియలో నిరవధికంగా ఆలస్యం చేయలేరనీ సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. రాష్ట్రపతితో సహా రాజ్యాంగ అధికారులు జవాబుదారీతనం లేకుండా లేదా కాలపరిమితిని దాటి వ్యవహరించలేరని కూడా ఆ తీర్పు పేర్కొంది. ఈ తీర్పు ఫలితంతో కేంద్ర ప్రభుత్వం అసంతృప్తి చెందింది. ఫలితంగా ఇప్పటికే కోర్టు సమాధానం ఇచ్చిన వాటికి దాదాపు సమానమైన ప్రశ్నలను సంధిస్తున్న రాష్ట్రపతి న్యాయ సలహాకు కేంద్రం మద్దతు ఇచ్చింది.

ప్రజా ప్రాముఖ్యం కలిగిన చట్టపరమైన విషయాలపై సుప్రీం కోర్టు న్యాయ సలహాను, అభిప్రాయాన్ని కోరడానికి ఆర్టికల్ 143 రాష్ట్రపతిని అనుమతిస్తుంది. కోర్టుకు మాత్రం అటువంటి న్యాయ సలహాకు తప్పనిసరిగా సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. 1964లో ప్రత్యేక సూచన నం.1లోనూ, అయోధ్య వివాదంపై 1993లో ప్రత్యేక సూచన నం.1లోనూ మనం చూసినట్లుగా, న్యాయ సలహాను ఇవ్వకుండా తిరస్కరించే విచక్షణ న్యాయస్థానానికి ఉంది.

కావేరీ జల వివాదాల కేసులో (1998లో ప్రత్యేక సూచన నం.1), కోర్టు అప్పటికే ఇచ్చిన తీర్పుపై అప్పీల్ చేయడానికి లేదా రెండవ అభిప్రాయాన్ని కోరడానికి ఆర్టికల్ 143ని ఉపయోగించలేరని స్పష్టంగా పేర్కొంది. 'రాజ్యాంగం ప్రకారం, అలాంటి అప్పీల్ అధికార పరిధి ఈ కోర్టుకు ఉండదు; ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి కూడా దానిపై సమీక్ష కోరలేరు... అటువంటి అధికారం ఆర్టికల్ 143లో ఉందనుకుంటే, అది న్యాయవ్యవస్థ స్వతంత్ర తలోకి తీవ్రమైన చొరబాటు అవుతుంది' అని నాడు కోర్టు నొక్కి చెప్పింది.

పునఃపరిశీలన కోరుతున్నట్లయితే...

రాష్ట్రపతి తాజాగా వేసిన 14 ప్రశ్నలు తమిళనాడు తీర్పులో ఇప్పటికే పరిష్కరించబడిన అనేక ప్రశ్నలను ప్రతిధ్వనిస్తాయి. గవర్నర్ ఒక బిల్లును అనేకసార్లు వెనక్కి ఇవ్వవచ్చా, లేదా ఆమోదం కోసం రాష్ట్రపతి నిర్దిష్ట కాలపరిమితికి కట్టుబడి ఉండాలా అనేవి వీటిలో ఉన్నాయి. వీటిని సుప్రీంకోర్టు అస్పష్టంగా వదిలివేయలేదు. అత్యంత స్పష్టతతో నిర్ణయం చెప్పేసింది. అందుకే రాష్ట్రపతి తాజా న్యాయ సలహా నివేదన నిజంగా స్పష్టతను కోరడం లేదనీ, పునఃపరిశీలన కోరుతోందనీ సూచిస్తుంది. అలా అయితే, ఇది చట్టపరమైన సమస్య కాదు. న్యాయవ్యవస్థ అంతిమం అనే పునాదినే ప్రశ్నిస్తోంది.


రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవయి

◆ సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరడానికి రాష్ట్రపతిని అనుమతించేదే ఆర్టికల్ 143. దీన్ని ఉపయోగించి గవర్నర్లు, రాష్ట్రపతి అధికారాలకు సంబంధించి 14 ప్రశ్నలతో రాష్ట్రపతి న్యాయసలహా (ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్) కోరారు. సాధారణంగా ఇది వివాదాస్పదం అయ్యేది కాదు. కానీ ఈ ప్రశ్నలు తమిళనాడు గవర్నర్ ఉదంతంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో తేల్చిచెప్పిన అంశాలనే తిరిగి పునఃపరిశీలించమనేలా కనిపిస్తున్నాయి. అలాంటప్పుడు కోర్టుకు స్పందించాల్సిన బాధ్యత ఉందా? లేదు! కానీ, రాష్ట్రపతి కార్యాలయం పట్ల గౌరవాన్ని, తన నిర్ణయాల సమగ్రతను కాపాడుకునే బాధ్యతను కోర్టు సమతుల్యం చేసుకోవాలి.

2012లో 2జీ స్పెక్ట్రమ్‌పై న్యాయసలహా దీనికి ఒక ముఖ్యమైన మినహాయింపు. ఇక్కడ సుప్రీంకోర్టు మునుపటి తీర్పులోని అంశాలను స్పష్టం చేయడానికి ఆర్టికల్ 143ని ఉపయోగించింది. కోర్టు 122 టెలికామ్ లైసెన్సులను రద్దు చేసిన తర్వాత, సహజ వనరులను కేటాయించడానికి వేలం మాత్రమే అనుమతించదగిన పద్ధతా అనే దానిపై నాటి కేంద్ర ప్రభుత్వం... సుప్రీంకోర్టు మార్గదర్శకత్వాన్ని కోరింది. వేలం న్యాయమైన పద్ధతి అయినప్పటికీ, అది మాత్రమే రాజ్యాంగబద్ధమైన మార్గం కాదని కోర్టు స్పష్టం చేసింది. ముఖ్యంగా, కోర్టు ఇచ్చిన ఈ స్పష్టత ప్రధానమైన తీర్పును భంగపరచలేదు. ఈ వ్యత్యాసం చాలా ముఖ్యమైనది. 2జీ విషయంలో, తన తీర్పును వెనక్కు తీసుకోవాలని కోర్టును ప్రభుత్వం అడగలేదు. కేవలం భవిష్యత్ విధానంపై తనకు మార్గనిర్దేశం చేయాలని కోరింది.

దీనికి విరుద్ధంగా, తాజాగా రాష్ట్రపతి కోరిన న్యాయ సలహా అనేది తమిళనాడు కేసు తీర్పులోని ప్రధాన విషయానికి వెళుతుంది. ఇది పరిణామాల వివరణ, లేదా భవిష్యత్ కేసులకు మార్గ దర్శకత్వం కోరదు. బదులుగా, కోర్టు ఇప్పటికే సమాధానం ఇచ్చిన ప్రశ్నలను తిరిగి లేవనెత్తుతుంది. దీన్ని అనుమతించడం అంటే సమీక్షను నియంత్రించే ఆర్టికల్ 137ను కార్యనిర్వాహక వర్గం దాటవేయవచ్చు. ఆర్టికల్ 143 ద్వారా కేసులను తిరిగి వ్యాజ్యం చేయవచ్చు. అది రాజ్యాంగపరంగా అనుమతించరానిది, అలాగే వ్యవస్థాగతంగా ప్రమాదకరమైనది.

రాష్ట్రపతి కార్యాలయ గౌరవం నిలుపుతూనే...

కోర్టుకు స్పందించాల్సిన బాధ్యత ఉందా? లేదు! ప్రత్యేక కోర్టుల బిల్లు కేసులో, కోర్టు ఒక సూచనకు సమాధానం ఇవ్వడానికి నిరాకరించవచ్చనీ, కాకపోతే అలా చేయడానికి కారణాలను పేర్కొనాలనీ న్యాయస్థానం మాట. 2జీ కేసులో, న్యాయ సలహాను తిరస్కరించడానికి కోర్టు అనేక కారణాలను పొందుపర్చింది: (1) ప్రశ్నలను ఇప్పటికే పరిష్కరించి ఉంటే; (2) ప్రశ్నలు రాజకీయమైనవి అయితే; (3) అవి రాజ్యాంగ ప్రయోజనానికి ఉపయోగపడకపోతే; (4) అవి చట్టపరమైన ప్రాముఖ్యత కలిగిన సమస్యలను కలిగి ఉండకపోతే!

తమిళనాడు తీర్పు స్పష్టంగా పరిష్కరించబడిన రాజ్యాంగ ప్రశ్నా విభాగంలోకి వస్తుంది. దీన్ని తిరిగి తెరవడం వల్ల న్యాయ నిర్ణయాల అంతిమత్వంపై సుప్రీం కోర్టుకు కాకుండా కార్యనిర్వాహక వర్గానికి ప్రాధాన్యతను కట్టబెట్టే ప్రమాదం ఉంది. ఇక్కడ రాజకీయ నేపథ్యాన్ని విస్మరించలేము. అనేక ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలలోని గవర్నర్లు చట్టాలకు మోకాలడ్డేందుకు కాలయాపన వ్యూహాలను అనుసరించారు.

ఇది రాజ్యాంగ ప్రశ్న కంటే ఎక్కువగా – రాజకీయంగా అడ్డుకొనే చర్య. ముఖ్యంగా రాజ్యాంగ సమీక్ష మార్గం ఎల్లప్పుడూ అందు బాటులో ఉన్నప్పుడు... రాష్ట్రపతి న్యాయ సలహాను సుప్రీంకోర్టు అంగీకరిస్తే, అది రాజకీయ ఒత్తిడికి లొంగి పోయినట్టు కనిపించే ప్రమాదం ఉంది. అయితే, కోర్టుకు ఇది క్లిష్టమైనదే. రాష్ట్రపతి కార్యాలయం పట్ల గౌరవాన్నీ, తన నిర్ణయాల సమగ్రతనూ కాపాడు కునే బాధ్యతను సమతుల్యం చేసుకోవాలి.

ఈ న్యాయ సలహాను కోరడం నిజంగా తమిళనాడు కేసును తిరగదోడే ప్రయత్నమే అయితే, కోర్టు దానికి సమాధానం ఇవ్వడానికి నిరాకరించాలి. న్యాయపరమైన తీర్పుల అంతిమత్వాన్ని తప్పించుకోవడానికి ఆర్టికల్ 143ని ఉపయోగించలేమని స్పష్టంగా పేర్కొనాలి. అయితే, భవిష్యత్ పాలన కోసం స్పష్టత అవసరమయ్యే అంశాలు తీర్పులో ఉంటే, కోర్టు సమాధానం ఇవ్వడానికి ఎంచుకోవచ్చు. కానీ అది తన మునుపటి నిర్ణయానికి చెందిన అధికారాన్ని నీరుగార్చకుండా చూసుకోవాలి.

ఆర్టికల్ 143 రాజకీయంగా తప్పించుకునే మార్గంగా కాకుండా చట్టపరమైన స్పష్టత కోసం ఒక సాధనంగా ఉద్దేశించబడింది. రాష్ట్రపతి కోరిన ఈ న్యాయ సలహాను పరిశీలన లేకుండా స్వీకరిస్తే, అది కోర్టు అధికారాన్ని బలహీనపరిచే ప్రమాదం ఉంది. కోర్టు రాజ్యాంగ వ్యాఖ్యాతగా మాత్రమే కాకుండా, దాని సంరక్షకురాలిగా కూడా వ్యవహరించాలి. సమాధానం ఇవ్వడానికి నిరాకరించడం అనేది రెండింటినీ కాపాడుకోవడానికి స్పష్టమైన మార్గం కావచ్చు.

వ్యాసకర్త సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

ఆసియా హార్వర్డ్



హార్వర్డ్ విశ్వవిద్యాలయం మీద డోనాల్డ్ ట్రంప్ చర్యలు... నాణ్యమైన బోధకులు, మంచి వాతావరణంతో ఆసియాలో ఒక ప్రాంతీయ క్యాంపస్‌ను ఏర్పరచి పోటీ పడే అవకాశాన్ని ఇస్తున్నాయి. యూఏఈ, ఇండియా, శ్రీలంక లాంటి దేశాలు ఒక జట్టుగా ఏర్పడి విద్యా స్వేచ్ఛ, అందుబాటు ఫీజులతో ఒక నవయుగ హార్వర్డ్ ఏర్పాటు చేయొచ్చు.

– మాధవన్ నారాయణన్, జర్నలిస్ట్

రెండు భవిష్యత్తులు



మనం ఒక విప్లవానికి సాక్షులుగా ఉన్నాం – వీఈఓ 3 లాంటి ఉపకరణాలతో కృత్రిమ మేధ మనిషి సృజనకు సమానంగా, ఒక్కోసారి మించి పనిచేస్తోంది. అదే సమయంలో ప్రపంచంలోని కొన్ని భాగాల్లో కొంతమంది ఎప్పుడో చచ్చిపోయిన చారిత్రక మనుమలను సమాధుల్లోంచి తవ్వి తీస్తున్నారు. ఒకటి భవిష్యత్తును నిర్మిస్తోంది, మరొకటి పూడ్చిపెడుతోంది.

– నజీర్ భాటియా, వ్యాపారవేత్త

అవే వస్తుంటాయి!



మీరు ఐడియాల పనిలో ఉన్నప్పుడు, ఒక్కోసారి అవి ఆగిపోయే సందర్భాలు వస్తుంటాయి. మొదటి 20 ఏళ్లు అలా జరిగిన ప్రతిసారీ ఇది శాశ్వతమేమో అని ఆందోళనకు గురవుతారు. కానీ నెమ్మదిగా ఆందోళన పడటం మానుకుంటారు.

– పాల్ గ్రాహమ్, శాస్త్రవేత్త

అదే పరీక్ష



ఒకరికి ఆర్థిక స్వేచ్ఛ ఉందనడానికి నిజమైన పరీక్ష ఏమిటంటే, 'నాకు మరింత డబ్బు అవసరం లేదు' అని నిశ్చయంగా చెప్పగలగడం.

– మనోజ్ అరోరా, ఫైనాన్షియల్ ప్లానర్

అన్నీ మీరే!



అవసరమైన సమయంలో మీరు సహాయకులు, బాధాకరమైన వేళల్లో ఓదార్చేవారు, గందరగోళ సమయాల్లో బోధకులు. మీరే గొప్ప శాంతి, గొప్ప ప్రేమ.

– నీలే డోనాల్డ్ వాల్ష్, రచయిత

ఇన్ బాక్స్

చికిత్సతో సరిచేయవచ్చు!

మానవాళి ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యల్లో మానసిక రుగ్మతలు ఇప్పటికీ అలక్ష్యానికి గురవుతున్నాయి. శారీరక వ్యాధులతో పోలిస్తే, స్కిజోఫ్రెనియా వంటి మానసిక సమస్యల గుర్తింపు, చికిత్సలో సమాజం వెనుకబడి ఉంది. అందుకే ఈ వ్యాధి గురించి ప్రజల్లో చైతన్యం పెంచడం, బాధితుల పట్ల సానుభూతి చూపడం, అపోహలు తొలగించడం వంటి ప్రధాన ఉద్దేశాలతో ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం మే 24న 'స్కిజోఫ్రెనియా అవగాహన దినోత్సవం' జరుపుకొంటున్నాం.

ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికల ప్రకారం, ప్రపంచంలో 0.3–0.7% మంది ఈ వ్యాధితో బాధపడుతున్నారు. సుమారు 1 కోటి మంది స్కిజోఫ్రెనియాతో జీవిస్తున్నట్టు అంచనా. ఈ వ్యాధిగ్రస్థులు తరచుగా భ్రమలకు లోనవుతారు. ఉదాహరణకు తనను ఎవరో హత్య చేయాలనుకుంటున్నారని భావిస్తూ భయపడుతుంటారు. అలాగే వారికి ఏవేవో శబ్దాలు వినిపిస్తున్నట్లు, ఏవో దృశ్యాలు కనిపిస్తున్నట్లు ఉంటుంది. సంభాషణలో అస్పష్టత ఉంటుంది. బంధువుల నుండి దూరంగా ఉండడానికి ప్రయత్నించడం, హఠాత్తుగా కోపగించుకోవడం, చికాకుపడడం, నిరాశకు లోనవ్వడం వీరి ప్రధాన లక్షణాలు.

ఈ వ్యాధికి స్పష్టమైన ఒకే కారణం లేకపోయినా... జన్యుపరమైన సున్నితత్వం, మెదడులో రసాయన అసమతుల్యత, బాల్యంలో జరిగిన మానసిక గాయాలు, మత్తు పదార్థాల వినియోగం వంటి అంశాలు ఉమ్మడిగా ప్రభావితం చేస్తాయి. మందులు (యాంటీ సైకోటిక్స్) వాడితే భ్రమలు వంటివి తగ్గుతాయి. ఆలోచనలను సమతుల్యం చేయడానికి తగిన మానసిక చికిత్స అందించాలి. కుటుంబం ఓర్పు, ప్రేమతో నిలబడటం బాధితుల ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. స్కిజోఫ్రెనియా బాధితులు ప్రమాదకరమనీ, వారికి సాధారణ జీవితం సాధ్యం కాదనీ చెప్పే మాటలు నిజం కాదు. చికిత్స అందిస్తే వారూ మనలాగే జీవిస్తారు.

– డా॥ బి. హర్షిణి (ఎమ్‌డీ, సైకియాట్రీ), ఫాదర్స్ ముల్లర్స్ మెడికల్ సైన్సెస్, మంగళూరు
(నేడు ప్రపంచ స్కిజోఫ్రెనియా అవగాహన దినోత్సవం)

మెడికల్ టూరిజంలో ముందంజలో మనం

అభిప్రాయం


డా॥ గురు ఎన్ రెడ్డి

ఇవాళ 'మెడికల్ టూరిజం' (వైద్య పర్యాటకం) వివిధ దేశాల ఆర్థిక వ్యవస్థలు వృద్ధి చెందడానికీ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న పేషెంట్లు వివిధ వ్యాధులకు అత్యున్నత చికిత్స పొందడానికీ వాహకంగా నిలుస్తోంది. ఈ రంగంలో భారత్ పైపైకి దూసుకుపోతుండటం మనందరికీ గర్వకారణం. వరల్డ్ ఎకనామిక్ ఫోరం 'ట్రావెల్ అండ్ టూరిజం డెవలప్‌మెంట్ ఇండెక్స్' (టీటీడీఐ)– 2024లో ప్రపంచవ్యాప్తంగా ఎంపిక చేసిన 119 దేశాల్లో మన భారతదేశం 39వ స్థానంలో ఉంది. అదే 2001లో మనం 54వ స్థానంలో ఉన్నాం. కీలకమైన అంశాల్లో భారత్ అద్భుతంగా రాణిస్తోంది. ఉదాహరణకు మిగతావారి కంటే మంచి ధరకు వైద్య సేవలు అందించడంలో 18వ స్థానం, విమాన రవాణా సామర్థ్యంలో 26వ స్థానం, అలాగే ఉపరితల రవాణాతో పాటు నౌకారవాణాలో 25వ స్థానంలో ఉంది. అందుకే ఈ ఏడాది నాటికి మెడికల్ టూరిజమ్‌లో భారత్‌లో మరో 12% పెరుగుదల నమోదవుతుందని అంచనా. ఈ రంగంలో ప్రస్తుతం ఫ్రాన్స్ అగ్రస్థానంలో ఉంది.

పేషెంట్స్‌కు ఇవాళ చాలా ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నాయి. వాళ్లు ఏదైనా మెడికల్ టూరిజమ్ తాలూకు గమ్యాన్ని ఎంపిక చేసుకోవాలంటే... అక్కడున్న ఆరోగ్య మౌలిక సదుపాయాలు, తేలిగ్గా చేరేందుకు అవసరమైన ప్రయాణ సౌకర్యాలు, తమ ప్రాంతానికీ, అక్కడికీ సాంస్కృతికంగా ఉన్న పోలికలూ, అక్కడ దొరికే వైద్యసదుపాయాల నాణ్యత, అక్కడి వైద్యుల విద్యార్హతలూ – నైపుణ్యాలూ, అంతర్జాతీయ థర్డ్ పార్టీ ద్వారా వాళ్లకు లభించిన ప్రశంసలూ కితాబులూ (అక్రెడిటేషన్స్), తాము వాళ్లతో ఎంత తేలిగ్గా సంభాషించడం సాధ్యమవుతుంది వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు.

2020 – 2021 మధ్యకాలంలో అంతర్జాతీయంగా / ప్రపంచవ్యాప్తంగా 46 ప్రాంతాలు అత్యద్భుతమైన మెడికల్ టూరిజమ్ గమ్యస్థానాలుగా ప్రఖ్యాతి పొందాయి. అనేక అంశాల ప్రాతిపదికన ఈ ర్యాంకింగ్‌లు ఇవ్వడం జరిగింది. మన భారతదేశం... ఆసియా ఖండంలోనే అత్యుత్తమమైన మెడికల్ టూరిజమ్ డెస్టినేషన్స్‌లో ఒకటిగా ప్రశస్తి పొందింది. మనం ఆరో స్థానంలో నిలిచాం. సౌకర్యాల నాణ్యతలోనే కాదు... విభిన్నమైన అనేక సేవలూ అందించగల మనే ప్రఖ్యాతి పొందాం. మన మెడికల్ వీసా విధానం ఎంత అత్యుత్తమైనదంటే... ఓ పేషెంట్‌తో పాటు అతడి సహాయకులూ (అటెండెంట్స్) దాదాపు 60 రోజులకు పైబడి ఇక్కడ అత్యంత సౌకర్యవంతంగా ఉండిపోయి సేవలందుకునేంత ఉత్తమమైన గమ్య స్థానంగా పేరొందడమన్నది అంతర్జాతీయంగా అన్ని దేశాల పేషెంట్స్‌నూ ఆకర్షిస్తోంది. 'గ్లోబల్ హెల్త్‌కేర్ అక్రెడిటేషన్ (జీహెచ్‌ఏ) వంటివి... భారతదేశాన్ని పేషెంట్ల పాలిట ఓ సురక్షితమైన, నాణ్యమైన, సాంస్కృతికంగా ఉత్తమమైన సేవలందించే, భాషాపరంగా కూడా ఇబ్బందులు లేని మెడికల్ టూరిజమ్ గమ్య స్థానంగా సిఫార్సు చేస్తున్నాయి.



భారతదేశంలో అనేక ఆస్పత్రులు అంతర్జాతీయ స్థాయి వైద్య సేవలందిస్తున్నాయి. అనేక మంది సందర్శించే నగరాల్లో ఢిల్లీ మొదటిస్థానంలో ఉంది. మనం అనేక రకాల వైద్యసేవలందించేలా సుశిక్షితులమై ఉన్నాం. ఉదాహరణకు జబ్బుపడకముందే నివారించగల సేవలు (ప్రివెంటివ్ మెడిసిన్) వంటివాటినీ అందిస్తున్నాం. ఎన్నో వ్యాధులకు చికిత్స నివ్వగల నిపుణులమంటూ గర్వంగా ప్రకటించుకో గలిగేంత పటిష్ఠమైన స్థానంలో ఉన్నాం. వైద్య సేవల కోసం నేడు అనేక ఆఫ్రికన్ దేశాలూ, పశ్చిమ ఆసియా, తూర్పు ఆసియా, మధ్యప్రాచ్యం (మిడిల్ ఈస్ట్)తో పాటు... యూరప్‌లోని పలు దేశాలు, ఉత్తర అమెరికా నుంచి కూడా ఇవాళ భారత్‌ను... మరీ ముఖ్యంగా హైదరాబాద్‌ను పలువురు పేషెంట్లు సందర్శిస్తున్నారు.

ప్రపంచవ్యాప్తంగా అత్యంత సంక్లిష్టమైన సర్జరీలు, సంతాన సాఫల్య చికిత్సలు, క్యాన్సర్ థెరపీలు, సౌందర్యసాధనాల ఉత్పాదనల రవాణా వంటివి మెడికల్ టూరిజమ్ రంగాన్ని మరింత ముందుకు నడిపే అంశాలు. దాంతోపాటు గణనీయమైన ప్రైవేటు పెట్టుబడులు, అలాగే అనుకూలమైన ప్రభుత్వ విధానాల వంటి వాటితో ఇంకాస్త మెరుగుదల సాధ్యమవుతుంది. దీన్ని సుసాధ్యం చేసేలా బడ్జెట్‌లో ఈ రంగానికి ఊతమిచ్చే నిర్ణయాలు చేయాలి. వీసా విధానాలను సులభతరం చేయాలి. తద్వారా మన 'హీల్ ఇన్ ఇండియా' నినాదానికి ఓ ఉద్యమరూపం కల్పించవచ్చు.

మన హైదరాబాద్ విషయానికి వస్తే... ఇప్పటికే ఈ నగరం వైద్య పర్యాటక రంగంలో ప్రపంచవ్యాప్త గమ్యస్థానాల్లో ఒకటిగా మారింది. కానీ అంతర్జాతీయంగా వైద్య సేవలను కోరుకుంటున్న కొన్ని దేశాలతో నేరుగా విమానయాన సర్వీసులు లేకపోవడం ఒక ప్రధాన అడ్డంకి అయ్యింది. వైద్యసేవలు ఇక్కడ చాలా చవగ్గా దొరుకుతుండటమూ, ఇంగ్లిష్‌లో సంభాషించగలిగినవారు ఉండటమూ, కాస్మోపాలిటన్ సంస్కృతి, సురక్షితమైన భద్రత వంటివి ఇక్కడి సానుకూల అంశాల్లో కొన్ని. అయితే ఈ పరిశ్రమలో రిఫరల్ ఫీజుల వంటి అనేక అనైతిక అంశాల వల్ల, అలాగే ఈ రంగంలోని మధ్యవర్తుల కారణంగా కొన్ని నిందలూ, అపవాదులు వినాల్సి రావడం ఓ దురదృష్టకరమైన అంశం. ఇక్కడికి వచ్చే విదేశీయుల్లో కొందరికి ఇంగ్లిష్ రాకపోవడం వల్ల ఇక్కడి మధ్యవర్తులు (దుబాసీలు) దోపిడీ చేస్తుండటమూ గర్హనీయమైన మరో అంశం.

ఈ నేపథ్యంలో హైదరాబాద్ ఓ మంచి హెల్త్ టూరిజమ్ డెస్టినేషన్‌గా వృద్ధి చెందాలంటే... విదేశీ పేషెంట్స్‌కు అవసరమైన అనువాదకులను ఏర్పాటు చేయడం, వారు ఏ విధంగానూ దోపిడీకి గురి కాకుండా చూసే ప్రత్యేక రక్షణ వ్యవస్థను సృష్టించడం, వారి సంస్కృతికి తగ్గట్లుగా ఆహారాలు, పానీయాలు అందేలా చేయడం, వారి మత ఆచారాలూ, విధానాలకు తగ్గట్లుగా ప్రార్థనా సౌకర్యాలు కల్పించడం, వారు ఖర్చు చేసే ప్రతి పైసాకూ తగిన ప్రతిఫలం అందేలా చూడటం అవసరం.

గత నాలుగు దశాబ్దాల కాలంలో ఓ మంచి వైద్యుడిగా, వైద్య సేవలు అదించే బృందాలకు నేతృత్వం వహిస్తున్నవాడిగా, ఇక్కడా, అలాగే అమెరికాలో కూడా సంపాదించిన అనుభవంతో చెప్పొచ్చేదేమిటంటే... మెడికల్ టూరిజమ్ రంగంలో మనం ప్రపంచంలోనే అందరూ కోరుకునే ఆదర్శ వనరులతో ఓ అద్భుతమైన గమ్యంగా ఉన్నాం. ఈ వేల కోట్ల డాలర్ల పరిశ్రమలో హైదరాబాద్‌నూ, మన రాష్ట్రాలనూ అగ్రస్థానంలో ఉంచడానికి కృషి చేయాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వినమ్రపూర్వకంగా అభ్యర్థిస్తున్నాను.

వ్యాసకర్త కాంటినెంటల్ హాస్పిటల్స్ స్థాపకుడు–చైర్మన్

ప్రేమైక మార్గం

ఎంతటి కఠినమైన మనిషినైనా మార్చగల శక్తి... దయ, ఓరిమి, వినయం, ప్రేమలకు ఉంటుంది. దేవుని కరుణా కటాక్ష వీక్షణాలకు పాత్రులవ్వడానికీ ఇవే సోపానాలు నిర్మిస్తాయి. ఒకసారి మదర్ థెరిసా తన సంరక్షణలో ఉన్న అనాథ పిల్లలకు అన్నం పెట్టడానికి డబ్బుల్లేక కలకత్తాలోని దుకాణదారులను యాచిస్తూ ఉన్న తరుణంలో... ఒక దుకాణదారుడు ఆమె ముఖం మీద ఉమ్మాడు. అయినా మదర్ ముఖం తుడుచుకుంటూ 'అయ్యా! ఈ ఉమ్మిని నేను స్వీకరిస్తాను. దయ చేసి అనాథ పిల్లల ఆకలి తీర్చడానికి మీ వంతు సాయం చేయగలరు' అని ఎంతో వినమ్రంగా అడిగారు. ఈ స్పందనను ఎదురు చూడని దుకాణం యజమాని హృదయం ద్రవించింది. వెంటనే గల్లాపెట్టెలో ఉన్న డబ్బునంతా తీసి మదర్‌కు ఇచ్చి క్షమించమని ఆమె కాళ్ళపై పడ్డాడు. తర్వాతి కాలంలో చావు ముంగిట ఉన్న వారి కోసం ఆమె స్థాపించిన శరణాలయాన్ని ఊరు మధ్య నుంచి తీయించడానికి కలకత్తాలోని సంప్రదాయవాదులు నానా ఇబ్బంది పెట్టారు. అయినా ఆమె సహనంతో ఆ బాధలను అనుభవిస్తూ 'మానవ సేవలోనే మాధవ సేవ' ఉందని చేతల ద్వారా నిరూపించారు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** బ.ద్వాదశి సా.4.14 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** రేవతి ప.10.58 వరకు, తదుపరి అశ్విని, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.6.03 నుండి 7.14 వరకు, **అమృతఘడియలు:** ఉ.8.44 నుండి 10.14 వరకు, శని త్రయోదశి ; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.30, **సూర్యాస్తమయం:** 6.23.

కేటీపీపీలో నిలిచిన విద్యుదుత్పత్తి

గణపురం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని 500 మెగా వాట్ల మొదటి దశ చెల్పూర్ కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రం (కేటీపీపీ)లో గురువారం అర్ధరాత్రి విద్యుదుత్పత్తి నిలిచిపోయింది. ప్రధాన ప్లాంట్‌లోని బాయిలర్ ట్యూబ్ లీకేజీతో అధికారులు విద్యుదుత్పత్తిని నిలిపివేశారు. అధికారులు మరమ్మతులు చేపట్టారు. శనివారం ఉదయం వరకు విద్యుదుత్పత్తి పునః ప్రారంభం అవుతుందని అధికారులు తెలిపారు.

పుష్కరాలకు పోటెత్తిన భక్తజనం

- తొమ్మిదో రోజు 2 లక్షల మందికిపైగా భక్తుల పుణ్యస్నానాలు
- వన్ వే ఏర్పాటు చేసినా 7 కిలోమీటర్లు నిలిచిన వాహనాలు
- ఓపిక నశించి 5 కిలోమీటర్లు కాలి నడకన త్రివేణి సంగమానికి..



సరస్వతి ఘాట్ వద్ద భక్తుల రద్దీ

భూపాలపల్లి/కాళేశ్వరం: సరస్వతి పుష్కరాలకు ముగింపు తేదీ దగ్గర పడుతుండటంతో భక్తజనం భారీగా తరలివస్తోంది. 9వ రోజు సుమారు 2 లక్షల మందికి పైగా భక్తులు పుణ్య స్నానాలు చేశారు. దక్షిణ కాశీగా పేరొందిన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో ఈ నెల 15న ప్రారంభమైన సరస్వతి పుష్కరాలు 26వ తేదీతో ముగియనున్నాయి. శుక్రవారం తెల్లవారు జామునుంచే త్రివేణి సంగమం, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర ఆలయం భక్తజనంతో నిండిపోయింది. హంపి పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య స్వామి పుష్కర స్నానం ఆచరించి, నదికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. నర్సంపేట, హుజూరాబాద్ ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డిలు వేర్వేరుగా పుష్కర స్నానం చేసి ఆలయంలో పూజలు చేశారు. శనివారం, ఆదివారం, సోమవారాల్లో భక్తులు 3 లక్షలకు పైగా వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

రోజంతా ట్రాఫిక్ సమస్యే..

శుక్రవారం ఉదయం 9 గంటల నుంచే హనుమకొండ, జనగామ, హైదరాబాద్, మహబూబాబాద్, భద్రాచలం, ఖమ్మం, పెద్దపల్లి, కరీంనగర్, సిద్దిపేట తదితర ప్రాంతాల నుంచి వేలాది ప్రైవేట్ వాహనాలు కాళేశ్వరం వైపు రాసాగాయి. వన్ వే ఏర్పాటు చేసినందున మహదేవపూర్ మండలం అన్నారం స్తూపం వరకు వచ్చాక మద్దులపల్లి మీదుగా కాళేశ్వరం వైపు వాహనాలు వెళుతుండగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. కాళేశ్వరం ఆలయ సమీపంలోని పార్కింగ్ స్థలాలు నిండిపోవడం, వర్షం కారణంగా పలు పార్కింగ్ స్థలాల్లో ఉన్న వాహనాలు బయటకు రాలేకపోయాయి. ఫలితంగా పుష్కర స్నానం కోసం త్రివేణి సంగమం వైపు వెళ్లే భక్తుల వాహనాలు మద్దులపల్లి నుంచి కాళేశ్వరం వరకు సుమారు 7 కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. పోలీసులు పూస్కుపల్లి వద్ద హోల్డింగ్ పాయింట్ ఏర్పాటు చేసి వాహనాలను మళ్లించినా ఫలితం లేకపోయింది. రహదారిపై వాహనాలు దిగబడిపోవడం, గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోవడంతో భక్తులు చేసేది లేక తమ సామగ్రి, పిల్లజెల్లను నెత్తిన ఎత్తుకొని సుమారు ఐదు కిలోమీటర్లకు పైగా కాలి నడకన త్రివేణి సంగమానికి చేరుకున్నారు.

విచక్షణ కోల్పోయిన డీఎస్పీ

కాళేశ్వరానికి వస్తున్న వాహనాలు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవడం, గంటల తరబడి సమస్య పరిష్కారం కాకపోవడంతో అక్కడే ఉన్న కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి విచక్షణ కోల్పోయారు. ట్రాఫిక్‌ను సమస్యను పరిష్కరించాల్సిందిపోయి వాహనదారులపై ఉగ్రరూపం దాల్చాడు. వాహన డ్రైవర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఒక కంక కర్రతో కార్లను ఇష్టారాజ్యంగా కొట్టసాగాడు. దీంతో పలు వాహనాల బానెట్‌లు దెబ్బతిన్నాయి. ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతే తాము ఏం చేస్తామంటూ వాహనదారులు సదరు డీఎస్పీతో వాగ్వాదానికి దిగారు. అనంతరం పోలీసులు ఎంత ప్రయత్నించినా మధ్యాహ్నం 3 గంటల వరకు కూడా ట్రాఫిక్ సాధారణ పరిస్థితికి రాలేదు. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇదిలా ఉండగా మధ్యాహ్నం సమయంలో ట్రాఫిక్‌లో ఇరుకున్న వాహనదారులు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు త్రివేణి సంగమం వరకు చేరుకోగా అదే సమయంలో భారీ వర్షం కురిసింది. దీంతో మళ్లీ ఇబ్బందులు తప్పలేదు.

ప్రధాన నగరాల్లో భూగర్భ విద్యుత్ వ్యవస్థ

- తెలంగాణ డిస్కంల నిర్ణయం
- బెంగళూరులో అమలును పరిశీలించిన బృందం



బెంగళూరులో తెలంగాణ విద్యుత్ అధికారుల బృందం

ఖమ్మం వ్యవసాయం: హైదరాబాద్ మహానగరంతో పాటు రాష్ట్రంలోని ముఖ్య పట్టణాల్లో భూగర్భ కేబుల్ వ్యవస్థ ద్వారా విద్యుత్ సరఫరా చేపట్టాలని ఉత్తర, దక్షిణ విద్యుత్ డిస్కంలు నిర్ణయించాయి. ఈ మేరకు ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ సీఎండీలు నిర్ణయం తీసుకోగా.. ఇప్పటికే దేశంలో భూగర్భ విద్యుత్ లైన్ల విధానం అమల్లో ఉన్న నగరాల్లో ఈ విధానాన్ని పరిశీలించాలని డిస్కంలు సాంకేతిక విభాగాన్ని ఆదేశించాయి. దీంతో రాష్ట్రంలోని రెండు డిస్కంలకు చెందిన ప్రతినిధులు శుక్రవారం కర్ణాటకలోని బెంగళూరు ఎలక్ట్రిక్ సప్లై కంపెనీ (బీఎస్‌కామ్)ని సందర్శించారు. బీఎస్‌కామ్ ఇటీవల బెంగళూరులో ఉపరితల (ఓవర్ హెడ్) విద్యుత్ లైన్ల వ్యవస్థను తొలగించి రూ.5,400 కోట్లతో భూగర్భ విద్యుత్ కేబుల్ వ్యవస్థను ఏర్పాటుచేసింది. ఈ నేపథ్యంలో భూగర్భంలో ఏర్పాటు చేసిన 11 కేవీ లైన్లను తెలంగాణ డిస్కంలకు చెందిన సాంకేతిక బృందం సభ్యులు పరిశీలించారు. భూగర్భంలో వేసిన కేబుళ్ల విలువ, భూగర్భంలోకి విద్యుత్ లైన్ల వ్యవస్థను మార్చాక ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎదురైన పరిణామాలు, ఉపరితలంతో పోలిస్తే భూగర్భంలో అనుకూలతలు, అంతరాయాల్లో ఉన్న తేడాలు.. వంటి అంశాలను తెలంగాణ అధికారులు తెలుసుకున్నారు. భూగర్భ విధానంతో ఎప్పటికప్పుడు రహదారుల వెంట ఉన్న చెట్ల కొమ్మలు తొలగించే భారం తప్పడం.. తదితర ప్రయోజనాలపైనా అధ్యయనం చేశారు. బెంగళూరులో పర్యటించిన తెలంగాణ బృందంలో హైదరాబాద్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ (టీజీఎస్పీడీసీఎల్) చీఫ్ మేనేజర్ కామేశ్, ఏడీలు ప్రవీణ్, సతీశ్, టీజీఎన్పీడీసీఎల్ (వరంగల్) నుంచి చీఫ్ ఇంజనీర్ కె.వెంకటరమణ, ఖమ్మం ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి ఉన్నారు. కాగా, ఖమ్మం జిల్లా మధిరలో ఇప్పటికే భూగర్భ విద్యుత్ లైన్ల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించారు.

- వచ్చే నెల 2న వ్యవసాయ వర్సిటీలో నాణ్యమైన విత్తనాల పంపిణీని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని ఉపకులపతి డాక్టర్ అల్దాస్ జానయ్య తెలిపారు. విత్తన వారోత్సవాలలో భాగంగా.. జూన్ 3 నుంచి వరి, కంది, మొక్కజొన్న, పెసర, మినుము, ఆముదం, చిరు ధాన్యాల పంటలకు సంబంధించి సుమారు 8,500 క్వింటాళ్లు సిద్ధంగా ఉంచామని వెల్లడించారు.



'మైసూర్'లో 'పాక్' మాయం!

దాయాది పేరుందని స్వీట్ల పేరు మార్పు • పాక్ ఉన్నచోట శ్రీ అని చేరుస్తున్న దుకాణాలు



జైపూర్: 'మైసూర్‌పాక్‌లో మైసూర్ ఏదిరా?' అంటూ ఒక సినిమాలో హోటల్ యజమానిని కమెడియన్ పాత్రధారి నిలదీసే సీన్ కడుపుబ్బా నవ్విస్తుంది. జైపూర్లో మాత్రం పలు మిఠాయి దుకాణాలు మాత్రం దాయాది పేరు ధ్వనిస్తోందనే కారణంతో మైసూర్‌పాక్ పేరును మైసూర్‌శ్రీగా మార్చేశాయి! అంతేగాక ప్రతి మిఠాయి పేరులోనూ పాక్‌కు బదులు శ్రీ అని చేరుస్తున్నాయి. అలా మోతీపాక్ మోతీశ్రీ, ఆమ్‌పాక్ ఆమ్‌శ్రీ గోండ్ పాక్ గోండ్‌శ్రీ అయిపోయాయి. స్వర్ణభస్మపాక్, చాందీభస్మపాక్ వంటి ప్రీమియం మిఠాయిలు కూడా స్వర్ణభస్మశ్రీ, చాందీభస్మశ్రీగా పేరు మార్చుకున్నాయి. దేశాభిమానంతోనే ఈ పని చేసినట్టు జైపూర్లోని ప్రఖ్యాత 'త్యోహార్ స్వీట్స్', 'బాంబే మృష్టాన్ భండార' వంటి స్వీట్‌షాపుల యజమానులు చెబుతున్నారు. దీన్ని కస్టమర్లు కూడా ఎంతగానో మెచ్చుకుంటుండటం విశేషం! ''స్వీట్ల పేర్ల మార్పు చిన్న విషయంగా అన్పించొచ్చు. కానీ పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యం నుంచి చూస్తే ఇది చాలా శక్తిమంతమైన సాంస్కృతిక సంస్పందన. యుద్ధక్షేత్రం నుంచి మిఠాయి దుకాణాల దాకా మన వీర జవాన్లకు ప్రతి భారతవాసీ తోడుగా ఉన్నాడని చాటి చెప్పే ప్రయత్నమిది'' అని వారంటున్నారు. ''మైసూర్‌పాక్ పేరును మైసూర్‌శ్రీగా మార్చారని వినగానే నా పెదాలపై గర్వంతో కూడిన చిరునవ్వు ఉదయించింది. మన జవాన్ల వీరత్వానికి మిఠాయిలు కూడా ఇలా సెల్యూట్ చేస్తున్నాయని అనిపించింది'' అని పుష్పా కౌశిక్ అనే రిటైర్డ్ టీచర్ చెప్పుకొచ్చారు.

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చలేదు

సుప్రీంకోర్టు పనితీరుపై జస్టిస్ ఓకా ఆవేదన

- పూర్తిగా సీజేఐ కేంద్రంగా కార్యకలాపాలు
- హైకోర్టుల్లోనే మెరుగైన ప్రజాస్వామ్యం
- వీడ్కోలు ప్రసంగంలో సంచలన వ్యాఖ్యలు
- 'సీజేఐ–కేంద్రిత' ఇమేజీని వదిలించుకోవాలి
- పారదర్శకత, హేతుబద్ధత తక్షణావసరాలు
- లిస్టింగ్ నుంచి పనితీరు దాకా కన్పించాలి
- అధికారాలను పూర్తిగా వికేంద్రీకరించాలి
- కీలక సూచనలు చేసిన న్యాయమూర్తి


జస్టిస్ ఓకా

న్యూఢిల్లీ: ''సుప్రీంకోర్టు చాలావరకు ప్రధాన న్యాయమూర్తిపైనే ఆధారపడి పని చేస్తోంది. అది సరికాదు. అత్యున్నత న్యాయస్థానం 'సీజేఐ–కేంద్రిత' ఇమేజీని తక్షణం వదిలించుకోవాల్సిన అవసరం చాలా ఉంది'' అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభయ్ శ్రీనివాస్ ఓకా అభిప్రాయపడ్డారు. ''సుప్రీంకోర్టు ఇటీవలే 75 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సుదీర్ఘ ప్రస్థానంలో దేశానికి ఎంతో సేవ చేసిందనడంలో సందేహం లేదు. కానీ ప్రజలు తనపై పెట్టుకున్న ఆకాంక్షలను మాత్రం నెరవేర్చలేకపోయిందన్నది నా వ్యక్తిగత అభిప్రాయం'' అని చెప్పారు. ''సుప్రీంకోర్టుకు ఇది ఉత్సవ సమయం కాదు. ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన సందర్భం'' అని హితవు పలికారు. అంతేకాదు, సుప్రీంకోర్టు కంటే హైకోర్టుల పనితీరే ప్రజాస్వామికంగా ఉంటుందని ఆయన కుండబద్దలు కొట్టారు! ''హైకోర్టుల్లో తొలి ఐదు న్యాయమూర్తులతో కూడిన పాలక కమిటీ ఉంటుంది. అదే ప్రధాన నిర్ణయాలన్నీ తీసుకుంటుంది. కమిటీలు, నిర్ధారిత రోస్టర్ల ద్వారా హైకోర్టుల్లో కార్యకలాపాలు సజావుగా సాగిపోతాయి. కానీ సుప్రీంకోర్టులో అలా కాదు. కార్యకలాపాలన్నీ ప్రధానంగా సీజేఐ ఆధారితంగా సాగుతాయి'' అంటూ ఆక్షేపించారు. ''సుప్రీంకోర్టు అధికారాలను పూర్తిగా వికేంద్రీకరించాలి. కేసుల లిస్టింగ్ పూర్తి పారదర్శకంగా జరగాలి. లిస్టింగ్, కోర్టు కార్యకలాపాల నిర్వహణలో టెక్నాలజీ వాడకం మరింతగా పెరగాలి'' అంటూ కీలక సూచనలు చేశారు. ఇవన్నీ ప్రస్తుత సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ హయాంలోనే కార్యరూపం దాలుస్తాయని ఆశాభావం వెలిబుచ్చారు. జస్టిస్ ఓకా శుక్రవారం రిటైరయ్యారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతూ పలు కీలకాంశాలను లేవనెత్తారు. ''హైకోర్టులతో పోలిస్తే సుప్రీంకోర్టు తన పనితీరు విషయంలో సీజేఐపై విపరీతంగా ఆధారపడుతుంది. అక్కడ న్యాయమూర్తిగా చేసిన ఈ మూడేళ్లలో దీన్ని బాగా గమనించాను. సుప్రీంకోర్టులో దేశ నలుమూలల నుంచి వచ్చే 34 మంది న్యాయమూర్తులు ఉంటారు. అలాంటప్పుడు సీజేఐ ఆధారిత ఇమేజీ ఏమాత్రమూ సరికాదు. సుప్రీంకోర్టు మరింత సమ్మిళిత, నిర్మాణాత్మక వ్యవస్థగా మారాల్సిన అవసరముంది'' అని స్పష్టం చేశారు.

లిస్టింగ్ సమస్యలు

సుప్రీంకోర్టులో కేసుల లిస్టింగ్ విషయంలోనూ తక్షణం పరిష్కరించాల్సిన అంశాలున్నాయని జస్టిస్ ఓకా చెప్పారు. ''కొన్ని కేసులు మర్నాడే విచారణకు వస్తాయని, మరికొన్ని రోజుల తరబడి పెండింగ్‌లో ఉండిపోతాయని చాలామంది ఫిర్యాదు చేస్తున్నారు. కేసుల లిస్టింగ్ విషయంలో హైకోర్టులు ఫిక్స్‌డ్ రోస్టర్‌ను పాటిస్తాయి. సుప్రీంకోర్టు కూడా ఈ విషయంలో పూర్తి పారదర్శక విధానాన్ని అనుసరించాలి'' అని సూచించారు. ''కేసుల లిస్టింగ్‌లో హేతుబద్ధత చాలా ముఖ్యం. వాటిని ఎవరూ వేలెత్తి చూపకుండా చూసుకోవాలి. మానవ ప్రమేయాన్ని పూర్తిగా తగ్గిస్తే తప్ప ఇది సాధ్యం కాదు. ఇందుకు కృత్రిమ మేధ తదితర పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలి. సుప్రీం కేవలం రాజ్యాంగ న్యాయస్థానం మాత్రమే కాదు. అపెలెట్ కోర్టు కూడా. కనుక రోజువారీ విధుల నిర్వహణలో పారదర్శకత, నిష్పాక్షికత వంటివి చాలా ముఖ్యం'' అని కుండబద్దలు కొట్టారు. న్యాయవ్యవస్థకు వెన్నెముక వంటి ట్రయల్, జిల్లా కోర్టులను హైకోర్టులు, సుప్రీంకోర్టు చిరకాలంగా నిర్లక్ష్యం చేస్తూ వస్తున్నాయని జస్టిస్ ఓకా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ట్రయల్ కోర్టుల్లో 30 ఏళ్లుగా పెండింగ్ కేసులు భారీగా పేరుకుపోయాయని గుర్తు చేశారు.

నమ్మకమిచ్చిన తీర్పరి

జస్టిస్ ఓకాపై సీజేఐ ప్రశంసలు

జస్టిస్ ఓకాకు సీజేఐ గవాయ్ భావోద్వేగభరితంగా వీడ్కోలు పలికారు. ఆయన తన తీర్పులతో అసంఖ్యాకులకు న్యాయవ్యవస్థపై నమ్మకం కలిగించారని కొనియాడారు. ''దాదాపు సమాంతరంగా సాగిన కెరీర్లు మా ఇద్దరివీ. న్యాయవాదిగా ప్రాక్టీస్ మొదలుపెట్టిన తొలినాళ్లలోనే ఆయన అపార ప్రజ్ఞ అందరినీ ఆకట్టుకుంది. ప్రతి వాదనకూ పూర్తిగా సంసిద్ధమై వచ్చేవారు. న్యాయమూర్తిగానూ అదే ఒరవడి కొనసాగించారు. రెండు రోజుల క్రితమే తల్లిని పోగొట్టుకున్నారు. అయినా అంత్యక్రియలు జరిగిన మర్నాడే విధులకు హాజరై 11 తీర్పులు వెలువరించారు. అంతటి అంకితభావమున్న అద్భుతమైన న్యాయమూర్తికి ఈ రోజు వీడ్కోలు పలుకుతున్నాం'' అన్నారు. న్యాయమూర్తులతో పాటు యువ న్యాయవాదులకు జస్టిస్ ఓకా స్ఫూర్తిగా నిలుస్తారన్నారు.

వీడ్కోలు ప్రసంగాలు అంత ఈజీ కాదు

వీడ్కోలు ప్రసంగాలు రాసుకోవడం అంత సులువు కాదంటూ చమత్కరించారు. ''గత రెండు వారాలు భారంగా గడిచాయి. ఎన్నో తీర్పులు రాయాల్సొచ్చింది. వాటిని బుధవారానికల్లా పూర్తి చేసి గురువారం వీడ్కోలు ప్రసంగం సిద్ధం చేసుకుందామనుకున్నా. కానీ ఊపిరి సలపని కార్యభారం వల్ల కుదరనే లేదు'' అని చెప్పుకొచ్చారు. న్యాయమూర్తిగా రెండు దశాబ్దాల పైచిలుకు కెరీర్లో మెజారిటీ తీర్పుతో తాను ఎన్నడూ విభేదించలేదన్నారు. ఇప్పట్లో ఇంటర్వ్యూలు ఇవ్వబోనని స్పష్టం చేశారు. మీడియాతో మాట్లాడేందుకు కాస్త సమయం కావాలన్నారు.

యాపిల్‌కు ట్రంప్ అల్టిమేటం

అమెరికాలోనే ఐఫోన్ల ఉత్పత్తి • లేదంటే 25% శాతం సుంకాలు


ట్రంప్

వాషింగ్టన్: ఐఫోన్లను అమెరికాలోనే తయారు చేయాలంటూ యాపిల్ కంపెనీపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరింతగా ఒత్తిడి పెంచారు. భారత్‌తో సహా మరెక్కడ ఉత్పత్తి చేసినా 25 శాతం దిగుమతి సుంకం తప్పదంటూ తాజాగా అల్టిమేటం జారీ చేశారు. ''అమెరికాలో విక్రయించే ఐఫోన్లను ఇక్కడే తయారు చేయాలని యాపిల్ చీఫ్ టిమ్ కుక్‌కు ఎప్పుడో చెప్పా. భారత్‌లోనో, మరో దేశంలోనే తయారు చేస్తామంటే కుదరదని స్పష్టం చేశా. కానీ ఆయన వినడం లేదు. అందుకే యాపిల్ ఉత్పత్తులపై 25 శాతం టారిఫ్ విధించాలని నిర్ణయించా'' అని శుక్రవారం తన సొంత 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ వెల్లడించారు. టారిఫ్‌ల భారాన్ని తగ్గించుకునేందుకు ఐఫోన్ల తయారీని చైనా నుంచి భారత్‌కు మార్చాలని కుక్ నిర్ణయించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ట్రంప్ ఇలా టారిఫ్ బాంబు పేల్చారు. గత వారం పశ్చిమాసియాలో పర్యటన సమయంలోనే ఆయన ఈ విషయాన్ని ప్రస్తావించడం తెలిసిందే. అమెరికా నిర్ణయంతో ఐఫోన్ల ధరలకు రెక్కలొచ్చే అవకాశం కన్పిస్తోంది. అదే జరిగితే ఫోన్ల అమ్మకాలు పడిపోయి సంస్థ లాభాలపై ప్రభావం పడనుంది. ట్రంప్ టారిఫ్‌లతో తలెత్తిన అనిశ్చితి, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లకు ఎలా స్పందించాలో తెలియక అమెజాన్, వాల్‌మార్ట్ వంటి దిగ్గజ కంపెనీలన్నీ ఇప్పటికే అయోమయంలో పడ్డాయి.

ఈయూపై 50% బాదుడు

యూరోపియన్ యూనియన్ (ఈయూ) పైనా ట్రంప్ మరోసారి టారిఫ్‌ల కొరడా ఝుళిపించారు. ఈయూతో అమెరికా వాణిజ్య చర్చలు సజావుగా సాగడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జూన్ 1 నుంచి అన్ని రకాల ఈయూ ఉత్పత్తులపైనా 50 శాతం టారిఫ్ అమల్లోకి రానుందని 'ట్రూత్ సోషల్'లో ప్రకటించారు. అమెరికాలో తయారు చేసే వస్తువులపై ఎలాంటి టారిఫ్‌లూ ఉండవని సెలవిచ్చారు. ఈయూ దిగుమతులపై 10% పన్ను కొనసాగాలని ట్రంప్ పట్టుబడుతుండగా పూర్తిగా ఎత్తేయాలని ఈయూ కోరుతోంది. ఈ సమయంలో ఆయన ఉన్నట్టుండి ఇలా టారిఫ్ బాంబు పేల్చారు. చైనా మీదా ఇలాగే టారిఫ్‌లను ఆయన 145 శాతానికి తీసుకెళ్లడం, చివరికి 30 శాతానికి తగ్గించడం తెలిసిందే.

నేను చిప్స్ దొంగిలించలేదమ్మా

నోట్ రాసి ప్రాణం తీసుకున్న బాలుడు

కోల్‌కతా: పాపం 12 ఏళ్ల పసివాడు! చిప్స్ దొంగిలించాడని అభాండం వేయడమే గాక అందరిముందు దండించడాన్ని, తల్లి కూడా తననే తప్పుబట్టడాన్ని తట్టుకోలేకపోయాడు. ఏకంగా పురుగుల మందు తాగి ప్రాణాలు తీసుకున్నాడు. 'నేను చిప్స్ దొంగిలించలేదమ్మా' అంటూ నోట్ రాసి మరీ ఆత్మహత్య చేసుకున్నాడు! ఈ దారుణం పశ్చిమబంగాల్‌లో పశ్చిమ మేదినీపూర్ జిల్లాలోని పన్స్కురాలో జరిగింది. ఏడో తరగతి చదువుతున్న క్రిషేందు దాస్ చిప్స్ ప్యాకెట్ కొనడానికి ఓ దుకాణానికి వెళ్తే ఎవరూ కన్పించలేదు. 'మామయ్యా! చిప్స్ కావాలి' అని యజమాని శుభాంకర్ దీక్షిత్‌ను ఎంత పిలిచినా స్పందన రాలేదు. దాంతో ఒక ప్యాకెట్ చిప్స్ తీసుకుని వెనుదిరిగాడు. అప్పుడొచ్చి చూసిన దీక్షిత్ కోపంతో క్రిషేందును దుకాణానికి లాక్కొచ్చి చెంపదెబ్బ కొట్టాడు. అందరి ముందూ గుంజీళ్లు తీయించడమే గాక బాలుని తల్లిని పిలిపించాడు. ఆమె కూడా కొడుకునే తిట్టి చెంపదెబ్బ కొట్టింది. ఎంత పిలిచినా దీక్షిత్ రానందుకే చిప్స్ తీసుకున్నానని, తరువాతైనా డబ్బులు ఇచ్చేవాడినని ఎంత చెప్పినా ఎవరూ విన్లేదు. దాంతో అందరి ముందూ దాస్ క్షమాపణలు చెప్పాడు. అయినా తాను అబద్ధం చెబుతున్నాడని దీక్షిత్ పదేపదే తిట్టడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఇంట్లోకెళ్లగానే గదిలోకి దూరి గడియ వేసుకున్నాడు. దాంతో తల్లి ఇరుగుపొరుగును పిలిచి తలుపు పగలగొట్టింది. అప్పటికే బాబు నోటి నుంచి నురగలు వస్తున్నాయి. పక్కన సగం తాగిన పురుగుమందుల సీసా, బెంగాలీలో నోట్ కనిపించింది. ''అమ్మా! నేను దొంగను కాదు. దొంగతనం చేయలేదు. చాలాసేపు పిలిచినా మామయ్య (దుకాణదారు) రాలేదు. అందుకే కుర్కురే ప్యాకెట్ తీసుకున్నా. అవంటే నాకెంతో ఇష్టం కదా! ఇవి నా చివరి మాటలు. పురుగుమందు తాగినందుకు క్షమించు'' అని అందులో రాశాడు.

పాక్–ఉగ్రవాదం లంకె సిందూర్‌తో బట్టబయలు: షా

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్ర దాడికి ప్రతిగా భారత వైమానిక దళం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్‌కు ఉగ్రమూకలతో అంటకాగుతున్న విషయం మరోసారి బట్టబయలైందని హోం మంత్రి అమిత్ షా చెప్పారు. మన బలగాలు పాక్‌తోపాటు పీవోకేలో 9 ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేశాక ఆ దేశం కొన్ని పౌర, సైనిక లక్ష్యాలపై మాత్రం దాడి చేయగలిగిందన్నారు. అనంతరం, మన ఆర్మీ సరిహద్దుల ఆవల 100 కిలోమీటర్ల దూరం చొచ్చుకెళ్లి పాక్ వైమానిక సామర్థ్యాన్ని తీవ్రంగా దెబ్బతీయగలిగిందని చెప్పారు. సరిహద్దు భద్రతా దళం(బీఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి ప్రసంగించారు.

'ఈశాన్యం'లో అసాధారణ అభివృద్ధి

- ఇక్కడ ప్రగతిని వేగవంతం చేస్తాం
- పెట్టుబడులకు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయి
- వాటిని పారిశ్రామికవేత్తలు వినియోగించుకోవాలి
- 'రైజింగ్ నార్త్ ఈస్ట్ ఇన్వెస్టర్స్ సమ్మిట్'లో మోదీ పిలుపు



న్యూఢిల్లీ: ఈశాన్య రాష్ట్రాల్లో మునుపెన్నడూ లేని రీతిలో అసాధారణ అభివృద్ధి జరుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తంచేశారు. గతంలో బాంబులు, తుపాకులు, ఘర్షణలకు మారుపేరైన ఈ ప్రాంతం ఇప్పుడు ప్రగతి పథంలో దూసుకెళ్తోందని చెప్పారు. ఈశాన్యంలో అభివృద్ధిని మరింత వేగవంతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టంచేశారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన 'రైజింగ్ నార్త్ ఈస్ట్ ఇన్వెస్టర్స్ సమ్మిట్'లో ప్రధాని మోదీ ప్రసంగించారు. వైవిధ్యమే ఈశాన్యానికి అతిపెద్ద బలమని తెలిపారు. ఇక్కడ పెట్టుబడులకు, వ్యాపారాభివృద్ధికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రధానంగా ఇంధనం, సెమీకండక్టర్ల రంగంలో పెట్టుబడులకు ఈశాన్య రాష్ట్రాలు గమ్యస్థానంగా మారాయని వెల్లడించారు. దేశంలో సెమీకండక్టర్ల ఉత్పత్తి వ్యవస్థను బలోపేతం చేయడంలో అస్సాం పాత్ర గణనీయంగా పెరిగిందని ఉద్ఘాటించారు. నార్త్‌ఈస్ట్ సెమీకండక్టర్ ప్లాంట్ నుంచి అతిత్వరలో మొట్టమొదటి మేడ్ ఇన్ ఇండియా చిప్ రాబోతోందని ప్రకటించారు. ఈశాన్యానికి ఇదొక మైలురాయి కాబోతోందని అన్నారు. అత్యాధునిక టెక్నాలజీని వినియోగించుకోవడంపాటు హైటెక్ పారిశ్రామిక ప్రగతిలో ఈశాన్య రాష్ట్రాల స్థానం మరింత పటిష్టం కానుందని వ్యాఖ్యానించారు.

ఉగ్రవాదం, తీవ్రవాదంపై కఠిన వైఖరి

ఏ ప్రాంతమైనా చక్కటి అభివృద్ధి సాధించాలంటే అక్కడ శాంతిభద్రతలు మెరుగ్గా ఉండడం అత్యంత కీలకమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అశాంతి, హింస కారణంగా గతంలో ఈశాన్య ప్రాంత యువకులు ఎన్నో అవకాశాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఉగ్రవాదం, తీవ్రవాదంపై కఠినంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. అభివృద్ధికి అడ్డుగా నిలిచే హింసాకాండను సహించే ప్రసక్తే లేదన్నారు. తమ ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని, గత 11 ఏళ్లలో ఈశాన్యంలో 10 వేల మంది యువకులు ఆయుధాలు వదిలేసి అభివృద్ధిలో భాగస్వాములయ్యారని పేర్కొన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వచ్చాయని తెలియజేశారు. వారంతా హింసను వ్యతిరేకిస్తూ శాంతి, సుస్థిరతను కోరుకుంటున్నారని ప్రశంసించారు.

టూరిజం హబ్‌గా నార్త్ ఈస్ట్

ఈశాన్య భారతదేశంలో హైడ్రోపవర్, సోలార్ పవర్ రంగాల్లో ప్రభుత్వం భారీగా పెట్టుబడులు పెడుతోందని ప్రధానమంత్రి గుర్తుచేశారు. ఇప్పటికే రూ.వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చామని చెప్పారు. ఈశాన్యంలో సోలార్ మాడ్యూల్స్, సెల్స్ తయారీ రంగంలోనూ ఎన్నెన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిని వినియోగించుకోవాలని పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు. జీవ–ఆర్థిక వ్యవస్థ, వెదురు పరిశ్రమ, తేయాకు ఉత్పత్తి, పెట్రోలియం, క్రీడలు, నైపుణ్యాలకు ఈ ప్రాంతం పర్యాయపదంగా మారిందన్నారు. పర్యావరణ టూరిజానికి ప్రధాన కేంద్రంగా ఎదుగుతోందని చెప్పారు. రైజింగ్ నార్త్ ఈస్ట్ పెట్టుబడిదారుల సదస్సులో ఈశాన్య రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, ప్రజాప్రతినిధులతోపాటు ప్రముఖ పారిశ్రామికవేత్తలు ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీ, అనిల్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు. రెండు రోజులపాటు ఈ సదస్సు జరుగనుంది.

రెండు ఎన్‌కౌంటర్లలో ఐదుగురు మావోయిస్టులు మృతి

చర్ల: మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లలో జరిగిన రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో ఐదుగురు మావోయిస్టులు చనిపోయారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా కవండీ –నెల్గొండ సమీపాన ఇంద్రావతి నదీ తీరంలో మావోయిస్టులు సంచారంపై నిఘా వర్గాల సమాచారం మేరకు బలగాలు గురువారం మధ్యాహ్నం నుంచి కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున ఇరువర్గాల మధ్య కాల్పులు మొదలయ్యాయి. కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు చనిపోయారు. మరోవైపు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా కిస్టారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని దట్టమైన అటవీ ప్రాంతంలో గురువారం సాయంత్రం జరిగిన ఎదురు కాల్పుల్లో ఒక నక్సలైట్ చనిపోయాడు. ఆపరేషన్ కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

రాజీనామా యోచనలో బంగ్లా సారథి యూనస్?

ఢాకా: బంగ్లాదేశ్‌లోని తాత్కాలిక ప్రభుత్వ సారథి మహ్మద్ యూనస్ బాధ్యతల నుంచి తప్పుకునే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. దేశంలో రాజకీయ మార్పును సాధించే విషయంలో రాజకీయ పార్టీల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడంతో బాధ్యతల నిర్వహణ కష్టంగా మారిందని ఆయన అంటున్నట్లు మీడియా చెబుతోంది. మారుతున్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో విధులను కొనసాగించడంపై యూనస్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారని నేషనల్ సిటిజన్ పార్టీ చీఫ్ నహీద్ ఇస్లామ్ చెప్పారని బీబీసీ పేర్కొంది. 'దేశంలో మార్పు, సంస్కరణలు తెచ్చే లక్ష్యంతో ప్రజా తిరుగుబాటు ద్వారా నాకు ఈ బాధ్యతలు అప్పగించారు. కానీ, ఒక వైపు తీవ్ర ఒత్తిడులు, మరో వైపు రాజకీయ పార్టీల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడంతో పనిచేయలేకపోతున్నాను' అని యూనస్ అన్నట్లు నహీద్ తెలిపాడు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు, దేశ భవిష్యత్తు, భద్రతను దృష్టిలో ఉంచుకుని బాధ్యతల్లో కొనసాగాలని ఆయన్ను కోరానని నహీద్ చెప్పాడు. దీనిపై యూనస్ కానీ, ఆయన కార్యాలయం కానీ ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు.

పాక్ విమానాలపై గగనతల నిషేధం పొడిగింపు

న్యూఢిల్లీ: పాకిస్తాన్ విమానాలపై విధించిన గగనతల నిషేధాన్ని కేంద్రం శుక్రవారం జూన్ 23వ తేదీ వరకు పొడిగించింది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం ఇరు దేశాల నడుమ కొనసాగిన ఉద్రిక్తతల నేపథ్యంలో పాక్ విమానాలపై గగనతల నిషేధం విధించడం తెల్సిందే. దీని ప్రకారం ..పాకిస్తాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానాలు లేదా లీజు/అద్దె విమానాలతోపాటు మిలటరీ విమానాలు సైతం భారత గగనతలంలోకి ప్రవేశించరాదు. భారత్‌లో రిజిస్టరయిన, భారతీయులు నిర్వహించే విమానాలేవీ జూన్ 24వ తేదీ ఉదయం వరకు తమ గగనతలంలోకి ప్రవేశించరాదంటూ అంతకుముందు పాకిస్తాన్ ప్రభుత్వం నిషేధ ప్రకటన విడుదల చేయడం గమనార్హం.

పాకిస్తాన్ ఆర్థిక దిగ్బంధం!

- ఉగ్రవాదులకు మద్దతిస్తున్నందుకు మళ్లీ గ్రే లిస్టులో చేర్చాల్సిందే
- ఎఫ్‌ఏటీఎఫ్‌పై ఒత్తిడి పెంచాలని భారత్ కీలక నిర్ణయం
- పాక్‌కు 20 బిలియన్ డాలర్ల రుణం ఇవ్వొద్దని ప్రపంచ బ్యాంక్‌కు విజ్ఞప్తి

న్యూఢిల్లీ: ఉగ్రవాద ఉత్పత్తి కర్మాగారంగా మారిపోయిన పాకిస్తాన్ మెడలు వంచాలంటే ఆ దేశానికి అప్పు పుట్టకుండా చేయాలని, ఆర్థికంగా అన్ని వైపులా దిగ్బంధించాలని భారత ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. ఉగ్రవాదులను పెంచి పోషిస్తూ భారత్‌పైకి ఉసిగొల్పుతున్న దాయాది దేశం ఆర్థికంగా మరింత చితికిపోయేలా చేయడానికి వ్యూహాలు రచిస్తోంది. పాకిస్తాన్‌ను మళ్లీ గ్రే లిస్టులో చేర్చాలని, కొత్తగా ఎలాంటి రుణాలు ఇవ్వకూడదని ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్‌ఏటీఎఫ్) తోపాటు ప్రపంచ బ్యాంక్‌పై ఒత్తిడి పెంచబోతున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. మనీ లాండరింగ్ నిరోధక చర్యలు చేపట్టడంలో విఫలం కావడంతోపాటు ఉగ్రవాద కార్యకలాపాలకు నిధులు అందజేస్తున్న పాకిస్తాన్‌పై కఠినంగా వ్యవహరించాలని కోరనున్నట్లు తెలిపాయి. పాక్‌ను ఎఫ్‌ఏటీఎఫ్ గ్రే లిస్టులో చేరిస్తే ప్రపంచ దేశాలతోపాటు అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి రుణాలు లభించే అవకాశం ఉండదు. 2018 జూన్‌లో పాక్‌ను ఈ జాబితాలో చేర్చారు. అమెరికా ప్రభుత్వ ఒత్తిడితో 2022 సెప్టెంబర్‌లో తొలగించారు.

ఇటీవల అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్) పాకిస్తాన్‌కు ఒక బిలియన్ డాలర్ల బెయిల్ ఔట్ ప్యాకేజీ ఇచ్చిన సంగతి తెలిసిందే. భారత్ గట్టిగా వ్యతిరేకించినా సరే లెక్కచేయకుండా ఈ ప్యాకేజీ అందజేసింది. దీనివెనుక అమెరికాతోపాటు కొన్ని అరబ్ దేశాల ఒత్తిడి పని చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో భారత్ తన అసంతృప్తిని ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్‌కు తెలియజేసింది. అంతేకాకుండా ఈ అంశాన్ని జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్ ఆర్థిక శాఖ మంత్రుల దృష్టికి తీసుకెళ్లింది. పాకిస్తాన్ ఆర్థికంగా ఎప్పుడో దివాలా తీసింది. విదేశీ రుణాలు, బెయిల్‌ఔట్ ప్యాకేజీలతోనే బతుకు బండి లాగిస్తోంది. పాకిస్తాన్‌కు వచ్చే నెలలో 20 బిలియన్ డాలర్ల రుణం మంజూరు చేసేందుకు ప్రపంచ బ్యాంకు ఇప్పటికే అంగీకరించినట్లు సమాచారం. ఈ రుణాన్ని నిలిపివేసేలా ప్రపంచ బ్యాంక్‌ను విజ్ఞప్తి చేయాలని భారత్ నిర్ణయించింది.

ల్యాండింగ్ ఆలస్యమై గాల్లో చక్కర్లు

- కనిమొళి బృందానికి రష్యాలో అనూహ్య అనుభవం
- విమానాశ్రయాలపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులే కారణం

మాస్కో: పాకిస్తాన్ దుర్బుద్ధిని, 'ఆపరేషన్ సిందూర్'కు దారితీసిన పరిస్థితులను వివరించేందుకు రష్యా వెళ్లిన భారత దౌత్య బృందానికి అనూహ్య స్వాగతం లభించింది. డీఎంకే ఎంపీ కనిమొళి నేతృత్వంలోని అఖిలపక్ష ప్రతినిధి బృందం గురువారం మాస్కో చేరుకుంది. డొమోడెడోవో విమానాశ్రయంలో విమానం ల్యాండ్ కావాల్సి ఉండగా ఉక్రెయిన్ డ్రోన్ దాడుల నేపథ్యంలో రష్యా అంతటా విమానాశ్రయాలను కాసేపు మూసేయాల్సి వచ్చింది. దాంతో దేశీయ, అంతర్జాతీయ విమాన సేవలకు అంతరాయం ఏర్పడింది. దాంతో కనిమొళి బృందం ఉన్న విమానం 40 నిమిషాల పాటు ఆకాశంలోనే చక్కర్లు కొట్టాల్సి వచ్చింది. ఆ తర్వాత ఎట్టకేలకు ల్యాండవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. తెల్లవారుజాము దాకా కొనసాగిన ఉక్రెయిన్ డ్రోన్ దాడుల వల్ల ముందుజాగ్రత్త చర్యగా విమానాశ్రయాలను మూసేయక తప్పలేదని రష్యా అధికార వర్గాలు వెల్లడించాయి. 150కి పైగా విమాన సేవలు ప్రభావితమైనట్టు వివరించాయి.

డ్యూమా సభ్యులతో భేటీ

పహల్గాం ఉగ్రవాద దాడి, ప్రతిస్పందనగా పాకిస్తాన్‌పై చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గురించి ప్రపంచ దేశాలకు తెలియచెప్పేందుకు ప్రభుత్వం ఏడు అఖిలపక్ష బృందాలను పలు దేశాలకు పంపడం తెలిసిందే. కనిమొళి బృందం రష్యా, స్పెయిన్, గ్రీస్, స్లొవేనియా, లాట్వియా దేశాల్లో పర్యటిస్తోంది. బృంద సభ్యులు శుక్రవారం రష్యా డూమా సభ్యులు, విదేశాంగ శాఖ అధికారులతో భేటీ అయ్యారు. శనివారం స్లొవేనియా వెళ్లనున్నారు. కాగా, ఉగ్రవాదం నుంచి తనను తాను రక్షించుకునే హక్కు భారత్‌కు ఉందని జర్మనీ స్పష్టం చేసింది. ఈ విషయంలో భారత్‌కు మద్దతు తెలిపింది. పహల్గాం ఉగ్ర దాడిని ఆ దేశం తీవ్రంగా ఖండించింది. యూరప్‌లో మూడు రోజుల పర్యటనలో భాగంగా విదేశాంగ మంత్రి జైశంకర్ శుక్రవారం జర్మనీలో విదేశాంగ మంత్రి జొహాన్ వడెఫుల్‌తో సమావేశమయ్యారు.

క్లుప్తంగా...

రామయ్య చిత్రాలకు పేటెంట్ హక్కులు



భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం మూలవిరాట్ చిత్రాలకు సంబంధించిన పేంటెంట్ హక్కులను తామే పొందినట్లు ఆలయ ఈఓ ఎల్.రమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారి చిత్రాలు, ఫొటోలను పలువురు దుర్వినియోగం చేస్తూ దేశ, విదేశాల్లో దేవస్థానం కీర్తి ప్రతిష్టలకు భంగం కలిస్తుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. లాయర్ కె.హేమప్రకాశరావు ద్వారా రామయ్య చిత్రాల పేటెంట్ పొందామని, తమ పేటెంట్ హక్కులకు విరుద్ధంగా ఎవరైనా ఆర్థిక, వ్యాపార పరమైన లావాదేవీల్లో ఈ చిత్రాలను ఉపయోగిస్తే దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

శ్వాసకోశ డాక్టర్‌కు కోవిడ్ నిర్ధారణ

సాక్షి, హైదరాబాద్: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని కూకట్‌పల్లి వివేకానందనగర్‌కు చెందిన ఓ పల్మనాలజిస్ట్‌కు కోవిడ్ సోకినట్లు గుర్తించామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ సి. ఉమాగౌరి తెలిపారు. ఐదు రోజులపాటు స్వీయ ఐసొలేషన్‌లో ఉన్న ఆయన ప్రస్తుతం పూర్తిగా కోలుకున్నారని చెప్పారు. కాంటాక్ట్ ట్రేసింగ్ పూర్తయిందని.. ఇప్పటివరకు ఆయన కుటుంబ సభ్యులు సహా ఇతరుల్లో ఎవరికీ కోవిడ్ లక్షణాలు కనిపించలేదని ఆమె వివరించారు. ఐసొలేషన్‌ను కొనసాగించాల్సిందిగా ఆ వైద్యుడికి సూచించినట్లు పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులు, సన్నిహితులు వైద్యాధికారుల పర్యవేక్షణలో ఉన్నట్లు ఉమాగౌరి తెలిపారు. ప్రజలు భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. తమ జిల్లాలో పరిస్థితి పూర్తి నియంత్రణలో ఉందని భరోసా ఇచ్చారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది ఏ పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కోవిడ్ లక్షణాలు కనిపించినట్లయితే ప్రజలు సమీపంలోని పీహెచ్‌సీలు, బస్తీ, పల్లె దవాఖానాలను సంప్రదించాలని డీఎంహెచ్‌ఓ సూచించారు.

కోటి బీసీ సభ్యత్వాలు నమోదు చేస్తాం: దాసు సురేశ్



సాక్షి, హైదరాబాద్ : తెలంగాణలో బీసీల సమైక్యతను, సంఘటిత శక్తిని చాటే దిశగా ఈనెల 25 నుంచి హైదరాబాద్‌లో బీసీల కోటి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నామని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ తెలిపారు. మొదటి విడతగా 10 లక్షల మంది కార్యకర్తల సభ్యత్వ నమోదును జూన్‌లో పూర్తి చేయనున్నామని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ, వార్డు, మండల, బస్తీ, పట్టణ, నియోజకవర్గ, జిల్లాస్థాయి వారీగా సభ్యత్వాలు నమోదు చేస్తామని, ఆపై రాజ్యాధికార సమితి కమిటీల నిర్మాణం చేపడతామన్నారు. ఆన్‌లైన్‌లోనూ సభ్యత్వ నమోదుకు వెసులుబాటు కల్పించనున్నామని తెలిపారు.

పిల్లలూ.. పంచదారతో జాగ్రత్త



బడుల్లో 'షుగర్ బోర్డ్'ల ఏర్పాటుకు సీబీఎస్ఈ ఆదేశం

- అవసరానికి మించి చక్కెర తీసుకుంటున్న విద్యార్థులు
- అవగాహనతోనే వాడకానికి కళ్లెం
- ఆరోగ్యంపై ఇప్పటికే కొన్ని బడుల్లో తరగతులు
- పోషకాహారం, పరిశుభ్రతపై పాఠాలు

ఇటీవలి కాలంలో జంక్‌ఫుడ్స్, ఫాస్ట్‌ఫుడ్స్, మితిమీరిన స్మార్ట్‌ఫోన్ల వాడకం.. ఇవన్నీ బాల్యాన్ని అనారోగ్యపు కోరల్లోకి నెట్టేస్తున్నాయి. బడి పిల్లల్లో ఊబకాయం, మధుమేహం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వారికి ఆరోగ్యంపై అవగాహన కల్పించే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. కొన్ని బడుల్లో మ్యాథ్స్, సైన్స్‌తో పాటు ఆరోగ్యంపైనా తరగతులు నిర్వహిస్తున్నారు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) కూడా విద్యార్థులు మధుమేహం బారిన పడుతుండటంపై ఆందోళన వ్యక్తం చేసింది. దీనికి పరిష్కారంగా.. తన పరిధిలోని అన్ని బడుల్లో 'షుగర్ బోర్డులు'ఏర్పాటుచేయాలని ఆదేశించింది.

ఈటింగ్ షుగర్ నో పప్పా

ఇటీవలి కాలంలో పిల్లల్లో మధుమేహం కేసులు పెరిగాయి. మరీ ముఖ్యంగా గతంలో పెద్దల్లో మాత్రమే కనిపించే టైప్ 2 మధుమేహం.. ఇటీవల పిల్లల్లోనూ కనిపిస్తుండటంతో సీబీఎస్ఈ వినూత్న నిర్ణయం తీసుకుంది. దేశ వ్యాప్తంగా ఉన్న సీబీఎస్ఈ అనుబంధ పాఠశాలల్లో ప్రత్యేక షుగర్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించింది. తద్వారా అతిగా చక్కెర తినడం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని నిర్దేశించింది. ఇలా ప్రత్యేక షుగర్ బోర్డుల ఏర్పాటు ద్వారా విద్యార్థులు ఏమేర చక్కెరను తింటున్నారో పర్యవేక్షించేందుకు, వారి చక్కెర వాడకాన్ని తగ్గించేందుకు వీలవుతుందని సీబీఎస్ఈ భావిస్తోంది. జాతీయ బాలల హక్కుల సంరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) సలహా మేరకు సీబీఎస్ఈ ఈ కార్యక్రమం చేపట్టింది.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే 5 (2019–21) ప్రకారం... 5 ఏళ్లలోపు పిల్లల్లో 3.4 శాతం మందిలో ఊబకాయం సమస్య ఉంది. 23 శాతం పురుషులు, 24 శాతం మహిళలు ఈ సమస్యతో బాధపడుతున్నారు. 'ద లాన్సెట్'లో వచ్చిన గ్లోబల్ న్యూట్రిషన్ టార్గెట్ కొలాబరేషన్స్ విశ్లేషణ ప్రకారం.. 1990లో 0.46 కోట్ల మంది అబ్బాయిల్లో ఊబకాయం ఉంటే, 2021 నాటికి ఆ సంఖ్య 1.3 కోట్లకు పెరిగింది. ఇదే సమయంలో అమ్మాయిల్లో 0.45 కోట్ల నుంచి 1.24 కోట్లకు పెరిగింది. 2050 నాటికి ఇలాంటి అమ్మాయిల సంఖ్య 1.44 కోట్లకు, అబ్బాయిల సంఖ్య 1.6 కోట్లకు పెరుగుతుందని అంచనా వేశారు. భారత జాతీయ సగటు ఆయు ప్రమాణం 70 ఏళ్లు ఉండగా.. ఇది జపాన్‌లో 84 ఏళ్లుగా ఉంది. ఆరోగ్య జీవన ప్రమాణం (ఎలాంటి రోగాలు లేకుండా జీవించడం) పరంగా చూసినప్పుడు ఈ తారతమ్యం మరింత ఎక్కువగా కనిపిస్తోంది. జపాన్‌లో ఎలాంటి రోగాల బారిన పడకుండా 70 ఏళ్ల వరకూ సంతోషంగా జీవిస్తుంటే.. ఇది మన దేశంలో 60 సంవత్సరాలు మాత్రమే!

సమగ్ర ఆరోగ్య పాఠ్యప్రణాళిక

పెరుగుతున్న అనారోగ్య సమస్యలను నివారించేందుకు చిన్నప్పటి నుంచే పిల్లల్లో అవగాహన కల్పించాలనే లక్ష్యంతో కొన్ని పాఠశాలలు 'సమగ్ర ఆరోగ్య పాఠ్యప్రణాళిక'ను అమలు చేస్తున్నాయి. ప్రతివారం ప్రత్యేకంగా ఆరోగ్య విద్యపై తరగతులు నిర్వహిస్తూ, ఆరోగ్యంపై శ్రద్ధ కల్పిస్తున్నాయి. ప్రధానంగా పోషకాహారం, పరిశుభ్రత, వ్యాయామం, మానసిక ఆరోగ్యం, ప్రథమ చికిత్స తదితర అంశాలపై పాఠాలు చెబుతున్నారు. బాల్యం నుంచే ఆరోగ్యంపై అవగాహన ఉన్న విద్యార్థులు మంచి అలవాట్లను పెంచుకుంటారని, వీరు తమ తదనంతర జీవితంలో రోగాల బారిన పడకుండా సంతోషకరమైన జీవనాన్ని గడుపుతారని నిపుణులు చెబుతున్నారు.

చక్కెరతో అనర్థాలు

చక్కెర ఎక్కువగా తీసుకోవడం వల్ల పిల్లల్లో మధుమేహంతోపాటు ఊబకాయం, దంత సమస్యలు, ఇతర అనారోగ్య సమస్యలు వస్తున్నట్లు సీబీఎస్ఈ పేర్కొంది. ఇవన్నీ విద్యార్థులను చదువుల్లో వెనుకబడేలా చే సే ప్రమాదం ఉందని తెలిపింది. బడుల్లో ఏర్పాటు చేసే షుగర్ బోర్డుల్లో.. ప్రతి రోజు పిల్లలు ఎంత మేరకు చక్కెర తీసుకోవాలి.. ఆయా ఆహార పదార్థాల్లో ముఖ్యంగా జంక్‌ఫుడ్స్, సాఫ్ట్‌డ్రింక్స్‌లో ఎంతమేర చక్కెర ఉంటుంది.. అతిగా పంచదార తినడం వల్ల వచ్చే అనారోగ్య సమస్యలు.. తదితర విషయాలను వివరిస్తారు. దీంతోపాటు ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయ ఆహార పదార్థాలను కూడా తెలియజేస్తారు.

సెమినార్లు, వర్క్ షాపులు

పాఠశాలల్లో షుగర్ బోర్డులను ప్రదర్శించడంతో పాటు.. చక్కెరతో వచ్చే అనర్థాలపై విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు సెమినార్లు, వర్క్‌షాపులు కూడా నిర్వహించాలని సీబీఎస్ఈ పేర్కొంది. దీనికి సంబంధించి తీసుకున్న చర్యలపై సంక్షిప్త నివేదికను జూలై 15వ తేదీ నాటికల్లా సమర్పించాలని ఆదేశించింది. ఈ చర్యలు విద్యార్థుల దీర్ఘకాలిక శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదం చేస్తాయని సీబీఎస్ఈ భావిస్తోంది.

'5-4-3-2-1-0'మంత్రం

పలు స్కూళ్లలో ఉదయమే వందేమాతరం, జనగణమనతో పాటు ''5-4-3-2-1-0''అంటూ.. ఆరోగ్య మంత్రాన్ని విద్యార్థులు జపిస్తున్నారు. '5'అంటే రోజూ ఐదురకాల పండ్లు, కూరగాయలు ఆహారంలో తీసుకోవడం. '4'అంటే ప్రతి రోజూ నాలుగుసార్లు చేతులు శుభ్రంగా కడుక్కోవడం. '3'అంటే మూడుసార్లు ప్రొటీన్ ఉన్న ఆహారం తీసుకోవడం. '2'అంటే స్క్రీన్ టైమ్‌ను (టీవీ, ఫోన్, ల్యాప్‌టాప్ చూడటం) రెండు గంటలకు పరిమితం చేయడం. '1'అంటే రోజూ కనీసం ఒక గంట వ్యాయామం చేయడం!

3 రెట్లు ఎక్కువగా!

'ప్రస్తుతం 4–10 ఏళ్ల వయసున్న విద్యార్థులు ప్రతిరోజూ చక్కెర నుంచి సగటున 13 శాతం కేలరీలు పొందుతున్నారు. అలాగే 11–15 ఏళ్ల వయసు విద్యార్థులకు చక్కెర నుంచి 15 శాతం కేలరీలు లభిస్తున్నాయి. ఆరోగ్య ప్రమాణాల ప్రకారం వాస్తవానికి ఇది 5 శాతానికి మించి ఉండకూడదు. అంటే నిర్దేశిత పరిమాణం కంటే మూడురెట్లు ఎక్కువగా స్కూల్ విద్యార్థులు షుగర్‌ను తీసుకుంటున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి'అని సీబీఎస్ఈ ఆందోళన వ్యక్తం చేసింది.

సాక్షి ఎడ్యుకేషన్, హైదరాబాద్

మీ పోర్టులు, గోడౌన్లు వాడుకుంటాం

పరస్పర సహకారంపై ఏపీ మంత్రి నాదెండ్లతో మంత్రి ఉత్తమ్ చర్చలు

- కాకినాడ పోర్టులో గోదాముల వినియోగానికి తెలంగాణకు వెసులుబాటు
- ఇరు రాష్ట్రాల మధ్య ఒప్పందం



సాక్షి, హైదరాబాద్: పౌరసరఫరాల శాఖకు సంబంధించి తెలుగు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకునేలా ఇరు రాష్ట్రాలకు చెందిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నాదెండ్ల మనోహర్ ఒప్పందం కుదుర్చుకున్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టం కింద కార్పొరేషన్ల విభజన ఇంకా పూర్తి కానందున పౌరసరఫరాల సంస్థకు చెందిన ఆస్తులపై చర్చించారు. తెలంగాణ నుంచి కాకినాడ పోర్టు ద్వారా ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి చేస్తున్న నేపథ్యంలో ఏపీలోని పౌరసరఫరాల శాఖ గోడౌన్లు, ఇతర మౌలిక సదుపాయాలను తెలంగాణ వినియోగించుకునేలా ఈ సందర్భంగా ఒప్పందం చేసుకున్నారు. అలాగే హైదరాబాద్‌లోని పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో, ఇతర ప్రాంతాల్లో ఉన్న ఏపీ ఆస్తులను అద్దె ప్రాతిపదికన వాడుకునేందుకు తమకు అవకాశం కల్పించాలని మంత్రి ఉత్తమ్ కోరారు. కాకినాడతోపాటు అవసరమైతే ఇతర పోర్టులలో కూడా తెలంగాణకు సంబంధించిన బియ్యం, ఇతర ఎగుమతి సరుకులను నిల్వ చేసేందుకు గోదాముల సదుపాయం కల్పించాలన్నారు. కాకినాడ పోర్టు ద్వారా బియ్యం ఎగుమతులకు ఏపీ ప్రోత్సాహం అందించాలని కోరారు. అక్రమ ధాన్యం రవాణా నియంత్రణ, సరఫరా వ్యవస్థలో పారదర్శకతకు పరస్పరం సహకరించుకోవాలని ఇరు రాష్ట్రాలు నిర్ణయించాయి. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ ఇది ప్రజల భవిష్యత్తు కోసం ఇరు రాష్ట్రాలు తీసుకున్న నిర్ణయమని చెప్పారు. తెలంగాణ టెక్నాలజీ సామర్థ్యంతో, ఏపీ పోర్టుల మౌలిక వనరులతో కలిపి దేశంలోనే ప్రత్యేక సరఫరా మోడల్‌ను రూపొందిస్తున్నామని తెలిపారు. ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ఇరు రాష్ట్రాల మధ్య ఇది పోటీ కాదు.. సహకారమన్నారు.

తడిసిన సన్నాలు బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు...

- నిజామాబాద్ జిల్లాలో 7,500, వరంగల్‌లో 6,350 మెట్రిక్ టన్నుల ధాన్యానికి అనుమతి

సాక్షి, హైదరాబాద్: అకాల వర్షాలతో యాసంగి సీజన్‌లో తడిసిన సన్న ధాన్యాన్ని బాయిల్డ్ రైస్‌గా మిల్లింగ్ చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన సన్నాలు తడిసిన నేపథ్యంలో పౌర సరఫరాల శాఖ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. తడిసిన ధాన్యం ముడి బియ్యంగా మిల్లింగ్‌కు వీలుకాని నేపథ్యంలో బాయిల్డ్ రైస్‌గా మిల్లింగ్‌కు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ఆ శాఖ కమిషనర్ డీఎస్.చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు.

నిజామాబాద్ జిల్లా కలెక్టర్ నివేదిక ప్రకారం మే 21న కురిసిన భారీ వర్షాలకు పలు కొనుగోలు కేంద్రాల్లో 63,503 క్వింటాళ్ల సన్న ధాన్యం తడిసినట్టు తేలింది. వీటిని మిల్లింగ్‌కు పంపించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. దీంతో నిజామాబాద్‌లో 7,500 మెట్రిక్ టన్నులు, వరంగల్‌లో 6,350 మెట్రిక్ టన్నుల సన్నధాన్యం మిల్లింగ్‌కు అనుమతి ఇచ్చారు. ఈ రెండు జిల్లాల్లోని మిల్లర్లకు తడిసిన సన్నరకం ధాన్యాన్ని పంపించి, వాటిని బాయిల్డ్ రైస్‌గా తయారు చేసి ఎఫ్‌సీఐకి సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మిల్లింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, మిల్లర్ల ఎంపికలో నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి.

తప్పు చేయకుంటే భయమెందుకు?

▶ మొదటి పేజీ తరువాయి

మంత్రి ఉత్తమ్ ఆరోపించారు. రూ.38 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును రూ.84 వేల కోట్లకు అంచనాలు పెంచి , ఆ తర్వాత రూ.లక్షా ఇరవై వేల కోట్లకు తీసుకెళ్లారని ధ్వజమెత్తారు. ఇంతా చేస్తే ఈ ప్రాజెక్టు ద్వారా వచ్చిన కొత్త ఆయకట్టు నామమాత్రమేనని విమర్శించారు. బీఆర్‌ఎస్ నేతల అవినీతి, అసమర్థత, కమీషన్ల కక్కుర్తి కారణంగానే ప్రాజెక్టు కూలిపోయిందని ఆరోపించారు. లోపభూయిష్టంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు ఇప్పుడు ఎందుకూ పనికి రావని ఎన్డీఎస్‌ఏ, కాగ్, విజిలెన్స్ చెప్పడంతోనే జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలో కమిషన్ వేసినట్లు తెలిపారు. ఈ కమిషన్ ముందు హాజరు కావాలని అప్పటి సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లకు నోటీసులు పంపితేనే బెంబేలెత్తి పోయి, ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని విమర్శించారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే ఎఫ్ఐఆర్

మేడిగడ్డపై బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలోనే ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, అక్కడ బాంబులు ఉన్నాయో లేదో అప్పుడే ఎందుకు తేల్చలేదని మంత్రి ప్రశ్నించారు. మేడిగడ్డలో బాంబులు అని తప్పుడు వ్యాఖ్యలకు, ఎన్డీఎస్‌ఏపై విమర్శలు చేసినందుకు చట్టప్రకారం చర్యలు ఉంటాయని అన్నారు. 2019లో ప్రాజెక్టును ప్రారంభించిన మరుసటి వారం నుంచే లోపాలు బయటపడుతున్నా, కప్పిపుచ్చి ప్రజలకు అబద్ధాలు చెప్పారని, ఆ బరాజ్ నిండా నీళ్లు నింపడంతో పరిస్థితి మరీ అధ్వాన్నమైందని అన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ చెప్పినట్టు ఈ ప్రాజెక్టులో నీళ్లు నింపితే భద్రాచలం , 43 గ్రామాలు, సమ్మక్క–సారక్కల ప్రదేశం కొట్టుకుపోతాయని, దానికి ఎవరు బాధ్యులని ఉత్తమ్ ప్రశ్నించారు. ఎన్డీఎస్‌ఏ రిపోర్టును అధ్యయనం చేసి నివేదిక ఇచ్చే బాధ్యతను ఒక సంస్థకు అప్పగించామని చెప్పారు. ఈ సమావేశంలో మంత్రి సీతక్క, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్‌సింగ్ పాల్గొన్నారు.

ముగ్గెట్టా పోసేది..?

▶ మొదటి పేజీ తరువాయి

ఖర్చవుతుంది. బేస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తయ్యాకే రూ.లక్ష బిల్లు వస్తుంది. నిరుపేదలకు రూ.1.50 లక్షలు పెట్టుబడి పెట్టి పనులు ప్రారంభించడం కష్టమవుతోంది. అప్పోసొప్పో చేసి నిర్మాణం ప్రారంభిద్దామనుకున్నా.. బిల్లులు వస్తాయో, రావోననే ఆందోళన చాలామందిలో ఉంది. ఇక ఆర్థికంగా కాస్త మెరుగ్గా ఉన్న లబ్ధిదారులు 600 చదరపు అడుగుల విస్తీర్ణంలోపు ఇంటి నిర్మాణానికి ఆసక్తి చూపడం లేదు. జీవితంలో ఒక్కసారే ఇల్లు కట్టుకుంటామని, చిన్న ఇల్లు కట్టుకుంటే ప్రయోజనం ఏంటనే అభిప్రాయంతో కొందరున్నారు. కనీసం 900 (100 గజాల్లోనైనా) చదరపు అడుగులైనా బాగుంటుందని, పిల్లలకు పెళ్లిళ్లు అయినా కొంత సౌకర్యంగా ఉంటుందనే భావనలో ఉన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 600 చదరపు అడుగులకు మించి ఇల్లు కట్టుకుంటే దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారిగా పరిగణించరని అధికారులు చెబుతున్నారు. అలాంటి నిర్మాణాలకు బిల్లులు రాకపోతే తమది బాధ్యత కాదని తేల్చి చెబుతున్నారు. మరోవైపు ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు.. మంజూరు పత్రం తీసుకున్న 45 రోజుల్లోపు ఇంటికి అవసరమైన మెటీరియల్ (స్టీలు, సిమెంట్, ఇటుక, ఇసుక, కిటికీలు, తలుపులు) సమకూర్చుకోవాలి. ఈ నిబంధన కూడా ఒకింత ఇబ్బందికరంగా ఉందని అంటున్నారు. ఇక మార్క్ అవుట్ ఇచ్చాక 90 రోజుల్లో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది.

పెరిగిన నిర్మాణ వ్యయమూ కారణమే..

ప్రస్తుత రోజుల్లో ఇంటి నిర్మాణ వ్యయం భారీగా పెరిగింది. సిమెంట్ ధర ఇప్పుడు సంచి రూ.340కి చేరింది. ఒక్కో ఇటుక రూ.8 పలుకుతోంది. మేస్త్రీకి తక్కువలో తక్కువ రూ.లక్ష వరకు చెల్లించాలి. ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షలతో పోల్చుకుంటే నిర్మాణ వ్యయం భారీగా ఉంటోందని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇది కూడా ఈ గృహాల నిర్మాణం నత్తనడకన సాగడానికి కారణమనే అభిప్రాయం ఉంది.

మంజూరు పత్రాలు వెనక్కి..

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం ముచ్చర్ల గ్రామాన్ని తొలి విడత పైలెట్ గ్రామంగా ఎంపిక చేశారు. మొత్తం 94 మంది లబ్ధిదారులకు ఇళ్లను మంజూరు చేస్తే.. ఇందులో ఏకంగా 56 మంది తమకు గృహాలు వద్దంటూ మంజూరు పత్రాలు వెనక్కి ఇచ్చేశారు. నిర్మాణం ప్రారంభించేందుకు తమ వద్ద డబ్బులు లేని కారణంగానే మంజూరు పత్రాలను వెనక్కి ఇచ్చామని వారు చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు పైలెట్ గ్రామాల్లో ఈ పరిస్థితి ఉన్నట్లు సమాచారం.

అడ్వాన్సు కోసం ఐకేపీ రుణం..

ప్రస్తుత పరిస్థితుల్లో.. లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించుకునేందుకు అవసరమైన ఖర్చుల కోసం ఐకేపీ రుణాలు మంజూరు చేయించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మహిళా సంఘాల సభ్యులకు రూ.లక్ష వరకు రుణం మంజూరు చేస్తున్నారు. దీనిద్వారా ఇంటి నిర్మాణం ప్రారంభించి పునాదుల వరకు పూర్తి చేసుకుంటే రూ.లక్ష బిల్లు వచ్చాక ఈ రుణం తీర్చేలా చర్యలు చేపట్టారు.

అడ్వాన్సు ఇస్తే బాగుండేది



ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారు. నిర్మాణం ప్రారంభించమని అధికారులు చెబుతున్నారు. కానీ ముగ్గు పోసేందుకు చేతిలో డబ్బులు లేవు. ముందుగాల ఏమైనా డబ్బులు అడ్వాన్సు రూపంలో ఇస్తే బాగుండేది. కానీ ముందుగాల పైసలు పెట్టుకుని కట్టుకుంటే.. బిల్లులు తరువాత ఇస్తారట. మాచేతిలో పైసలు లేక ఇల్లు వద్దని అధికారులకు రాసిచ్చాము.

– కోల దేవవ్వ, సిరికొండ, రాజన్న సిరిసిల్ల జిల్లా

డబ్బుల్లేక ముగ్గు పోయలేదు..



మాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రం ఇచ్చారు. కానీ ముగ్గు పోసుకుని పనులు షురూ చేద్దామంటే చేతిలో డబ్బులు లేవు. బేస్‌మెంట్ వరకు పూర్తయితేనే బిల్లు వస్తుందని అధికారులు చెబుతున్నారు. అడ్వాన్సుగా ఖర్చులు పెట్టుకునేందుకు డబ్బులు లేక ముగ్గు పోసుకోలేదు.

– తూర్పాటి లక్ష్మి, ముచ్చర్ల గ్రామం, సంగారెడ్డి జిల్లా.

చీటింగ్ కేసులో శ్రవణ్‌రావు విచారణ

రూ.6.5 కోట్ల మోసం కేసులో ఒక రోజు సీసీఎస్ కస్టడీ
మూడు గంటలపాటు విచారించిన పోలీసులు
ఫోన్‌ట్యాపింగ్ కేసులో 6వ నిందితుడిగా ఉన్న శ్రవణ్‌రావు



సాక్షి, హైదరాబాద్: ఓ చీటింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మీడియా సంస్థ యజమాని ఎ.శ్రవణ్ కుమార్ రావును సీసీఎస్ పోలీసులు శుక్రవారం తమ కస్టడీలోకి తీసుకున్నారు. ఇనుప ఖనిజం వ్యాపారం డీల్ ఇప్పిస్తానంటూ శ్రవణ్‌రావు మోసం చేశాడని అఖండ ఇన్‌ఫ్రాటెక్ ఇండియా సంస్థ ఎండీ ఎ.ఆకర్ష్ కృష్ణ ఫిర్యాదు చేయటంతో ఈ కేసు నమోదైంది. ఈ నెల 13న శ్రవణ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఒక రోజు కస్టడీ విచారణకు కోర్టు అనుమతించడంతో శుక్రవారం విచారించారు. ఏ ప్రశ్నకు అతడి నుంచి సరైన సమాధానం రాలేదని, ప్రతి ఆరోపణను ఖండించాడని అధికారులు తెలిపారు.

రూ.6.5 కోట్ల మోసం: శ్రవణ్‌రావు రాష్ట్ర స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) కేంద్రంగా సాగిన అక్రమ ఫోన్‌ట్యాపింగ్ కేసులో ఆరో నిందితుడిగా ఉన్న విషయం తెలిసిందే. ఇన్నిధమ్ ఎనర్జీ సంస్థ డైరెక్టర్‌గా ఉన్న శ్రవణ్‌రావు 2022 జూన్‌లో ఆకర్ష్‌ను సంప్రదించాడు. కర్ణాటకలోని సాండూర్‌లో ఉన్న ఎకోర్ ఇండస్ట్రీస్ బాధ్యతల్ని తాను స్వీకరించినట్లు చెప్పాడు. ఇనుప ఖనిజం వ్యాపారంలో ఉన్న తమకు నిధులు సమకూరిస్తే ప్రతి టన్నుకు రూ.300 చొప్పున లాభం ఇస్తానని నమ్మబలికాడు. దీంతో అఖండ సంస్థ 2022 నవంబర్ నుంచి 2023 డిసెంబర్ వరకు పలు దఫాలుగా ఎకోర్ సంస్థ ఖాతాల్లోకి రూ.6.5 కోట్లు బదిలీ చేసింది. ఈ చెల్లింపులకు సంబంధించి ఎకోర్ సంస్థ నుంచి తమకు ఎలాంటి ఇన్వాయిస్‌లు అందలేదని ఆకర్ష్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. 2023 నాటికి సంబంధిత వ్యక్తులకు రూ.7 కోట్ల విలువైన ఇనుప ఖనిజం సరఫరా జరగాల్సి ఉండగా.. అది రాకపోవటంతో ఆకర్ష్‌కు అనుమానం వచ్చి ఆరా తీశారు. తమ సంస్థ బదిలీ చేసిన నిధుల్ని శ్రవణ్‌రావు వేరే అవసరాలకు మళ్లించినట్లు గుర్తించారు. దీనిపై ఎన్నిసార్లు ప్రశ్నించినా శ్రవణ్‌రావు నుంచి సరైన సమాధానం రాలేకపోవటంతో సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. శ్రవణ్‌రావును దాదాపు మూడు గంటల పాటు ప్రశ్నించిన అనంతరం తిరిగి జైలుకు తరలించారు. ఈ కేసులో శ్రవణ్‌రావుతో పాటు ఆయన భార్య ఎ.స్వాతిరావు, వ్యాపార భాగస్వామి కేబీ వేదమూర్తి, ఎకోర్ ఇండస్ట్రీస్ హోల్‌టైమ్ డైరెక్టర్ ఉమా మహేశ్వర్ రెడ్డి నిందితులుగా ఉన్నారు.

తెలంగాణలో 'తృణధాన్య పరిశోధన సంస్థ'

▶ మొదటి పేజీ తరువాయి

చెప్పారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రూ.250 కోట్లతో 'గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్'ను కేంద్ర వ్యవసాయ శాఖ హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనుందని వెల్లడించారు. ఇప్పటికే ఐసీఏఆర్, ఐఐఎంఆర్ ఆధ్వర్యంలో మిల్లెట్స్‌పై పరిశోధనలు జరుగుతున్నాయని, వీటిని మరింత విస్తృతం చేసే దిశగా ఈ సంస్థ తోడ్పడుతుందని చెప్పారు. హైదరాబాద్‌లో ఏర్పాటు కానున్న ఈ కేంద్రంలో సెంట్రల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ల్యాబ్, ఇంటర్నేషనల్ హాస్టల్, మిల్లెట్స్ మ్యూజియం, రీసెర్చ్ ఫామ్‌లు, ట్రైనింగ్ రూమ్‌లు, ఇంటర్నేషనల్ గెస్ట్ హౌస్ ఉంటాయని వివరించారు. అలాగే జీనోమ్ ఎడిటింగ్ గ్రీన్ హౌజ్‌లు, స్పీడ్ బ్రీడింగ్ ల్యాబ్స్, ఫినోమిక్స్ ల్యాబ్స్ వంటి ఆధునిక పరిశోధనా వసతులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. వికసిత్ భారత్ కింద రూ.60 వేల కోట్లతో ఐటీఐల అప్‌గ్రేడేషన్ కోసం హైదరాబాద్‌తో పాటు భువనేశ్వర్, చెన్నై, కాన్పూర్, లుధియానాలో 'ట్రైనింగ్ ఫర్ ట్రైనర్స్'సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. రైల్వే సెక్యూరిటీకి సంబంధించి 'కవచ్ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్'సంస్థను రూ.300 కోట్లతో సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని చెప్పారు.

కాళేశ్వరంపై సీబీఐ విచారణ చేయాలి..

కాళేశ్వరం అక్రమాలపై సీబీఐతో విచారణ జరిపించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా డిమాండ్ చేస్తున్నట్టు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి బీటలు పడుతున్నాయని, బీఆర్‌ఎస్ మునిగిపోతున్న నావలా మారిందన్నారు. కుటుంబ పార్టీలు అత్యంత ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్‌లో డాడీ–డాటర్ లేఖ ఒక డ్రామా అని కొట్టిపారేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 'ట్రిపుల్ ఆర్ ట్యాక్స్' పేరిట వసూళ్లు జరుగుతున్నాయని ఆరోపించారు. నేషనల్ హెరాల్డ్ కేసు దర్యాప్తు చట్టబద్ధంగా సాగుతుందని అన్నారు. రాష్ట్రంలో అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 53 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించేందుకు ఒప్పందం కుదుర్చుకుందని, అంత కంటే ఎక్కువ సేకరించినా పూర్తి వ్యయాన్ని కేంద్రం భరిస్తుందని హామీ ఇచ్చారు.

తెలంగాణ కులగణనను దేశవ్యాప్తం చేయండి

▶ మొదటి పేజీ తరువాయి

నేత రాహుల్‌గాంధీ సూచించారు. తెలంగాణ తరహా మోడల్‌ను అనుసరించేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. భారత్ జోడో పాదయాత్ర సందర్భంగా, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం జనగణన చేసి చూపించి దేశానికే మార్గదర్శిగా నిలిచిన అంశాన్ని ప్రజలకు వివరించాలని, ఈ విషయంలో కాంగ్రెస్‌కు ఉన్న నిబద్ధతను చాటి చెప్పాలని సూచించారు. దేశంలోని అణగారిన వర్గాలకు విద్య, ఉపాధి, రాజకీయ అంశాల్లో న్యాయం చేసేలా జనగణనలో భాగంగా కులగణను ఎప్పట్లోగా కేంద్రం పూర్తి చేస్తుందో చెప్పాలంటూ బలంగా డిమాండ్ చేయాలని అన్నారు. శుక్రవారం ఇందిరా భవన్‌లోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధులు, ముఖ్య నేతలతో కులగణన అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాహుల్‌గాంధీ పాల్గొనగా, ఖర్గే వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో కులగణన సర్వే నిర్వహించిన తీరు, ప్రశ్నాపత్రం, వివిధ వర్గాల భాగస్వామ్యం, అసెంబ్లీ తీర్మానం వంటి అంశాలను పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అత్యంత పారదర్శకంగా, పూర్తి నిబద్ధతతో పూర్తి చేయడమే కాకుండా విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో దీనిని అమలు పరిచేలా తీసుకుంటున్న చర్యలను సమావేశం దృష్టికి తెచ్చారు.

సైద్ధాంతిక నిబద్ధతకు నిదర్శనం: ఖర్గే

సమావేశంలో ప్రారంభోపన్యాసం చేసిన ఖర్గే.. తెలంగాణలో కులగణన చేపట్టడాన్ని మరోసారి అభినందించారు. 'తెలంగాణలో జరిగిన కుల సర్వే సమాజం, నిపుణులు, ప్రభుత్వం అందరూ పాల్గొన్న ఒక నమూనాను ప్రదర్శించింది. కేంద్ర ప్రభుత్వం కూడా ఇలాంటి ప్రజా, స్నేహపూర్వక, పారదర్శక నమూనాను అవలంబించాలని మేము కోరుకుంటున్నాం. ఈ ప్రక్రియలో సహకరించడానికి సిద్ధంగా ఉన్నాం..'అని అన్నారు. కులగణన సామాజిక న్యాయం కోసం జరిగే పోరాటం మాత్రమే కాదని, రాజ్యాంగం ఆత్మను కాపాడుకునే పోరాటమని పేర్కొన్నారు. కులగణన అంశాన్ని కేవలం ఎన్నికల అంశంగా పరిగణించవద్దని, ఇది పార్టీ సైద్ధాంతిక నిబద్ధతకు నిదర్శనం అన్న విషయం గుర్తుంచుకోవాలని అన్నారు. పార్టీ అధికార ప్రతినిధులుగా కులగణన అంశాన్ని వాస్తవాలతో, సున్నితత్వంతో, భయం లేకుండా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఖర్గే సూచించారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో దళిత, ఓబీసీ, ఆదివాసీ విద్యార్థులకు రిజర్వేషన్లు కల్పిస్తూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(5)ని వెంటనే అమలు చేసేలా గొంతును పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు.

ప్రజాస్వామ్యం నైతిక బాధ్యత: రాహుల్

పార్టీ మేనిఫెస్టోలో, పార్లమెంటులో, వీధుల్లో, సామాజిక న్యాయం గురించి చర్చించాల్సిన ప్రతి వేదికపై కాంగ్రెస్ దీనిని లేవనెత్తిందని రాహుల్‌గాంధీ గుర్తు చేశారు. తాము హామీ ఇచ్చినట్లుగా తెలంగాణలో అమలు చేసి చూపామన్నారు. కులగణన భారత ప్రజాస్వామ్యం నైతిక బాధ్యత అని పేర్కొన్నారు. కులగణనపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. కులగణనతో రాష్ట్రంలో కులాల వారీగా లెక్కలు తేలాయని, వీటి ఆధారంగా ఎవరికి ఎంత రిజర్వేషన్లు దక్కాలో తెలిసిందని అన్నారు. రాష్ట్రంలో 42% బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానించి కేంద్రం ఆమోదానికి పంపామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు కృషి చేస్తున్నామన్నారు.

క్లుప్తంగా...

ప్రజా పాలన అంటే.. అరెస్టులు చేయడమేనా?

మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఉన్న ప్రతీసారి రైతులు, నాయకులను ముందస్తు అరెస్టులు, నిర్బంధాలు చేయడమేనా ప్రజా పాలన అంటే? అని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సీఎం జహీరాబాద్ పర్యటన సందర్భంగా రైతులను అరెస్టు చేయడాన్ని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. 'మొన్న నాగర్‌కర్నూల్ పర్యటనలోనూ చెంచులను అక్రమంగా అరెస్టు చేశారు. నేడు జహీరాబాద్‌లో రైతులను, రైతు నాయకులను అరెస్టు చేశారు'అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జహీరాబాద్ నిమ్జ్ ప్రాజెక్టు చుట్టూ ఉన్న గ్రామాలను అష్టదిగ్బంధనం చేసి, రైతు నాయకులను నిర్బంధించడం ఏ విధంగా ప్రజా పాలన అవుతుందో చెప్పాలని నిలదీశారు. ఇది ప్రజాపాలన కాదని, ప్రజలను పీడించే పాలన అని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రతీ పౌరుడికి తన ఆవేదనను వ్యక్తపరిచే స్వేచ్ఛ ఉందని అన్నారు. ఈ హక్కును హరించడం దుర్మార్గమని, నిర్బంధాలు, కంచెలు, ఆంక్షలు, అరెస్టులు లేకుండా ముఖ్యమంత్రి పర్యటన జరిగే పరిస్థితి లేదని విమర్శించారు. అక్రమంగా అరెస్టు చేసిన రైతులను, రైతు నాయకులను వెంటనే విడుదల చేయాలని డీజీపీని ఆయన డిమాండ్ చేశారు.

రేవంత్ తక్షణమే సీఎం పదవికి రాజీనామా చేయాలి

బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్



సాక్షి, హైదరాబాద్: చిల్లర డ్రామాలు చేసినంత మాత్రాన నేషనల్ హెరాల్డ్ కేసులో రేవంత్‌రెడ్డి పేరు ఈడీ చార్జిషీట్ నుంచి మాయమవుతుందా? అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి తక్షణమే సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రేవంత్ అవినీతి చరిత్ర నేడు జాతీయ స్థాయికి చేరిందని విమర్శించారు. రేవంత్ ఈ ఆరోపణలపై తేలు కుట్టిన దొంగలా వ్యవహరిస్తున్నారని, సీఎం మౌనం దాలుస్తున్నారంటే తప్పును అంగీకరిస్తున్నట్టేనని అన్నారు. గతంలో ఈడీ చార్జిషీట్‌లో పేరున్న యడ్యూరప్ప, అశోక్ చవాన్, పవన్ బన్సల్, సురేష్ కల్మాడీ, ఏఆర్ అంతులే విచారణ ఎదుర్కొనే దశలోనే తమ పదవులకు రాజీనామా చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ హైకమాండ్ ఆయన్ను తొలగించకముందే రేవంత్ తన పదవికి రాజీనామా చేయాలన్నారు. పొంగులేటిపై ఈడీ దాడులు చేస్తే బీజేపీ నేతల కాళ్లు పట్టుకున్నారని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి కూడా బీజేపీ కాళ్లు పట్టుకున్నారేమోనని ఆరోపించారు.

కవిత లేఖ వెనుక సీఎం!

ఎంపీ రఘునందన్ రావు



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత లేఖ వెనుక సీఎం రేవంత్‌రెడ్డి ఉండొచ్చని మెదక్ పార్లమెంటు సభ్యుడు ఎం.రఘునందన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో అభిప్రాయపడ్డారు. కవిత లేఖ రాసిన రోజే కాంగ్రెస్‌కు సంబంధించిన పత్రిక, టీవీలలో ఈ వార్త ప్రముఖంగా వచ్చిందని గుర్తు చేశారు. ఆమె త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం కనిపిస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే కవితతో లేఖ డ్రామా తెరపైకి వచ్చిందని పేర్కొన్నారు. కవిత లేఖ రాజకీయ పంచాయతీయా? లేక ఆస్తుల పంచాయతీయా? తేలాలని కోరారు. ప్లీనరీ సందర్భంగా.. కేసీఆర్ కుటుంబంలో వారసత్వ చిచ్చు రావడం నిజమని ఈ లేఖ ద్వారా తెలుస్తోందని వ్యాఖ్యానించారు. కవితను బయటకు పంపించడం కోసం బావా, బామ్మర్దులు ఒక్కటయ్యారనే సంకేతం.. వారి లేఖ ద్వారా స్పష్టమైందని తెలిపారు. కవిత మరో షర్మిల కాబోతున్నట్లు తెలుస్తోందని పేర్కొన్నారు.

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

విమల గద్దర్



మాట్లాడుతున్న విమల గద్దర్. చిత్రంలో వెన్నెల

పంజగుట్ట(హైదరాబాద్): కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను శాంతి చర్చలకు ఆహ్వానించి..వారు జన జీవన స్రవంతిలో కలిసేలా చర్యలు తీసుకోవాలని గద్దర్ సతీమణి విమల కోరారు. ఈ మేరకు శుక్రవారం తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్‌తో కలిసి రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిశారు. అనంతరం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. కేంద్రం ఆపరేషన్ సిందూర్ చేపట్టి భారతీయ మహిళల ఆత్మగౌరవం, ఆత్మస్థైర్యం, మన దేశ సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పారని, అందుకు భారత మహిళగా ఎంతో గర్విస్తున్నట్టు తెలిపారు. దండకారణ్యంలో జరుగుతున్న ఆపరేషన్ కగార్‌ను కూడా మానవతా దృక్పథంతో నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాజు, యాదగిరి పాల్గొన్నారు.

రణమా.. శాంతి మంత్రమా?



కాంకేర్ జిల్లాలోని కల్లంలో తగలబడుతున్న తునికాకు కట్టలు

- తాజా ఎన్‌కౌంటర్‌లో సుప్రీం కమాండర్ నంబాల మృతి
- ఇతర నేతలనూ కార్నర్ చేశామంటున్న పోలీసులు
- కాంకేర్ జిల్లాలో తునికాకు డిపోలో నిప్పు రవ్వలు
- మావోయిస్టుల నిరసన చర్యగా అనుమానాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ తర్వాత మావోయిస్టులు, ప్రభుత్వం మధ్య శాంతి చర్చలు జరుగుతాయా లేక రణమే కొనసాగుతుందా అనే చర్చ జరుగుతోంది. అయితే, తాజా ఎన్‌కౌంటర్ తర్వాత ఇరువర్గాల నుంచి ఎలాంటి ప్రకటన వెలువడకపోవడంతో పై ప్రశ్నలకు సమాధానాలు లభించడం లేదు.

శాంతిచర్చలు.. ఎన్‌కౌంటర్లు

→ మావోయిస్టుల నిర్మూలనలో భాగంగా 2024 జనవరిలో ఆపరేషన్ కగార్(ఫైనల్ మిషన్)ను కేంద్రం చేపట్టిన విషయం తెలిసిందే. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో లక్షలాదిగా ప్రభుత్వ సాయుధ దళాలు మోహరించాయి. వరుస ఎన్‌కౌంటర్లలో వందలాదిగా మావోయిస్టులు చనిపోతున్నారు. దీంతో మావోయిస్టులు ఈ ఏడాది మార్చి 28న శాంతిచర్చల ప్రతిపాదన చేశారు. దీనికి అనుకూలంగా తెలంగాణలో గళాలు వినిపించాయి. కానీ మావోయిస్టు ప్రభావం తీవ్రంగా ఉన్న ఛత్తీస్‌గఢ్ కానీ, ఆపరేషన్ కగార్ చేపట్టిన కేంద్రం కానీ శాంతిచర్చల ప్రతిపాదనపై సానుకూల వైఖరి ప్రదర్శించలేదు. తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో భారీ ఎత్తున బ్లాక్ ఫారెస్ట్ ఆపరేషన్ చేపట్టింది. ఈ క్రమంలోనే జార్ఖండ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు ప్రయాగ్ మాంఝీ చనిపోగా, తాజాగా నారాయణపూర్ ఎన్‌కౌంటర్‌లో పార్టీ జనరల్ సెక్రటరీ నంబాల కేశవరావు అలియాస్ బస్వరాజు హతమయ్యారు.

కార్నర్ చేశాం.. చుట్టుముడతాం

నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ అనంతరం ఛత్తీస్‌గఢ్ డీజీపీ అరుణ్‌దేవ్ గౌతమ్ స్పందిస్తూ 'కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విధించిన గడువు 2026 మార్చి 31 కంటే ముందే మావోయిస్టులను మా రాష్ట్రంలో పూర్తిగా నిర్మూలిస్తామనే నమ్మకం ఉంది'అని ప్రకటించారు. అందుకు తగినట్టుగానే యాంటీ నక్సల్స్ ఆపరేషన్స్‌లో కీలక పాత్ర పోషిస్తున్న ఉన్నతాధికారులు సైతం ఆఫ్ ది రికార్డ్‌గా మాట్లాడుతూ.. 'మావోయిస్టు పార్టీకి సంబంధించిన కీలక నేతలందరినీ కార్నర్ చేశాం, వారు మా రాడార్‌లోనే ఉన్నారు. అనుకూలమైన సమయం వచ్చినప్పుడు చుట్టుముడతాం. నంబాల కేశవరావు విషయంలోనూ జరిగింది అదే' అని చెప్పుకొస్తున్నారు.

మావోల మౌనం..

నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ జరిగి మూడు రోజులు కావొస్తున్నా ఇప్పటి వరకు మావోయిస్టు పార్టీ నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఇప్పుడు నంబాల మృతితో శాంతిచర్చల విషయమై మావోయిస్టు పార్టీ వైఖరి ఎలా ఉంటుందనే ఆసక్తి నెలకొంది. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లా కోయ్‌లిబేడా పోలీస్‌స్టేషన్ పరిధి గట్టకాల్ అనే గ్రామ సమీపాన తునికాకు కల్లంలో శుక్రవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. కల్లంలోని తునికాకు రాశులన్నీ కాలిబూడిదయ్యాయి. నంబాల ఎన్‌కౌంటర్‌కు నిరసనగా మావోయిస్టులు ఈ పని చేసినట్టుగా పోలీసులు అనుమానిస్తూ విచారణ ముమ్మరం చేశారు. అగ్రనేత చనిపోయినా, ఇతర నేతలు కార్నర్‌లో ఉన్నారని పోలీసులు చెబుతున్నా, మావోలు తమ ఉనికి చాటుకునే ప్రయత్నం చేయడం గమనించదగ్గ అంశంగా చెప్పుకోవచ్చు.

మృతదేహాల అప్పగింతపై చిక్కుముడి

ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో నంబాల కేశవరావుతోపాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఐదుగురు మావోయిస్టులు చనిపోయిన విషయం తెలిసిందే. ఈ నెల 21న ఉదయం 8 గంటల సమయాన ఎన్‌కౌంటర్ జరగ్గా, 22న సాయంత్రం 5గంటల తర్వాత మృతదేహాలకు పోస్టుమార్టం ప్రక్రియ ప్రారంభించారు. ఇక 23వ తేదీ శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించేలా మృతుల బంధువులు ప్రయత్నించగా ఛత్తీస్‌గఢ్ పోలీసులు సహకరించలేదు. శుక్రవారం పొద్దుపోయే వరకు మృతదేహాల అప్పగింతపై స్పష్టత రాలేదు. నిబంధనల ప్రకారం ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన వారి మృతదేహాలను 72 గంటల్లోగా గుర్తించి, అంత్యక్రియలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే మృతదేహాల అప్పగింత విషయంలో నిబంధనల ఉల్లంఘన జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి.

ఏడేళ్ల తర్వాత!

- నీతి ఆయోగ్ భేటీలో పాల్గొననున్న తెలంగాణ సీఎం
- ఢిల్లీ వెళ్లిన రేవంత్‌రెడ్డి
- నేడు తెలంగాణ రైజింగ్–2047 విజన్ ఆవిష్కరణ
- రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించనున్న ముఖ్యమంత్రి

సాక్షి, హైదరాబాద్: దేశ అభివృద్ధి విధానాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించే నీతి ఆయోగ్ సమావేశానికి దాదాపు ఏడేళ్ల తర్వాత తెలంగాణ సీఎం హాజరు కానున్నారు. 2018 తర్వాత రాష్ట్ర సీఎం ఈ సమావేశాలకు హాజరు కానుండటం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. శనివారం ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో ఏర్పాటు చేసిన భారత్ మండపంలో జరిగే నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. ఇందుకోసం ఆయన శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. 'వికసిత్ రాజ్య ఫర్ వికసిత్ భారత్'అనే ఎజెండాతో ఏర్పాటు చేసిన నీతి ఆయోగ్ సమావేశంలో తెలంగాణ రైజింగ్–2047 విజన్‌ను సీఎం ఆవిష్కరిస్తారు. తెలంగాణ రాష్ట్రం 2047 నాటికి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న విధానాలు, సుపరిపాలన విధానాలు, రాష్ట్రాలకు కేంద్రం అందించాల్సిన సహాయ సహకారాలపై ఆయన ప్రత్యేక నివేదిక సమర్పిస్తారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యంగా ఐటీ, ఫార్మా, పట్టణీకరణ అంశాల్లో చేపడుతున్న చర్యలను వివరిస్తారు. ట్రిపుల్ ఆర్, రేడియల్ రోడ్లు, యంగ్ ఇండియా స్పోర్ట్స్, స్కిల్స్ యూనివర్సిటీల ఏర్పాటు, ఐటీఐల ఆధునీకరణ, యువతకు నైపుణ శిక్షణతో పాటు ప్రపంచ స్థాయి సౌకర్యాల కల్పనలను తన ప్రసంగంలో భాగంగా వివరించనున్నారు.

ప్రధానితో కలిసి అల్పాహారం, గ్రూప్ ఫొటో!: రాష్ట్రంలో వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం అమలు చేసిన రుణమాఫీ, వరికి బోనస్, సంక్షేమంలో భాగంగా అందిస్తున్న సన్న బియ్యం, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ సరఫరా, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ సరఫరా తదితర పథకాలను గురించి కూడా వివరించనున్నారు. సామాజిక సాధికారతలో భాగంగా రాష్ట్రంలో జరిగిన ఎస్సీ కులాల వర్గీకరణ, కులగణన, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పన కోసం శాసనసభలో చేసిన తీర్మానాలు తదితర అంశాలను సీఎం ప్రస్తావిస్తారని సీఎంవో వర్గాలు వెల్లడించాయి. ప్రధాని మోదీ, ఇతర ముఖ్యమంత్రులతో కలిసి రేవంత్ అల్పాహారం చేస్తారని, ఇతర రాష్ట్రాల సీఎంలతో కలిసి గ్రూప్ ఫొటో దిగే కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపాయి.

సాకారమవుతున్న సంప్రదింపులు: కేంద్రంతో సంప్రదింపుల ద్వారా రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన వాటిని సీఎం రేవంత్ సానుకూల రీతిలో సాధిస్తున్నారు. తెలంగాణకు ఐపీఎస్‌ల సంఖ్య 139 నుంచి 151కు పెంపు, హైదరాబాద్‌కు 2 వేల ఎలక్ట్రిక్ బస్సుల కేటాయింపు లాంటి అంశాల్లో కేంద్రం నుంచి అనుమతి లభించింది. రాష్ట్ర విభజన నేపథ్యంలో తెలంగాణ అవసరాలకు సరిపడా ఐపీఎస్ అధికారులు లేరని, అదనంగా 29 మందిని కేటాయించాలని ప్రధాని మోదీతో పాటు కేంద్రమంత్రి అమిత్‌షాను కలిసి విజ్ఞప్తి చేయడంతో పాటు పలుమార్లు ఆయన లేఖలు కూడా రాశారు. దేశంలోని ఐదు ప్రధాన నగరాల్లో హైదరాబాద్ ఒకటని, ఈ నేపథ్యంలో ఐపీఎస్ అధికారుల సేవలు అవసరమని రేవంత్ వివరించారు. ఈ క్రమంలో కేంద్రం లేవనెత్తిన సందేహాలకు రాష్ట్ర ప్రభుత్వం సుదీర్ఘమైన వివరణలు కూడా పంపింది. ఈ వివరణలకు సంతృప్తి చెందిన కేంద్రం 12 మంది ఐపీఎస్ అధికారులను కేటాయించింది. హైదరాబాద్‌లో నానాటికీ పెరుగుతున్న వాయు కాలుష్య నియంత్రణ, ఆధునిక నగర అవసరాలకు తగినట్టు ఎలక్ట్రిక్ వాహనాలను కేటాయించాలని ఈ ఏడాది జనవరి 16న కేంద్ర మంత్రులకు సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. నగర కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రత్యేక ప్రణాళికలో భాగంగా ముఖ్యమంత్రి చేసిన ఈ విజ్ఞప్తికి కేంద్రం సానుకూలంగా స్పందించి 2 వేల ఎలక్ట్రిక్ బస్సులు కేటాయిస్తున్నట్టు ప్రకటించడం గమనార్హం. కాగా, శుక్రవారం రాత్రి సీఎం రేవంత్ ఢిల్లీ చేరుకున్నారు.

యాభై సార్లయినా మోదీని కలుస్తా

▶ మొదటి పేజీ తరువాయి

ప్రజలకు అంకితం ఇచ్చే వరకు నిద్రపోను..' అని రేవంత్ అన్నారు.

అదానీ, అంబానీలతో పోటీ పడేలా ఆడబిడ్డలకు అవకాశాలు

'రాష్ట్రంలో మహిళలకు ఉచితబస్సు పథకం కోసం ఇప్పటికే రూ.5,500 కోట్లు ఖర్చు చేశాం. మహిళా సంఘాల ద్వారా 600 బస్సులు కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చాం. వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తికి విద్యుత్ శాఖతో ఒప్పందాల ద్వారా తెలంగాణ మహిళలు అదానీ, అంబానీలతో పోటీ పడే స్థాయిలో అవకాశాలు కల్పిస్తున్నాం. అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో ప్రభుత్వ పాఠశాలల నిర్వహణను మహిళలకే అప్పగించాం. మహిళా సంఘాలకు పెట్రోల్ బంక్‌లు ఇచ్చాం. ఇందిరమ్మను ఆదర్శంగా తీసుకుని.. సోనియాగాంధీ నాయకత్వంలో ఆడబిడ్డలను ఆర్థికంగా నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నాం. రాబోయే రోజుల్లో రూ.21 వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు ఇచ్చి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం..' అని సీఎం చెప్పారు.

యువత నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నాం..

'తెలంగాణ ఉద్యమంలో ముందున్న లక్షలాది మంది యువతకు గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగాలు రాలేదు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఆయన కుటుంబంలో నలుగురికి మాత్రం ఉద్యోగాలు వచ్చాయి. నేను సీఎంగా బాధ్యతలు తీసుకున్నాక 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశాం. ప్రైవేటు రంగంలో లక్ష ఉద్యోగాలు ఇచ్చి యువతలో మాపై ఉన్న విశ్వాసాన్ని, నమ్మకాన్ని నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తున్నాం. ఈ 15 నెలల్లోనే రూ.3 లక్షల కోట్ల విదేశీ పెట్టుబడులు రాష్ట్రానికి తెచ్చి పారిశ్రామికంగా అభివృద్ధి చేసే ప్రయత్నం చేస్తున్నాం. వీటన్నింటికీ ప్రజల ఆశీర్వాదం ఉండాలి. ప్రజలు ఆశీర్వదిస్తేనే రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం సాధ్యమవుతుంది. ప్రజల ఆశీర్వాదంతోనే రాష్ట్రంలో 25.55 లక్షల మంది రైతు కుటుంబాలకు రూ.20,617 కోట్ల రుణమాఫీ చేశాం. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. రైతుబరోసా ఆర్థిక సాయాన్ని రూ.12 వేలకు పెంచాం. భూమిలేని నిరుపేదలకు రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తున్నాం. సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తున్నాం..' అని ముఖ్యమంత్రి తెలిపారు.



బసవేశ్వర విగ్రహావిష్కరణలో సీఎం రేవంత్. చిత్రంలో మంత్రి దామోదర రాజనర్సింహ తదితరులు

ప్రతిపక్ష నేత అసెంబ్లీకి రావాలి

'రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రతిపక్షాల సహకారం కూడా కావాలి. ప్రతిపక్ష నాయకుడికి విజ్ఞప్తి చేస్తున్నా.. రండి.. అసెంబ్లీకి వచ్చి మాట్లాడండి.. 40 ఏళ్ల రాజకీయ అనుభవంతో సూచనలు ఇవ్వండి.. ఎక్కడైనా తప్పులు చేస్తే సరిదిద్దుకుంటాం..అలా కాకుండా అధికారంలో ఉంటేనే అసెంబ్లీకి వస్తా.. లేకపోతే ఫామ్‌హౌస్‌లో పడుకుంటానంటే ప్రజలే విచక్షణతో నిర్ణయం తీసుకుంటారు.

నేను 20 ఏళ్లు ప్రజల గొంతుకై నిలిచా

నేను ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, జెడ్పీటీసీగా, ఎంపీగా.. ఇలా 20 ఏళ్ల ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏ ఒక్కరోజూ సెలవు తీసుకోలేదు. ప్రజల సమస్యలకు గొంతుకనై పనిచేశా. నేను 20 ఏళ్లుగా ప్రజల పక్షాన పనిచేశాను కాబట్టే ప్రజలు నాకు సీఎంగా అవకాశం కల్పించారు. నా వద్దకు చిన్నోడు వచ్చినా.. పెద్దోడు వచ్చినా.. ఉన్నోడు వచ్చినా.. పేదోడు వచ్చినా.. అందరినీ కలిసి.. చేతనైన సాయం చేస్తున్నా..' అని రేవంత్ చెప్పారు. సభలో మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, ఎంపీ సురేష్ షెట్కార్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

పోలీస్‌శాఖ తరఫున అందించిన డీడీలతో లొంగిపోయిన మావోయిస్టులు



18 మంది మావోయిస్టుల లొంగుబాటు

ములుగు: మావోయిస్టు పార్టీకి చెందిన 18 మంది సభ్యులు ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీశ్ ఎదుట లొంగిపోయారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో లొంగిపోయిన వారి అరెస్టును చూపారు. లొంగిపోయిన వారంతా ఛత్తీస్‌గఢ్‌లోని పూజారి కాంకేర్ ఏరియా కమిటీ సభ్యులని ఎస్పీ తెలిపారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం తరఫున పునరావాసం నిమిత్తం ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున డీడీలను అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఓఎస్డీ, ములుగు డీఎస్పీ నలువాల రవీందర్ పాల్గొన్నారు.

కేసీఆర్ దేవుడు.. ఆయన చుట్టూ దెయ్యాలు

▶ మొదటి పేజీ తరువాయి

ఏం జరుగుతుందో ఇప్పుడు అందరం ఆలోచించుకోవాల్సిన అవసరం ఉంది. పార్టీలో అన్ని స్థాయిల్లో ఉన్నవారు అనుకుంటున్న విషయాలు, దాదాపు సగం తెలంగాణ ప్రజలు అనుకుంటున్న విషయాలే లేఖలో చెప్పాను. ఇందులో నాకు వ్యక్తిగత ఎజెండా ఏమీలేదు. వ్యక్తిగతంగా నాకు ఎవరిపై ద్వేషం లేదు, ఎవరిపై ప్రేమ లేదు. మా పార్టీ అధినేతకు రాసిన లేఖ బహిర్గతమైందంటే, దాని వెనుక ఎవరున్నారో ఆలోచించుకోవాల్సిన అవసరం ఉంది. కేసీఆర్ దేవుడు.. కానీ ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయి. వారి వల్లే నష్టం జరుగుతోంది. లేఖ బహిర్గతం కావడంతో కాంగ్రెస్, బీజేపీలు కోతికి కొబ్బరి చిప్ప దొరికినట్లు సంబరపడుతున్నాయి. బీఆర్‌ఎస్ ఆగమైనట్లు ఆ పార్టీల నాయకులు మాట్లాడుతున్నారు. మా నాయకుడు కేసీఆరే.. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ బాగుపడుతుంది. పార్టీ కూడా ముందుకెళ్తుంది. పార్టీలో చిన్నచిన్న లోపాలపై చర్చించుకొని సవరించుకొని కోవర్టులను పక్కకు జరుపుకొని ముందుకెళ్తే పార్టీ పది కాలాల పాటు చల్లగా ఉంటుంది. కాంగ్రెస్, బీజేపీలు విఫలమయ్యాయి. వారు రాష్ట్రానికి చేసిందేమీ లేదు. వాటికి కేసీఆర్ నాయకత్వమే ప్రత్యామ్నాయం' అని కవిత స్పష్టంచేశారు.

సీఎం.. సీఎం నినాదాలు

శంషాబాద్ విమానాశ్రయంలో కవితకు స్వాగతం పలకడానికి వచ్చిన శ్రేణులు సీఎం.. సీఎం అని నినాదాలు చేశారు. కవితక్క జిందాబాద్.. సామాజిక తెలంగాణ కోసం పోరాడిన కవితక్క అన్న ప్లకార్డులను ప్రదర్శిస్తూ బీసీ సంఘాల నాయకులు ఆమెకు స్వాగతం పలికారు. కవిత టీం పేరుతో వచ్చినవారు ప్రదర్శించిన ప్లకార్డులలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఫొటోలు కానీ, కేటీఆర్ లేదా హరీశ్‌రావు ఫొటోలు కానీ కనిపించకపోవడం గమనార్హం. జాగృతి ఆధ్వర్యంలో వచ్చిన కొందరు మాత్రం కవితతోపాటు కేసీఆర్ ఫొటోలు ఉన్న ప్లకార్డులు పట్టుకొని కవిత జిందాబాద్.. కేసీఆర్ జిందాబాద్ అని నినాదాలు చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ బ్యాగ్‌మ్యాన్

▶ మొదటి పేజీ తరువాయి


మారిందని ఈడీ లాంటి దర్యాప్తు సంస్థలు కూడా చెప్తున్నాయని అన్నారు. ఈడీ చార్జిషీట్‌లో పేరు రావడంతో 'తెలంగాణ బ్యాగ్ మ్యాన్'రేవంత్‌రెడ్డి ప్రజల దృష్టి మళ్లించే డ్రామాలు మొదలు పెట్టారని శుక్రవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. తన అవినీతిపై చర్చ జరగకుండా చూసేందుకు రేవంత్ రోజుకో కొత్త నాటకం వేస్తున్నారని ఆరోపించారు. ఈడీ చార్జిషీట్‌లో రేవంత్ పేరు నమోదైనందున కేంద్రం ఆయనపై చర్యలు తీసుకుంటున్నదీ లేనిదీ చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో అమృత్ స్కామ్, ఆర్‌ఆర్ ట్యాక్స్ కుంభకోణం, పౌర సరఫరాల స్కామ్ వంటి వాటిని చూసీ చూడనట్లుగా వదిలేసిన రీతిలోనే కేంద్రం నేషనల్ హెరాల్డ్ కేసు విషయంలోనూ వ్యవహరిస్తుందా? అని ప్రశ్నించారు.

అధికారం కోసం వందల కోట్లు


సీఎం పదవి చేపట్టకముందే అధికారం కోసం రేవంత్‌రెడ్డి.. కాంగ్రెస్ పెద్దలకు వందల కోట్ల రూపాయలు ముడుపులు ఇచ్చిన వ్యవహారం ఈడీ చార్జిషీట్‌లో బయటపడిందని కేటీఆర్ అన్నారు. యంగ్ ఇండియా సంస్థకు విరాళాలు ఇస్తే పదవులు ఇప్పిస్తానని రేవంత్‌రెడ్డి ప్రలోభపెట్టిన విషయం ఈడీ చార్జిషీటులో బయట పడిందని తెలిపారు. వందల కోట్లతో మొదలైన రేవంత్ అవినీతి బాగోతం ఏడాదిన్నరలోనే సీఎం పదవిని అడ్డుపెట్టుకుని వేల కోట్ల రూపాయలకు చేరిందని ఆరోపించారు. మంత్రి పొంగులేటి తరహాలోనే రేవంత్ చీకట్లో బీజేపీ పెద్దల కాళ్లు పట్టుకుంటారా? అని ప్రశ్నించారు. కేవలం చార్జిషీట్‌లో రేవంత్ పేరు నమోదుతో సరిపెట్టకుండా విచారణకు పిలిచి అవినీతిని కక్కించాలని డిమాండ్ చేశారు. అంతర్గత కుమ్ములాటలతో కాంగ్రెస్ కకావికలమైందని, తిరుగుబాట్లతో సీఎం కుర్చీ ఎప్పుడు దిగాల్సి వస్తుందో అనే భయం రేవంత్‌ను అడుగడుగునా వెంటాడుతోందని ఎద్దేవా చేశారు. కమీషన్లు లేనిదే ఫైలు కదలడం లేదని మంత్రి కొండా సురేఖ చెప్పారని, 30 శాతం పర్సంటేజీపై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలతో కాంగ్రెస్ నిజ స్వరూపం బయట పడిందని అన్నారు. ప్రజల ముందు సీఎం అవినీతి బాగోతం బట్టబయలు కావడంతో కుడితిలో పడిన ఎలుకలా కాంగ్రెస్ పార్టీ కొట్టుకుంటోందని విమర్శించారు. పచ్చని రాష్ట్రంలో చిచ్చుపెట్టి వేల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేస్తూ పేదల జీవితాలతో చెలగాటమాడుతున్న సీఎం పాపం పండిందని, ధర్మమే గెలుస్తుందని కేటీఆర్ అన్నారు.

ఏసీబీకి చిక్కిన నలుగురు అవినీతి అధికారులు


- ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీకి రూ.8 లక్షలు డిమాండ్
- జీహెచ్‌ఎంసీ నార్త్‌జోన్ ఏసీపీ బి.విఠల్‌రావు అరెస్టు
- లంచం తీసుకుంటూ దొరికిన పెద్దశంకరంపేట ఇన్‌చార్జ్ ఎంపీడీఓ
- కామారెడ్డి కోర్టులోనే పట్టుబడిన ఏపీపీ, కోర్టు కానిస్టేబుల్



బి.విఠల్‌రావు



విఠల్‌రెడ్డి



గుగులోత్ అశోక్, సంజయ్

సికింద్రాబాద్/పెద్దశంకరంపేట(మెదక్)/ కామారెడ్డి క్రైం: అవినీతి అధికారులపై ఏసీబీ పంజా విసిరింది. ఒక్కరోజే నలుగురిని అదుపులోకి తీసుకుంది. నిర్మాణం పూర్తయిన రెండు అపార్ట్‌మెంట్లకు చెందిన ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీ కోసం రూ.8 లక్షలు డిమాండ్ చేసిన జీహెచ్‌ఎంసీ నార్త్‌జోన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) బి.విఠల్‌రావును శుక్రవారం ఏసీబీ అరెస్టు చేసింది. బేగంపేటకు చెందిన వెంకట్‌రావు యాప్రాల్‌లో నిర్మించిన రెండు అపార్ట్‌మెంట్లకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేయగా నార్త్‌జోన్ ఏసీపీ బి.విఠల్‌రావు రూ.8 లక్షలు డిమాండ్ చేశాడు. రూ.4 లక్షలు ఇచ్చిన వెంకటరావు.. లంచం ఇచ్చిన దృశ్యాలను రహస్యంగా వీడియో చిత్రీకరించి ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. వీడియో ఆధారంగా కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు.. శుక్రవారం జీహెచ్‌ఎంసీ ఉత్తర మండలం కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. విఠల్ రావును అదుపులోకి తీసుకున్నారు.

రూ.20 వేలు లంచం తీసుకుంటూ దొరికిన ఇన్‌చార్జి ఎంపీడీఓ

మెదక్ జిల్లా పెద్దశంకరంపేటలో డ్రైనేజీ నిర్మాణ బిల్లుకు సంబంధించిన చెక్కు జారీచేసేందుకు రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఇన్‌చార్జి ఎంపీడీఓ విఠల్‌రెడ్డి ఏసీబీకి అడ్డంగా దొరికిపోయాడు. మెదక్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన ఓ కాంట్రాక్టర్ రూ.2.92 లక్షలతో డ్రైనేజీ పనులు పూర్తి చేశాడు. ఇందులో రూ.1,95,747కు పెద్దశంకరంపేట ఇన్‌చార్జి ఎంపీడీఓ విఠల్‌రెడ్డి చెక్కు ఇవ్వాల్సి ఉంది. ఆ చెక్కు ఇచ్చేందుకు రూ.20 వేలు లంచం డిమాండ్ చేయగా, కాంట్రాక్టర్ 20న ఏసీబీని ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు.. మండల పరిషత్ కార్యాలయంలో లంచం తీసుకుంటుండగా విఠల్‌రెడ్డిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

కోర్టులోనే పట్టుబడ్డ ఏపీపీ, కానిస్టేబుల్

ప్రభుత్వం, పోలీసుల తరఫున కోర్టులో కేసు వాదించాల్సిన ఓ ఏపీపీ, పోలీసు విధులు నిర్వర్తించాల్సిన కానిస్టేబుల్ కాసులకు కక్కుర్తి పడి ఏకంగా కోర్టులోనే ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికారు. ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ కథనం ప్రకారం.. కామారెడ్డి పట్టణానికి చెందిన ఓ వ్యక్తిపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో 2018లో చీటింగ్ కేసు నమోదైంది. కోర్టులో కేసు విచారణ త్వరగా పూర్తి చేయడానికి, కేసు నుంచి నిర్దోషిగా విడుదల చేయించడానికి కామారెడ్డి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పని చేస్తున్న అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గుగులోత్ అశోక్ శివరాం నాయక్ లంచం డిమాండ్ చేశాడు. కోర్టు కానిస్టేబుల్ సంజయ్ ద్వారా ముందుగా రూ.15 వేలు ఇవ్వాలని అడిగారు. బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శుక్రవారం కోర్టులో ఏపీపీ, కానిస్టేబుల్ బాధితుని నుంచి రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం కామారెడ్డిలోని అశోక్ శివరాం నాయక్ ఇంట్లో కూడా తనిఖీలు చేశారు.

విపత్తుల సమయంలో కీలకంగా ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు

ఎస్‌డీఆర్‌ఎఫ్ విన్యాసాల ప్రారంభంలో డీజీపీ జితేందర్

సాక్షి, హైదరాబాద్ : ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు వెనువెంటనే రంగంలోకి దిగి ప్రజల ప్రాణాలు కాపాడేలా అత్యంత కీలకమైన ఎస్‌డీఆర్‌ఎఫ్ (స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్)ను అందుబాటులోకి తెచ్చినట్టు డీజీపీ డాక్టర్ జితేందర్ తెలిపారు. తెలంగాణ స్పెషల్ పోలీస్‌కు చెందిన 10 యూనిట్లు, తెలంగాణ అగ్నిమాపకశాఖకు చెందిన ఐదు యూనిట్లు కలిపి మొత్తం 15 యూనిట్లలో 1,500 వరకు ఈ ప్రత్యేక బృందాల సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. టీజీఎస్పీ బెటాలియన్ల నుంచి రెండు ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలకు చెందిన 200 మందికి ఎన్‌డీఆర్‌ఎఫ్ శిక్షణ కేంద్రాల్లో రెండు నెలల శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. తొలి రెండు యూనిట్ల శిక్షణ పూర్తయిన సందర్భంగా శుక్రవారం హుస్సేన్‌సాగర్ సమీపంలోని బోట్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనకు డీజీపీ జితేందర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాల విన్యాసాలను శాంతిభద్రత అడిషనల్ డీజీ మహేశ్ భగవత్, టీజీఎస్పీ అడిషనల్ డీజీ సంజయ్‌కుమార్ జైన్, పీఅండ్ఎల్ ఐజీ రమేశ్‌లతో కలిసి తిలకించారు.

పాకిస్తాన్ వారిని తిరిగి పంపించాం

రాష్ట్రంలో వివిధ రకాల వీసాలతో నివాసముంటున్న పాకిస్తానీయుల్లో 31 మంది తిరిగి వారి దేశానికి పంపినట్టు డీజీపీ జితేందర్ 'సాక్షి'తో తెలిపారు. తెలంగాణలో భద్రత ఎంతో కట్టుదిట్టంగా ఉందని, ఉగ్రవాద కార్యకలాపాలను ఆదిలోనే తెలంగాణ పోలీస్ స్పెషల్ యూనిట్లు కనిపెట్టాయన్నారు.

సాక్షి
హైదరాబాద్

శనివారం । 24 । మే । 2025



అద్దెకు వచ్చి.. ఆక్రమించి!

జూబ్లీహిల్స్ రోడ్డు నం.41 పెద్దమ్మ గుడి సమీపంలోని ఇంటిని అద్దెకు తీసుకున్న ఓ వ్యక్తి దాని పక్కన ఉన్న రోడ్డుతో పాటు నాలాను కబ్జా చేశాడు. -10లో



అందం.. అనుబంధం..

గ్లోబల్ వేదికగా ఏ రంగంలోనైనా హైదరాబాద్ తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో పలువురు మిస్ వరల్డ్ పోటీదారులు తమ అనుభవాలను వెలిబుచ్చారు. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 32.0/24.0

నగరంలో శనివారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 32, కనిష్ఠంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

పెరిగిన మెట్రో చార్జీలపై 10 శాతం తగ్గింపు నేటి నుంచి

సాక్షి, సిటీబ్యూరో: మెట్రో చార్జీల పెంపుపై ప్రయాణికుల్లో వ్యతిరేకత వ్యక్తం కావడంతో ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రో రైల్ పెంచిన చార్జీలపై 10 శాతం తగ్గింపును ప్రకటించింది. ఈ మేరకు శనివారం నుంచి 10 శాతం తగ్గింపు అమల్లోకి రానుంది.

హైడ్రా డీఎస్పీగా శ్రీకాంత్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీకి (హైడ్రా) మరో డీఎస్పీ వచ్చారు. ఇప్పటికే హైడ్రా ఠాణా ఎస్‌హెచ్‌ఓగా ఉన్న తిరుమలేష్ ఒకరు ఉండగా... అదనంగా మరో డీఎస్పీగా సీహెచ్.శ్రీకాంత్‌ను నియమిస్తూ డీజీపీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో శ్రీకాంత్‌ను మాదాపూర్ ఏసీపీగా నియమించారు. దాన్ని రద్దు చేసిన డీజీపీ హైడ్రాలో పోస్టింగ్ ఇచ్చారు. మరోపక్క చిక్కడపల్లి ఏసీపీగా ఎల్.రమేష్‌కుమార్‌ను కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

సర్కారు బడులపై నమ్మకం పెంచాలి



శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులతో యోగితా రాణా తదితరులు

అత్తాపూర్: అత్తాపూర్‌లోని ఎడిఫై స్కూల్‌లో కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా, సెక్రటరీ డైరెక్టర్ రమేష్, డీఈఓ సుసీందర్‌రావు, కోర్స్ డైరెక్టర్ శంకర్ రాథోడ్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణలో సుమారు 60 శాతానికి పైగా విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లోకి వెళ్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల్లో, తల్లిదండ్రులలో నమ్మకం పెంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మనం నాణ్యమైన విద్యను అందిస్తే విద్యార్థులు మన వద్దకు వస్తారని పేర్కొన్నారు.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు

గోసేవా సంఘాలకు కొత్వాల్ విజ్ఞప్తి




సాక్షి, సిటీబ్యూరో: బక్రీద్‌ను నగరంలో పూర్తి ప్రశాంత, శాంతియుత వాతావరణంలో నిర్వహించడానికి తీసుకుంటున్న చర్యల్లో భాగంగా నగర కొత్వాల్ సీవీ ఆనంద్ శుక్రవారం గోసేవా సంఘాలతో భేటీ అయ్యారు. బషీర్‌బాగ్‌లోని ఓల్డ్ కమిషనరేట్‌లో జరిగిన ఈ సమావేశంలో ఆయా సంఘాల ప్రతినిధులతో పాటు అదనపు సీపీ విక్రమ్‌సింగ్ మాన్ సహా ఇతర అధికారులు పాల్గొన్నారు. గోరక్షకులను ఉద్దేశించి ఆనంద్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి ఉండాలని, పశువుల అక్రమ రవాణాపై ఏదైనా సమాచారం అందితే తమకు చెప్పాలని సూచించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని.. 87126 61155కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ నెంబర్‌కు ఫోన్ చేయడంతో పాటు ఫోటోలు, వీడియోలు కూడా షేర్ చేయవచ్చని స్పష్టం చేశారు. గోసేవా ఫౌండేషన్ ప్రతినిధులు, గోసంరక్షకులు మాట్లాడుతూ తాము ఆవులతో పాటు ఇతర పశువులను రక్షించడానికి, వాటిని హింసించకుండా చూసుకోవడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. కొందరు పశువులను చంపుతున్న వీడియోలను తీసి సోషల్ మీడియాలో రీల్స్‌గా పెడుతున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై వెంటనే స్పందించిన కొత్వాల్ ఆనంద్ అలాంటి పోస్టులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో యుగతులసి ఫౌండేషన్ ఛైర్మన్ కొలిశెట్టి శివకుమార్, గోరక్షకదళ్ తెలంగాణ ప్రెసిడెంట్ దీపక్ సింగ్ పాల్గొన్నారు.

‘గ్యారంటీ’ లేని గ్యాస్ సబ్సిడీ

మూణ్నాళ్ల ముచ్చటగా మారిన కాంగ్రెస్ హామీ

రెండో సిలిండర్ వచ్చినా జమ కాని నగదు

- కొందరు లబ్ధిదారులకు తప్పని నిరాశ
- మళ్లీ భారంగా తయారవుతున్న వంట గ్యాస్
- రాష్ట్ర ప్రభుత్వ తీరుపై పేద కుటుంబాల అసహనం



‘నగర శివారులోని మౌలాలీకి చెందిన బాలకృష్ణ కుటుంబం రూ.500 గ్యాస్ సిలిండర్ వర్తింపునకు అర్హత సాధించింది. రీఫిల్ డోర్ డెలివరీ కాగానే మార్చి నెల వరకు ఠంచన్‌గా బ్యాంక్ ఖాతాలో సబ్సిడీ నగదు జమ అవుతూ వచ్చింది. కాగా.. మార్చి నుంచి రెండు పర్యాయాలు సిలిండర్ బుక్ చేస్తే .. రీఫిల్ డోర్ డెలివరీ అయింది కానీ సబ్సిడీ నగదు బ్యాంక్ ఖాతాలో జమ కాలేదు. బాలకృష్ణ కుటుంబానికే ఎదురైన సమస్య కాదు.. గ్రేటర్ పరిధిలో గ్యాస్ సబ్సిడీకి అర్హత సాధించిన చాలా కుటుంబాలదీ ఇదే పరిస్థితి’



సాక్షి, సిటీబ్యూరో: కాంగ్రెస్ సర్కార్ ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం కింద రూ.500కు వంట గ్యాస్ సబ్సిడీ నగదు జమ మూణ్నాళ్ల ముచ్చటగానే తయారైంది. గ్యాస్ సబ్సిడీకి అర్హత సాధించి రీఫిల్ డోర్ డెలివరీ కాగానే సబ్సిడీ నగదు రూపంలో కొన్ని నెలలు బ్యాంక్ ఖాతాలో జమ అయినా.. ఆ తర్వాత ఆగిపోవడం విస్మయానికి గురిచేస్తోంది. దీంతో కేవలం కేంద్ర ప్రభుత్వ స్లాబ్ సబ్సిడీకి పరిమితం కావాల్సిన పరిస్థితి నెలకొంది.

మూడు లక్షల కుటుంబాలకు..

గ్రేటర్ పరిధిలో మహాలక్ష్మి పథకం కింద రూ. 500కు వంట గ్యాస్ వర్తింపునకు కేవలం మూడు లక్షల కుటుంబాలు మాత్రమే అర్హత సాధించాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాల పరిధిలో సుమారు 40.18 లక్షల ఎల్పీజీ కనెక్షన్‌దారులున్నారు. ప్రజాపాలనలో సుమారు 24.74 లక్షల కుటుంబాలు గ్యాస్ సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకున్నాయి. వీటిలో 19.10 లక్షల కుటుంబాలకు మాత్రమే తెల్లరేషన్ కార్డులు ఉన్నాయి. సబ్సిడీ గ్యాస్ మాత్రం కేవలం మూడు లక్షలలోపు కనెక్షన్‌దారులకు మాత్రమే వర్తించినట్లు పౌరసరఫరాల శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మిగతా 16 లక్షల కనెక్షన్‌దారులు అర్హులుగా ఉన్నా.. సబ్సిడీ వర్తింపు మాత్రం అందని ద్రాక్షగా మారింది. తాజాగా అర్హత సాధించిన కుటుంబాల్లో సైతం కొందరికి సబ్సిడీ నగదు బ్యాంక్ ఖాతాలో జమకావడం మూణ్నాళ్ల ముచ్చటగానే మారింది.

కొందరి ఖాతాల్లోనే నగదు జమ..

రాష్ట్ర ప్రభుత్వం అందించే సబ్సిడీ బ్యాంక్ ఖాతాలో నగదు జమ కాకపోవడంతో మళ్లీ వంట గ్యాస్ ఆర్థిక భారంగా తయారవుతోంది. మార్కెట్ ధర ప్రకారం కొనుగోలు చేయక తప్పడం లేదు. కేంద్ర ప్రభుత్వం సిలిండర్‌పై సబ్సిడీ రూపంలో రూ.40.71 జమ చేస్తోంది. ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా అర్హత సాధించిన వంట గ్యాస్ లబ్ధిదారులకు మాత్రం రాష్ట్ర ప్రభుత్వం సిలిండర్ ధరలో రూ.500, కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ మినహాయించి మిగతా సొమ్మును నగదు బదిలీ ద్వారా వినియోగదారులు ఖాతాలో చేస్తూ వస్తోంది. తాజాగా సిలిండర్‌పై కొద్ది మందికి మాత్రమే సబ్సిడీ బ్యాంకు ఖాతాల్లో జమ అవుతోంది. మిగతా వారికి జమ కావడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధికారుల్లో కొరవడిన స్పష్టత..

వంట గ్యాస్ సబ్సిడీ నగదు జమ కొన్ని లబ్ధి కుటుంబాలకు నిలిచిపోవడంపై పౌరసరఫరాల అధికారులకు సైతం స్పష్టత లేకుండా పోయింది. సిలిండర్ల వినియోగం దాటడమే సబ్సిడీ నగదు జమ కాకపోవడానికి కారణమనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం 12 సిలిండర్లపై సబ్సిడీ వర్తింప జేస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం గత మూడేళ్లలో వినియోగించిన సిలిండర్ల సంఖ్యను పరిగణనలోకి తీసుకున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. గరిష్ఠంగా ఏటా ఇవ్వాల్సిన సిలిండర్ల సంఖ్య ఎనిమిదిగా నిర్ధారించింది. లబ్ధిదారుల సిలిండర్ సంఖ్య ఎనిమిది పరిమితి దాటనప్పటికీ.. గతంలో వినియోగించిన సంఖ్య తక్కువగా ఉంటే దాని ప్రకారమే సబ్సిడీ వర్తింపజేస్తున్నట్లు సమాచారం.

రక్షణ లేక భక్షణ!

అన్యాక్రాంతంలో హెచ్‌ఎండీఏ భూములు

- రెండు వేల ఎకరాలకు కొరవడిన భద్రత
- ఆ విభాగాల మధ్య సమన్వయలేమి
- అమలుకు నోచుకోని జియో ఫెన్సింగ్
- కబ్జాదారుల చెరలో విలువైన స్థలాలు



రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో హెచ్‌ఎండీఏ భూములు	
ప్రాంతం	ఎకరాలు
జవహర్‌నగర్	1300
కంది	50
ఆరుట్ల	110
శంకరంపేట్	86
మియాపూర్	500
చిట్కుల్	50
ఇంద్రకరణ్	140

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) భూములకు రక్షణ కొరవడింది. వివిధ జిల్లాల్లో హెచ్‌ఎండీఏకు చెందిన భూములు వందల ఎకరాల్లో ఉన్నాయి. కానీ అనేక చోట్ల అన్యాక్రాంతమవుతున్నాయి. కబ్జాదారులు భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. మియాపూర్, జవహర్‌నగర్, శంషాబాద్, తదితర ప్రాంతాల్లో ఇప్పటికే పెద్ద ఎత్తున హెచ్‌ఎండీఏ స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి. చివరకు పోలీసులు, రెవిన్యూ తదితర విభాగాలకు చెందిన యంత్రాంగాలు రంగంలోకి దిగి కొన్ని చోట్ల భూములను తిరిగి స్వాధీనం చేసుకున్నప్పటికీ దశాబ్ద కాలంగా పెద్ద సంఖ్యలోనే భూములను కోల్పోయినట్లు సమాచారం.

భద్రత ఏర్పాటు చేయకపోవడంతో..

మియాపూర్‌లోని 100, 101 సర్వే నంబర్లలోని సుమారు 500 ఎకరాల భూములను కాపాడుకొనేందుకు గత ఏడాది పోలీసులు కబ్జాదారుల నుంచి హెచ్‌ఎండీఏకు అప్పగించారు. శంషాబాద్‌లోనూ హెచ్‌ఎండీఏకు ఉన్న సుమారు 200 ఎకరాల భూముల్లో 50 ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయి. వీటిలో ఏకంగా కొన్ని భవనాలను కూడా కట్టించారు. వీటి రక్షణ కోసం హెచ్‌ఎండీఏ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. హైకోర్టు తీర్పుతో భూమిని తిరిగి స్వాధీనం చేసుకొనేందుకు చర్యలు చేపట్టారు. అక్రమంగా నిర్మించిన భవనాలను సైతం తొలగించారు. ఇలా ఎక్కడో ఒక చోట కబ్జాకు గురైనట్లు హెచ్‌ఎండీఏ దృష్టికి వచ్చినప్పుడు మాత్రమే అధికారులు జోక్యం చేసుకొని రక్షణ చర్యలు తీసుకుంటున్నారు. ఎలాంటి భద్రత ఏర్పాటు చేయకపోవడంతో హెచ్‌ఎండీఏ పరిధిలోని వివిధ జిల్లాల్లో సుమారు 2,000 ఎకరాల భూములకు రక్షణ లేకుండాపోయింది. కొన్ని చోట్ల సరైన సెక్యూరిటీని కూడా ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.


కాగితాల్లోనే ప్రతిపాదనలు..

మరోవైపు భూములను కాపాడేందుకు వివిధ విభాగాల మధ్య సమన్వయం లేకపోవడం కూడా సమస్యగా మారింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్టేట్ విభాగాల మధ్య కొంతకాలంగా సమన్వయం లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జవహర్‌నగర్‌లో ఇప్పటికే పెద్ద ఎత్తున ఆక్రమణకు గురి కాగా.. మరో 1,300 ఎకరాల భూములు హెచ్‌ఎండీఏ ఖాతాలోఉన్నాయి. ‘హెచ్‌ఎండీఏకు చెందిన భూములు ఎక్కడెక్కడ ఉన్నాయనే సంగతి తెలియదు. పై అధికారుల సూచనల మేరకు సెక్యూరిటీ ఏర్పాటు చేయడం వరకే పరిమితమయ్యాం’అని హెచ్‌ఎండీఏ విజిలెన్స్ విభాగానికి చెందిన అధికారి ఒకరు తెలిపారు.

- కబ్జా కోరల్లో చిక్కుకున్న మియాపూర్ భూములను కాపాడేందుకు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ తరహాలో మిగిలిన చోట్ల కూడా ఇలాగే చర్యలు తీసుకోవాలనే ప్రతిపాదన ఉన్నా.. అమలుకు మాత్రం నోచుకోవడంలేదు. ఎస్టేట్ విభాగం నిర్లక్ష్యం కారణంగానే ఫెన్సింగ్ పనులు కొనసాగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. హెచ్‌ఎండీఏ పరిధిలోని విలువైన భూములకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి సీసీ కెమెరాల ద్వారా నిఘాను బలోపేతం చేయాలని ప్రతిపాదించినా అన్ని చోట్ల ఈ వ్యవస్థ అందుబాటులోకి రాలేదు. మరోవైపు ప్రత్యక్షంగా భద్రత సదుపాయం కల్పించలేని ప్రాంతాల్లో జియోఫెన్సింగ్ ద్వారా భూముల రక్షణకు చర్యలు తీసుకోవాలని భావించినా ఆ ప్రణాళికలు ఇప్పటికీ ప్రతిపాదన దశలోనే ఉండటం గమనార్హం.

ఇక ‘ఫ్యూచర్’లో లేఔట్లు

వాణిజ్య క్రయ విక్రయాలకు అనుమతులు మంజూరు



- పరిశ్రమలకు భూ కేటాయింపుల బాధ్యత ఎఫ్‌సీడీఏదే
- జూన్ నుంచి ఎఫ్‌సీడీఏ కార్యకలాపాలు ప్రారంభం
- హెచ్‌ఎండీఏ నుంచి ఎఫ్‌సీడీఏ కమిషనర్‌కు అధికారాల బదిలీ

సాక్షి, సిటీబ్యూరో: రంగారెడ్డి జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఫోర్త్ సిటీ నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) శరవేగంగా అడుగులు వేస్తోంది. జూన్ నుంచి ఎఫ్‌సీడీఏ కార్యకలాపాలు ప్రారంభించనుంది. ఫ్యూచర్ సిటీలో ఓపెన్ ప్లాట్ లేఔట్లు, నివాస, వాణిజ్య భవన నిర్మాణాల అనుమతులతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు ఎఫ్‌సీడీఏ అనుమతులు మంజూరు చేయనుంది. వీటితో పాటు పరిశ్రమలు, ఐటీ మరియు ఆరోగ్య సంరక్షణ ప్రాజెక్ట్‌లకు భూ కేటాయింపుల బాధ్యత కూడా ఎఫ్‌సీడీఏనే నిర్వహించనుంది.

హెచ్‌ఎండీఏ నుంచి ఎఫ్‌సీడీఏకు..

హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తరహాలో తెలంగాణలో ఫోర్త్ సిటీ అభివృద్ధి అవసరమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో శివార్లలోని ఆమన్గల్, ఇబ్రహీంపట్నం, కడ్తాల్, కందుకూరు, మహేశ్వరం, యాచారం, మంచాల్ 7 మండలాలోని 56 రెవెన్యూ గ్రామాలు ఎఫ్‌సీడీఏ పరిధిలోకి తీసుకొచ్చారు. కొత్త అనుమతులు, ఆమోదాలను నిలిపివేయడం, మార్గదర్శకాలపై స్పష్టత లేకపోవడంతో రియల్ ఎస్టేట్ డెవలపర్లు, భూ యజమానులలో అనిశ్చితి ఏర్పడింది. దీంతో అథారిటీ ఏర్పాటు వేగంగా జరిగినా.. రెండు నెలల పాటు కార్యకలాపాల నిర్వహణ జరగలేదు. దీంతో ఆయా ప్రాంతాలలో స్థిరాస్తి ప్రాజెక్టులు, అభివృద్ధి పనుల్లో జాప్యం ఏర్పడింది. మార్చి వరకూ ఫ్యూచర్ సిటీ ప్రాంతాలలో భవనాలు, లేఔట్ల అనుమతులను హైదరాబాద్ మెట్రోపాలిటన్ అభివృద్ధి అథారిటీ (హెచ్‌ఎండీఏ), స్థానిక సంస్థలు మంజూరు చేశాయి. తాజాగా ప్రభుత్వం అధికారాన్ని కార్యాచరణలోకి తీసుకురావడంపై దృష్టిసారించింది. ఇందులో భాగంగా ఎఫ్‌సీడీఏ పరిధిలో లేఔట్లు, నిర్మాణ అనుమతుల అధికారాలను హెచ్‌ఎండీఏ నుంచి ఎఫ్‌సీడీఏ కమిషనర్‌కు బదిలీ చేశారు. దీంతో శ్రీశైలం హైవే వెంబడి ఉన్న ఈ ఫ్యూచర్ సిటీలో పట్టణ మరియు పారిశ్రామిక విస్తరణతో పాటు ప్రణాళికబద్ధమైన అభివృద్ధికి వీలు కలగనుంది.

ఫ్యూచర్ సిటీ పేరు మార్పు?

యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా పోలీసు స్కూల్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీల పేర్ల తరహాలోనే ఫ్యూచర్ సిటీకి కూడా జాతీయ స్థాయిలో గౌరవం పొందేలా ఫ్యూచర్ సిటీని ‘భారత్ ఫ్యూచర్ సిటీ’గా పేరు మార్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే పలు కార్యక్రమాలలో సీఎం తన ప్రసంగాలలో దీన్ని భారత్ ఫ్యూచర్ సిటీగా ప్రకటించారు. దీంతో జాతీయ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా మారుతుందని అధికార వర్గాలు తెలిపాయి.

ఫ్యూచర్ సిటీ స్వరూపమిదీ

విస్తీర్ణం: 765.28 చ.మీ

ఎకరాలు: 2,01,318

జనాభా: 1,31,733

డూప్లికేట్లు 11 వేలు

హైదరాబాద్ జిల్లా ఓటర్ల జాబితాలో గుర్తించిన కేంద్ర ఎన్నికల సంఘం

- తొలగించిన జీహెచ్‌ఎంసీ యంత్రాంగం



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లా పరిధిలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 11 వేలకుపైగా డూప్లికేట్ ఓటర్లున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించింది. ఈ అంశాన్ని జీహెచ్‌ఎంసీ ఎన్నికల విభాగానికి తెలియజేయడంతో విచారణ జరిపి తొలగించారు. ఓటరు జాబితాలో ఒకే పేరు, ఒకే ఓటరు గుర్తింపు నంబరు ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఉండటంతో ఒక చోట మాత్రం ఉంచి, మిగతా చోట్ల తొలగించారు. ఓటరు జాబితా ప్రక్షాళనలో భాగంగా ఈ చర్యలు తీసుకున్నారు. ఇలా ఒకటికంటే ఎక్కువ (చాలా వరకు రెండు చోట్ల) చోట్ల ఒకే పేరు, ఎపిక్ నంబరు ఉండటంతో తొలగించారు. వీటిని డూప్లికేట్‌లుగా పరిగణిస్తున్నారు. ఇలాంటి డూప్లికేట్‌లు జిల్లాలోని మొత్తం 15 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను అంబర్‌పేట నియోజకవర్గంలో అత్యధికంగా 1826 మంది ఉన్నారు. ఆ తర్వాత జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 1327 మంది, సికింద్రాబాద్ నియోజకవర్గంలో 1148 మంది ఉన్నారు.

ఏ నియోజకవర్గంలో ఎన్ని..

నియోజకవర్గం	డూప్లికేట్లు
మలక్‌పేట	717
నాంపల్లి	633
సనత్‌నగర్	927
ఖైరతాబాద్	758
చాంద్రాయణగుట్ట	569
యాకుత్‌పురా	449
ముషీరాబాద్	984
అంబర్‌పేట	1826
గోషామహల్	535
చార్మినార్	205
సికింద్రాబాద్	1148
కంటోన్మెంట్	555
జూబ్లీహిల్స్	1327
కార్వాన్	555
బహదూర్‌పురా	260
మొత్తం	11448

‘రాజస్థాన్ నేరం’ వెనుక లోకేంద్ర!



నిందితులను అరెస్టు చేసిన జైపూర్ పోలీసులు

అక్కడి కాంగ్రెస్ నేత ఇంట్లో భారీ చోరీ

- వారి వద్ద పని చేసే నేపాలీలే పాత్రధారులు
- కాచిగూడలో జరిగిన చోరీతో సారూప్యతలు
- నగర పోలీసులతో ఆ అధికారుల సంప్రదింపులు



లోకేంద్ర

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని కాచిగూడకు చెందిన కార్టన్స్ ఫ్యాక్టరీ యజమాని హేమ్‌రాజ్ దుగ్గర్ ఇంట్లో జరిగిన భారీ చోరీ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న లోకేంద్ర బహదూర్ షాహి నేతృత్వంలోని ముఠా మరో నేరం చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ పంజా విసరడానికి ఆరు నెలల ముందు ముంబైకి చెందిన ఓ బడా వ్యాపారి ఇంట్లో ఇదే పంథాలో 5 కేజీల బంగారం తస్కరించినట్లు ఇప్పటికే వెలుగులోకి వచ్చింది. దీంతో పాటు ఈ నెల 14 రాత్రి రాజస్థాన్‌లోని జైపూర్‌లో నివసించే కాంగ్రెస్ పార్టీ నేత సందీప్ చౌదరి ఇంట్లో రూ.6 కోట్ల సొత్తు దొంగతనానికీ ఇతడే సూత్రధారి అని ఆ పోలీసులు అనుమానిస్తున్నారు. దీన్ని ఖరారు చేసుకోవడానికి హైదరాబాద్ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు.

వ్యవస్థీకృతంగా లోకేంద్ర వ్యవహారాలు..

కొన్నేళ్ల క్రితం నేపాల్ నుంచి వసలవచ్చిన లోకేంద్ర వ్యవస్థీకృతంగా ఈ చోరీలు చేయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇక్కడి వ్యాపారుల ఇళ్లల్లో పని చేస్తున్న నేపాలీల్లో కొందరితో సంబంధాలు ఏర్పాటు చేసుకున్నాడు. వారి ద్వారా ఆయా వ్యాపారుల కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలు తెలుసుకుంటున్నాడు. అదను చూసుకుని అప్పటికే పని చేస్తున్న వారి ద్వారానే, ఆ స్థానంలో మరో నేపాలీని పనిలో పెట్టిస్తున్నాడు. ఆపై తన ముఠాతో రంగంలోకి దిగి ఆ ఇంటిని కొల్లగొట్టిస్తున్నాడు. ముంబైకి చెందిన వ్యాపారి ఇంట్లో ఇదే పంథాలో ఐదు కేజీల బంగారం తస్కరించారు. గత నెల్లో కాచిగూడలోనూ ఇలానే భారీ చోరీకి పాల్పడ్డారు. ఇక్కడ ఇంట్లో ఉన్న ఇద్దరు వృద్ధులకు మత్తు మందు ఇచ్చి తమ పని కానిచ్చారు.

వైశాలీ నగర్‌లోనూ ..

జైపూర్‌లోని వైశాలీనగర్‌లో ఉన్న సందీప్ చౌదరి ఇంట్లోనూ ఇదే పంథాలో నేరం జరిగింది. ఈ ఇంట్లో పని చేసే మహిళతో పాటు ఓ పురుషుడు అదను కోసం ఎదురు చూశారు. సందీప్ జైపూర్‌లో లేని విషయం గమనించి మరో ఇద్దరికి సమాచారం ఇచ్చారు. ఆయన కుటుంబీకులతో మత్తు మందు కలిపిన టీ తాగించారు. అంతా అపస్మారక స్థితిలో ఉండగా ఆ ఇద్దరితో పాటు మరొకరినీ రప్పించిన ఈ ద్వయం ఇంట్లో ఉన్న నగదు, బంగారం, వెండి, వజ్రాభరణాలతో సహా రూ.6 కోట్ల విలువైన సొత్తుతో ఉడాయించారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన ప్రత్యేక బృందం భరత్ బిస్త్, హరి బహదూర్ దామిలను అరెస్టు చేశారు. మిగిలిన ముగ్గురి ఆచూకీ కోసం ఆరా తీస్తున్నారు. నిందితుల విచారణలో సరైన వివరాలు రాకపోవడంతో ఈ పంథాలో జరిగిన నేరాల వివరాలు ఆరా తీశారు. ఈ నేపథ్యంలోనే కాచిగూడ చోరీ వారి దృష్టికి వెళ్లింది. ఇక్కడా, అక్కడా ఒకేలా నేరం జరగడంతో జైపూర్ చోరీ వెనుకా లోకేంద్ర బహదూర్ షాహి పాత్రను అనుమానిస్తున్నారు. దర్యాప్తు కోసం వివరాలు కోరుతూ నగర పోలీసులను సంప్రదిస్తున్నారు.



ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ

వేదిక కానున్న ఉర్దూ విశ్వవిద్యాలయం

రాయదుర్గం : మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఎన్‌సీసీ విభాగం, తెలంగాణ ఆర్టిలరీ బ్యాటరీ ఎన్‌సీసీ యూనిట్ హైదరాబాద్ గ్రూప్ ఆధ్వర్యంలో పది రోజులపాటు ప్రత్యేక ఇన్‌టెన్సివ్ శిక్షణా శిబిరం నిర్వహిస్తారు. మే 26 నుంచి జూన్ 4వ తేదీ వరకూ ఇది కొనసాగుతుంది. క్యాంప్ కమాండెంట్ కల్నల్ రవీంద్రరావు పర్యవేక్షణలో నిర్వహించేందుకు పూర్తి ఏర్పాట్లు చేశారు. వివిధ విద్యాసంస్థల నుంచి సుమారు 600 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, బాలురు, బాలికలు ఈ శిబిరంలో పాల్గొంటారు. వీరికి పది మంది ఆర్మీ పీ1 సిబ్బంది, పది మంది అసోసియేట్ ఎన్‌సీసీ అధికారుల (ఏఎన్ఓలు) బృందం మార్గనిర్దేశం చేయనున్నారు. ఈ శిబిరం ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ పద్మశ్రీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ పర్యవేక్షణలో సాగుతుంది. క్యాడెట్లకు వసతి, మెస్, నీరు, వైద్య సహాయం, ఇతర అన్ని సౌకర్యాలు కల్పిస్తారు. ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం కేవలం సైనిక శిక్షణకు వేదిక మాత్రమే కాదు, యువత సాధికారత ద్వారా దేశ నిర్మాణం వైపు అడుగు వేసేలా ప్రోత్సహిస్తుందని నిర్వాహకులు తెలిపారు.

ఒక్క రోజులో 108 కార్ల డెలివరీ



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని వరుణ్ మోటర్స్ ఎరేనా షోరూం ఒక్క రోజులో 108 మారుతి సుజుకీ కంపెనీకి చెందిన 'ది ఎపిక్ న్యూ స్విఫ్ట్' కార్లను డెలివరీ చేసింది. ఈ మేరకు శుక్రవారం సంస్థ ప్రతినిధులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జెడ్ సిరీస్ ఇంజన్‌తో కూడిన ఈ కార్ల ఏడాదిలో 1.8 లక్షలు అమ్ముడైనట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో మారుతి సుజుకి, వరుణ్ మోటర్స్ 'మాస్ డెలివరీ ఆఫ్ న్యూ ఎపిక్ స్విఫ్ట్' ఉత్సవాన్ని జరుపుకున్నాయి. ఇదే రోజులో తెలుగు రాష్ట్రాల్లో 555 కార్లను డెలివరీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

అద్దెకు వచ్చి ఆక్రమించి!

జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మ గుడి సమీపంలో...

- నాలాతో పాటు రహదారి సైతం కబ్జా
- కోర్టు ఆదేశాల మేరకు తొలగించిన హైడ్రా
- రూ.200 కోట్ల విలువైన పార్కుకు దారి



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డు నం.41 పెద్దమ్మ గుడి సమీపంలోని ఇంటిని అద్దెకు తీసుకున్న ఓ వ్యక్తి దాని పక్కన ఉన్న రోడ్డుతో పాటు నాలాను కబ్జా చేశాడు. ఫలితంగా దాని వెనుకే ఉన్న పార్కుకు దారి లేకుండాపోయింది. దీనిపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీకి (హైడ్రా) ఫిర్యాదులు అందాయి. వీటి కూల్చివేతకు న్యాయస్థానం సైతం అనుమతించడంతో శుక్రవారం తొలగించారు. ఫలితంగా రెండు ఎకరాల పార్కుకు దారి ఏర్పడి దాదాపు రూ.200 కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తిని కాపాడామని హైడ్రా ప్రకటించింది.

ఇంట్లో కిరాయికి దిగి.....

రోడ్డు నం.41లో అవసరాల శ్రీనివాస్ రుక్మాందగ రావుకు వెయ్యి గజాల స్థలం ఉంది. ఇందులో 200 గజాల మేర ఇంటిని నిర్మించి క్రోతుపల్లి శ్రీనివాస్ అద్దెకు ఇచ్చారు. ఈ ఇంటి పక్కనే 30 అడుగుల వెడల్పు రోడ్డు ఉంది. ఈ మార్గంలో వెళ్తే వెనుక ఉన్న రెండు ఎకరాల పార్కుకు చేరుకోగలం. కిరాయికి దిగిన శ్రీనివాస్ ఆ దారిని సగానికి పైగా ఆక్రమించి పార్కునకు దారి లేకుండా చేశాడు. దీని పక్కనే ఉన్న బాక్సు టైపు నాలా కూడా కబ్జా చేశాడు. అక్కడ ఓ హాస్టల్, వెనుక వైపు కారు షెడ్డు నిర్మించి అద్దెకు ఇచ్చాడు. ఇలా 907 గజాల మేర ఆక్రమించి అద్దె రూపంలో నెలకు రూ.10 లక్షల వరకు ఆర్జిస్తున్నాడు. ఈ విషయాలన్నీ ఇంటి యజమాని ప్రమేయం లేకుండానే జరిగిపోయాయి.

న్యాయస్థానం సైతం తప్పుపట్టింది...

దీనిపై ఫిర్యాదు అందటంతో హైడ్రా అధికారులు రంగంలోకి దిగారు. ఆ స్థలాన్ని ఖాళీ చేయాలని క్రోతుపల్లి శ్రీనివాస్‌కు నోటీసులు జారీ చేసింది. దీంతో హైకోర్టును ఆశ్రయించిన ఆక్రమణదారుడు నోటీసులను సవాల్ చేశారు. విచారణ నేపథ్యంలో రోడ్డు, నాలాలను ఎలా ఆక్రమిస్తారని, అక్కడ నిర్మాణాలు ఎలా చేపడతారని ప్రశ్నించింది. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడాన్నీ తప్పుపట్టింది. ఈ విషయంలో ఏమైనా అభ్యంతరాలు ఉన్నాయా? అంటూ ఇంటి ఓనర్‌ను అడిగింది. ఆయన తనకు ఎలాంటి అభ్యంతరాలు లేవని చెప్పడంతో ఆక్రమణల తొలగింపునకు అనుమతిచ్చింది. దీంతో శుక్రవారం రంగంలోకి దిగిన హైడ్రా అక్కడ నిర్మించిన హాస్టల్ భవనాన్ని, కారు మెకానిక్ షెడ్డును తొలగించింది.

పార్కునకు రూట్ క్లియర్...

ఈ ఆక్రమణలు తొలగించడంతో వెనుక ఉండిపోయిన రూ.200 కోట్ల విలువైన రెండు ఎకరాల పార్కునకు దారి ఏర్పడింది. ఆ పార్కును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్ణయించారు. దారితెన్ను లేకుండా పోయిన ఆ పార్కు అందరికీ అందుబాటులోకి వస్తే స్థానికులకు ఆహ్లాదంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు ప్రాణవాయువు అందుతుందని హైడ్రా అధికారులు చెబుతున్నారు. హైడ్రా చర్యలతో ఈ పార్కుకు దారి లభించడంతో స్థానికులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కూల్చివేతలకు ముందు జూబ్లీహిల్స్ సొసైటీ ప్రతినిధులు, అక్కడి నివాసితులు ఇచ్చిన ఫిర్యాదుపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ క్షేత్ర స్థాయి విచారణ చేపట్టారు. అక్కడ ఉన్న అంశాలతో పాటు రికార్డులను పరిగణలోకి తీసుకుని కబ్జాను నిర్ధారించారు.

కంచ పర్వతాపూర్‌లో సహపంక్తి భోజనాలు...

ఇదిలా ఉండగా... హైడ్రా అధికారులు గురువారం పీర్జాదిగూడలోని కంచె పర్వతాపూర్‌లో ఆక్రమణకు గురైన శ్మశానవాటికను కాపాడింది. అక్కడ ఉన్న అక్రమ కట్టడాలను కూల్చేసింది. దీనిపై హర్షం వ్యక్తం చేస్తూ స్థానికులు శుక్రవారం ఆ ప్రాంతంలో సహపంక్తి భోజనాలు చేశారు. హైడ్రాతో పాటు ప్రభుత్వానికీ కృతజ్ఞతలు చెప్తూ టపాసులు పేలుస్తూ హర్షం వ్యక్తం చేశారు. సీఎం ఎ.రేవంత్‌రెడ్డితో పాటు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ శ్మశానం పరిరక్షణకు ఏడేళ్లుగా ధర్నాలు చేశామని, అధికారుల చుట్టూ తిరిగామని పరిరక్షణ కమిటీ ప్రతినిధులు తెలిపారు. హైడ్రాకు ఫిర్యాదు చేసిన 24 గంటల్లోనే సమస్య పరిష్కారమైందని కొనియాడారు.

289 మంది పోకిరీలకు కౌన్సెలింగ్



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో యువతులు, మహిళల్ని వేధిస్తూ ఈ ఏడాది జనవరి–ఏప్రిల్ మధ్య షీ–టీమ్స్‌కు చిక్కిన 289 మంది పోకిరీలకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. బషీర్‌బాగ్‌లోని ఓల్డ్ కమిషనరేట్‌లో స్వచ్ఛంద సంస్థలతో కలిసి డీసీపీ డాక్టర్ ఎన్‌జేపీ లావణ్య ఈ కార్యక్రమం నిర్వహించారు. కౌన్సెలింగ్‌కు హాజరైన వారిలో 271 మంది మేజర్లు, 18 మంది మైనర్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ తరహా వేధింపులపై 100కు కాల్ చేసి లేదా 9490616555కు వాట్సాప్ ద్వారా సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

సమన్వయంతోనే ప్రమాదాల నియంత్రణ

అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి



సాక్షి,సిటీబ్యూరో: అగ్ని ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో విద్యుత్, టౌన్‌ప్లానింగ్, హైడ్రా, ఫైర్‌సేఫ్టీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుల్జార్‌హౌస్ తదితర అగ్నిప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా విభాగాలు ప్రజలకు తగిన సూచనలివ్వాలన్నారు. ముఖ్యంగా జీహెచ్‌ఎంసీ పరిధిలో వ్యాపార సముదాయాల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా నిరోధించే చర్యలపై అవగాహన కల్పించడంతో పాటు వాటిని పాటించని యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. హెరిటేజ్ భవనాలతో సహా అన్ని భవనాల్లోనూ షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఎలాంటి పరికరాలు వాడాలో విద్యుత్ అధికారులు ఎలక్ట్రిక్ పనులు చేసేవారికి, ఎలక్ట్రిక్ షాపులు నిర్వహించే వారికి దశలవారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డిస్కమ్ సీఈకి సూచించారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు, ట్రేడ్ లైసెన్స్ జారీ చేసే అధికారులు ఫైర్‌సేఫ్టీ మెజర్స్ తప్పనిసరిగా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నెలలో ఒకరోజు ఫైర్ సేఫ్టీపై అవగాహనకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ మాట్లాడుతూ, శిథిలావస్థలో ఉన్న భవనాలను సర్వే చేయనున్నట్లు చెప్పారు. వ్యాపార భవనాల్లో ఫైర్‌సేఫ్టీకి సంబంధించి పకడ్బందీ చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ, ప్రమాదాలు జరిగినప్పుడు ఫైర్, పోలీస్ శాఖలకు మాత్రమే సమాచారం వెళ్తుందని , రెవెన్యూ సంబంధిత శాఖలకు కూడా సమాచారం ఇవ్వాలన్నారు. తద్వారా జిల్లా యంత్రాంగం తరఫున అంబులెన్స్, ఆసుపత్రిలో చికిత్స సదుపాయాలు, డాక్టర్లు, బెడ్స్ సిద్ధం చేయడం వంటి చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. 15 మీటర్ల లోపు ఉన్న హాస్పిటల్స్, షాపింగ్ మాల్స్, ఆఫీస్ బిల్డింగ్స్,లాడ్జింగ్, హోటల్, బిజినెస్ మాల్స్, స్టోరేజీ బిల్డింగ్‌లు తప్పనిసరిగా ఫైర్ సేఫ్టీ చర్యలు తీసుకోవాలన్నారు. తప్పని సరిగా స్మోక్ డిటెక్టర్ తో పాటు అలారం కూడా ఉండాలని, ప్రజలు కూడా వీటిని గమనించాలన్నారు.

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ కృష్ణా ఎదురుగా ఉన్న లేబుల్స్ ది పాప్ అప్ స్పేస్‌లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8.30గంటల వరకు హెరిటేజ్ వీవర్స్ ఆధ్వర్యంలో బిగ్ పటోలా శారీస్ సేల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది. నేటితో ముగియనున్న ఈ ఎగ్జిబిషన్‌లో 50 శాతం రాయితీ అందిస్తున్నారు.
- మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6.30గంటల వరకు ఇండోమచ్ పేరిట బీ2బీ ఇండస్ట్రియల్ మెషినరీ, ఇంజనీరింగ్ ఎక్స్‌పో అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని నోవాటెల్ హోటల్‌లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 8 గంటలకు హై లైఫ్ ఎగ్జిబిషన్ జరుగుతుంది.
- మిస్ వరల్డ్ ప్రారంభ వేడుకల్లో భాగంగా గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జానపద కళాకారుల ప్రదర్శన జరుగుతుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది .
- మాదాపూర్‌లోని శిల్పారామంలో వేసవి సెలవుల సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో 7 విజన్స్ పేరిట చిత్ర ప్రదర్శన ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

జీహెచ్‌ఎంసీలో దొంగలు ?

సాక్షి,సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో దొంగల బెడద ఎక్కువైంది. కంట్రోల్‌రూమ్‌లో విధులు నిర్వహించే ఓ ఉద్యోగి తన బైక్ బాక్స్‌కు తాళం వేయడం మరచిపోవడంతో అందులో ఉన్న రూ.21వేలు మాయమయ్యాయి. సీసీ టీవీల ఫుటేజీలను పరిశీలించి కాపు కాసిన ఉద్యోగులు శుక్రవారం వాటిని దొంగిలించిన వ్యక్తిని పట్టుకున్నారు. అయితే అంతలోనే అతను స్పృహ తప్పడంతో 108లో ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా గతంలో ఓ వ్యక్తి జీహెచ్‌ఎంసీ కార్యాలయ ఆవరణలోని ఏటీఎం నుంచి నగదు తీసుకుని వెళ్తుండగా, వెనుక నుంచి కొందరు వెంబడించినట్లు సమాచారం. పార్కింగ్ ప్రదేశంలో ఉంచిన అధికారులు, ఇతరుల కార్లలో సైతం దొంగతనాలు జరిగినట్లు ప్రచారం జరుగుతున్నా ఇప్పటి వరకు ఎవరూ వాటిని ధృవీకరించలేదు.

ఒకే ఆస్పత్రి నుంచి 65 బర్త్, 8 డెత్ నకిలీ సర్టిఫికెట్లు

గుర్తించిన జీహెచ్‌ఎంసీ ● సర్టిఫికెట్ల రద్దు ● క్రిమినల్ కేసు నమోదుకు చర్యలు

సాక్షి,సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీలో బర్త్, డెత్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్న వారిపై అధికారులు చర్యలకు ఉపక్రమించారు. నగరంలో విచ్చలవిడిగా నకిలీ బర్త్, డెత్ సర్టిఫికెట్లు జారీ అవుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ అధికారులు చేపట్టిన తనిఖీల్లో ఎన్నో విషయాలు వెలుగుచూస్తున్నాయి. టోలిచౌకీలోని మెట్రో హాస్పిటల్ నుంచి ఇలాంటి సర్టిఫికెట్లు జారీ అవుతున్నట్లు పోలీసుశాఖ సహకారంతో గుర్తించిన జీహెచ్‌ఎంసీ అధికారులు పూర్తిస్థాయి విచారణలో 65 నకిలీ బర్త్ సర్టిఫికెట్లు 8 నకిలీ డెత్ సర్టిఫికెట్లను గుర్తించి వాటిని రద్దు చేశారు. సదరు హాస్పిటల్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయడంతో పాటు హాస్పిటల్ రిజిస్ట్రేషన్, సంబంధిత డాక్టర్ల మెడికల్ రిజిస్ట్రేషన్లు కూడా రద్దు చేసేందుకు సంబంధిత శాఖల ద్వారా చట్టప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు జీహెచ్‌ఎంసీ పేర్కొంది.

ఇంటి వద్ద పుట్టుక పేరుతో..
అంతే కాకుండా, ఆస్పత్రిలో కాకుండా ఇళ్ల వద్ద జననాలు జరిగాయంటూ నకిలీ ధ్రువీకరణలతో బర్త్ సర్టిఫికెట్లు జారీ చేసిన వారిపై చర్యలు తీసుకున్నారు. సుమోటోగా విచారణ చేపట్టిన సంబంధిత అధికారులు ఇళ్ల వద్ద జననాలు జరగనప్పటికీ, ఇళ్ల వద్దే జరిగినట్లు తప్పుడు సమాచారం, పత్రాలతో బర్త్ సర్టిఫికెట్లు పొందిన నాలుగు బర్త్ సర్టిఫికెట్లు రద్దు చేయడంతో పాటు సంబంధిత రిజిస్ట్రార్లపై అభియోగాలు నమోదు చేశారు. వీటిల్లో మూడు ఫలక్ నుమా సర్కిల్‌లో జారీ కాగా, ఒకటి మలక్‌పేట సర్కిల్ నుంచి జారీ అయినట్లు గుర్తించారు. సంబంధిత హెల్త్ అసిస్టెంట్లను విధుల నుంచి తొలగించారు. అంతేకాకుండా తప్పుడు సమాచారమిచ్చిన తల్లిదండ్రులు, ఇరుగు పొరుగువారు, అడ్వకేట్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సిందిగా సంబంధిత రిజిస్ట్రార్లకు సూచించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఇటీవలి కాలంలో 74 జననాలు ఇళ్లవద్దే జరిగినట్లు దృష్టికి రావడంతో గత జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ఆదేశాల మేరకు సీఎంఓహెచ్ ర్యాండమ్‌గా జరిపిన పరిశీలనలో 38 జననాలు అనాథపిల్లల శిశువిహార్‌లో రిజిస్టర్ అయినట్లు గుర్తించారు.

గోల్డ్ బార్ చాలెంజ్‌లో హెబ్బా



నగరంలోని శరత్ సిటీ మాల్ వేదికగా ఏర్పాటు చేసిన 'గోల్డ్ అండ్ సిల్వర్ బార్ చాలెంజ్'లో ప్రముఖ సినీనటి హెబ్బా పటేల్ సందడి చేశారు. వింధ్య గోల్డ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేతలకు బంగారు, వెండి నాణేలు అందజేశారు. – సాక్షి, సిటీబ్యూరో

హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు

నిర్వహించిన స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలు

- నిబంధనల ఉల్లంఘనల గుర్తింపు
- రూ. 2,45,500 పెనాల్టీ విధింపు 30 హాస్టళ్లకు నోటీసులు..
- కొన్నింటి మూసివేత



సాక్షి,సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలోని పలు హాస్టళ్లపై ఫుడ్‌సేఫ్టీ, టౌన్‌ప్లానింగ్, హెల్త్, తదితర విభాగాల అధికారులతో ఏర్పాటైన స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. నగరంలోని పలు హాస్టళ్లు నిబంధనలు ఉల్లంఘించడంతో పాటు కనీస పరిశుభ్రత పాటించకపోవడంతో హాస్టళ్లలో ఉంటున్న వర్కింగ్ మెన్, ఉమెన్, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. పార్కింగ్ సెల్లార్లను ఇతర అవసరాలకు వినియోగించడం, భారీ హోర్డింగులతో వ్యాపారం చేయడం, ఇరుకు గదుల్లో ఎక్కువ మందిని కుక్కడం, తగినన్ని మరుగుదొడ్లు లేకపోవడం, కనీస ఫైర్‌సేఫ్టీ లేకపోవడం, శుభ్రత, నాణ్యత లేని ఆహారం సరఫరా ,ఇతరత్రా లోపాలు కోకొల్లలు. పలుమార్లు హెచ్చరించినా యాజమాన్యాల్లో మార్పు రావడం లేదు.ఈ నేపథ్యంలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలు పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్, అమీర్‌పేట ప్రాంతాల్లోని 58 హాస్టళ్లలో తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకున్నాయి.

- అశోక్‌నగర్ ప్రాంతంలో 20 హాస్టళ్లలో తనిఖీలు నిర్వహించి ఫుడ్‌లైసెన్సు లేకుండా, అపరిశుభ్రతతో ఆహారం తయారు చేస్తున్న రెండింటిని మూసివేశారు. ట్రేడ్ లైసెన్సులు లేకుండా నిర్వహిస్తున్న ఎనిమిదింటికి నోటీసులు జారీ చేశారు. 9 హాస్టళ్లకు రూ.37,500 పెనాల్టీ విధించారు.
- దిల్‌సుఖ్ నగర్‌లో 23 హాస్టళ్లను తనిఖీ చేసి ఫుడ్‌సేఫ్టీ లైసెన్సులేని రెండింటిని మూసివేశారు. ఏడింటికి నోటీసులు జారీ చేశారు. ట్రేడ్‌లైసెన్సులు లేని 11 హాస్టళ్లకు రూ.23వేల పెనాల్టీ విధించారు.
- అమీర్‌పేటలో 15 హాస్టళ్లను తనిఖీ చేసి దేనికీ ట్రే డ్ లైసెన్సు లేకపోవడాన్ని గుర్తించి నోటీసులు జారీ చేయడంతో పాటు రూ.1.85 లక్షల పెనాల్టీ విధించారు. ఫుడ్‌సేఫ్టీ లైసెన్సు లేని ఒక కిచెన్‌ను మూసివేశారు.

బాలికపై మారు తండ్రి లైంగిక దాడి

మేడ్చల్: ఓ మహిళను రెండో పెళ్లి చేసుకున్న వ్యక్తి ఆమె మొదటి సంతానమైన బాలికపై లైంగికదాడికి పాల్పడి గర్భవతిని చేసిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. మేడ్చల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్ మున్సిపాలిటీ, గిర్మాపూర్ కు చెందిన శ్రీకాంత్‌ముదిరాజ్ అదే గ్రామానికి చెందినప మహిళను రెండో పెళ్లి చేసుకున్నాడు. ఆమెకు ఓ కుమార్తె (13), ఇద్దరు కుమారుడు ఉన్నారు. సదరు బాలికపై కన్నేసిన శ్రీకాంత్ తల్లి ఇంట్లో లేని సమయంలో ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. దీంతో బాధితురాలు బాలిక భయపడి తల్లికి చెప్పలేదు. ఈనెల 21న బాలిక కడుపు నొప్పితో బాధపడుతుండటంతో తల్లి ఆమెను మేడ్చల్ లోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లింది. పరీక్షించిన వైద్యులు ఆమె గర్భం దాల్చినట్లుగా నిర్ధారించారు. దీంతో తల్లి ఆమెను నిలదీయగా అసలు విషయం చెప్పింది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు శ్రీకాంత్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పదోన్నతుల్లో అవకతవకలను సరిచేయడంపై హర్షం

హిమాయత్‌నగర్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గత పదేళ్లలో గిరిజన, దళిత వర్గాలకు సంబంధించిన బోధనేతర సిబ్బంది పదోన్నతుల విషయంలో రివర్షన్‌కు గురై మనోవేదనకు చెందిన గిరిజన, దళిత వర్గాలుగా సంబంధించిన సిబ్బందికి న్యాయం చేకూర్చిన ప్రస్తుత వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ అల్దాస్ జానయ్య, ప్రస్తుత రిజిస్ట్రార్ డాక్టర్ జి.ఇ.సి హెచ్ విద్యాసాగర్ లకు పీజేటీఏయూ, ఎస్సీ, ఎస్టీ టీచింగ్, నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ బి.బాలాజీ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. గతంలో జరిగిన అవకతవకల కారణంగా ఉన్నత పదవులు పొంది 2, 4 సంవత్సరాలు విధులు నిర్వహిస్తున్న వారికి అన్యాయంగా కింది స్థాయికి మార్చి మనోవేదనకు గురిచేశారని అన్నారు. ఈ తప్పిదాన్ని గుర్తించి నిబంధనలకు అనుగుణంగా సరి చేయడం పట్ల హర్షంవ్యక్తం చేశారు.

స్నాతకోత్సవానికి గవర్నర్‌కు ఆహ్వానం


గవర్నర్‌ను కలిసి ఘంటా చక్రపాణి

బంజారాహిల్స్: తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను శుక్రవారం అంబేడ్కర్ విశ్వవిద్యాలయ అధికారులు రాజ్‌భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి అభివృద్ధి పనులు, విశ్వవిద్యాలయ కార్యక్రమాలను వివరించారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలలో జరగనున్న విశ్వవిద్యాలయ స్నాతకోత్సవానికి అనుమతి కోరుతూ కార్యక్రమానికి హాజరు కావాలని గవర్నర్‌ను ఆహ్వానించారు. గవర్నర్‌ను కలిసిన వారిలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్.విజయకృష్ణారెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి బోజు శ్రీనివాస్, ప్రజా సంబంధాల అధికారి వేణుగోపాల్‌రెడ్డి ఉన్నారు.

సైనిక్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు

పంజగుట్ట: తెలంగాణలో సైనిక్ స్కూల్స్ ఏర్పాటు చెయ్యాలని, ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న సైనిక్ స్కూల్స్‌లో తెలంగాణ విద్యార్థులకు స్థానికత కల్పించాలని కోరుతూ సైనిక్ స్కూల్ అర్హత పరీక్షలు రాసిన విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే సంవత్సరం లోపు తెలంగాణలో ష్టంలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేసేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా క్రాంతి కీన్ ఫౌండేషన్‌లో చదువుతున్న 50 మంది విద్యార్థులు సైనిక్ స్కూల్ అర్హత పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడంతో వారిని అభినందించారు.

తెరుచుకోని గుడ్‌విల్ స్టోర్లు


సోమాజిగూడ పార్క్ హోటల్ చౌరస్తాలో తాళం వేసిన గుడ్‌విల్ స్టోర్

బంజారాహిల్స్: మనకు అక్కర్లేని వస్తువులను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా ఓ చోట పెడితే ఎవరికైనా అవి అవసరమైతే వాటిని తీసుకునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన గుడ్‌విల్ స్టోర్లకు సరైన నిర్వహణ లేక మూతపడుతున్నాయి. ఖైరతాబాద్ సర్కిల్–17 పరిధిలోని సోమాజిగూడ పార్క్ హోటల్ మలుపు వద్ద ఏర్పాటు చేసిన గుడ్‌విల్ స్టోర్ ఎప్పుడు చూసినా తాళం వేసి ఉంటుంది. ఉన్నతాధికారులు స్పందించి గుడ్‌విల్ స్టోర్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

కార్మికులకు అండగా బీజేఎమ్‌సీ


నియామక పత్రం అందుకుంటున్న నాగార్జున

పంజగుట్ట: కార్మికులకు ఎలాంటి కష్టం వచ్చినా భారతీయ జనతా మజ్దూర్ సెల్ (బీజేఎమ్‌సీ) ముందుంటుందని జాతీయ అధ్యక్షుడు అర్జబ్ చటర్జీ అన్నారు. భారతీయ జనతా పార్టీకి అనుబంధంగా పనిచేసే కార్మిక విభాగం బీజేఎమ్‌సీ రాష్ట్ర అధ్యక్షుడిగా శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో డాక్టర్ నాగార్జున ఎస్.వి.వి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా భాగ్యలక్ష్మిను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అర్జబ్ చటర్జీ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అసంఘటిత కార్మికుల కోసం ఎన్నో పథకాలు రూపొందించిందని కాని రాష్ట్ర ప్రభుత్వం వాటిని అమలు చెయ్యడం లేదని ఆరోపించారు. నాగార్జున మాట్లాడుతూ.. రైతులు, నిర్మాణరంగ కార్మికులు, చిన్న కార్మికులు, మహిళా కార్మికులు దేశాన్ని నిర్మించేది వీరే అని కానీ.. వీరు దుర్భర పరిస్థితి ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో దీపక్ శర్మ, ఎస్.ప్రశాంత్ కుమార్, షేక్ ఖలీఫతుల్లా భాషా పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక కార్యాచరణ

● ఒకే రోజు వార్డు మొత్తం ఫాగింగ్ చేసేలా ప్రణాళిక ● ఖైరతాబాద్ జోన్ పరిధిలో అమలు


అధికారులతో చర్చిస్తున్న కమిషనర్ అనురాగ్ జయంతి

బంజారాహిల్స్: వర్షాకాలం నేపథ్యంలో దోమల విజృంభణకు అడ్డుకట్ట వేయడానికి చేపట్టాల్సిన చర్యలపై ఫాగింగ్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసే దిశలో వర్షాకాల కార్యాచరణ ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి సూచించారు. ఫాగింగ్ విషయంలో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని, దోమల నియంత్రణపై కట్టుబడి ఉండాలని కోరారు. శుక్రవారం ఖైరతాబాద్‌లోని జోనల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశంలో ఖైరతాబాద్ సర్కిల్ డీసీ రజనీకాంత్‌రెడ్డి, జూబ్లీహిల్స్ సర్కిల్ డీసీ సమ్మయ్య, జోనల్ సీనియర్ ఎంటమాలజిస్ట్ గంగప్ప, అసిస్టెంట్ ఎంటామాలజిస్టులు భాస్కర్, రజిత, తిరుపతయ్య, నూరుల్లాఖాన్‌తో పాటు ఆయా సర్కిళ్ల అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు హాజరయ్యారు.

ప్రణాళికాబద్ధంగా ఫాగింగ్..

ప్రస్తుతం ఎంటమాలజీ సిబ్బంది వార్డు పరిధిలోని ఒక కాలనీలో ఫాగింగ్ చేపట్టిన తర్వాత మళ్లీ ఆ కాలనీకి వెళ్లడానికి 10–15 రోజుల సమయం పడుతుందని, దీని వల్ల దోమలు వృద్ధి చెందడంతో పాటు అరికట్టడంలో సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. ఈ సమస్య పరిష్కారం కావాలంటే ప్రయోగాత్మకంగా జోనల్ పరిధిలో ఒక వార్డులో ఆ సర్కిల్ పరిధిలో ఉన్న మొత్తం ఎంటమాలజీ సిబ్బంది, ఫాగింగ్ మిషన్లు ఒకే రోజు ఫాగింగ్ చేపడితే ఆ వార్డు ప్రజలందరికీ ఫాగింగ్ చేసిన విషయం తెలుస్తుందని జోనల్ కమిషనర్ పేర్కొన్నారు. ఒక సర్కిల్‌లో నాలుగు వార్డులు ఉంటే ఒక రోజు ఒక వార్డులో మొత్తం సర్కిల్ పరిధిలోని సిబ్బంది ఫాగింగ్ చేయడం ద్వారా 5వ రోజు మళ్లీ అదే వార్డులో ఫాగింగ్ చేయడానికి అవకాశం ఉంటుందని, దీని వల్ల వెంటవెంటనే ఫాగింగ్ జరుగుతుందని, దోమల వృద్ధి కూడా జరగదన్నారు.

8 ఫాగింగ్ మిషన్లు, 60 మంది సిబ్బంది..

ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలో పోర్టబుల్ ఫాగింగ్ మిషన్లు 8 ఉండగా, వెహికల్ మౌంటెడ్ ఫాగింగ్ మిషన్లు రెండు ఉన్నాయి. 60 మంది ఎంటమాలజీ సిబ్బంది పని చేస్తున్నారు. ఇంకోవైపు ఎంటమాలజీ సిబ్బంది కూడా తప్పించుకోవడానికి వీల్లేకుండా తూతూమంత్రంగా పని చేయకుండా డీసీల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఏ డివిజన్‌లో ఏ రోజు ఫాగింగ్ చేస్తారో ఆ షెడ్యూల్‌ను రూపొందించుకోవాలన్నారు. ఒక రోజు ముందే ఆ డివిజన్ ప్రజలకు ఈ సమాచారం చేర వేయడం ద్వారా అప్రమత్తంగా ఉండడం జరుగుతుందని పేర్కొన్నారు. దోమల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించవద్దని తెలిపారు. వర్షాకాలంలో అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందని, దోమలతోనే వ్యాధులు విజృంభిస్తాయని, వీటిని అరికడితేనే ఆరోగ్యకరమైన వాతావరణం వస్తుందన్నారు. ఈ సందర్భంగా డీసీల నుంచి కూడా సలహాలు, సూచనలు స్వీకరించారు. ఎంటమాలజీ సిబ్బంది సైతం ఫాగింగ్ చేపట్టే విధానంపై అధికారులకు తమ సమస్యలను చెప్పుకున్నారు.

వాడవాడలా తిరంగా యాత్ర


తిరంగా యాత్ర నిర్వహిస్తున్న బీజేపీ నాయకుల

ఖైరతాబాద్: ఆపరేషన్ సిందూర్ విజయోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం ఖైరతాబాద్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగా యాత్రకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ విజయంతో భారత సైన్యం మరోసారి తన వ్యూహాత్మక నైపుణ్యం, ధైర్యసాహసాలను ప్రపంచానికి చాటి చెప్పిందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో మన జవాన్లు దేశ భద్రత కోసం ఎప్పుడూ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఇది ప్రతి భారతీయుడికి గర్వకారణమన్నారు. ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. తిరంగా ర్యాలీ ద్వారా మన దేశ భద్రతను కాపాడుతున్న సైనికులకు కృతజ్ఞతగా మనం ఏకమవుతున్నాం, జవాన్ల త్యాగాన్ని గుర్తించి, దేశభక్తిని పెంపొందించుకోవాలనే ఉద్దేశంతో ఈ యాత్రను చేపట్టామన్నారు.

బంజారాహిల్స్‌లో..

బంజారాహిల్స్: ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో పాటు దేశ సైనికులకు మద్దతుగా బీజేపీ నేతలు వాడవాడలా తిరంగా యాత్ర నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం సోమాజిగూడ డివిజన్‌లోని బీఎస్ మక్తాలో నిర్వహించిన తిరంగా యాత్రను సెంట్రల్ డిస్ట్రిక్ట్ స్పోక్స్‌పర్సన్ శ్రవణ్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జాతీయ జెండాలు చేతబూని భారత్ మాతాకి జై అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో సూర్యవినాయక్ ముదిరాజ్, కృష్ణారెడ్డి, వేణు, స్వరాజ్, గోపి, రాహుల్ పాల్గొన్నారు.



తిరంగా యాత్రలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

స్ఫూర్తిని కలిగించిన 'సీఎం ప్రజావాణి'


సీఎం ప్రజావాణిని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్ అధికారులతో చిన్నారెడ్డి, దివ్య దేవరాజన్

లక్డీకాపూల్: సీఎం ప్రజావాణి తమకు ఎంతో స్ఫూర్తిని కలిగించిందని ట్రైనీ ఐఏఎస్ అధికారులు ప్రణయ్ కుమార్, సాలోని చాబ్ర తెలిపారు. భవిష్యత్‌లో ప్రజా సమస్యల పరిష్కారంలో తమకు ఇక్కడి అనుభవాలు చాలా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్లో శుక్రవారం జరిగిన 'సీఎం ప్రజావాణి'ని శిక్షణ పొందుతున్న తెలంగాణ రాష్ట్ర క్యాడర్ ఐఏఎస్ అధికారుల బృందం సందర్శించింది. సీఎం ప్రజావాణిలో అందజేసే వినతి పత్రాల దరఖాస్తులను హెల్ప్ డెస్క్ సిబ్బంది సహకారాన్ని ఇవ్వడం, డెస్క్ అధికారులు వాటిని స్వీకరించి ఆన్‌లైన్‌లో సంబంధిత శాఖలకు పంపించే విధానాన్ని అధ్యాయనం చేశారు. ప్రజావాణి ఇన్‌చార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి వారితో జరుపుతున్న సమన్వయ తీరును శిక్షణ పొందుతున్న ఐ.ఏ.ఎస్. అధికారులు పరిశీలించారు.

అడ్డగోలు తవ్వకాలతో అవస్థలు


అగ్రసేన్ చౌరస్తాలో కేబుల్ తవ్వకాలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లో ఇష్టానుసారంగా రోడ్డు తవ్వకాలు చేస్తుండడంతో వాహనదారులు నిత్యం నరకాన్ని అనుభవిస్తున్నారు. ముఖ్యంగా బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లో ఈ తవ్వకాలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డునెంబర్–12 అగ్రసేన్ చౌరస్తాలో శుక్రవారం ఉదయం నుంచి యాక్ట్ ఫైబర్ కేబుల్ కోసం రోడ్లను తవ్వేశారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోయింది. వీరికి అనుమతి ఉందా లేదా స్పష్టత లేదు. ఏ రోడ్డులో ఎక్కడ తవ్వకాలు చేపడుతున్నారో వాహనదారులను అప్రమత్తం చేసే సమాచారం ఉండడం లేదు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి వెంరెడ్డి ఎన్‌క్లేవ్ వరకు రోడ్డు పక్కన ఇటీవల కాలంలో తవ్వకాలు చేపట్టారు. ఈ గుంతలను మధ్యలోనే ఆపేశారు. దీంతో ఇక్కడ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని దుర్గాభవానీనగర్‌లోని ఎల్లమ్మ–మారెమ్మ ఆలయానికి చెందిన స్థలాన్ని కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డికి ఫిర్యాదు చేశారు. శుక్రవారం షేక్‌పేట మండల వీఆర్వో శ్రీనివాస్‌రెడ్డి సదరు ప్రాంతాన్ని పరిశీలించారు. ఆలయానికి చెందిన స్థలంలో ఇప్పటికే ఓ వ్యక్తి గదిని నిర్మించి అద్దెకు ఇచ్చాడని, ఆ డబ్బులను కూడా సొంత అవసరాలకు వాడుకుంటున్నాడని, గుడి అకౌంట్‌లో జమ చేయడం లేదని ఆరోపించారు. ఇటీవల మరో గది కోసం నిర్మాణాలు చేపట్టారని తెలియడంతో రెవెన్యూ సిబ్బంది వాటిని కూల్చివేశారు. దుర్గాభవానీనగర్, గౌతమ్‌నగర్, ఛత్రపతి శివాజీనగర్, దీన్‌దయాళ్‌నగర్ బస్తీలకు చెందిన ఈ అమ్మవారి ఆలయానికి చెందిన స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

కూరగాయల షెడ్ తొలగింపు



పంజగుట్ట: ఎర్రమంజిల్ కాలనీలో నిమ్స్‌కు కేటాయించిన స్థలంలో ఉన్న కూరగాయలు, పండ్లు అమ్ముకునే దుకాణాన్ని అధికారులు కూల్చేశారు. బంజారాహిల్స్ నుంచి ఎర్రమంజిల్ వచ్చే మార్గంలో ఎన్నో సంవత్సరాలుగా ఒక వ్యక్తి షెడ్ ఏర్పాటు చేసుకుని కూరగాయలు, పండ్లు అమ్ముతుంటాడు. ఈ స్థలం నిమ్స్ అభివృద్ధికి కేటాయించడంతో స్థలాన్ని ఖాళీ చెయ్యాలని గత కొంతకాలంగా నోటీసులు ఇచ్చినా స్పందన లేకపోవడంతో శుక్రవారం ఖైరతాబాద్ తహసీల్దార్ నయీముద్దీన్, ఆర్.ఐ రాజిరెడ్డి భారీ పోలీస్ బందోబస్తు మధ్య షెడ్‌ను తొలగింపజేశారు. కాగా సదరు రోడ్డు వెంబడి ఉన్న షాపులను అన్నింటినీ తొలగించి నిమ్స్ అభివృద్ధికి ఇస్తే కొంతమంది స్థానిక నాయకులు, నిమ్స్ వారితో కుమ్మక్కై ఆ స్థలంలో వాహనాలను అక్రమంగా పార్కింగ్ చేసుకునేందుకు కేటాయిస్తున్నారని స్థానికులు అంటున్నారు. ఒక్కో వాహనానికి ప్రతీ నెల రూ.2500 వసూలు చేస్తూ కొన్ని వందల అంబులెన్స్‌లు, ప్రైవేట్ బస్సులు నిలుపుకునేందుకు స్థలం కేటాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

బంజారాహిల్స్: వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాలకు మరింత పదును పెట్టేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు రాజ్‌భవన్ హైస్కూల్లో రెండు విడతలుగా జరిగాయి. హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న మ్యాథ్స్, సోషల్ ఉపాధ్యాయులు 400 మందికి ఈ నెల 13 నుంచి 17 వరకు, 19 నుంచి 23 వరకు రెండు విడతలుగా శిక్షణ ఇచ్చారు. శుక్రవారం ముగింపు కార్యక్రమంలో మ్యాథ్స్ డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్లు జనార్దన్, మల్లారెడ్డి, సత్యనారాయణ, ప్రభావతి, విష్ణుప్రియ, సోషల్ స్టడీస్ డీఆర్‌పీలు నరేష్, బాలాజీ, భాస్కర్ తదితరులు ఘనంగా సత్కరించారు. రెండు విడతల్లో జరిగిన ఈ శిక్షణలో ఒక్కో విడతలో 200 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం, కెపాసిటీ బిల్డింగ్, లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టం, న్యూ టెక్నిక్స్‌పై ఈ శిక్షణ ఇచ్చారు. శిక్షణ తీసుకున్న ఉపాధ్యాయులంతా ఈ విద్యా సంవత్సరం నుంచే తమ తమ పాఠశాలల్లో వీటిని అమలు చేయాల్సి ఉంటుంది.

బావపై బామ్మర్దుల దాడి

ఫిలింనగర్: భార్యాభర్తల నడుమ జరుగుతున్న గొడవల్లో తలదూర్చిన బామ్మర్దులు తమ బావను గదిలో వేసి చితకబాదిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. షేక్‌పేట సక్కుబాయినగర్‌లో నివసించే డి.సాయిమనీష్ (33) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. భార్య రోజంతా తల్లితో ముచ్చట్లు పెడుతుండడంతో పద్ధతి బాగోలేదంటూ హెచ్చరించాడు. ఈ విషయంలో ఇరువురి నడుమ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే సాయిమనీష్ బామ్మర్దులు ఎం.విశాల్, ఎం.రోహిత్‌తో పాటు మామ ఎం.శ్రీనివాస్ ముగ్గురూ కలిసి సాయిమనీష్ ఉంటున్న ఇంటికి వచ్చి సాయిమనీష్‌ను గదిలోకి తీసుకువెళ్లి తీవ్రంగా కొట్టారు. అడ్డువచ్చిన అతడి సోదరుడు కార్తీక్‌పై కూడా దాడి చేశారు. సీసీ కెమెరాలో నమోదైన దృశ్యాలతో బాధితుడు తన మామ, బామ్మర్దులపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కులం పేరుతో దూషించిందని ఫిర్యాదు

బంజారాహిల్స్: అకారణంగా తనను కులం పేరుతో దూషిస్తున్న హాస్టల్‌మేట్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఓ టీవీ ఛానల్‌లో న్యూస్ ప్రజెంటర్ జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–36లోని ఓ టీవీ ఛానల్‌లో పనిచేస్తున్న న్యూస్ ప్రజెంటర్ (21) సోమాజీగూడలోని శబరీష ఉమెన్స్ హాస్టల్‌లో మరో యువతి అలేఖ్యతో కలిసి ఉంటుంది. ఈ నెల 8న న్యూస్ ప్రజెంటర్, అలేఖ్యకు స్కార్ఫ్ విషయంలో గొడవ జరిగింది. స్కార్ఫ్‌ను దొంగిలించావంటూ అలేఖ్య అపార్థం చేసుకుని తరచూ న్యూస్ ప్రజెంటర్‌కు అసభ్యకరంగా మెసేజ్‌లు పెట్టసాగింది. రెండు రోజుల క్రితం కులం పేరుతో దూషించింది. అంతేకాక తన తల్లిదండ్రులతో కలిసి అలేఖ్య బాధితురాలు పనిచేస్తున్న టీవీ కార్యాలయానికి వచ్చి అసభ్యకరంగా దూషించడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అలేఖ్యతో పాటు ఆమె తల్లిదండ్రులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మాజీ ఆర్మీ అధికారికి సైబర్ మోసగాళ్ల టోకరా

బంజారాహిల్స్: విద్యుత్ బిల్లు చెల్లించలేదంటూ ఓ రిటైర్డ్ ఆర్మీ అధికారికి సైబర్ మోసగాళ్లు ఫోన్ చేసి రూ.44 వేలు కాజేసిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–10సీ లోని ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలో నివసించే గన్‌శ్యాం పాండే (82) అరిటైర్డ్ ఆర్మీ అధికారికి ఓ వ్యక్తి ఫోన్ చేసి మీ కరెంటు బిల్లు పెండింగ్‌లో ఉందని చెప్పాడు. అయితే తాను బిల్లు చెల్లించానని, ఎలాంటి బకాయిలు లేవని గన్‌శ్యాం తెలిపాడు. మీరు చెల్లించిన డబ్బులు అకౌంట్‌లో జమ కాలేదు..ఒకసారి చెక్ చేసుకోండి అంటూ రూ.10 ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఆ పిన్ నెంబర్ నొక్కిన ఆర్మీ అధికారికి మరో నిమిషంలోనే తన ఖాతాలో నుంచి రూ.44 వేలు బదిలీ కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పెళ్లి పేరుతో లైంగిక దాడి యువకుడి రిమాండ్

బంజారాహిల్స్: పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిని బంజారాహిల్స్ పోలీసులు చేసి రిమాండ్‌కు తరలించారు.లంగర్‌హౌస్‌కు చెందిన కార్తీక్ (34)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే బంజారాహిల్స్ రోడ్డునెంబర్–10లోని దూరపు బంధువైన బాలిక (17)తో తరచూ మాట్లాడుతూ మాయమాటలు చెప్పి పెళ్లి పేరుతో లొంగిదీసుకున్నాడు. తనకు పెళ్లి కాలేదని నమ్మించాడు. భార్య గర్భవతిగా ఉన్న సమయంలో కార్తీక్ సదరు బాలికతో చనువుగా ఉంటూ లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఇటీవల బాలిక కదలికలపై దృష్టిపెట్టిన తల్లి నిలదీయగా జరిగిన విషయం చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పూర్తిస్థాయిలో ఫాగింగ్ చేయాలి


కార్పొరేటర్‌ను కలిసిన ఎంటమాలజీ సిబ్బంది

ఫిలింనగర్: కాలనీలు, బస్తీల్లో పూర్తిస్థాయిలో ఫాగింగ్ చేయాలని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ సూచించారు. శుక్రవారం తనను కలిసిన జీహెచ్‌ఎంసీ ఫాగింగ్ సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. దోమల నివారణకు ప్రజలు కూడా చైతన్యవంతులై బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా ఇంటితో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలన్నారు.

పెండింగ్ పనులను ప్రారంభించాలి



వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ దేదీప్య

వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను పునఃప్రారంభించాలని కార్పొరేటర్ దేదీప్య విజయ్ శుక్రవారం సెంట్రల్ జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. వెంగళరావునగర్ కాలనీలోని అయ్యప్పగ్రౌండ్‌లో కమ్యూనిటీ హాల్ అసంపూర్తిగా ఉందని అదే విధంగా జవహర్‌నగర్‌లో కమ్యూనిటీహాల్ నిర్మిస్తామని అధికారులు చెప్పినా ఇంత వరకు ఎలాంటి పురోగతి లేదన్నారు. అనేక ఏరియాల్లో గార్బేజీ సమస్యలు ఉన్నాయని, గ్రీన్‌వేస్ట్, గతంలో ఉన్న ప్రాపర్టీ టాక్స్‌ను నిబంధనల ప్రకారం వసూలు చేయాలని, వానాకాలంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరగా త్వరలోనే డివిజన్‌లో పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు.

నిధుల మంజూరుకు వినతి



రహమత్‌నగర్: రహమత్‌నగర్ డివిజన్‌లోని పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేయాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ సహదేవరావును కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన జెడ్సీని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎన్‌రెడ్డి మాట్లాడుతూ.. క్వారీ మైదానంలో ఫ్లడ్‌లైట్ల ఏర్పాటుతో పాటు సీసీ రోడ్ల నిర్మాణం ఇతర పనులకు నిధులు మంజూరు చేయాలని కోరగా జెడ్సీ సానుకూలంగా స్పందించారని సీఎన్‌రెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

రహమత్‌నగర్ : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఆర్ఆర్ పురంలో నివాసముండే గణేష్(40) బ్యాండు కంపెనీలో పనిచేస్తుంటాడు. గురువారం సాయంత్రం డాన్‌బోస్కో స్కూల్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

దోమల నివారణకు స్పెషల్‌డ్రైవ్

జోనల్ కమిషనర్ రవి కిరణ్

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో దోమల నివారణకు స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ అన్నారు. శుక్రవారం రాత్రి బన్సీలాల్‌పేట్ డివిజన్ లో స్థానిక కార్పొరేటర్ కె. హేమలతతో కలిసి మాసివ్ ఫాగింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నివారణ కోసం మాసివ్ ఫాగింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జోనల్ పరిధిలోని ప్రతి డివిజన్‌లో పెద్ద ఎత్తున యంత్రాల సహాయంతో ఫాగింగ్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ ఆదేశాల మేరకు సికింద్రాబాద్ జోనల్ పరిధిలో ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఎంటమాలజిస్ట్ దుర్గాప్రసాద్, శ్రీనివాస్ రెడ్డిలతో పాటు స్థానిక నాయకులు లక్ష్మీపతి, ఫయూమ్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు. స్పెషల్‌డ్రైవ్ ఫాగింగ్ కార్యక్రమాన్ని డివిజన్‌లోని బీజేఆర్ నగర్, బండ మైసమ్మనగర్, న్యూబోయిగూడ, బోలక్‌పూర్, జయనగర్ కాలనీ, ఐడిహెచ్ కాలనీ, పద్మారావునగర్ తదితర ప్రాంతాల్లో నిర్వహించారు.

వరదనీరు నిల్వ ఉండకుండా చర్యలు

● చురుగ్గా నాలాల్లో పూడికతీత పనులు
● డిప్యూటీ కమిషనర్ డాకూ నాయక్

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో వరదనీటి నాలాలు, వరదనీటి కాల్వల్లో పూడికతీత పనులు చురుగ్గా సాగుతున్నాయని జీహెచ్‌ఎంసీ బేగంపేట్ డిప్యూటీ కమిషనర్ డాకూ నాయక్ పేర్కొన్నారు. తన కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. వర్షాకాలంలో వరదనీరు నిల్వకుండా పూడికతీత పనులు ప్రతి యేటా జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తుంటారన్నారు. ఈ సంవత్సరం కూడా బేగంపేట సర్కిల్ పరిధిలో పెద్ద ఎత్తున పనులు సాగుతున్నాయని తెలియజేశారు. ముఖ్యంగా వరదనీరు నిలిచే ప్రాంతాలను ముందే గుర్తించి ఆయా ప్రాంతాల్లో వరదనీరు సాఫీగా వెళ్లడానికి వీలుగా వరదనీటిడ్రైన్‌లలో మట్టి, చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నామన్నారు. ముందస్తు ప్రణాళికలో భాగంగా పలు ఏరియాలను ముందుగా గుర్తించి పనులు నిర్వహిస్తున్నామని డిప్యూటీ కమిషనర్ వివరించారు. సదరు పనులను కాంట్రాక్టర్లు సక్రమంగా నిర్వహించే విధంగా తమ ఇంజనీరింగ్ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పనులను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. వర్షాలు, ఉదురు గాలులకు రోడ్లు, ఇతరత్రా కాలనీ ప్రాంతాల్లో చెట్లు నేల కూలిన వెంటనే తమ సిబ్బంది అక్కడికి చేరుకొని తొలగిస్తున్నారన్నారు. ఉద్యానవనం విభాగం సిబ్బందికి సమాచారం వచ్చిన వెంటనే అక్కడికి చేరుకొని రోడ్లపై పడిన చెట్లను హుటాహుటిన తొలగిస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నారని తెలియజేశారు. జీహెచ్‌ఎంసీ అధ్వర్యంలో ఆయా సమస్యల పరిష్కారానికి యుద్ధప్రాతిపదిక చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సాక్షి సిటీ ప్లస్
12
హైదరాబాద్‌,
శనివారం, 24, మే, 2025

అందం.. అనుబంధం..

హైదరాబాద్‌తో అనుబంధం పెంచుకున్న మిస్‌ వరల్డ్‌ తారలు

- మా అమ్మను కచ్చితంగా వెకేషన్‌కు తీసుకొస్తా : మిస్‌ కెనడా
- పానీ పూరీ కోసమైనా మళ్లీ రావాలి : మిస్‌ వియత్నాం
- కల్చరల్‌ డైవర్సిటీ అద్భుతం : మిస్‌ బంగ్లాదేశ్‌

గ్లోబల్‌ వేదికగా ఏ రంగంలోనైనా హైదరాబాద్‌ తన ప్రత్యేక స్థానాన్ని సుస్థిరం చేసుకుంటోంది. ఇది ఇప్పుడొచ్చిన గుర్తింపేం కాదు.. నిజాం కాలం నుంచే అంతర్జాతీయ స్థాయిలో భాగ్యనగరం ప్రసిద్ధి చెందింది. ఆనాటి సంస్కృతులు, ఆహారం, విలాస నగరంగానే కాకుండా ఇప్పటి ఐటీ, సినిమా, క్రీడలు తదితర రంగాల్లో అగ్రగామిగా నిలుస్తోంది. ఈ ఒరవడిలో వీటన్నింటి సమాహారంగానే ప్రతిష్టాత్మక మిస్‌ వరల్డ్‌ పోటీలు నగరంలో నిర్వహిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 109 దేశాలకు చెందిన మిస్‌ వరల్డ్‌ కంటెస్టెంట్‌లు నగరానికి వచ్చిన విషయం విధితమే. ఈ ప్రయాణంలో అందాల తారలు నగరానికి ముగ్ధులైపోతున్నారు. ఈ మిస్‌ వరల్డ్‌ పోటీల్లో ఒక్కరు మాత్రమే విజేతగా నిలుస్తారు.. కానీ ఈ మిస్‌ల అందరి హృదయాల్లో స్థానం సంపాదించుకుంది భాగ్యనగరం. ఈ నేపథ్యంలో పలువురు మిస్‌వరల్డ్‌ పోటీదారులు 'సాక్షి'తో పంచుకున్న అనుభవాలు.. – సాక్షి, సిటీబ్యూరో



బెల్జియం చాక్లెట్లు మావే..

వచ్చినప్పటి నుంచి చూస్తున్నా.. ఎంతో ఆత్మీయత, ప్రేమ నింపుకున్న మనుషులు మీరంతా..?! నాకు చాలా సంతోషంగా అనిపించింది. అధునాతన జీవన విధానం బాగా నచ్చింది. దీనికి సమానంగా సామాన్య జీవనం కనిపిస్తోంది. మిస్‌ వరల్డ్‌ కార్యక్రమాల్లో భాగంగా కొన్ని ప్రాంతాలను సందర్శించాను.. ఎంత అందమైన నగరమో. ఇక్కడి బెల్జియం చాక్లెట్లను చూశాను. ఈ బెల్జియం చాక్లెట్లకు మాతృక మా దేశమే. హైదరాబాద్‌లో షాపింగ్‌ చేయడం మరచిపోలేని అనుభూతి.

– కారెన్‌ జాన్సెన్‌, మిస్‌ బెల్జియం

అమ్మా నాన్నలను తీసుకొస్తా..

ఇక్కడ అద్భుతమైన జీవన విధానమే కాదు.. ఎన్నో వింతలు ఉన్నాయి. మిస్‌ వరల్డ్‌ బృందంతో పాటు అవన్నీ సందర్శించాను. ముఖ్యంగా కొన్ని ప్రాంతాలను చూడటానికి మళ్లీ హైదరాబాద్‌ వస్తా. వీటిని చూపించడానికి మా తల్లిదండ్రులను కూడా తీసుకొస్తాను. నా ఫేవరెట్‌ డెస్టినేషన్‌ నగరాల్లో హైదరాబాద్‌ కూడా చేరింది. నగరం చుట్టూ ఉన్న ప్రకృతి కూడా నాకు బాగా నచ్చింది.


– ఎమ్మా మోరిసన్‌, మిస్‌ కెనడా



మరో ఇల్లులా అనిపించింది..

భారత దేశం విభిన్న సంస్కృతుల సమ్మేళనం.. అంతెందుకు విదేశాలకు చెందిన కొన్ని సంస్కృతులు సైతం ఇక్కడ తారసపడ్డాయి. ఈ వైవిధ్యాన్ని చూడటానికి భారత్‌ మొత్తం తిరగాల్సిన పనిలేదు. కేవలం హైదరాబాద్‌ వస్తే చాలు. ఇది నేను అనుభవపూర్వకంగా చెబుతున్నా. ఢిల్లీ వెళ్తే ఒకలా, చెన్నై, లద్దాక్‌ వెళితే మరోలా.., ఒక్కో రాష్ట్రంలో ఒక్కో సాంస్కృతి కనిపిస్తుంది. అంతెందుకు కోల్‌కతా (బెంగాల్‌) వెళితే మా బంగ్లాదేశ్‌ మూలాలు కనిపిస్తాయి. ఇవన్నీ హైదరాబాద్‌లో చూశా. ఇది ఒక మినీ ఇండియా. నాకైతే హైదరాబాద్‌ మరో ఇల్లులా అనిపిస్తుంది. తెలంగాణ ప్రజల ఆత్మీయ ప్రతి ఒక్కరినీ కట్టిపడేస్తుంది. నాకు నచ్చిన స్పైసీ ఫుడ్‌ లభిస్తుంది. వారసత్వ వంటకాలు బాగున్నాయి. నేను తిన్న కొబ్బరి చట్నీ అయితే సూపర్బ్‌.

– అక్లిమా అతికా కొనికా, మిస్‌ బంగ్లాదేశ్‌







మొదటి సారి పానీ పూరీ తిన్నా..

వియత్నాంలో ఉన్నప్పుడు సోషల్‌ మీడియాలో పానీ పూరీ గురించి వీడియోలు చూశాను. ఉన్నత చదువుల కోసం ఆస్ట్రేలియా వెళ్లినప్పుడు కూడా కొన్ని సార్లు వీటి గురించి విన్నాను. అయితే హైదరాబాద్‌ వచ్చాకే పానీ పూరీ మొదటి సారి తిన్నా. వీటి రుచిని మాటల్లో చెప్పలేను. మొదట్లో వీటిని సరిగా తినలేకపోయాను. మిస్‌ ఇండియా నందినీ గుప్తా పానీపూరీ ఎలా తినాలో చూపించింది.. అప్పటి నుండి తినడం అలవాటైంది. ప్రస్తుతం హైదరాబాద్‌ అనగానే మొదట పానీపూరీనే గుర్తొస్తుంది. ఇక్కడి ప్రజలు ఆత్మీయంగా పలకరిస్తారు. నేను బసచేసే హోటల్‌ సిబ్బంది చూపించే ప్రేమ ఇంటిని మరిపిస్తోంది. చార్మినార్‌ వీధుల్లో కొన్న వస్తువులు వియాత్నాం తీసుకెళతాను. ఎయిర్‌పోర్ట్‌లోకి రాగానే బొట్టు పెట్టి ఆహ్వానించిన విధానం నాకెంతో నచ్చింది. తెలంగాణ సంస్కృతిలో భాగంగా ప్రదర్శించిన నృత్యాలు నన్ను ఆశ్చర్యానికి గురిచేశాయి.

– హూన్‌ ట్రాన్‌ నీ, మిస్‌ వియాత్నాం

అమ్మాయిలకు అనువైన నగరం..

ఇక్కడి అమ్మాయిలను చూస్తే సంతోషంగా ఉంది. వారికి అనుకూలమైన వాతావరణం ఉంది. మా దేశం జింబాబ్వే ఇంకా అభివృద్ధి చెందుతున్న దేశం.. అంతర్జాతీయంగా ఫ్యాషన్‌ రంగంలో మా కళకు, డిజైనింగ్‌కు ప్రత్యేకత ఉంది. మా డిజైనర్ల డిజైనింగ్‌ ఇక్కడ చూసి సంతోషం అనిపించింది. ఒక మోడల్‌గా గర్వపడుతున్నా. విదేశాల్లోనూ ఆఫ్రికన్ల సంస్కృతి ఇప్పుడు ట్రెండ్‌గా మారుతోంది. మేమంతా వివిధ దేశాల నుంచి వచ్చిన మహిళలుగా మాకు వేర్వేరు నమ్మకాలున్నాయి. కానీ ఇక్కడి సంస్కృతిక సమ్మేళనం, వైవిధ్యం ఐక్యతను ప్రదర్శిస్తోంది. ఇలాంటి సమాంతర వ్యవస్థ ఉండటం అద్భుతం. రంగు, రూపం వంటి అంశాలతో భిన్నంగా ఉన్న స్త్రీలను ఈ వైవిధ్యం విజేతను చేస్తుంది. అవకాశం ఉంటే మళ్లీ మళ్లీ ఇక్కడికి రావాలనుంది. –కోర్ట్నీ జాంగ్వే, మిస్‌ జింబాబ్వే

హైటెక్స్‌లో ఇండస్ట్రియల్‌ ఎక్స్‌పో

- మూడు రోజుల పాటు నిర్వహణ
- ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకూ

అత్యాధునిక సాంకేతికత, ప్రపంచస్థాయి ఆవిష్కరణలు అందుబాటులో ఉన్నాయని కోయికే కటింగ్‌, వెల్డింగ్‌ ఇండియా లిమిటెడ్‌ సీఈఓ టీ కుమగాయ్‌ శాన్‌ తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఇండస్ట్రియల్‌ మెషనరీ, ఇంజనీరింగ్‌ ఎక్స్‌పోను మాదాపూర్‌లోని హైటెక్స్‌లో శుక్రవారం నిర్వాహకులతో కలసి ప్రారంభించారు. దేశంలోని ప్రముఖ పారిశ్రామిక కేంద్రాల్లో ముఖ్యంగా జంషెడ్‌పూర్‌, నాగ్‌పూర్‌, హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. మెషీన్‌టూల్స్‌, ఆటోమెషన్‌, రోబోటిక్స్‌, వెల్డింగ్‌, ఎలక్ట్రికల్‌, ఇండస్ట్రియల్‌ ఇంజనీరింగ్‌ ఉత్పత్తులు, హెవీ, లైట్‌మెషీన్లు, ఇతర అనుబంధ ఉత్పత్తులు ప్రదర్శనలో ఉన్నాయన్నారు. దేశ విదేశాల నుంచి 125కి పైగా ప్రదర్శకులు పాల్గొంటున్నట్లు తెలిపారు. 750కి పైగా లైవ్‌ మెషీన్‌లు, 900లకి పైగా జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. –మాదాపూర్‌

మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఇండస్ట్రియల్‌ మెషినరీ, ఇంజనీరింగ్‌ ఎక్స్‌పోను ప్రారంభించిన కోయికే కటింగ్‌, వెల్డింగ్‌ ఇండియా లిమిటెడ్‌



'స్టెమ్‌'తో అధునాతన విద్య..

- షిల్లర్‌ స్పాట్లైట్‌లో గ్లోబల్‌ ఎడ్యుకేషన్‌ వెల్లడి
- తాజ్‌ కృష్ణ హోటల్లో నూతన ప్రణాళికలు

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయంగా వ్యూహాత్మక విస్తరణతో పాటు బలమైన భాగస్వామ్యాలతో ఉన్నతమైన విద్యను అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు గ్లోబల్‌ ఎడ్యుకేషన్‌ (జీఈడీయూ) ప్రకటించింది. ఇందులో భాగంగానే తమ ఇన్‌స్టిట్యూషన్‌లో ఒకటైన షిల్లర్‌ ఇంటర్నేషనల్‌ యూనివర్సిటీ స్టెమ్‌ ప్రోగ్రామ్‌పై దృష్టి సారించినట్లు గ్లోబల్‌ ఎడ్యుకేషన్‌ గ్రూప్‌ సీఈఓ డాక్టర్‌.విశ్వజీత్‌ రాణా తెలిపారు. దీనికి సంబంధించి నగరంలోని తాజ్‌ కృష్ణ హోటల్లో నిర్వహించిన షిల్లర్‌ స్పాట్లైట్‌ కార్యక్రమంలో నూతన ప్రణాళికలను వెల్లడించారు. ఇప్పటికే 15 దేశాల్లో కార్యకలాపాలను నిర్వహిస్తున్నామని, దాదాపు 75 వేలకు పైగా విద్యార్థులకు స్టెమ్‌ సంబంధిత కోర్సులు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. తమ గ్రూప్‌ పోర్ట్‌ఫోలియోలో షిల్లర్‌ కీలకమైన భాగం కాగా, పారిస్‌, హిడెల్బర్గ్‌, టంపా, మాడ్రిడ్లలో క్యాంపస్‌లు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ విద్యార్థుల ప్లేస్‌మెంట్‌ సీనియర్‌ డైరెక్టర్‌ రాజ్‌ కపూర్‌ పాల్గొన్నారు.



బీయింగ్‌ బాబా కామెడీ షో..

సాక్షి, సిటీబ్యూరో: స్టాండప్‌ కామెడీకి పేరొందిన అవినాష్‌ అగర్వాల్‌ బీయింగ్‌ బాబా పేరిట శనివారం నగరంలో ప్రదర్శన ఇవ్వనున్నారు. మాదాపూర్‌లోని ది స్ట్రీట్‌ కామెడీ క్లబ్‌లో ఈ కార్యక్రమం రాత్రి 9గంటలకు ప్రారంభం కానుంది.

క్రీడాకారుల మధ్య అనుబంధం ఉండాలి

బ్యాడ్మింటన్‌ కోచ్‌, అర్జున అవార్డ్‌ గ్రహీత పుల్లెల గోపీచంద్‌

గచ్చిబౌలి: ఆటగాళ్లకు అభిమానులు అందించే ప్రోత్సాహం, ఉత్సాహం ఎంతో శక్తిని అందిస్తాయని, వీరి మధ్య అనుబంధం ఎప్పటికప్పుడు బలోపేతం అవుతూ ఉండాలని ప్రముఖ బ్యాడ్మింటన్‌ కోచ్‌, అర్జున అవార్డ్‌ గ్రహీత పుల్లెల గోపీచంద్‌ అన్నారు. భారత బ్యాడ్మింటన్‌ ఆటగాళ్లను, అభిమానులను ఒకే వేదికపైకి తీసుకొచ్చే 'ఫ్యాన్‌ లీ' యాప్‌ ను గచ్చిబౌలిలోని పుల్లెల గోపీచంద్‌ బ్యాడ్మింటన్‌ అకాడమీలో శుక్రవారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ డిజిటల్‌ యుగంలో క్రీడాకారులపై సానుకూల ప్రభావాన్ని చూపించే విధంగా అభిమానులకు ఆరోగ్యకరమైన సమాచారాన్ని అందించే డిజిటల్‌ వేదికల అవసరం ఎంతైనా ఉందన్నారు. 'బ్యాడ్మింటన్‌ ఇండియా' పేరుతో దేశంలోని అగ్రశ్రేణి ఆటగాళ్లు, యువ ప్రతిభావంతులు, అభిమానులను ఒకే డిజిటల్‌ వేదిక పైకి తీసుకురావడం అనే ఆలోచనను అభినందించారు. సోషల్‌ మీడియా యుగంలో ఆటగాళ్లతో అభిమానుల సత్సంబంధాలు ఉండాలని, ట్రోలింగ్స్‌ వంటివి దూరంకావాలని ఆకాంక్షించారు. ఈ ఆవిష్కరణలో ఫ్యాన్లీ సహ వ్యవస్థాపకులు శ్రీనివాసన్‌ బాబు, శరవణన్‌ కనగరాజు, శ్రీదేవి సిరాలతో పాటు రాష్ట్ర బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు పాల్గొన్నారు.



'మ్యాపోగ్రాఫీ' ఫొటో ఎగ్జిబిషన్‌'..

- స్టేట్‌ ఆర్ట్‌ గ్యాలరీలో జూన్‌ 13న ప్రారంభం
- పోస్టర్‌ ఆవిష్కరించిన ఆచార్య ఘంటా చక్రపాణి, మామిడి హరికృష్ణ

సాక్షి, సిటీబ్యూరో: యువ ఫొటోగ్రాఫర్‌ కావలి చంద్రకాంత్‌ తన ఫొటోగ్రఫీ ప్రయాణంలో భాగంగా తీసిన ఫొటోలను 'మ్యాపోగ్రాఫీ ఫొటో ఎగ్జిబిషన్‌' ద్వారా ప్రదర్శించనున్నారు. జూన్‌ 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ మదపూర్‌లోని స్టేట్‌ ఆర్ట్‌ గ్యాలరీలో ఏర్పాటు చేయనున్న ఈ ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్‌ను రవీంద్రభారతిలో అంబేద్కర్‌ సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్‌ ఛాన్సలర్‌ ఆచార్య ఘంటా చక్రపాణి, తెలంగాణ భాషా సాంస్కృతిక సంచాలకులు మామిడి హరికృష్ణ శుక్రవారం ఆవిష్కరించారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రదర్శించనున్న ఈ ఫొటోలు పురాతన కాలం మొదలు ఆధునిక కాలంలోని మానవ ప్రయాణాన్ని, సాంస్కృతిక వైభవాన్ని, అధునాతన జీవన విధానాలను ప్రతిబింబిస్తాయని హరికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా యువ ఫొటోగ్రాఫర్‌ కావలి చంద్రకాంత్‌ ప్రయత్నాన్ని చక్రపాణి ప్రత్యేకంగా అభినందించారు. ఈ ప్రదర్శనలో తెలంగాణతో పాటు హైదరాబాద్‌కు సంబంధించిన తన ఫొటోలు చాలా మందికి తెలియని కథలను చెబుతాయని చంద్రకాంత్‌ పేర్కొన్నారు.



హెచ్‌ఐసీసీలో హైలైఫ్‌

- మూడు రోజుల పాటు కొనసాగింపు
- అందుబాటులో 350 మంది డిజైనర్ల ఉత్పత్తులు

మాదాపూర్‌ : ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో హైలైఫ్‌ ఎగ్జిబిషన్‌ను సినీనటి మాల్వి మల్హోత్ర, శ్రవంతి చోకరపు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరవాసులను ఆకట్టుకునే విధంగా డిజైన్స్‌ అందుబాటులో ఉన్నాయన్నారు. వివాహాది శుభకార్యాలకు ప్రత్యేక డిజైన్స్‌, జ్యువెలరీ ఉత్పత్తులు ఆకర్షణగా నిలుస్తున్నాయన్నారు. ఈ ఎగ్జిబిషన్‌ మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు డొమినిక్‌ తెలిపారు. ఈ కార్యక్రమంలో మోడల్స్‌ సుభశ్రీ, రాయగురు తదితరులు పాల్గొన్నారు.



పసిడి కాంతులు

– జీఎంఆర్‌ ఎరీనాలో జ్యువెలరీ ప్రదర్శన



శంషాబాద్‌ : వజ్రవైఢూర్యాలు పొదిగిన ఆభరణాలు పసిడి కాంతులతో వెలుగులు చిమ్మాయి. ముత్యాలు, రత్నాలు పొదిగిన నగలు ధరించి పలువురు మోడల్స్‌ చూపరులను కట్టిపడేశారు. ఈ ప్రదర్శనకు జీఎంఆర్‌ ఎరీనా శుక్రవారం వేదికైంది. ఇందులో మొత్తం 500 పైగా స్టాళ్లు కొలువుదీరాయి. తెలంగాణ జ్యువెలరీ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌తో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన ప్రత్యేక డిజైన్లు అందుబాటులో ఉంచారు. బిజినెస్‌ టూ బిజినెస్‌ లక్ష్యంగా కేవలం లైసెన్స్‌ వర్తకులకు మాత్రమే ఇందులో ప్రవేశం కల్పించారు. ఆదివారం వరకూ ఈ ప్రదర్శన కొనసాగుతుంది.



సాక్షి రియల్టీ
శనివారం
24-05-2025





ఫైర్.. బీకేర్‌ఫుల్

నివాసం, వాణిజ్యం, కార్యాలయం.. నిర్మాణం ఏదైనా సరే అగ్ని ప్రమాద నివారణ ఉపకరణాలు తప్పనిసరి. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా జరిగే ప్రమాదం వెలకట్టలేనిది. ఆస్తి, ప్రాణ నష్టాన్ని భర్తీ చేయలేనిది. అందుకే ప్రతీ భవనంలోనూ ఫైర్ ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేసుకోవడంతో పాటు క్రమం తప్పకుండా వాటిని నిర్వహణ చేయాలి లేకపోతే ప్రమాదం జరిగినప్పుడు అవి పనిచేయవు. ఈమధ్య కాలంలో గ్రేటర్ హైదరాబాద్‌లో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్, సిలిండర్ పేలుళ్లు.. ఇలా కారణాలనేకం.

→ హైదరాబాద్ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, విద్యా, వైద్య సదుపాయాలు, కాస్మోపాలిటన్ కల్చర్, తక్కువ జీవన వ్యయం, అందుబాటు ధరలు, మెరుగైన మౌలిక వసతులు ఇలా రకరకాల కారణాలతో నగరంలో జనాభా, వలసలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో నివాస, వాణిజ్య భవనాలలో అగ్ని ప్రమాద భద్రతా నిబంధనలు, ఉత్పత్తులు మనశ్శాంతి ఇవ్వడమే కాకుండా అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ప్రాణ నష్టాన్ని కూడా తగ్గిస్తుంది. చిన్న మంట ఒక గదిని దహించేందుకు నగటున మూడు నిమిషాల సమయం పడుతుంది. అందుకే అగ్ని ప్రమాదం జరిగినప్పుడు వేగవంతమైన ప్రతిస్పందన అత్యవసరం. ప్రతిస్పందనలో సెకన్ల సమయం ఆలస్యమైనా.. విపత్తు తీవ్రత పెరుగుతుంది.

– సాక్షి, సిటీబ్యూరో

ఎక్కడ ఎలాంటి ఏర్పాట్లు చేసుకోవాలి..?



అపార్ట్‌మెంట్లు:

- ప్రతీ ఫ్లాట్ లోపల స్మోక్ డిటెక్టర్లను ఏర్పాటు చేయాలి.
- మంటలను ఆర్పే పరికరం, యంత్రం ఉండాలి. ముఖ్యంగా వంట గదిలో తప్పనిసరి.
- మంటలను నియంత్రించే తలుపులు, కిటికీలు ఉండాలి. కనీసం 30-60 నిమిషాల పాటుతట్టుకునే శక్తి ఉండాలి.

లిఫ్ట్:

- లిఫ్ట్ డోర్లకు అగ్నిని తట్టుకునే శక్తి ఉండాలి.
- 15 మీటర్ల కంటే ఎత్తయిన భవనాలలో ప్రత్యేకంగా అగ్నిమాపక సిబ్బందిని నియమించుకోవాలి.
- లిఫ్ట్ ముందు భాగంలో 'అగ్ని ప్రమాదం జరిగినప్పుడు లిఫ్ట్‌ను వినియోగించరాదు', 'మెట్ల మార్గం'.. తదితరాలను సూచించే సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలి.



బేస్‌మెంట్, పార్కింగ్ ఏరియా

- ఆటోమెటిక్ స్ప్రింక్లర్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.
- పొగను గుర్తించే పరికరాలు, అలారం ఉండాలి.
- పార్కింగ్, ప్రధాన భవనం మధ్య భాగంలో మంటలను నియంత్రించే తలుపులను ఏర్పాటు చేయాలి.
- ఇంధనం, రంగులు, వార్నిష్ వంటి మండే గుణం ఉన్న వస్తువులను భద్ర పర్చకూడదు.
- అగ్ని ప్రమాదం జరిగే తప్పించుకునే సైన్ బోర్డులు, లైటింగ్‌లను ఏర్పాటు చేయాలి.

కారిడార్లు, కామన్ ఏరియాలు:

- ప్రతీ 30 మీటర్ల దూరంలో ఒక మాన్యువల్ కాల్ పాయింట్ల (ఎంసీపీ) ను ఏర్పాటు చేయాలి.
- కారిడార్లలో 2 గంటల పాటు మంటలను తట్టుకునే గుణం ఉన్న గోడలు, తలుపులను ఏర్పాటు చేయాలి.
- ఫైర్ అలారం స్పీకర్లు, అత్యవసర లైట్లు, మెరిసే ఎగ్జిట్ గుర్తులను పెట్టాలి.

అసెంబ్లీ ఏరియా

- ఓపెన్ స్పేస్, గ్రౌండ్ ఫ్లోర్‌లో సురక్షితమైన అసెంబ్లీ జోన్‌లను గుర్తించాలి.

Fire Safety

అత్యవసర నంబర్లు

101: ఫైర్ అండ్ రెస్క్యూ
102: అంబులెన్స్ హెల్ప్‌లైన్
100: పోలీస్ కంట్రోల్ రూమ్
1070: స్టేట్ కంట్రోల్ రూమ్
1077: డిజాస్టర్ హెల్ప్‌లైన్

- లిఫ్ట్, మెట్ల దగ్గర అగ్నిమాపక సంకేతాలు, గుర్తులను ఏర్పాటు చేయాలి.
- బేస్‌మెంట్, లిఫ్ట్ లాబీలలో పొగ తొలగింపు వ్యవస్థను పెట్టాలి.
- సహజ, యాంత్రిక వెంటిలేషన్ తప్పనిసరి.

అగ్నిమాపక మౌలిక సదుపాయాలు

- 15 మీటర్ల కంటే ఎత్తయిన భవనంలో ప్రతీ అంతస్తులోనూ నీటిని సరఫరాను అందించే పైప్‌లు, హోస్ రీల్ ఉండాల్సిందే.
- ఫైర్ హైడ్రంట్ సిస్టమ్ ఉండాలి.
- అండర్‌గ్రౌండ్, ఓవర్‌హెడ్ ఫైర్ వాటర్ స్టోరేజ్ ట్యాంక్‌లను ఏర్పాటు చేయాలి.
- డీజిల్ లేదా ఎలక్ట్రిక్‌తో నడిచే ఫైర్ పంప్ రూమ్ తప్పనిసరి.

రూఫ్, టెర్రర్..

- అగ్నిమాపక సిబ్బంది వెళ్లేందుకు వీలుగా ఉండాలి.

మీ ఇంటికి ఫైర్ ప్రూఫ్ ఉండాల్సిందే..



- మంటలను ఆర్పేందుకు ప్రత్యేకంగా వాటర్ స్టోరేజ్ ట్యాంక్ తప్పనిసరి.
- హైరైజ్ భవనాలతో ప్రతీ 24 మీటర్ల దూరంలో అత్యవసర సమయంలో ఆశ్రయం పొందేందుకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలి.
- ఇంట్లో అగ్ని మాపక యంత్రం ఉంచుకోవాలి.
- ఇసుకతో నిండిన అగ్ని మాపక బకెట్‌ను ఏర్పాటు చేసుకోవాలి.

మెట్లు..

- 15 మీటర్ల కంటే ఎత్తయిన భవనాలకు రెండు మెట్ల మార్గాలు తప్పనిసరి.
- అగ్ని ప్రమాదం జరిగితే తప్పించుకునేందుకు ప్రత్యేకంగా మెట్ల మార్గం ఉండాలి.
- మెట్ల మార్గంలోని తలుపులు కనిష్ఠంగా 1-2 గంటల పాటు మంటలను నియంత్రించే గుణం ఉన్న వాటినే ఏర్పాటు చేయాలి.
- పొగ ప్రవేశించకుండా నిరోధించే మెట్లను నిర్మించుకోవాలి.

చేయాల్సినవి..

- తప్పించుకునే మార్గాలు, మెట్ల మార్గాలు, అగ్ని ప్రమాద హెచ్చరికలు, సూచికలను గుర్తించుకోవాలి.
- ఇంట్లో లేనప్పుడు విద్యుత్ మెయిన్స్‌ను ఆపివేయాలి.

చేయకూడనివి

- అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఫర్నీచర్ వెనుక లేదా టాయిలెట్లతో దాక్కోకూడదు.
- ఐఎస్ఐ ప్రమాణాలు ఉన్న ఉత్పత్తులను మాత్రమే వాడాలి.
- అనధికారి విద్యుత్ కనెక్షన్లు తీసుకోవద్దు. మీటర్‌ను ఓవర్‌లోడ్ చేయకూడదు.
- ప్రమాదకర పదార్థాలు, ఉత్పత్తులను నిల్వ చేయకూడదు.
- ఫైర్ ఎగ్జిట్ పాయింట్లకు అడ్డంగా ఏమీ పెట్టరాదు.
- విద్యుత్ వ్యవస్థల మరమ్మతులు, నిర్వహణ తప్పనిసరి.

ఓపెన్ ప్లాట్లకు ఆదరణ

ఏటా స్థలాల ధరలు 7 శాతం వృద్ధి | అయితే ఫ్లాట్లలో పెరుగుదల 2 శాతమే..

సాక్షి, సిటీబ్యూరో: 'కొనేటప్పుడు తక్కువకు రావాలి.. అమ్మేటప్పుడు ఎక్కువకు పోవాలి' అని కోరుకునేది ఒక్క స్థిరాస్తి రంగంలోనే.. కొనుగోలుదారులు, పెట్టుబడిదారులు ఎవరైనా సరే రాబడి ఎక్కువగా ఉన్న చోట కొనేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. అయితే ఓపెన్ ప్లాట్, అపార్ట్‌మెంట్, కమర్షియల్ స్పేస్, రిటైల్.. ఇలా రియల్ ఎస్టేట్ పెట్టుబడులకు సాధనాలు అనేకం. కానీ, ఓపెన్ ప్లాట్లలో ఇన్వెస్ట్‌మెంట్స్ ఎక్కువ రాబడి వస్తుందని ఓ సర్వే తెలిపింది. 2015 నుంచి దేశంలోని 8 ప్రధాన నగరాలలో ప్రతి ఏటా స్థలాల ధరలలో 7 శాతం వృద్ధి నమోదవుతుంటే.. అపార్ట్‌మెంట్లలో మాత్రం 2 శాతమే పెరుగుదల కనిపిస్తుందని పేర్కొంది.

కరోనాతో పెరిగిన డిమాండ్..

ఢిల్లీ–ఎన్‌సీఆర్, పుణె, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, కోల్‌కత్తా, అహ్మదాబాద్ ఎనిమిది ప్రధాన నగరాల్లో సాధారణంగా కొనుగోలుదారులు ఓపెన్ ప్లాట్ల కంటే అపార్ట్‌మెంట్లను కొనుగోలు చేయడానికే ఇష్టపడతారు. ఎందుకంటే భద్రతతో పాటూ పవర్ బ్యాకప్, కార్ పార్కింగ్, క్లబ్ హౌస్, జిమ్, స్విమ్మింగ్ పూల్, గార్డెన్ వంటి కామన్ వసతులు ఉంటాయని అపార్ట్‌మెంట్ కొనుగోళ్లకే మొగ్గు చూపుతున్నారు. కానీ, కరోనా వ్యాప్తి నేపథ్యంలో కామన్ వసతులు వినియోగం,అపార్ట్‌మెంట్లలో ఎక్కువ జనాభా వంటివి శ్రేయస్కరం కాదనే అభిప్రాయం ఏర్పడింది. దీంతో సొంతంగా స్థలం కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకోవడమో లేక వ్యక్తిగత గృహాలను కొనుగోలు చేసేందుకే కొనుగోలుదారులు మొగ్గు చూపుతున్నారు.



స్థలాల కొరతే కారణం..

పెద్ద నగరాలలో స్థలాల కొరత ఎక్కువగా ఉండటం, విపరీతమైన పోటీ నేపథ్యంలో ఉన్న కొద్ది స్థలాల ధరలు ఎక్కువగా ఉన్నాయని ఓ సంస్థ సీఈఓ తెలిపారు. అందుకే ప్రధాన నగరాలలో పరిమిత స్థాయిలోని స్థలాలకు డిమాండ్ ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. కరోనా మహమ్మారి సమయంలో ఓపెన్ ప్లాట్లకు, ఇండిపెండెంగ్ గృహాలకు డిమాండ్ ఏర్పడింది. దీంతో పెద్ద నగరాల్లోని శివారు ప్రాంతాలలో బడా డెవలపర్లు ఓపెన్ ప్లాట్ వెంచర్లు, వ్యక్తిగత గృహాల ప్రాజెక్ట్‌లను చేపడుతున్నారని, దీంతో డిమాండ్ పునఃప్రారంభమైందని చెప్పారు.

13–21 శాతం పెరిగిన ధరలు..

హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలతో పాటూ గుర్గావ్‌లోని కొన్ని ప్రధాన ప్రాంతాలలోని నివాస స్థలాలకు డిమాండ్ పెరుగుతుందని ఓ సంస్థ రీసెర్చ్ హెడ్ తెలిపారు. 2018 నుంచి ఆయా నగరాలలోని ఓపెన్ ప్లాట్లలో రెండంకెల వృద్ధి నమోదవుతుందని పేర్కొన్నారు. మూడు సంవత్సరాలలో ఈ నగరాల్లో భూముల ధరలు 13–21 శాతం మేర పెరిగాయని చెప్పారు. ఇదే నగరాల్లోని అపార్ట్‌మెంట్ల ధరలలో మాత్రం 2–6 శాతం మేర వృద్ధి ఉందని తెలిపారు. కరోనా నేపథ్యంలో కొనుగోలుదారుల అభిరుచుల్లో వచ్చిన మార్పులు, పాలసీలతో రాబోయే త్రైమాసిక కాలంలో ఈ డిమాండ్ మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని అంచనా వేశారు.

హైదరాబాద్‌లో ప్లాట్లకే డిమాండ్ ఎక్కువ

ఇతర దక్షిణాది నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లోని ఓపెన్ ప్లాట్లకే డిమాండ్ ఎక్కువ. 2018–21 మధ్య కాలంలో నగరంలోని స్థలాలలో గరిష్ఠంగా 21 శాతం వార్షిక వృద్ధి రేటు నమోదవుతుంది. శంకర్‌పల్లి, పటాన్‌చెరు, తుక్కుగూడ, మహేశ్వరం, షాద్‌నగర్ ప్రాంతాల్లోని స్థలాలకు డిమాండ్, ధరల పెరుగుదల ఎక్కువగా ఉందని తెలిపింది. చెన్నైలో ప్లాట్లలో వార్షిక వృద్ధి రేటు 18 శాతం, బెంగళూరులో 13 శాతం ఉంది. చెన్నైలో అంబత్తూరు, అవడి, ఒరిగడం, శ్రీపెరంబుదూర్, తైయూర్ ప్రాంతాలలో, బెంగళూరులో నీలమంగళ, దేవనహళ్లి, చిక్‌బల్లాపూర్, హోస్కోట్, కొంబల్‌గోడు ప్రాంతాల్లోని నివాస ప్లాట్లకు ఆదరణ ఎక్కువగా ఉంది.

- 2018–21 మధ్య ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లో ప్లాట్ల వార్షిక వృద్ధి రేటు 15 శాతంగా ఉంది. సోహ్నా, గుర్గావ్‌లో భూముల ధరలు ఏటా 6 శాతం పెరుగుతున్నాయి. సెక్టార్ 99, ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే, సెక్టార్ 95ఏ, సెక్టార్ 70ఏ, సెక్టార్ 63లలోని నివాస స్థలాలలకు డిమాండ్ ఎక్కువగా ఉంది.



తెలంగాణలో జరుగుతున్న 72వ మిస్ వరల్డ్ బ్యూటీ పాజెంట్‌లో భాగంగా 'హెడ్ టు హెడ్ చాలెంజ్' ఈవెంట్ కూడా పూర్తయింది. ఇందులో టర్కీ, వేల్స్, ట్రినిడాడ్ అండ్ టొబాగో, జాంబియా దేశాలకు చెందిన సుందరీమణులు గెలుపొందారు. వాళ్ల పరిచయాలు..

ఇక్కడి సంస్కృతికి ఫిదా అయ్యాం

బుద్ధవనం ప్రాజెక్ట్ వెరీ వెరీ స్పెషల్
– ఇడిల్ బిల్గెన్, మిస్ టర్కీ



మిస్ వరల్డ్ పాజెంట్‌లో భాగంగా హెడ్ టు హెడ్ ఛాలెంజ్‌లో విజేతగా నిలిచింది మిస్ టర్కీ ఇడిల్ బిల్గెన్. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ – ''ఈ రోజు నాకు చాలా స్పెషల్. నా దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నందుకు గర్వంగానూ చాలా ఉత్సాహంగానూ ఉన్నాను. ఈ హెడ్ టు హెడ్ ఛాలెంజ్‌లో ముందంజలో ఉండటం మరింత ఆనందం. మహిళల భద్రత, సాధికారత, విద్య, సాంస్కృతిక గుర్తింపు, మానసిక ఆరోగ్యం, సోషల్ మీడియా ప్రభావం, వాతావరణ మార్పుల... ఇలా విభిన్నమైన టాపిక్స్‌తో హెడ్ టు హెడ్ చాలెంజింగ్ రౌండ్ గడిచింది. ఎక్కడైనా మహిళల విజయానికి చదువు చాలా ముఖ్యమైనది. ఏ దేశంలోనైనా అభివృద్ధి, సాధికారిత రెండూ కలిసి ప్రయాణించాలి. జనాభాలో సగం మంది వెనకబడి ఉంటే మనం విజయం సాధించలేం. ఇక్కడ మహిళలు వెనుకబడి ఉండకుండా ప్రభుత్వాలు చూసుకుంటున్నాయి. సాంకేతికత, వైద్యపురోగతికి ఈ ప్రాంతం కేంద్రంగా ఉంది. ప్రజల ఆప్యాయత, ప్రేమ, దయాగుణం, ఇక్కడి సంస్కృతి హైలైట్ చేస్తున్నాయి. ఇవే విషయాలను వేదికపై నుంచి వినిపించాను. తెలంగాణలోని టూరిజం నాకు బాగా నచ్చింది. ముఖ్యంగా బుద్ధవనం ప్రాజెక్ట్ వెరీ వెరీ స్పెషల్. అక్కడ మాంక్స్ చదివే మంత్రాలు ఆధ్యాత్మిక భావనలో ముంచెత్తాయి. నేను రేడియేషన్ అంకాలజీలో మెడిసిన్ చేస్తున్నాను. క్యాన్సర్ అవగాహన కార్యక్రమాలలో పాల్గొంటుంటాను. 'నేనొక వైద్యురాలిని, అంతేకాదు నేను ఒక టర్కిష్ మహిళను. మిస్ వరల్డ్‌లో టర్కిష్ మహిళల గొంతుగా నేను ఉండాలనుకుంటున్నాను' అని వేదికపై వివరించాను. బ్యూటీ విత్ ఎ పర్పస్ ప్రాజెక్ట్‌లో భాగంగా రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ అవగాహనకు కృషి చేస్తున్నాను. ఒక వైద్యురాలిగా క్యాన్సర్ రోగులకు సహాయకారిగా ఉండటం నా బాధ్యత. క్రీడలు అంటే చాలా ఇష్టం. మానసిక ఒత్తిడి నుంచి విశ్రాంతి పొందడానికి క్రీడలు, జిమ్ నాకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. అసాధ్యం అనేది మన డిక్షనరీలో ఉండకూడాదు. ఎలాంటి సమస్య వచ్చినా దానిని అధిగమించగలను, సాధించగలను అనే ఆలోచన మనలో ధైర్యాన్ని నింపుతుంది. విజయాలను మన ముందుంచుతుంది' అంటూ వివరించింది ఇడిల్.

యువతకు చదువు చాలా ముఖ్యం
– మిల్లీ మే ఆడమ్స్, మిస్ వేల్స్



మిస్ వరల్డ్ పాజెంట్‌లో భాగంగా హెడ్ టు హెడ్ ఛాలెంజ్ టాప్ టెన్ జాబితా యూరప్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న మిస్ వేల్స్ మిల్లీ మే ఆడమ్స్ టాప్ టెన్ జాబితాలోకి చేరింది. ఈ సందర్భంగా మిల్లీ మాట్లాడుతూ – ''ఈ ఫీలింగ్ చాలా గొప్పగా ఉంది. స్వతహాగా పర్యటనలు చేయడం, చారిత్రక ప్రదేశాలు సందర్శించడం అంటే నాకు చాలా ఇష్టం. వీలు చిక్కినప్పుడు గొప్ప గొప్ప కట్టడాలను సందర్శిస్తుంటాను. అందులో భాగంగా గతంలో ఇండియాకు వచ్చినప్పుడు తాజ్‌మహల్‌ని సందర్శించాను. ఇప్పుడు ఈ మిస్ వరల్డ్ పాజెంట్‌లో భాగంగా హెరిటేజ్ టెంపుల్స్, చార్మినార్ చాలా బాగా నచ్చాయి. ఇక్కడి శిల్పనిర్మాణం అద్భుతం అనిపిస్తుంది. ట్రిప్స్ చాలా ఎంజాయ్ చేశాం. ఇక్కడి సంస్కృతితో పాటు మహిళల సాధికారిత గురించి తెలుసుకున్నాను. ప్రభుత్వాలు అందిస్తున్న రక్షణ, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్, ఫ్రీ బస్ సౌకర్యం గురించి తెలుసుకున్నాం. బ్యూటీ విత్ ఎ పర్పస్ హెడ్ టు హెడ్ ఛాలెంజ్ రౌండ్‌లో 20 మందితో పోటీపడ్డాను. పోటీలో నా వర్క్స్ గురించి, చదువు ప్రాముఖ్యత గురించి అడిగారు. నేను వేల్స్‌లో మెడిసిన్ చదువుతున్నాను. స్ట్రీట్ డాక్టర్స్ అనే జాతీయసంస్థతో కలిసి పనిచేయడంతో పాటు, యువతకు చదువు ఎంత అవసరమో వివరిస్తూ, పాఠశాల విద్య పట్ల అవగాహన కల్పిస్తున్నాను. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఆరోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించడం, అందాల పోటీల ద్వారా నిధుల సేకరించి, ప్రపంచ వ్యాప్తంగా వెనుకబడిన పిల్లలకు మద్దతుగా నిలుస్తున్నాను. నా విజయానికి ఇవన్నీ ఉపకరించాయి. యువతులు, బాలికలకు తమపై తమకు పూర్తి విశ్వాసం ఉండాలి. అప్పుడు ప్రపంచంలో ఏదైనా సాధించడానికి మనకు సహకారం అందుతుంది. కోరుకున్న జీవితాన్ని గడపటానికి మహిళకు సాధికారతతో పాటు దయ, వినయం కూడా ఉంటే ఎక్కడ ఉన్నా రాణిగా వెలిగిపోతాం'' అంటూ అందమైన నవ్వుతో సమాధానమిచ్చింది మిస్ వేల్స్.

– నిర్మలారెడ్డి

తెలంగాణ మినీ ఇండియా
– అనా లీజ్ నాన్సాన్, మిస్ ట్రినిడాడ్ అండ్ టొబాగో



''మాది పెద్ద కుటుంబం. మేము మొత్తం ఎనిమిది మంది పిల్లలం. అందరిలోకి నేనే పెద్ద. అందుకే అన్ని విషయాల్లో నా తోబుట్టువులకు నేనో మార్గదర్శిగా ఉండాలని కోరుకునేదాన్ని! మా నాన్న ఇంజినీర్, అమ్మ గృహిణి. చదువు విషయంలో నాకు మా నాన్నే స్ఫూర్తి. ఇంగ్లండ్‌లో సివిల్ ఇంజినీరింగ్ చదివాను. ఇప్పుడు మాస్టర్స్ చేయాలనుకుంటున్నాను. పర్యావరణహిత నిర్మాణాలు నా లక్ష్యం. నేను అథ్లెట్ కూడా! ఫుట్‌బాల్ ప్లేయర్‌ని. బ్యూటీ పాజెంట్‌లో పాల్గొనడానికి నాకు ప్రేరణ.. ఇందులోని 'బ్యూటీ విత్ ఎ పర్పస్' సెగ్మెంట్. ఇందులో నేను నమ్మే సుస్థిర అభివృద్ధి, హ్యాపీ లివింగ్ వంటివాటి గురించే చెప్పే అవకాశం దొరుకుతుందని అనుకున్నాను. నా బ్యూటీ విత్ ఎ పర్పస్ కూడా అదే! 'ద రిపుల్ ఎఫెక్ట్' అనే సంస్థను స్థాపించాను. స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ ద్వారా సస్టెయినబుల్ కమ్యూనిటీస్‌ని ఏర్పాటు చేయడమే దీని లక్ష్యం. ముఖ్యంగా నిస్సహాయ మహిళల సాధికారత, పిల్లల చదువు కోసం పని చేస్తున్నాను. మా దేశానికి వలసలు ఎక్కువ. ఆ పిల్లలకు స్థానిక భాషలు, ఇంగ్లిష్ వంటివి రాక చదువుకు దూరమవుతున్నారు. అందుకే ట్రినిడాడ్‌లోని 'విసడమ్ సియోరామ్' అనే ఓ టెక్నాలజీ కంపెనీ సహాయంతో ఆ పిల్లలకు పలు భాషలు, కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పించే ప్రయత్నం చేస్తున్నాను. నేను అథ్లెట్‌ని కూడా కాబట్టి స్పోర్ట్స్ మీదా ఫోకస్ చేస్తున్నాను. ఆటలతో శారీరక దృఢత్వమే కాదు ఎమోషనల్ బ్యాలెన్స్ కూడా అలవడుతుంది. అందుకే పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించే ప్రయత్నమూ చేస్తున్నాను. ముఖ్యంగా స్విమ్మింగ్‌లో. ఎందుకంటే అది లైఫ్ స్కిల్ కాబట్టి. స్థానిక వనరులతో గ్రీన్ బిల్డింగ్ టెక్నిక్స్‌ని చెప్పే పాడ్‌కాస్ట్ చానెల్‌నూ స్టార్ట్ చేశాను. ఇందులో ఇంజినీర్స్, ఆర్కిటెక్ట్స్, పర్యావరణవేత్తలను ఇంటర్వ్యూ చేస్తుంటాను. అంతేకాదు మొక్కలు నాటే కార్యక్రమాలూ నిర్వహిస్తుంటాను. ఇవన్నీ నా బ్యూటీ విత్ ఎ పర్పస్‌లో భాగాలే!

కలర్‌ఫుల్‌గా..

ఇండియా గురించి విన్నాను. కానీ తెలంగాణ స్టేట్ గురించి ఎప్పుడూ వినలేదు. తెలంగాణ మినీ ఇండియాలా అనిపించింది. మాలాగే ఇక్కడా భిన్న మతాలు, భిన్న సంస్కృతీసంప్రదాయాలు కనిపించాయి. చాలా కలర్‌ఫుల్‌గా ఉంది. ఇక్కడి ఫుడ్ స్పైసీగా ఉన్నప్పటికీ చాలా బాగుంది. సో డిలీషియస్. మళ్లీ మళ్లీ ఇక్కడికి రావాలనిపించేలా ఉంది తెలంగాణ ఆతిథ్యం! చాలా హ్యాపీ!'' అన్నారు అనా లీజ్ నాన్సాన్

పెళ్లి తప్పించుకుని మెడిసిన్ చదివా
ఫేత్ వాలియా, మిస్ జాంబియా



''వృత్తిరీత్యా డాక్టర్‌ని. నాకు ఒక తమ్ముడు. మా అమ్మ పాస్టర్. నాన్న కార్పెంటర్. మేము లుసాకాలో ఉంటాం. నాకు ముందునుంచీ అందాల పోటీలంటే ఇష్టం. నాకు పదిహేనేళ్లున్నప్పుడు మొదటిసారిగా అందాల పోటీల్లో పాల్గొన్నాను. గెలిచాను కూడా! బ్యూటీ అంటే నా దృష్టిలో ఆత్మవిశ్వాసం. మా దగ్గర బాల్య వివాహాలు ఎక్కువ. నన్నూ బాల్య వివాహానికి సిద్ధం చేసింది మా సమాజం. అయితే బాగా చదువుకుని మా దేశంలోని ఆడపిల్లల తలరాతను మార్చాలి అనుకునేదాన్ని. మా ఆర్థిక పరిస్థితి బాలేనందువల్ల నా పదహారవ ఏట నాకు పెళ్లి చేసేయాలనే ఒత్తిడి తెచ్చారు మా కమ్యూనిటీ పెద్దలు. కానీ నేను తల వంచలేదు. ఆ పెళ్లిని తప్పించుకున్నాను. కష్టపడి మెడిసిన్ చదివాను. అప్పుడు గనుక నేను ఆ తెగువ చూపించక పోయుంటే ఈ రోజు మీతో ఇలా మాట్లాడే అవకాశం వచ్చేది కాదు.

నా ఈ కథను ప్రపంచానికి చెప్పి, ఆడపిల్లలకు మానసిక స్థయిర్యాన్ని, స్ఫూర్తిని పంచడానికి అందాల పోటీలు ఓ వేదికగా కనిపించాయి. మన కథను వినిపించే, మన వ్యక్తిత్వాన్ని తెలియజేసే అవకాశాన్నిస్తాయి. అందుకే ఎలాగైనా ఈ ప్లాట్‌ఫామ్ దాకా రావాలనుకున్నాను. వచ్చాను.

వాయిస్ ఆఫ్ ఫెయిత్

జీవితంలో గెలవడానికి ఉపయోగపడేవి చదువు, నైపుణ్యం మాత్రమే. నా బ్యూటీ విత్ ఎ పర్పస్ కూడా అదే! 'వాయిస్ ఆఫ్ ఫేత్' అనే ఫౌండేషన్ ద్వారా అట్టడుగు వర్గాల పిల్లలకు చదువు ప్రాధాన్యాన్ని తెలియజెబుతున్నాను. సేంద్రియ సాగు విధానాలను నేర్పి.. వాళ్ల సుస్థిర ప్రగతికి పాటుపడే ప్రయత్నం చేస్తున్నాను. సాంకేతిక రంగంలో వాళ్లు నైపుణ్యం సాధించేలా శిక్షణనిప్పిస్తున్నాను. ఈ పనులన్నీ ఎలా చేస్తున్నానో 'హెడ్ టు హెడ్ చాలెంజ్ (బ్యూటీ విత్ ఎ పర్పస్)' రౌండ్‌లో ప్రెజెంట్ చేశాను.

ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎడ్యుకేషన్, హెల్త్, సాంకేతిక రంగాల్లో తెలంగాణ ప్రపంచంతో పోటీ పడుతున్నట్టుంది. అధిక జనాభా, తక్కువ భూభాగం లాంటి సవాళ్లతో కూడా ఇండియా సాధించిన ఈ ప్రగతి చూస్తుంటే ముచ్చటేస్తోంది. ప్రజల అవసరాల పట్ల ప్రభుత్వాలకున్న చిత్తశుద్ధి ప్రశంసనీయం. తెలంగాణ సంస్కృతికి, ఆతిథ్యానికీ నేను ఫిదా అయ్యాను. మా దేశం కూడా ఈ స్థాయికి ఎదగాలని కోరుకుంటున్నాను'' అన్నారు మిస్ జాంబియా ఫేత్ వాలియా.

– సరస్వతి రమ

● బ్యూటిప్

జుట్టుకు బయోటిన్

ఎన్ని రకాలుగా ప్రయత్నించినా కొన్నిసార్లు జుట్టు రాలడం తగ్గదు. ఇలాంటప్పుడు బయోటిన్ పొడి జుట్టురాలడాన్ని తగ్గిస్తుందని నిపుణులు చెబుతున్నారు. మరి ఆ పొడి ఎలా తయారు చేసుకోవాలో చూడండి.

- అరకప్పు డ్రైఫ్రూట్స్(బాదం, పల్లీలు, పొద్దు తిరుగుడు పువ్వు గింజలు, వాల్‌నట్స్), అర కప్పు ఓట్స్, పచ్చిశనగపప్పు పెసరపప్పులు



కలిపి అరకప్పు, సబ్జా గింజలు అరకప్పు, అవిసె గింజలు అరకప్పు చొప్పున తీసుకుని దోరగా వేయించి పొడి చేసుకోని డబ్బాలో వేసి నిల్వ చేయాలి.
- ఈ పొడిని టేబుల్ స్పూన్ తీసుకుని టీ లేదా స్మూతీలో వేసుకుని తాగాలి. టీ అలవాటు లేని వాళ్లు వేడినీళ్లలో కలుపుకుని రోజూ ఉదయాన్నే తాగితే రాలడం తగ్గి జుట్టు ఒత్తుగా పెరుగుతుంది. ఈ పొడి జుట్టు సంరక్షణకే గాక ఆరోగ్యాన్నీ మెరుగు పరుస్తుంది.

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో) 23న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	96,410
బంగారం (22 క్యారెట్లు)	89,568
వెండి	99,500
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	99,100
బంగారం (22 క్యారెట్లు)	89,400
వెండి	1,00,600
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	97,530
బంగారం (22 క్యారెట్లు)	89,400
వెండి	1,11,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	99,100
బంగారం (22 క్యారెట్లు)	92,080
వెండి	1,00,600
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	96,200
బంగారం (22 క్యారెట్లు)	88,500
వెండి	99,200
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	97,520
బంగారం (22 క్యారెట్లు)	89,400
వెండి	1,11,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

దీప మనోబలం
వికాసం

'మాది ఘిసడి సంచార తెగ' అని చెప్పుకోవడానికి కొద్దిమంది సంశయిస్తారు. దీనికి కారణం బ్రిటిష్ కాలంలో ఆ తెగకు 'క్రిమినల్ ట్రైబ్'గా ముద్ర వేయడం.

కానీ దీపా పవార్... 'నేను ఘిసడి తెగకు చెందిన మహిళను' అని సగర్వంగా చెప్పుకోవడమే కాదు తన జాతిజనుల కోసం సామాజిక కార్యకర్తగా ఎంతో శ్రమిస్తోంది.

తాజాగా...

అట్టడుగు వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న మానసిక సమస్యలు, పరిష్కార మార్గాలపై 'మన్ బోలి' అనే పుస్తకం రాసింది దీపా పవార్...


దీపా పవార్

ఒక వర్క్‌షాప్‌లో...

'బాధగా ఉందని తెలియకుండానే రోజూ మనం మోసే బరువు పేరు ఏమిటి?' అని అడిగింది ఒక గిరిజన యువతి.

ఆ ప్రశ్నే దీపా పవర్‌ను 'మన్ బోలి' పుస్తకం రాసేలా చేసింది.


ఆ బరువు పేరు... మానసిక సమస్య.

పేరు పెట్టని ఆ బరువు వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు. వ్యవస్థ తాలూకు నిశ్శబ్దం. నిర్లక్ష్యం.

'మెంటల్ హెల్త్ అనేది కులం, పేదరికం, భాష, అధికారంతో ముడిపడి ఉంది. మన దేశంలో మానసిక ఆరోగ్య సంరక్షణ అనేది చాలా వరకు పట్టణ ప్రాంతాలు, ఉన్నత వర్గాలకే పరిమితం అయింది. ఈ నేపథ్యంలో అణగారిన వర్గాలను దృష్టిలో పెట్టుకొని కొత్త కేర్ గ్రామర్‌ని నిర్మించడానికి కృషి చేస్తున్నాం' అంటుంది దీప.

తమ తెగలోని సామెతల నుంచి కథల వరకు రకరకాల అంశాలను ఉపయోగించి మానసిక ఆరోగ్యానికి, అట్టడుగు ప్రజల మధ్య ఉన్న అంతరాన్ని ఈ పుస్తకం ద్వారా తెలియజేసింది దీప. గిరిజనుల సంప్రదాయాలు, సంస్కృతిపై అవగాహన ఉన్న దీపా పవార్ మెంటల్ హెల్త్ ప్రొఫెషనల్స్‌తో కలిసి పనిచేసింది. ఆ అనుభవం పుస్తకానికి బలం అయింది.

ఘిసడి సంచార తెగకు చెందిన దీపా పవార్ పద్నాలుగు సంవత్సరాల వయసులో సామాజిక కార్యకర్తగా మారింది. సోషల్ వర్క్‌లో మాస్టర్స్ చేసింది. కమ్యూనిటీ డెవలప్‌మెంట్ నుంచి శానిటేషన్ వరకు జెండర్ నుంచి హెల్త్ వరకు ఎన్నో అంశాలపై పనిచేసింది.



దీపా పవార్ రాసిన పుస్తకం 'మన్ బోలి'

'ఘిసడి సంచార తెగకు చెందిన మహిళను' అని గర్వంగా చెప్పుకునే దీప ఆ తెగలోని మూఢనమ్మకాలపై కూడా పోరాడింది. 'ఆడపిల్లలకు చదువు అవసరం లేదు' అనుకునే వారి దృష్టిని మార్చడానికి కృషి చేసింది.

'అనుభూతి' అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా తన సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతం చేసింది. మహారాష్ట్రలోని ఎన్నో జిల్లాలలో మెంటల్ హెల్త్, కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌పై పనిచేస్తోంది. రాజ్యాంగం, మానవ హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

● సోషల్ మీడియా

ట్రంప్ గారి మనవరాలు... మస్తు హుషార్!



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మనవరాలు కై ట్రంప్ తన 18వ పుట్టిన రోజు సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియో నెటిజనులను ఆకట్టుకుంటోంది.

తన గోల్ఫ్ ఆటకు సంబంధించిన ఫోటోలు, వైట్‌హౌజ్‌లో తాతతో గడిపిన ఫోటోలు ఇందులో ఉన్నాయి.

'17... నువ్వు నాకు జీవితం గురించి ఎంతో చెప్పావు.

18... నువ్వు కూడా అలాగే చేస్తావని ఆశిస్తున్నాను' అని తన పోస్ట్‌లో రాసింది కై ట్రంప్.

'లాస్ట్ డే బీయింగ్ 17' కాప్షన్‌తో పోస్ట్ చేసిన వీడియోలో స్నేహితులతో కలిసి డ్యాన్స్ చేస్తూ కనిపిస్తుంది కై.

తాత కోసం ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఆకట్టుకునే ఉపన్యాసాలు ఇచ్చింది.

రాజకీయ ఉపన్యాసాల సంగతి ఎలా ఉన్నా గోల్ఫ్ ఆటలో చక్కని ప్రతిభ చూపుతోంది.

యూట్యూబ్ చానల్ స్టార్ట్ చేసి తక్కువ కాలంలోనే 'సోషల్ మీడియా సెన్సేషన్' అయింది.

కోకోనట్ స్పెషల్స్
వంటిల్లు

వంటల్లో కొబ్బరిని జోడిస్తే.. ఆ రుచే అదుర్స్. పైగా అందులోని పోషకాలు, ప్రొటీన్స్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్న సంగతి తెలిసిందే. మరి అలాంటి హెల్దీ కోకోనట్‌తో మరింత హెల్దీగా వెరైటీలు చేసుకుందామా?

కొబ్బరి చాక్లెట్



కావలసినవి: చిక్కటి పాలు – కప్పు; పంచదార – అర కప్పు; కొబ్బరి తురుము – ఒకటిన్నర కప్పులు; నెయ్యి – కొద్దిగా; చాక్లెట్ చిప్స్ – కప్పు;

తయారీ: ముందుగా కడాయిలో పాలు, పంచదార వేసుకుని, చిన్న మంట మీద బాగా కాగనివ్వాలి. అనంతరం అందులో కొబ్బరి తురుము వేసుకుని దగ్గర పడేవరకూ అలానే గరిటెతో తిప్పుతూ ఉడికించుకోవాలి. దగ్గర పడిన తర్వాత స్టవ్ ఆఫ్ చేసి, చల్లారనివ్వాలి. ఇప్పుడు నెయ్యి చేతులకు రాసుకుని ఈ మిశ్రమంతో చిన్నచిన్న బాల్స్ లేదా బైట్స్‌లా చేత్తో ఒత్తుకుని కాసేపు పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు చాక్లెట్ చిప్స్‌ని ఓవెన్‌లో కరిగించి.. కొబ్బరి బైట్స్‌ని అందులో ముంచి బాగా పట్టించాలి. అనంతరం అవి గాలికి ఆరిన తర్వాత సర్వ్ చేసుకోవాలి.

కొబ్బరి పులిహోర



కావలసినవి: బియ్యం – ఒక కప్పు (అన్నం పొడిపొడిగా ఉడికించుకోవాలి); పచ్చి కొబ్బరి తురుము – అర కప్పు; పల్లీలు – 2 టేబుల్ స్పూన్లు; శనగపప్పు, మినప్పప్పు, ఆవాలు – ఒక టీస్పూన్ చొప్పున; జీలకర్ర – అర టీస్పూన్; ఎండుమిర్చి – 2–3 (తుంచినవి); పచ్చిమిర్చి – 2–3 (మధ్యలోకి చీల్చినవి); కరివేపాకు– 2 రెబ్బలు; ఇంగువ – చిటికెడు; పసుపు – అర టీస్పూన్; నిమ్మరసం – 1–2 టేబుల్ స్పూన్లు (రుచికి సరిపడా); నూనె – 2–3 టేబుల్ స్పూన్లు; ఉప్పు – తగినంత;

తయారీ: ముందుగా బియ్యాన్ని బాగా కడిగి, పొడిపొడిగా ఉండేలా అన్నం వండుకోవాలి. ఇలా వండిన అన్నాన్ని ఒక వెడల్పాటి ప్లేట్‌లో వేసి చల్లారనివ్వాలి. దీనికి పసుపు, కొద్దిగా ఉప్పు, ఒక టీస్పూన్ నూనె కలిపి పక్కన పెట్టుకోవాలి. ఈలోపు ఒక కడాయిలో నూనె వేసి వేడి చేయాలి. నూనె వేడయ్యాక పల్లీలు వేసి గోల్డెన్ బ్రౌన్ కలర్ వచ్చే వరకు వేయించి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఆ నూనెలో శనగపప్పు, మినప్పప్పు వేసి కొద్దిగా రంగు మారగానే ఆవాలు, జీలకర్ర వేసి చిటపటలాడించాలి. తర్వాత ఎండుమిర్చి, పచ్చిమిర్చి, కరివేపాకు, ఇంగువ వేసి గరిటెతో తిప్పుతూ, బాగా వేయించాలి. ఇప్పుడు ఈ తాలింపులో కొబ్బరి తురుము వేసి సుమారు 1–2 నిమిషాల పాటు వేయించాలి. కొబ్బరితురుము పెద్దగా రంగు మారకుండా చూసుకోండి. ఇప్పుడు ఆ మిశ్రమాన్ని చల్లారిన అన్నంలో వేసి, రుచికి సరిపడా ఉప్పు, నిమ్మరసం వేసుకుంటూ బాగా కలుపుకోవాలి. అనంతరం పల్లీలు కలుపుకుని సర్వ్ చేసుకోవచ్చు.

కొబ్బరి ఐస్‌క్రీమ్



కావలసినవి: కొబ్బరి తురుము – కప్పు; కొబ్బరి పాలు – 2 కప్పులు; కండెన్స్‌డ్ మిల్క్ – ముప్పావు కప్పు; ఫ్రెష్ క్రీమ్ / హెవీ క్రీమ్ – ఒక కప్పు (బాగా చల్లగా ఉండాలి); పంచదార – పావు కప్పు (రుచిని బట్టి పెంచుకోవచ్చు లేదా తగ్గించుకోవచ్చు); యాలకుల పొడి – అర టీస్పూన్;

తయారీ: ముందుగా ఒక మిక్సీ జార్‌లో కొబ్బరి తురుమును వేసి, పావు కప్పు కొబ్బరి పాలు కలిపి మెత్తటి పేస్ట్‌లా గ్రైండ్ చేసి పక్కన పెట్టుకోవాలి. ఈలోపు ఒక పెద్ద బౌల్‌లో ఫ్రెష్ క్రీమ్ లేదా హెవీ క్రీమ్ తీసుకొని, ఎలక్ట్రిక్ బీటర్‌తో నురుగు వచ్చే వరకు బీట్ చేయాలి. ఇప్పుడు బీట్ చేసుకున్న క్రీమ్‌లో కండెన్స్‌డ్ మిల్క్, మిగిలిన కొబ్బరి పాలు, యాలకుల పొడి వేసి కలపాలి. చివరగా ముందే గ్రైండ్ చేసుకున్న కొబ్బరి పేస్ట్‌ను ఈ మిశ్రమంలో వేసి, అన్నీ బాగా కలిసేలా ఒక ఎయిర్‌టైట్ కంటైనర్‌లో పోసి, మూతపెట్టేసుకోవాలి. ఇప్పుడు దీన్ని డీప్ ఫ్రీజర్‌లో కనీసం 8 గంటలు లేదా రాత్రంతా పూర్తిగా గడ్డకట్టే వరకు ఉంచాలి.

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	769	81,721
నిఫ్టీ ▲	243	24,853

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	18,788	▽	138
డోజోన్స్	41,701	▽	168
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,718	▽	21
డాక్స్	23,630	▽	370
షాంఘై	3,348	▽	32
నికాయ్	37,160	△	175

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో


			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.60	86.62
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	114.30	117.26
€	యూరో	ఎస్‌బీఐ	95.09	98.79
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	59.26	60.81
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.32	56.53
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	63.91	68.58
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.82	23.33
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.31	24.91
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.98	12.81

కేంద్రానికి బంపర్ బొనాంజా



ముంబై: గత ఆర్థిక సంవత్సరానికి (2024–25) గాను కేంద్ర ప్రభుత్వానికి రిజర్వ్ బ్యాంక్ రికార్డు స్థాయిలో రూ. 2.69 లక్షల కోట్ల డివిడెండ్ ప్రకటించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో (2023–24) చెల్లించిన రూ. 2.1 లక్షల కోట్లతో పోలిస్తే ఇది 27.4 శాతం అధికం. 2022–23లో ప్రభుత్వానికి ఆర్‌బీఐ రూ. 87,416 కోట్ల డివిడెండ్ చెల్లించింది. 'రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా సారథ్యంలో జరిగిన 616వ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో రూ. 2,68,590.07 కోట్ల మిగులును కేంద్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు' అని ఆర్‌బీఐ ఒక ప్రకటనలో తెలిపింది. పాకిస్తాన్‌తో ఉద్రిక్త పరిస్థితుల వేళ రక్షణ శాఖకు కేటాయింపులు భారీగా పెంచాల్సి రావడం, అమెరికా టారిఫ్‌లపరంగా నెలకొన్న సవాళ్లను అధిగమించేందుకు ప్రభుత్వానికి ఇది సహాయకరంగా ఉండనుంది. ఆర్‌బీఐ ఏటా తన పెట్టుబడులపై వచ్చే అదనపు రాబడిని, డాలర్ మారకంలో మార్పుల వల్ల వచ్చే ప్రయోజనాలు మొదలైన వాటిని ప్రభుత్వానికి డివిడెండ్ రూపంలో బదలాయిస్తుంది. ఈసారి ఇది రూ. 2.5 – రూ. 3 లక్షల కోట్ల స్థాయిలో ఉండొచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేశాయి. తాజా బడ్జెట్‌లో అంచనా వేసిన దానికంటే ఆర్‌బీఐ ప్రకటించిన డివిడెండు సుమారు రూ. 0.4–0.5 లక్షల కోట్లు అధికమని, పన్ను వసూళ్లు లేక డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాలను సాధించలేకపోయినా, లేదా లెక్కకు మించి వ్యయాలు ఎదురైనా అధిగమించేందుకు ఇది సహాయపడగలదని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా చీఫ్ ఎకానమిస్ట్ అదితి నాయర్ తెలిపారు.

ఆర్థిక సంవత్సరాల వారీగా ప్రభుత్వానికి ఆర్‌బీఐ డివిడెండ్ చెల్లింపులు ఇలా..



రిస్క్ బఫర్ 7.50 శాతానికి పెంపు..

అంతర్జాతీయ, దేశీ పరిస్థితులు, రిస్కులు మొదలైన అంశాలను సమావేశంలో సమీక్షించినట్లు ఆర్‌బీఐ పేర్కొంది. అలాగే, గత ఆర్థిక సంవత్సరంలో రిజర్వ్ బ్యాంక్ పనితీరును కూడా సమీక్షించి వార్షిక నివేదికకు ఆమోదముద్ర వేసినట్లు వివరించింది. ఆర్థిక అత్యవసర పరిస్థితుల కోసం ఉద్దేశించిన కంటింజెంట్ రిస్క్ బఫర్‌ని (సీఆర్‌బీ) ఆర్‌బీఐ బ్యాలెన్స్ షీటులో 7.50 శాతానికి పెంచాలని సెంట్రల్ బోర్డ్ నిర్ణయించింది. 2023–24లో దీన్ని 6.5 శాతానికి పెంచారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..	
ఐదేళ్లలో వజ్రాల డిమాండ్ రెట్టింపు	ఈవీలకు హైబ్రిడ్ వాహనాల దన్ను

అశోక్ లేలాండ్ బోనస్ షేర్లు

1:1 నిష్పత్తిలో జారీ • క్యూ4 లాభం రూ. 1,246 కోట్లు



ముంబై: వాణిజ్య వాహన రంగ దిగ్గజం అశోక్ లేలాండ్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 33 శాతంపైగా జంప్‌చేసి రూ. 1,246 కోట్లను తాకింది. ఆదాయం పుంజుకోవడం ఇందుకు ప్రధానంగా సహకరించింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 934 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 13,542 కోట్ల నుంచి రూ. 14,696 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 12,037 కోట్ల నుంచి రూ. 13,097 కోట్లకు పెరిగాయి. ఈ నెల(మే) 22న చెల్లించిన(రెండో) రూ. 4.25 డివిడెండ్‌ను తుది డివిడెండ్‌గా ప్రకటించింది. మరోవైపు వాటాదారులకు 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్ల జారీకి బోర్డు అనుమతించినట్లు వెల్లడించింది. దీంతో ప్రతీ షేరుకి మరో షేరుని ఉచితంగా జారీ చేయనుంది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి కంపెనీ నికర లాభం రూ. 2,696 కోట్ల నుంచి రూ. 3,383 కోట్లకు బలపడింది. మొత్తం ఆదాయం రూ. 45,703 కోట్ల నుంచి రూ. 48,535 కోట్లకు ఎగసింది. వెరసి క్యూ4తోపాటు పూర్తి ఏడాదిలో రికార్డ్ ఆదాయం సాధించినట్లు కంపెనీ చైర్మన్ ధీరజ్ హిందుజా పేర్కొన్నారు. గతేడాది మొత్తం వాణిజ్య వాహన విక్రయాలు 1,95,093 యూనిట్లను తాకాయి. కంపెనీ ఆర్థికంగా పటిష్టస్థితిలో ఉన్నట్లు కంపెనీ ఎండీ, సీఈవో షేను అగర్వాల్ పేర్కొన్నారు. 2025 మార్చికల్లా రూ. 4,242 కోట్ల నగదు నిల్వలున్నట్లు వెల్లడించారు.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 0.4 శాతం బలపడి రూ. 240 వద్ద ముగిసింది.

పెరిగిన జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ నష్టం



క్యూ4లో రూ. 253 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ (జీఏఎల్) నష్టం (కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన) రూ. 253 కోట్లకు పెరిగింది. అంతక్రితం క్యూ4లో నష్టం రూ. 168 కోట్లు. ఇక సమీక్షాకాలంలో ఆదాయం రూ. రూ. 2,570 కోట్ల నుంచి రూ. 2,977 కోట్లకు చేరింది. 2024–25 పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ నష్టం రూ. 829 కోట్ల నుంచి రూ. 817 కోట్లకు తగ్గింది. ఆంధ్రప్రదేశ్‌లోని భోగాపురంలో అభివృద్ధి చేస్తున్న విమానాశ్రయం పనులు మార్చి ఆఖరు నాటికి సుమారు 69 శాతం పూర్తయినట్లు జీఏఎల్ తెలిపింది. నియంత్రణ సంస్థ ఏఈఆర్ఏ కొత్తగా జారీ చేసిన టారిఫ్ ఆర్డరుతో ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ ఆదాయం, లాభదాయకత మరింత మెరుగుపడతాయని పేర్కొంది. ఈ ఆర్డరు ఏప్రిల్ 16 నుంచి అమల్లోకి వచ్చింది. దీన్ని గత ఆర్థిక సంవత్సరంలోనే జారీ చేసి ఉంటే ఫలితాలు మరింత మెరుగ్గా ఉండేవని సంస్థ వివరించింది. జీఏఎల్‌లో భాగమైన సంస్థలు హైదరాబాద్, ఢిల్లీ, మోపా (గోవా) విమానాశ్రయాలను నిర్వహిస్తున్నాయి. అటు ఇండొనేషియాలోని మెడాన్ ఎయిర్‌పోర్ట్, గ్రీస్‌లోని క్రైటీ ఎయిర్‌పోర్టు కూడా కంపెనీ నిర్వహణలో ఉన్నాయి.

శుక్రవారం బీఎస్‌ఈలో జీఏఎల్ షేరు రెండు శాతం పైగా క్షీణించి రూ. 86.83 వద్ద క్లోజయ్యింది.

సెన్సెక్స్ 769 పాయింట్లు జంప్

- కేంద్రానికి ఆర్‌బీఐ భారీ డివిడెండ్ ఎఫెక్ట్
- అమెరికా బాండ్లపై దిగొచ్చిన రాబడులు
- ఎఫ్‌ఎంసీజీ, ఐటీ షేర్లకు డిమాండ్



ముంబై: స్టాక్ సూచీలకు నష్టాలు ఒకరోజుకే పరిమితయ్యాయి. ఎఫ్‌ఎంసీజీ, ఐటీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో శుక్రవారం ఒకశాతం లాభపడ్డాయి. సెన్సెక్స్ 769 పాయింట్లు పెరిగి 81,721 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 243 పాయింట్లు బలపడి 24,853 వద్ద నిలిచింది. ఆర్‌బీఐ గత ఆర్థిక సంవత్సరానికి (2025)గానూ కేంద్రానికి రూ.2.69 లక్షల కోట్లు డివిడెండ్ ప్రకటన, అమెరికా ట్రెజరీ బాండ్లపై రాబడులు తగ్గడం ఇన్వెస్టర్లకు ఉత్సాహాన్నిచ్చాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్(0.50%), రిలయన్స్ ఇండస్ట్రీస్(1%), ఐటీసీ(2%) షేర్లు రాణించి సూచీలకు ర్యాలీకి దన్నుగా నిలిచాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం ఫ్లాటుగా మొదలయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 953 పాయింట్లు ఎగసి 81,905 వద్ద, నిఫ్టీ 299 పాయింట్లు బలపడి 24,909 వద్ద గరిష్టాన్ని తాకింది. బీఎస్‌ఈలో రంగాల ఇండెక్సుల్లో ఎఫ్‌ఎంసీజీ 1.50%, వినిమయ, విద్యుత్, ఫైనాన్స్ సర్వీసెస్, బ్యాంకెక్స్, ఆయిల్‌అండ్‌గ్యాస్ ఇంధన సూచీలు ఒకశాతం రాణించాయి. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ సూచీలు అరశాతం పెరిగాయి.

అంతర్జాతీయ మార్కెట్లకు 'టారిఫ్ టెర్రర్'

యూరోపియన్ యూనియన్(ఈయూ)తో జరిపిన చర్చలు విఫలం కావడంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈయూలో ఆయా దేశాలపై 50% సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. కొత్త సుంకాలు జూన్ 1 నుంచి అమల్లోకి వస్తాయన్నారు. అమెరికా వెలుపల తయారుచేసిన ఐఫోన్‌లకు 25% దిగుమతి సుంకం ఉంటుందన్నారు. ట్రంప్ అనూహ్య నిర్ణయాలతో ఆసియా, యూరప్ మార్కెట్లు 1–2% నష్టపోయాయి. అమెరికా స్టాక్ సూచీలు ఒకశాతం నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

రూపాయి 50 పైసలు అప్

85.45 వద్ద ముగింపు

డాలర్ ఇండెక్స్ బలహీనత, దేశీ ఈక్విటీ మార్కెట్ బౌన్స్‌బ్యాక్‌తో రూపాయి మూడు రోజుల వరుస నష్టాలకు చెక్ పడింది. డాలర్ మారకంలో శుక్రవారం 50 పైసలు బలపడి 85.45 వద్ద స్థిరపడింది. దీంతో గత మూడు ట్రేడింగ్ సెషన్లలో 53 పైసల పతనాన్ని భర్తీ చేసుకుంది.

విస్తరణపై స్టాండర్డ్ గ్లాస్ దృష్టి

వచ్చే 3 ఏళ్లలో రూ. 130 కోట్ల పెట్టుబడులు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంజినీరింగ్ సొల్యూషన్స్ సంస్థ స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ (ఎస్‌జీఎల్‌టీఎల్) సామర్థ్యాలను పెంచుకోవడంపై మరింతగా దృష్టి పెడుతోంది. ఉత్పత్తి సామర్థ్యాల పెంపుపై వచ్చే 2–3 ఏళ్లలో రూ. 130 కోట్లు పైగా ఇన్వెస్ట్ చేయనుంది. ప్రస్తుతం 60 టన్నుల క్రేన్, 60 మి.మీ. మందం ఫ్యాబ్రికేషన్ సామర్థ్యం ఉండగా .. 100 టన్నుల క్రేన్, 100 మి.మీ. మందం ఫ్యాబ్రికేషన్ స్థాయికి పెంచుకోనున్నట్లు సంస్థ తెలిపింది. అలాగే ప్రస్తుతమున్న 5 వెల్డింగ్ రోబోల సంఖ్యను కూడా గణనీయంగా పెంచుకోనున్నట్లు పేర్కొంది. తద్వారా అంతర్జాతీయంగా హెవీ ఇంజినీరింగ్ విభాగంలో అవకాశాలు అందిపుచ్చుకోనున్నట్లు వివరించింది. మరోవైపు, గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో కంపెనీ నికర లాభం 3 శాతం పెరిగి రూ. 16 కోట్లకు చేరగా, ఆదాయం రూ. 171 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరంలో అన్ని కీలకాంశాల్లోనూ రెండంకెల స్థాయి వృద్ధి సాధించినట్లు కంపెనీ ఎండీ నాగేశ్వరరావు కందుల తెలిపారు. జీఎల్ హక్కా జపాన్, ఐపీపీ యూఎస్ఏతో భాగస్వామ్యాలు, పటిష్టమైన ఆర్డర్ బుక్, కొత్త ప్రొడక్ట్ లైన్స్‌తో ఈసారి మరింత మెరుగ్గా రాణించగలమని ధీమా వ్యక్తం చేశారు.

శుక్రవారం బీఎస్‌ఈలో కంపెనీ షేరు 1% క్షీణించి రూ. 169 వద్ద క్లోజయ్యింది.

సాక్షి స్పోర్ట్స్



సెమీస్‌లో రిత్విక్ జోడీ ఓటమి

మసడోనియా ఓపెన్ ఏటీపీ చాలెంజర్–75 టెన్నిస్ టోర్నీలో భారత డేవిస్ కప్ జట్టు సభ్యుడు, హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరికి నిరాశ ఎదురైంది. నార్త్ మసడోనియా రాజధాని స్కోప్‌జేలో జరుగుతున్న ఈ టోర్నీలో శుక్రవారం పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో మూడో సీడ్ రిత్విక్–విజయ్ సుందర్ ప్రశాంత్ (భారత్) జోడీ 3–6, 3–6తో ఆండ్రూ పాల్సన్–మైకేల్ వెర్‌బెన్‌స్కీ (చెక్ రిపబ్లిక్) ద్వయం చేతిలో ఓడిపోయింది. 70 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో భారత జంట ఏకంగా ఏడు డబుల్ ఫాల్ట్‌లు చేసి, తమ సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయింది. మరోవైపు ఇదే టోర్నీలో భారత మూడో ర్యాంకర్ శ్రీరామ్ బాలాజీ మెక్సికోకు చెందిన రేయస్ వరేలాతో జతకట్టి టైటిల్ పోరుకు అర్హత సాధించాడు. సెమీఫైనల్లో శ్రీరామ్ బాలాజీ–రేయస్ వరేలా ద్వయం 7–5, 6–3తో మార్సెలో డెమోలైనర్–మార్సెలో జోర్మన్ (బ్రెజిల్) జోడీపై విజయం సాధించింది.

14 నెలల తర్వాత...

- అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీలో సెమీఫైనల్ చేరిన శ్రీకాంత్
- మలేసియా ఓపెన్‌లో కొనసాగుతున్న సంచలన ప్రదర్శన



కౌలాలంపూర్: ఎట్టకేలకు భారత అగ్రశ్రేణి బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిడాంబి శ్రీకాంత్ తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేశాడు. మలేసియా ఓపెన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–500 టోర్నీలో 32 ఏళ్ల శ్రీకాంత్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 65వ ర్యాంకర్ శ్రీకాంత్ 24–22, 17–21, 22–20తో ప్రపంచ 18వ ర్యాంకర్ టోమా జూనియర్ పొపోవ్ (ఫ్రాన్స్)పై గెలుపొందాడు. 74 నిమిషాలపాటు హోరాహోరీగా జరిగిన పోరులో శ్రీకాంత్ కీలకదశలో చెలరేగి తుది ఫలితాన్ని శాసించాడు. నిర్ణాయక మూడో గేమ్‌లో శ్రీకాంత్ ఒకదశలో 7–11తో వెనుకబడ్డాడు. కానీ సంయమనం కోల్పోకుండా తన అనుభవాన్నంతా రంగరించి పోరాడిన శ్రీకాంత్ 14–14తో స్కోరును సమం చేశాడు. ఆ తర్వాత 16–14తో ఆధిక్యంలోకి వెళ్లిన శ్రీకాంత్ అదే జోరును కొనసాగించి 20–17తో విజయం అంచుల్లో నిలిచాడు. అయితే పొపోవ్ వరుసగా మూడు పాయింట్లు నెగ్గి స్కోరును 20–20తో సమం చేశాడు. కానీ శ్రీకాంత్ మరో అవకాశం ఇవ్వకుండా వరుసగా రెండు పాయింట్లు నెగ్గి గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. 2024 మార్చిలో స్విస్ ఓపెన్‌లో చివరిసారి శ్రీకాంత్ సెమీఫైనల్ చేరుకున్నాడు. ఆ తర్వాత శ్రీకాంత్ 14 అంతర్జాతీయ టోర్నీల్లో పోటీపడ్డా క్వార్టర్ ఫైనల్ దశను దాటి ముందుకెళ్లలేకపోయాడు. నేడు జరిగే సెమీఫైనల్లో ప్రపంచ 23వ ర్యాంకర్ యుషి తనాకా (జపాన్)తో శ్రీకాంత్ తలపడతాడు. మరోవైపు మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో తనీషా క్రాస్టో–ధ్రువ్ కపిల (భారత్) జోడీ పోరాటం ముగిసింది. క్వార్టర్ ఫైనల్లో తనీషా–ధ్రువ్ ద్వయం 22–24, 13–21తో జియాంగ్ జెన్ బాంగ్–వె యా జిన్ (చైనా) జోడీ చేతిలో ఓడిపోయింది.


నీరజ్ చోప్రాకు రెండో స్థానం



చోర్జో (పోలాండ్): ఈ సీజన్‌లో తాను పాల్గొన్న రెండో ఈవెంట్‌లోనూ భారత స్టార్ జావెలిన్ త్రోయర్ రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. శుక్రవారం జరిగిన జానుస్ కుసోన్‌స్కీ స్మారక అథ్లెటిక్స్ మీట్‌లో నీరజ్ చోప్రా చివరిదైన ఆరో ప్రయత్నంలో తన అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేశాడు. 27 ఏళ్ల నీరజ్ చివరి ప్రయత్నంలో జావెలిన్‌ను 84.14 మీటర్ల దూరం విసిరి మూడో స్థానం నుంచి రెండో స్థానానికి ఎగబాకాడు. ఈనెల 16న జరిగిన దోహా డైమండ్ లీగ్ మీట్‌లోనూ నీరజ్ రెండో స్థానాన్ని సాధించాడు. దోహా డైమండ్ లీగ్ మీట్‌లో అగ్రస్థానంలో నిలిచిన జూలియన్ వెబెర్ (జర్మనీ) అదే జోరును ఇక్కడా కొనసాగించాడు. జూలియన్ వెబెర్ జావెలిన్‌ను 86.12 దూరం విసిరి తొలి స్థానాన్ని పొందగా... రెండుసార్లు ప్రపంచ చాంపియన్ అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా; 83.24 మీటర్లు) మూడో స్థానాన్ని సొంతం చేసుకున్నాడు. తొలి ప్రయత్నంలో ఫౌల్ చేసిన నీరజ్ రెండో ప్రయత్నంలో జావెలిన్‌ను 81.28 మీటర్ల దూరం విసిరాడు. ఆ తర్వాత మూడు, నాలుగు ప్రయత్నాల్లో ఫౌల్ చేసిన నీరజ్ ఐదో ప్రయత్నంలో జావెలిన్‌ను 81.80 మీటర్ల దూరం విసిరాడు. ఆ తర్వాత చివరి ప్రయత్నంలో తన ప్రదర్శనను మరింత మెరుగుపర్చుకొని రెండో స్థానాన్ని ఖరారు చేసుకున్నాడు.

బెంగళూరుకు రైజర్స్ బ్రేక్

- 42 పరుగుల తేడాతో హైదరాబాద్ విజయం
- మెరిసిన ఇషాన్ కిషన్, కమిన్స్



ఇషాన్ కిషన్

లక్నో: 'ప్లే ఆఫ్స్'కు దూరమైన అనంతరం సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొడుతోంది. గత మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ 'ప్లే ఆఫ్స్' ఆశలపై నీళ్లుచల్లిన రైజర్స్... శుక్రవారం రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)ని మరింత ముందుకు వెళ్లకుండా అడ్డుకట్ట వేసింది. శుక్రవారం జరిగిన పోరులో సన్‌రైజర్స్ 42 పరుగుల తేడాతో బెంగళూరుపై గెలుపొందింది. మొదట సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 231 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఇషాన్ కిషన్ (48 బంతుల్లో 94 నాటౌట్; 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) దంచికొట్టగా... అభిషేక్ శర్మ (17 బంతుల్లో 34; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), హెన్రిచ్ క్లాసెన్ (13 బంతుల్లో 24; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), అనికేత్ వర్మ (9 బంతుల్లో 26; 1 ఫోర్, 3 సిక్స్‌లు) మెరుపులు మెరిపించారు. అనంతరం లక్ష్యఛేదనలో బెంగళూరు 19.5 ఓవర్లలో 189 పరుగులకు ఆలౌటైంది. ఫిల్ సాల్ట్ (32 బంతుల్లో 62; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు), విరాట్ కోహ్లి (25 బంతుల్లో 43; 7 ఫోర్లు, 1 సిక్స్) ఆరంభంలో భయపెట్టినా... చివర్లో ఒత్తిడి పెంచిన రైజర్స్ ఫలితం రాబట్టింది. సన్‌రైజర్స్ కెప్టెన్ కమిన్స్ మూడు వికెట్లు పడగొట్టాడు.

ఆరంభం నుంచే దంచుడు...

ఎలాంటి ఒత్తిడి లేకుండా బరిలోకి దిగిన సన్‌రైజర్స్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. రెండో ఓవర్‌లో హెడ్ ఫోర్‌తో ఖాతా తెరవగా... భువనేశ్వర్ వేసిన రెండో ఓవర్‌లో హెడ్ ఫోర్, అభిషేక్ 4, 6 బాదారు. మూడో ఓవర్‌లోనూ అభిషేక్ 4, 6 దంచగా... నాలుగో ఓవర్‌లో ఈ జోడీ 4, 6, 4 కొట్టింది. వీరిద్దరూ మూడు బంతుల వ్యవధిలో అవుట్ కాగా... పవర్‌ప్లే ముగిసేసరికి రైజర్స్ 71/2తో నిలిచింది. క్లాసెన్ ఉన్నంతసేపు మెరుపులు మెరిపించగా... ఇషాన్ కిషన్ నిలకడ కనబర్చాడు. సుయాశ్ శర్మ వేసిన 11వ ఓవర్‌లో అనికేత్ 6, 4, 6 కొట్టి కాసేపటికే ఔట్ కాగా... ఆంధ్రప్రదేశ్ ఆల్‌రౌండర్ నితీశ్ రెడ్డి (4) ప్రభావం చూపలేకపోయాడు. అభినవ్ మనోహర్ (12) కూడా ఎక్కువసేపు నిలవలేకపోగా... ఆఖర్లో బాదే బాధ్యత ఇషాన్ భుజాలకెత్తుకున్నాడు.

ఓపెనర్లు మినహా...

పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలవడమే లక్ష్యంగా బరిలోకి దిగిన బెంగళూరు... భారీ లక్ష్యం కళ్ల ముందు కనిపిస్తున్నా ఏమాత్రం వెరవలేదు. తొలి రెండు ఓవర్లలో ఒక్కో ఫోర్ కొట్టిన కోహ్లి, మూడో ఓవర్‌లో రెండు ఫోర్లు దంచాడు. నాలుగో ఓవర్ వేసిన హర్షల్‌కు అదే శిక్ష వేశాడు. కోహ్లి 7 ఫోర్లు కొట్టే వరకు ఒక్క బౌండ్రీ బాదలేకపోయిన సాల్ట్ ఆ తర్వాత జూలు విదిల్చాడు. దీంతో పవర్‌ప్లే ముగిసేసరికి చాలెంజర్స్ 72/0తో నిలిచింది. తొలి వికెట్‌కు 80 పరుగులు జోడించిన అనంతరం విరాట్ అవుట్ కాగా... పడిక్కల్ స్థానంలో జట్టులోకి వచ్చిన మయాంక్ అగర్వాల్ (11) ఎక్కువసేపు నిలవలేకపోయాడు. 27 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకున్న సాల్ట్ కాసేపటికి వెనుదిరగగా... జితేశ్ శర్మ, రజత్ పాటీదార్ జోరు కొనసాగించారు. దీంతో 14 ఓవర్లు ముగిసేసరికి బెంగళూరు 163/3తో నిలిచింది. విజయానికి 36 బంతుల్లో 69 పరుగులు అవసరమైన దశలో... బెంగళూరు బ్యాటర్లు తడబడటంతో పరాజయం తప్పలేదు.

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అభిషేక్ (సి) సాల్ట్ (బి) ఇన్‌గిడి 34; హెడ్ (సి) షెఫర్డ్ (బి) భువనేశ్వర్ 17; ఇషాన్ కిషన్ (నాటౌట్) 94; క్లాసెన్ (సి) షెఫర్డ్ (బి) సుయాశ్ 24; అనికేత్ (సి) భువనేశ్వర్ (బి) కృనాల్ 26; నితీశ్ రెడ్డి (సి) కృనాల్ (బి) షెఫర్డ్ 4; అభినవ్ మనోహర్ (సి) సాల్ట్ (బి) షెఫర్డ్ 12; కమిన్స్ (నాటౌట్) 13; ఎక్స్‌ట్రాలు 7; మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 231. వికెట్ల పతనం: 1–54, 2–54, 3–102, 4–145, 5–164, 6–188. బౌలింగ్: యశ్ దయాళ్ 3–0–36–0; భువనేశ్వర్ 4–0–43–1; ఇన్‌గిడి 4–0–51–1; సుయాశ్ శర్మ 3–0–45–1; కృనాల్ పాండ్యా 4–0–38–1; షెఫర్డ్ 2–0–14–2.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: ఫిల్ సాల్ట్ (సి) హర్షల్ (బి) కమిన్స్ 62; కోహ్లి (సి) అభిషేక్ (బి) హర్ష్ దూబే 43; మయాంక్ (సి) ఇషాన్ (బి) నితీశ్ 11; పాటీదార్ (రనౌట్) 18; జితేశ్ శర్మ (సి) అభినవ్ (బి) ఉనాద్కట్ 24; షెఫర్డ్ (సి అండ్ బి) మలింగ 0; కృనాల్ (హిట్ వికెట్) (బి) కమిన్స్ 8; టిమ్ డేవిడ్ (సి) క్లాసెన్ (బి) మలింగ 1; భువనేశ్వర్ (బి) కమిన్స్ 3; యశ్ దయాళ్ (సి) అభిషేక్ (బి) హర్షల్ పటేల్ 3; ఇన్‌గిడి (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 16; మొత్తం (19.5 ఓవర్లలో ఆలౌట్) 189. వికెట్ల పతనం: 1–80, 2–120, 3–129, 4–173, 5–174, 6–174, 7–179, 8–186, 9–187, 10–189. బౌలింగ్: కమిన్స్ 4–0–28–3; ఉనాద్కట్ 4–0–41–1; హర్షల్ పటేల్ 3.5–0–39–1; ఇషాన్ మలింగ 4–0–37–2; హర్ష్ దూబే 2–0–20–1; నితీశ్ రెడ్డి 2–0–13–1.

ఐపీఎల్–2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
గుజరాత్	13	9	4	0	18	0.602
పంజాబ్	12	8	3	1	17	0.389
బెంగళూరు	13	8	4	1	17	0.262
ముంబై	13	8	5	0	16	1.292
ఢిల్లీ	13	6	6	1	13	-0.019
లక్నో	13	6	7	0	12	-0.337
కోల్‌కతా	13	5	6	2	12	0.193
హైదరాబాద్	13	5	7	1	11	-0.745
రాజస్తాన్	14	4	10	0	8	-0.549
చెన్నై	13	3	10	0	6	-1.030

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, పా-పాయింట్లు, ర.రే- రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

ఢిల్లీ × పంజాబ్
వేదిక: జైపూర్

రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



షమీకి నో చాన్స్!

- కొత్త కెప్టెన్‌పైనే అందరి దృష్టి
- ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు నేడు జట్టు ప్రకటన

ముంబై: భారత టెస్టు క్రికెట్‌లో కొత్త మార్పుకు సమయం వచ్చింది. దశాబ్దంన్నర పాటు తన ఆటతో టెస్టుల్లో ఉత్సాహం నింపిన విరాట్ కోహ్లితో పాటు సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మ కూడా రిటైర్ కావడంతో పలు మార్పులతో జట్టు సిద్ధం కానుంది. ఇంగ్లండ్‌తో జరిగే ఐదు టెస్టుల సిరీస్ కోసం సెలక్టర్లు నేడు టీమ్‌ను ఎంపిక చేయనున్నారు. కోహ్లి, రోహిత్‌లతో పాటు సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ స్థానాలు భర్తీ చేస్తూ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సెలక్టర్లు కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. అన్నింటికంటే ముందుగా కొత్త టెస్టు కెప్టెన్ ఎంపికపై చర్చ సాగుతోంది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటే శుబ్‌మన్ గిల్‌కే సారథ్యం దక్కే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. జట్టులో ప్రధాన బ్యాటర్‌గా ఉన్న అతనికి ఇప్పటికే కెప్టెన్సీ అనుభవం ఉండటంతో పాటు 25 ఏళ్ల వయసు సానుకూలాంశాలు. నిజానికి ఆస్ట్రేలియాలో రెండు టెస్టులకు నాయకత్వం వహించిన స్టార్ పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రాకు తొలి ప్రాధాన్యత దక్కాల్సి ఉన్నా... అతని ఫిట్‌నెస్ సమస్యలు కెప్టెన్సీకి ప్రతిబంధకంగా మారాయి. బౌలింగ్‌లో సీనియర్ పేసర్ మొహమ్మద్ షమీకి చోటు దక్కడం సందేహంగా మారింది. గాయం నుంచి కోలుకొని తిరిగొచ్చిన తర్వాత చాంపియన్స్ ట్రోఫీ, ఐపీఎల్‌లలో ఆడినా... టెస్టు మ్యాచ్‌లకు సంబంధించి అతని ఫిట్‌నెస్‌పై సందేహాలు ఉన్నాయి. ఐపీఎల్‌లో కూడా పూర్తిగా విఫలమైన షమీ బౌలింగ్‌లో సరైన లయ కనిపించలేదు. ఈ నేపథ్యంలో షమీని ఎంపిక చేయకపోతే ప్రసిధ్ కృష్ణ, అర్ష్‌దీప్, ఖలీల్‌లలో ఒకరికి అవకాశం లభించవచ్చు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.


Reliance
Jio Mart
రెండిటినీ పొదుపు చేస్తుంది
సమయం మరియు డబ్బు
Quick
Quick ఫ్రీ
హోమ్ డెలివరీ
ప్రైస్
గ్యారంటీ
జీరో ఎక్స్‌ట్రా
ఛార్జెస్
ఫ్లాట్ ₹ 100 తగ్గింపు*
మీ మొదటి Quick కిరాణా సరుకుల ఆర్డర్ పై
* ₹399 కనీస షాపింగ్ పై.
కూపన్ కోడ్ వాడండి
JMNEW100
డౌన్‌లోడ్ చేయడానికి స్కాన్
చేయండి
*T&C Apply
ఉల్లిపాయలు 10 kg ప్యాక్
మార్కెట్ ధర ₹ 20 /kg
జియోమార్ట్ ధర
₹ 15/kg
తోతాపురి మామిడి 1 kg
మార్కెట్ ధర ₹ 40
జియోమార్ట్ ధర
₹ 29
మామిడి బంగినపల్లి 1 kg
మార్కెట్ ధర ₹ 80
జియోమార్ట్ ధర
₹ 69
క్వాలిటీ వాల్స్ పార్టీ ప్యాక్స్ / టబ్స్
700 ml మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
ఎమ్ఆర్‌పి ₹ 140 మొదలుకుని
జియోమార్ట్ ధర ₹ 70 మొదలుకుని
ఫ్లాట్
50% తగ్గింపు
బింగో! / ప్రింగల్స్ చిప్స్
75 g (సెలెక్ట్ వేరియంట్స్)
ఎమ్ఆర్‌పి ₹ 20 మొదలుకుని
ఫ్లాట్
40% తగ్గింపు
జియోమార్ట్ ధర ₹ 12 మొదలుకుని
కోల్డ్ డ్రింక్స్ 750 ml / జ్యూసులు
600 ml (సెలెక్ట్ వేరియంట్స్)
ఎమ్ఆర్‌పి ₹ 40 మొదలుకుని
ఫ్లాట్
25% తగ్గింపు
జియోమార్ట్ ధర ₹ 30 మొదలుకుని
గోల్డ్ డ్రాప్ / ఫ్రీడమ్ విన్నర్ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్
ఆయిల్ 1 L
ఎమ్ఆర్‌పి ₹ 185 / ₹ 164
జియోమార్ట్ ధర
₹ 147/ ₹ 148
ఆదా చేసుకోండి ₹ 38 / ₹ 16
మెక్కేన్ ఫ్రెంచ్ ఫ్రైస్ 420 g
ఎమ్ఆర్‌పి ₹ 125
జియోమార్ట్ ధర
₹ 49
ఆదా చేసుకోండి ₹ 76
ట్రెసెమె / హిమాలయ / డవ్ షాంపు
340 ml (సెలెక్ట్ వేరియంట్స్)
ఎమ్ఆర్‌పి ₹ 310 మొదలుకుని
ఫ్లాట్
33% తగ్గింపు
జియోమార్ట్ ధర ₹ 207 మొదలుకుని
టైడ్ 6 kg + 2 kg / సర్ఫ్ ఎక్సెల్ డిటర్జెంట్ పౌడర్
7 kg / ఏరియల్ / సర్ఫ్ ఎక్సెల్ మ్యాటిక్ లిక్విడ్ 4 L /
కంఫర్ట్ ఫ్యాబ్రిక్ కండిషనర్ 2 L (సెలెక్ట్ వేరియంట్స్)
ఎమ్ఆర్‌పి ₹ 550 మొదలుకుని
ఫ్లాట్
40% తగ్గింపు
జియోమార్ట్ ధర ₹ 330 మొదలుకుని
నియమ నిబంధనలు వర్తిస్తాయి. స్టాక్స్ ఉన్నంతవరకు ఆఫర్లు చెల్లుతాయి. ఆఫర్లన్నీ నోటీస్ చేయకుండానే మార్పు చేయబడగలవు. చూపించబడిన ఉత్పాదనల బొమ్మలు/ఫోటోగ్రాఫ్‌లు కేవలం ప్రదర్శన కోసం మాత్రమే. ఉత్పాదనలన్నిటి యొక్క ఎమ్ఆర్‌పి అన్ని పన్నులతో కూడి ఉంటుంది. డిస్కౌంట్ పర్సెంటేజ్ మా ఆఫర్ ధర యొక్క సమీప పర్సెంటేజ్‌కు రౌండ్ ఆఫ్ చేయబడింది. ఇతర ఆఫర్లన్నీ 25 మే 2025 వరకు చెల్లుతాయి, ఎంపిక పిన్ కోడ్‌లో. ఆక్షేపణలన్నీ ముంబయిలోని కోర్టుల ప్రత్యేక అధికారానికి మాత్రమే లోబడి ఉంటాయి.

ఇటుకల రక్షణకు కిటుకు



అకాల వర్షాలతో అన్నదాతకే కాదు ఇటుక బట్టీ యజమానులకు సైతం తిప్పలు తప్పడం లేదు. రూ.లక్షలు వెచ్చించి ఒడిశా, బిహార్ రాష్ట్రాల నుంచి తీసుకొచ్చిన కార్మికులకు పని కల్పించలేక, చేసిన ఇటుకలు అరక వర్షాలతో మట్టిలో కలిసిపోతున్నాయని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా రంగాపూర్, రాఘవాపూర్ గ్రామాల శివార్లలోని ఇటుక బట్టీల్లో ఇటుకలపై పరదాలు కప్పి కాపాడుకుంటున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

'జలే'శ్వరం!



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం దేవస్థానం ఆవరణలో శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి భారీగా వరద నీరు నిలిచిపోయింది. ఆ నీటిలో కాళేశ్వరాలయ ప్రతిబింబం కనువిందు చేసింది.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్

రాష్ట్రంలో తగ్గిన ఉపాధి హామీ పనిదినాలు



రోజుకు రూ. 300కు బదులుగా సగటున రూ. 213 వేతనాన్ని పొందుతున్న కార్మికులు

- కార్మికులకు రూ. 1,059 కోట్ల వేతనం తక్కువగా చెల్లింపు
- 36.5%తో ములుగు జిల్లాలో అత్యధిక వృద్ధి
- 25.3% తగ్గుదలతో చివరి స్థానంలో మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా
- లిబ్‌టెక్ ఇండియా విడుదల చేసిన నివేదికలో వెల్లడి

నివేదికలోని ప్రధానాంశాలు

- ఉపాధి హామీ పథకంలో పాల్గొన్న కుటుంబాలు: 25.33 లక్షల నుంచి 26.68 లక్షలకు పెరిగాయి (5.3%)
- పనిదినాల సగటు: 47.71 నుంచి 45.80కి తగ్గింది
- 100 రోజుల ఉద్యోగం పూర్తి చేసిన కుటుంబాలు: 1.35 లక్షల నుంచి 0.93 లక్షలకు తగ్గింది. (-31.1%)
- ప్రభుత్వం ప్రకటించిన వేతనం: రూ.300, కానీ వాస్తవంగా అందినది రూ.213 మాత్రమే
- వేతన లోటు: రూ.1,059 కోట్లు (40.6%)
- కార్మికుల తొలగింపులు: గత మూడేళ్లలో 21 లక్షల మంది తొలగింపు
- రాష్ట్రం నూతన జాబ్‌కార్డుల పునరుద్ధరణకు చర్యలు తీసుకోలేదు.

సాక్షి, న్యూఢిల్లీ

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రాష్ట్రంలో అమలైన తీరుపై తాజా గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. పథకంలో పాల్గొనే కుటుంబాల సంఖ్య పెరుగుతున్నా వారికి అందుతున్న పనిదినాలు మాత్రం తగ్గిపోతున్నాయి. లిబ్‌టెక్ ఇండియా ఇటీవల విడుదల చేసిన 'తెలంగాణ ట్రాకర్ 2024–25'ప్రకారం గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే పలుచోట్ల అభివృద్ధి కనిపించినా కీలకాంశాల్లో మందగమనమే కనిపిస్తోంది.

సగటు పనిదినాల్లో క్షీణత..

గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పని చేసిన ప్రత్యేక కుటుంబాల సంఖ్య జాతీయ స్థాయిలో 3.5% తగ్గుదల నమోదవగా తెలంగాణలో మాత్రం 5.3% పెరుగుదల నమోదైంది. ఈ సంఖ్య 25.33 లక్షల నుంచి 26.68 లక్షలకు పెరిగింది. అదే సమయంలో ప్రతి ఇంటికి సగటు పనిదినాలు 47.7 నుంచి 45.8కి తగ్గాయి. వంద రోజుల పని పూర్తిచేసే కుటుంబాలు 31% తగ్గాయి. ఇది జాతీయ క్షీణత కంటే మూడురెట్లు ఎక్కువ కావడం గమనార్హం. దేశవ్యాప్తంగా వ్యక్తిగత పనుల్లో 7% తగ్గుదల నమోదవగా తెలంగాణలో మాత్రం మొత్తం ఉద్యోగ దినాలు 1.1% పెరిగాయి. గతేడాదితో పోలిస్తే సంవత్సర ప్రారంభంలో పెరుగుదల నమోదైంది. వ్యక్తిగత పనిదినాల్లో 2024 ఏప్రిల్, మే నెలల్లో 88%, 35% వృద్ధి నమోదైన తర్వాత తగ్గుదల కనిపించింది.

వేతన నష్టం..

గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వేతన రేటు రూ. 272 నుంచి రూ. 300కు పెంచినట్లు ప్రకటించినప్పటికీ కార్మికులు రోజుకు సగటున రూ. 213 మాత్రమే పొందారు. కార్మికులకు అంచనా వేసిన వేతన నష్టం రూ.1,059 కోట్లుగా ఉంది. కాగా ఈ పథకం నుంచి గత మూడేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 21 లక్షల మంది కార్మికులు ఎంజీఎన్ఆర్ఇజీఏ జాబితా నుంచి తొలగించబడ్డారు. ఇతర రాష్ట్రాలు తిరిగి కార్మికులను చేర్చుకొనే ప్రక్రియలు చేపడుతున్నా తెలంగాణలో మాత్రం ప్రభుత్వం స్పందించకపోవడం ఆందోళన కలిగిస్తోందని నివేదిక పేర్కొంది. తప్పుగా తొలగించిన లబ్ధిదారులను పునరుద్ధరించడంలో తెలంగాణ ఇతర రాష్ట్రాల కంటే వెనుకబడి ఉంది.

జిల్లాలవారీగా చూస్తే..

గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 32 జిల్లాల్లో 17 జిల్లాలు పెరిగిన ఉద్యోగ దినాలను నమోదు చేశాయి. ములుగు జిల్లాలో 36.5%, కామారెడ్డి జిల్లాలో 24.6%, వరంగల్ జిల్లాలో 23.7% అత్యధిక పెరుగుదల నమోదవగా మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలో -25.3%, సంగారెడ్డి జిల్లాలో -19.2%, మహబూబాబాద్ జిల్లాలో-18.1% అత్యధిక తగ్గుదల నమోదైంది. గ్రామీణ పనులకు డిమాండ్ ఉన్నప్పటికీ పాలనాపరమైన అడ్డంకులు, వేతనంలో తగ్గుదల, మినహాయింపులు తెలంగాణలో పథకం లక్ష్యాలను బలహీనపరుస్తున్నాయని నివేదిక పేర్కొంది.

మంత్రివర్గంలో మాదిగలుండాలి

కాంగ్రెస్ అధిష్టానానికి ఎమ్మెల్యేలు శామేల్, లక్ష్మణ్‌కుమార్ విజ్ఞప్తి






సాక్షి, హైదరాబాద్: తాము ఎవరికీ వ్యతిరేకం కామని, అయితే కాంగ్రెస్ పార్టీకి అండగా నిలుస్తున్న మాదిగ సామాజికవర్గానికి మంత్రివర్గంలో చోటు కల్పించాలని ఆ పార్టీ ఎమ్మెల్యేలు మందుల శామేల్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లు అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీఎల్పీ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఏకపక్షంగా కాంగ్రెస్ పార్టీకి ఓట్లేసిన మాదిగలకు న్యాయం జరగాలని కోరారు. దీనిపై మల్లికార్జున ఖర్గే, సోనియా, రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్, మీనాక్షి నటరాజన్‌లను కలిసి త్వరలోనే విజ్ఞప్తి చేస్తామని చెప్పారు.

సంధ్య హోటళ్లపై యథాతథస్థితి


కూల్చివేతలపై హైడ్రాను ఆదేశించిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలోని సర్వే నంబర్ 124, 125లో ఉన్న సంధ్య హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లోని మినీ మాల్, ఇతర నిర్మాణాల కూల్చివేతలపై తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు యథాతథస్థితి కొనసాగించాలని హైడ్రాను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ ఈ నెల 28కి వాయిదా వేసింది. చట్టబద్ధమైన ప్రక్రియను పాటించకుండా, ఉద్దేశపూర్వకంగా హైడ్రా కూల్చివేత చేపట్టిందని, హస్త కళాకారులు చేసిన నిర్మాణాల కూల్చివేతకు తగిన పరిహారం చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ సంధ్య హోటల్స్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించినందుకు సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ నెల 6న సంధ్య హోటళ్లకు చెందిన యూఎస్ఓఎస్, మ్యాంగో నిర్మాణాలను హైడ్రా అక్రమంగా కూల్చివేసిందని పిటిషనర్ తరపు న్యాయవాది పేర్కొన్నారు. సంధ్య హోటల్స్ యజమాని సొసైటీ లేఅవుట్‌లోని ప్లాట్లను ఆక్రమించారన్న ఫిర్యాదు మేరకే చర్యలు చేపట్టామని హైడ్రా తరపు న్యాయవాది వెల్లడించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణ వరకు యథాతథస్థితి విధిస్తూ విచారణ వాయిదా వేశారు.

కవితకు కృతజ్ఞతలు

ప్రభుత్వ విప్ అయిలయ్య



సాక్షి, హైదరాబాద్: మునిగిపోయే నావ బీఆర్ఎస్ నుంచి.. బయటికి దూకాలని ఎమ్మెల్సీ కవిత చూస్తున్నారని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్, బీజేపీల మధ్య ఒప్పందాన్ని బయట పెట్టినందుకు ఆమెకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని వ్యాఖ్యానించారు. అయితే, ఈ విషయాన్ని పార్లమెంటు ఎన్నికల కంటే ముందే బయట పెట్టాల్సిందని, అప్పుడు బీజేపీకి.. ఆ మేరకు కూడా సీట్లు వచ్చేవి కావని చెప్పారు. ఆయన శుక్రవారం సీఎల్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కవిత రాసిన లేఖపై కేసీఆర్ కుటుంబ సభ్యులు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. మేడిగడ్డలో కాంగ్రెసోళ్లు బాంబులు పెట్టారని అడ్డగోలుగా మాట్లాడుతున్న కేటీఆర్.. నిజంగా ఆ ప్రాజెక్టు నిర్మాణంలో ఎలాంటి అవినీతి జరగకపోతే సీబీఐ విచారణ కోరాలని సూచించారు. బీజేపీలో బీఆర్ఎస్‌లో విలీనం అవుతుందని, ఆ పార్టీ గురించి ఆలోచించే సమయం సీఎం రేవంత్‌కు లేదని బీర్ల అయిలయ్య స్పష్టం చేశారు.


కవిత ప్రశ్నలకు ఎవరు బదులిస్తారు?

తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్, బీజేపీల మధ్య ఉన్న బంధం ఏమిటో.. ఆ పార్టీ ఎమ్మెల్సీ కవిత రాసిన లేఖతోనే తేటతెల్లమైందని తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఎద్దేవా చేశారు. ఆ లేఖలో కవిత అడిగిన ప్రశ్నలకు బీఆర్ఎస్‌లో ఎవరు సమాధానం చెబుతారో తేల్చుకోవాలని సూచించారు. ఆయన శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు వేర్వేరు కాదని గతంలో ఎన్నోసార్లు చెప్పామని, ఇప్పుడు కవిత రాసిన లేఖతో ఇది స్పష్టమైందన్నారు. తెలంగాణను అవమానించిన బీజేపీతో కలిసి పనిచేస్తున్నందుకు బీఆర్ఎస్ నేతలు.. తెలంగాణ సమాజానికి క్షమాపణలు చెప్పాలని మెట్టు సాయికుమార్ డిమాండ్ చేశారు.

11 ప్రశ్నలకు కవిత సమాధానమివ్వాలి

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: అమెరికా నుంచి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. కవిత 11 ప్రశ్నలకు సమాధానం చెప్పాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కవిత రాసిన లేఖను ఎవరు లీక్ చేశారు?, కేసీఆర్ దేవుడైతే దెయ్యం ఎవరు?, కోవర్టులెవరు?, మీపై కుట్ర చేస్తున్నదెవరు?, కలిసి మాట్లాడకుండా లేఖ ఎందుకు రాశారు?, ఫామ్‌హౌజ్‌లోకి ప్రవేశం లేకపోతే అడ్డుకుంటోంది ఎవరు?, లేఖ లీకేజీపై కేసీఆర్‌ను వివరణ అడుగుతారా?, కేటీఆర్ గురించి మీరెందుకు మాట్లాడడం లేదు?, ఇంత జరుగుతున్నా మీ కుటుంబం మీకెందుకు అండగా నిలవడం లేదు?, మీకు స్వాగతం పలికేందుకు బీఆర్ఎస్ నేతలెవరూ విమానాశ్రయానికి ఎందుకు రాలేదు?, మీ లేఖ నకిలీదని పార్టీ పత్రికలో రాయించింది ఎవరు?.. తదితర ప్రశ్నలకు సమాధానం చెప్పాలని ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

రేవంత్ బండారం బట్టబయలు

మాజీ మంత్రి వేముల



సాక్షి, హైదరాబాద్: నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ చార్జిషీట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పేరును ప్రస్తావించడంతో.. బండారం బయటపడిందని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. పదవుల ఆశచూపి విరాళాలు వసూలు చేశారని శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. నాడు పీసీసీ అధ్యక్షునిగా ఉన్నప్పుడే.. విరాళాల కోసం రేవంత్ ఒత్తిడి తీసుకొచ్చినట్లు ఈడీ పేర్కొందని వెల్లడించారు. ఇప్పుడు ముఖ్యమంత్రి హోదాలో కూడా అదే జరుగుతోందని, ఢిల్లీకి మూటలు పంపుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎంలా మారిందని చెబుతూనే ఉన్నామని గుర్తు చేశారు. ఆ విషయం ఈడీ చార్జిషీట్‌తో మరోమారు స్పష్టమైందని తెలిపారు. కమీషన్లు లేనిదే పనులు కావడం లేదని మంత్రి కొండా సురేఖ స్వయంగా చెప్పారని, 30 శాతం కమీషన్లు అని కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి బహిరంగంగా చెప్పారని పేర్కొన్నారు. దీనిపై రేవంత్ రెడ్డి ఇప్పుడు మాట్లాడాలని, ఈడీ కేసు విషయంలోనూ సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీటిపై కేంద్రం వెంటనే చర్యలు తీసుకోవాలని వేముల కోరారు.



జహీరాబాద్ నియోజకవర్గం ఝరాసంగం మండలం మచ్నూర్ గ్రామశివారులో నిర్మించిన కేంద్రీయ విద్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఓ చిన్నారితో కరచాలనం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



శుక్రవారం జహీరాబాద్‌లో బహిరంగ సభ నిర్వహించిన సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్‌లో తెలంగాణ తల్లి విగ్రహం బొమ్మను కొనుగోలు చేస్తున్న మంత్రి కొండా సురేఖ. చిత్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర తదితరులు

మన ప్లాస్టిక్ పరిశ్రమకు అంతర్జాతీయ సామర్థ్యం

పరిశ్రమల శాఖ డైరెక్టర్ డాక్టర్ జి.మల్సూర్

సాక్షి, హైదరాబాద్: భారతీయ ప్లాస్టిక్, పాలీమర్ పరిశ్రమకు అంతర్జాతీయంగా అగ్రస్థానానికి ఎదిగే సామర్థ్యం ఉందని రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ డాక్టర్ జి.మల్సూర్ అన్నారు. సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (సిపెట్) భాగస్వామ్యంతో రాష్ట్ర పరిశ్రమల విభాగం శుక్రవారం ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించింది. ప్లాస్టిక్, పాలీమర్ పరిశ్రమల రంగంలో సాంకేతిక అంతరాలను మదింపు చేసేందుకు జరగాల్సిన అధ్యయనంపై ఈ వర్క్‌షాప్‌లో చర్చించారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్సూర్ మాట్లాడుతూ ప్లాస్టిక్, పాలీమర్ రంగాల్లో పర్యావరణ అనుకూల ఆధునిక సాంకేతికతను అనుసరించాలని సంబంధిత వర్గాలకు పిలుపునిచ్చారు. ఎంఎస్ఎంఈ రంగంలో పరిశోధన, భాగస్వామ్య వాతావరణాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలను చేరుకోవడానికి ఎంఎస్ఎంఈలు అధునాతన సాంకేతికతను అనుసరించడంతోపాటు నైపుణ్యం పెంచుకోవాలని పరిశ్రమల శాఖ అదనపు డైరెక్టర్ రాజ్‌కుమార్ ఓటర్ సూచించారు. డేటా ఆధారిత పాలసీ రూపకల్పనతోపాటు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్లాస్టిక్, పాలీమర్ పరిశ్రమల రంగంలో పరిష్కారాలు కనుగొనాలని అదనపు డైరెక్టర్ మధుకర్ బాబు పిలుపునిచ్చారు. వర్క్‌షాప్‌లో తెలంగాణ, ఏపీ ప్లాస్టిక్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి అరుణ్ లాహోటీ, సిపెట్ ప్రిన్సిపల్ డైరెక్టర్ బి.రవి ప్రసంగించారు.

కేఏ పాల్ సభకు హైకోర్టు అనుమతి

సాక్షి, హైదరాబాద్: ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ శనివారం సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో ప్రపంచ శాంతి ఉత్సవం నిర్వహించుకొనేందుకు హైకోర్టు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది. సభలో వెయ్యి మందికి మించి ప్రజలు పాల్గొనరాదని.. ప్రార్థనలు మినహా ఇతర ప్రేరేపిత ప్రసంగాలు చేయరాదని సభ నిర్వహిస్తున్న గ్లోబల్ పీస్ ఫెస్టివల్‌కు స్పష్టం చేసింది. సభ శాంతియుతంగా సాగేలా పోలీసులు చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఏదైనా అనుకోని ఘటన జరిగితే దానికి సొసైటీనే బాధ్యత వహించాల్సి ఉంటుందని తేల్చిచెప్పింది. నిబంధనలు ఉల్లంఘించినా లేక దేశ ప్రయోజనాలకు, సమగ్రతకు విరుద్ధమైన నినాదాలు చేసినా పోలీసులు చర్యలు తీసుకోవచ్చని ఉన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. సభకు పోలీసులు అనుమతి నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ గోస్పెల్ సొసైటీ హైకోర్టులో దాఖలు చేసిన హౌస్‌మోషన్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

మొద్దు.. కుక్కకు హద్దు



అటు, ఇటు పరుగెత్తుతూ.. రంకెలు వేస్తూ దాడి చేస్తాయని మొండి పశువులు, వయసు మీద ఉండే కోడెలేగల మెడకు మొద్దులు వేయడం సహజం. కానీ, కుక్క మెడకు మొద్దు వేశాడొక గొర్రెల కాపరి. హనుమకొండ జిల్లా అంబాలకు చెందిన ఓ గొర్రెల కాపరి తన జీవాల రక్షణ కోసం ఓ కుక్కను పెంచుతున్నాడు. కానీ ఆ కుక్క మందవెంట వస్తూ.. ఆ మార్గంలో వెళ్లే బాటసారులు, వాహనచోదకులపై దాడి చేస్తోంది. దీంతో ఆ గొర్రెల కాపరి.. తన కుక్క పరుగులు తీయకుండా.. దాని మెడకు ఇలా మొద్దు వేశాడు.

- హసన్‌పర్తి

సాగర తీరాన యోగా



మానసిక, శారీరక ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడే యోగాకు ప్రస్తుతం విశేష ప్రాచుర్యం లభిస్తోంది. యోగా డే వేడుకల్లో భాగంగా మూడో రోజు విశాఖలోని ఆర్కే బీచ్‌లో పలువురు శిక్షకులు, అభ్యాసకులు యోగాసనాలతో ఆకట్టుకున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

తిరునగరం.. దేదీప్యమానం



నిర్మల ఆకాశం నీలివర్ణంలో మెరిసిపోతోంది. దేవదేవుని పాదాల చెంత తిరుపతి నగరం ఆధ్యాత్మిక సౌరభాలు వెదజల్లుతోంది. కనుచూపు మేర విస్తరించిన నగరం విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా ప్రకాశిస్తోంది. ఈ మనోహర దృశ్యాన్ని తిరుమల మొదటి ఘాట్ రోడ్ నుంచి సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

తొలకరికి ముందే జలసిరి



కర్నూలు జిల్లాలో గత రెండు వారాలుగా కురుస్తున్న వర్షాలకు సుంకేశుల డ్యాం జలసిరితో కళకళలాడుతోంది. డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోవడంతో ఒక గేటు ఎత్తి నీటిని కిందికి వదులుతున్నారు. తొలకరికి ముందే డ్యాం నిండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పొలాలను సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

క్లుప్తంగా...

లేపాక్షి, ఆప్కో సంస్థల ఒప్పందం

సాక్షి, అమరావతి: రాష్ట్ర సాంస్కృతిక సంపదకు ప్రాచుర్యం కల్పించేందుకు లేపాక్షి, ఆప్కో సంస్థలు భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. విజయవాడలోని ఆప్కో కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా సమక్షంలో రెండు సంస్థల అధికారులు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. దీని ద్వారా రెండు సంస్థల షోరూంలలో హస్తకళలు, చేనేత ఉత్పత్తులను ప్రదర్శించి విక్రయించనున్నారు. ఈ భాగస్వామ్యం రాష్ట్ర శిల్పకారులు, నేత కార్మికులకు కొత్త మార్కెట్ అవకాశాలను అందిస్తుందని సిసోడియా చెప్పారు. కళాకారుల జీవనోపాధిని మెరుగుపరుస్తుందన్నారు. ఈ భాగస్వామ్యం వాణిజ్యపరంగా కొత్త మైలురాయిగా నిలుస్తుందని ఆప్కో, లేపాక్షి ఎండీ విశ్వ మనోహరన్ తెలిపారు. ఉత్పత్తుల పంపిణీ, షోరూంలలో ప్రదేశాల కేటాయింపు, ఖర్చు తగ్గింపుపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వ్యర్థాలను సంపదగా మారుస్తాం

సాక్షి, అమరావతి: వ్యర్థాలను సంపదగా మార్చడం ద్వారా ఉద్యోగ అవకాశాలను పెంచడమే లక్ష్యమని కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్య చెప్పారు. విజయవాడలోని ఒక హోటల్‌లో సర్క్యులర్ ఎకానమీ అమలుపై జరిగిన రెండోరోజు వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. బట్టీలలో సహ–ప్రాసెసింగ్ యూనిట్లు, సౌర వ్యర్థ నిర్మూలన వంటి వినూత్న పద్ధతులపై దృష్టి సారించినట్లు తెలిపారు. నగరాల్లో వ్యర్థాలు వేరు చేయడం, ట్రాకింగ్ విధానాలను బలోపేతం చేయడం వంటి అంశాలపై నిపుణులతో చర్చిస్తున్నట్లు తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణను మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ నిపుణులు, మెటీరియల్ రీసైక్లింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పాల్గొన్నారు. ప్లాస్టిక్, ఈ–వ్యర్థాలు, బ్యాటరీ, సోలార్ ప్యానెల్ వ్యర్థాల నిర్వహణపై చర్చలు జరిగాయి.

ఇక నిధి వర్క్స్ మాడ్యూల్‌లోనే బిల్లుల ప్రాసెసింగ్

సాక్షి, అమరావతి: పనుల బిల్లులన్నీ ఇక నిధి వర్క్స్ మాడ్యూల్‌లోనే ప్రాసెస్ చేయాలని ఆర్థికశాఖ స్పష్టం చేసింది. అన్ని ఇంజనీరింగ్ విభాగాలు, కార్పొరేషన్లుసహా పనులు అమలు చేస్తున్న విభాగాలన్నీ బిల్లుల ప్రాసెస్‌ను దశల వారీగా నిధి వర్క్స్ మాడ్యూల్‌లో అమలు చేయాలని ఆదేశిస్తూ ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 22వ తేదీ నుంచి పలు దశల్లో శాఖల వారీగా నిధి వర్క్స్ మాడ్యూల్ అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు ఇందుకు అనుగుణంగా అన్ని విభాగాల్లో కార్యకలాపాలు ఆగస్టు 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయి. పనుల తనిఖీ, నాణ్యత, ఆడిట్, అవసరమైన ఆర్థిక నియంత్రణలు నిధి వర్క్స్ మాడ్యూల్‌లో నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. దీనితో ఈ ప్రక్రియ అంతా ఇకపై డిజిటల్‌గా జరుగుతుంది. డైరెక్టర్ ఆఫ్ వర్క్స్ అకౌంట్స్ ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం అన్ని పని బిల్లుల ప్రాసెస్‌కు యూజర్లందరూ: https://nidhi.-apcfss.inలో లాగిన్ అవ్వాలి.

చిత్తడి నేలల సంరక్షణకు కమిటీల ఏర్పాటు

సాక్షి, అమరావతి: చిత్తడి నేలల (సంరక్షణ మరియు నిర్వహణ) నియమాలు–2017 ప్రకారం రాష్ట్ర వెట్‌ల్యాండ్ అథారిటీ కోసం రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక, ఫిర్యాదుల కమిటీలను ఏర్పాటు చేసింది. సాంకేతిక కమిటీలో గ్రామీణాభివృద్ధి, రెవెన్యూ, నీటి వనరుల ప్రధాన కార్యదర్శులు, వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) డైరెక్టర్ ఫరీదా టంపల్, ఆంధ్రా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ కె.కామేశ్వరరావు, ఎం.ఎస్.స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ నుంచి రామ్ సుబ్రమణ్యం సభ్యులుగా ఉన్నారు. ఫిర్యాదుల కమిటీలో నీటి వనరులు, మత్స్య విభాగం ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర జీవ వైవిధ్య బోర్డు సభ్య కార్యదర్శి, సంబంధిత జిల్లా కలెక్టర్, అటవీ అధికారి తదితరులు ఉన్నారు.

నాణ్యత తెల్లబోతోంది!

బీటీ పత్తి విత్తనాలకు సొంత ధ్రువీకరణ

- కంపెనీల తీరుపై వ్యవసాయ శాఖ మీనమేషాలు
- కో–మార్కెటింగ్ పేరిట బీటీ పత్తి విత్తన వ్యాపారం
- సిస్టర్ కన్సల్టెన్సీ, సబ్ డీలర్ల పేరుతో దందా
- తరచూ విత్తనం కారణంగా దెబ్బతింటున్న పంట
- గతంలో నిండా ముంచిన 'కావేరి-జాదు'
- బీటీ-2 పత్తి విత్తన ప్యాకెట్లు బ్లాక్ విక్రయాలు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండు, మూడేళ్ల క్రితం కావేరి-జాదు రకం బీటీ పత్తి విత్తనాలు రైతులను నిండా ముంచేశాయి. 17 మండలాల్లో దాదాపు 2,400 ఎకరాల్లో పత్తి దెబ్బతినగా.. 1,899 మంది రైతులు నష్టపోయారు. ఎకరాకు 3 క్వింటాళ్ల వరకు నష్టం జరిగిందని, క్వింటాకు రూ.7,300 ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని జిల్లా అధికార యంత్రాంగం ఆదేశాలు ఇచ్చింది. దీనిపై కావేరి కంపెనీ హైకోర్టును ఆశ్రయించగా వ్యవసాయ శాఖ కమిషనర్‌కు అప్పీల్ చేసుకోవాలనే తీర్పు వచ్చింది. ఆ మేరకు అప్పీలు చేసుకోగా.. సుదీర్ఘ విచారణ తర్వాత పరిహారాన్ని కొంత మేర తగ్గిస్తూ జడ్జిమెంట్ వచ్చింది. అయితే ఆ ప్రకారం కూడా కంపెనీ రైతులకు పరిహారం చెల్లించకపోవడం గమనార్హం.

... కంపెనీలపై వ్యవసాయ శాఖ పర్యవేక్షణ లేకపోవడం.. విత్తన ధ్రువీకరణ కంపెనీలే సొంతంగా చేసుకోవడం కారణంగా పంట దెబ్బతిన్న సమయంలో రైతులు కోలుకోలేని విధంగా నష్టపోతున్నారు.

- 450 గ్రాముల బీటీ–2 పత్తి విత్తన ప్యాకెట్ ఎంఆర్‌పీ రూ.901. నూజివీడు కంపెనీ రేవంత్ రకం ప్యాకెట్లను రూ.1,300 పైబడిన ధరతో అమ్ముతున్నట్లు తెలుస్తోంది.
- యుఎస్ అగ్రీ కంపెనీకి చెందిన 7067 రకాన్ని రూ.1,200 వరకు బ్లాక్‌లో అమ్మకాలు సాగిస్తున్నట్లు సమాచారం.



వెల్దుర్తిలో పట్టుబడిన నకిలీ బీటీ పత్తి విత్తన ప్యాకెట్లు (ఫైల్)

- బీటీ టెక్నాలజీని మ్యాన్‌శ్యాంటో కంపెనీ తెచ్చింది. బీటీ టెక్నాలజీని పొంది విత్తనోత్పత్తి, ప్యాకింగ్, మార్కెటింగ్ చేసుకోవాలంటే మ్యాన్‌శ్యాంటో నుంచి లైసెన్స్ తీసుకోవడం తప్పనిసరి. ఈ కంపెనీ నుంచి తెలుగు రాష్ట్రాల్లో 45 కంపెనీలకు లైసెన్‌లు ఉండగా.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఒకే ఒక్క కంపెనీకి మాత్రమే లైసెన్స్ ఉంది.
- కో–మార్కెటింగ్ పేరుతో ఉమ్మడి జిల్లాలో 10 వరకు కంపెనీలు ఉండగా.. సిస్టర్ కన్సల్టెన్సీ, సబ్ డీలర్స్ పేరుతో వందలాది కంపెనీల బీటీ పత్తి విత్తన ప్యాకెట్ల మార్కెటింగ్‌లో నిమగ్నమయ్యాయి.

కర్నూలు(అగ్రికల్చర్): ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రం మొత్తం మీద పత్తి 5,28,361 హెక్టార్లలో సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా. ఇందులో ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే దాదాపు 50 శాతం వరకు సాగవుతోంది. కర్నూలు జిల్లాలో 2,34,409 హెక్టార్లు, నంద్యాల జిల్లాలో 18,827 హెక్టార్లలో పత్తి సాగయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. నల్లరేగడి నేలలు ఎక్కువగా ఉండటం వల్ల దశాబ్దాలుగా పత్తి రైతుల పాలిట తెల్ల బంగారం అవుతోంది. ఇక్కడ హైబ్రిడ్ పత్తి, బీటీ పత్తి విత్తనోత్పత్తి కూడా ఎక్కువగా ఉంటోంది. విత్తన కంపెనీల దృష్టి కూడా ఉమ్మడి కర్నూలు జిల్లాపైనే ఉండటం గమనార్హం. రాష్ట్రం మొత్తం మీద జరిగే మార్కెటింగ్ ఒక ఎత్తు అయితే, ఇక్కడి మార్కెటింగ్ మరో ఎత్తు. జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో పత్తి సాగుకు విత్తనాలు సిద్ధం చేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని విధంగా ఇక్కడ కో–మార్కెటింగ్, సిస్టర్ కన్సల్టెన్సీ, సబ్ డీలర్స్.. ఇలా రకరకాల పేర్లతో పత్తి విత్తన ప్యాకెట్లను అమ్మకానికి పెట్టినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఏది ఒరిజినల్, ఏది నకిలీ తెలుసుకోవడం రైతులకు కష్టంగా మారింది. **వాస్తవానికి కో–మార్కెటింగ్ అనేది లేదు. కానీ** అనధికారికంగా సిస్టర్ కన్సల్టెన్సీ, సబ్ డీలర్స్ పేర్లతో రైతులను దగా చేస్తున్నా వ్యవసాయ శాఖ చేష్టలుడిగి చూస్తోంది. జిల్లాలో 250 **కంపెనీలు** దాదాపు **1000** దాకా బీటీ పత్తి **విత్తన** రకాలను **మార్కెట్‌లోకి** విడుదల చేయడం **గమనార్హం.**

పంట దెబ్బతింటే దేవుడే దిక్కు!

పత్తి విత్తన నాణ్యతపై వ్యవసాయ శాఖకు ఎలాంటి సంబంధం లేదు. ఆయా కంపెనీలే సొంతంగా ధ్రువీకరించుకుంటున్నాయి. ఈ కారణంగా పంట దెబ్బతింటే **ఆయా** కంపెనీలదే పూర్తి **బాధ్యత.** అయితే పం**ట** దెబ్బతిన్న సమయంలో వాతావరణ పరిస్థితులను కారణంగా చూపుతూ కంపెనీలు చేతులు దులుపుకుంటున్న **పరిస్థితి** కనిపిస్తోం**ది.** పంట దెబ్బతిన్న**ప్పుడు** పరిహారం ఇవ్వ**కుండా** తప్పించుకునేం**దుకు** **రకర**కాలుగా ప్రయ**త్నాలు చేస్తున్నారు.** 2024 ఖరీఫ్ సీజన్‌లో కూడా ఒక పేరొందిన కంపెనీ విత్తనంతో సాగు చేసిన పత్తి పలు చోట్ల దెబ్బతినింది. అయితే ఆ కంపెనీ వ్యవసాయ యంత్రాంగాన్ని ముడుపులతో లోబరుచుకొని ఇతర కారణాలతో పంట దెబ్బతిన్నట్లు రిపోర్టు ఇవ్వడం గమనార్హం.

బ్లాక్‌లో పత్తి విత్తనాలు

ఈ సారి పత్తి సాగు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. వర్షాలు పడుతున్నందున ఈ నెల చివరి వారం నుంచే పత్తి విత్తనాలు నాటుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో వందల కంపెనీలు, రకాలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నా.. వీటికి అనుమతులు ఉన్నాయా, లేదా అని వ్యవసాయశాఖ పటించుకున్న పాపాన పోవడంలేదు. ప్రధానంగా రెండు కంపెనీల బీటీ పత్తి విత్తన ప్యాకెట్లను బ్లాక్‌లో అమ్మకాలు సాగిస్తున్నారు. జిల్లాలోకి ఒకవైపు తెలంగాణ నుంచి, మరోవైపు కర్ణాటక నుంచి అనధికార పత్తి విత్తన ప్యాకెట్లు జిల్లాలోకి వెల్లువెత్తుతున్నాయి. పశ్చిమ ప్రాంతంలో పత్తి లూజు విత్తనాల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఆదోని, ఎమ్మిగనూరు ప్రాంతాల్లో నకిలీలు, అనుమతి లేని విత్తనాలను జోరుగా అమ్మకాలు సాగిస్తున్నా వ్యవసాయ శాఖ నుంచి స్పందన కరువైంది.

హెచ్‌టీ పత్తి సాగు ప్రమాదకరం

పత్తిలో హెచ్‌టీ విత్తనాలకు కేంద్రం ఇంతవరకు అనుమతి ఇవ్వలేదు. పత్తిలో కలుపు సమస్య ఎక్కువగా ఉంటుంది. హెచ్‌టీ పత్తిలో కలుపు నివారణకు గ్లైఫోసేట్ మందును పిచికారి చేస్తే కలుపు నాశనం అవుతుంది తప్ప.. పత్తి పంటకు ఏమీ కాదు. హెర్బిసైడ్ టాలరెంట్(హెచ్‌టీ) బీటీ పత్తి విత్తనాలు జీవవైవిధ్యానికి ప్రమాదకరమనే ఉద్దేశంతో కేంద్రం వీటికి అనుమతివ్వలేదు. అయినప్పటికీ కొంతమంది రైతులు హెచ్‌టీ పత్తి సాగు చేస్తున్నారు. ఇటీవల వ్యవసాయ శాఖ నుంచి వచ్చిన ప్రత్యేక టీమ్ వచ్చి హెచ్‌టీ పత్తి విత్తనాలను గుర్తించేందుకు తనిఖీలు జరిపి పరీక్షలు నిర్వహించారు. అయితే తూతూమంత్రంగా పరీక్షలు నిర్వహించారనే చర్చ జరుగుతోంది.

విత్తు.. విపత్తు



వర్షాలు ముందుగానే మురిపిస్తున్నాయి. దుక్కి దున్నేందుకు ఇదే మంచి అదను. ఇప్పటికే చాలామంది రైతులు పొలాన్ని సిద్ధం చేసి ఉంచారు. మరో వర్షం పడితే అదనులోనే విత్తనం వేద్దామనే ఆలోచనలో ఉన్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు పెట్టుబడి సాయం అందలేదు. గతేడాది కూడా సర్కారు సాయం లేదు. విత్తన ప్రణాళిక గురించి ఇప్పటి వరకు అధికారులు ఎలాంటి ప్రణాళికా విడుదల చేయలేదు.



- వ్యవసాయాన్ని పట్టించుకోని ప్రభుత్వం
- అదను సమీపిస్తున్నా అందని విత్తనం
- వర్షాలు కురుస్తున్నా ఇబ్బందుల్లోనే రైతులు
- విత్తనాలు, ఎరువుల ప్రస్తావన లేక ఆందోళన

సాక్షి, పుట్టపర్తి: ప్రతి ఏటా మే నెలలో దుక్కి దున్నే సమయానికి రైతులందరూ రాయితీ విత్తనాల కోసం వెంపర్లాడేవారు. ప్రభుత్వం నుంచి మే రెండో వారం నుంచి రాయితీ విత్తనాలు రైతులకు పంపిణీ చేసేవారు. అయితే ఈసారి ఇప్పటి వరకు రాయితీ సంగతి పక్కన పెడితే.. విత్తన ప్రాసెసింగ్ కూడా మొదలుపెట్టిన దాఖలాలు కనిపించలేదు. దీంతో విత్తనాలు ఎన్నడు ఇస్తారోనని సత్యసాయి జిల్లా రైతులు ఆందోళనలో ఉన్నారు. ఇప్పుడు కురిసిన వర్షాలకు పొలం చదును చేసుకున్నారు. నెలాఖరున నైరుతి రుతు పవనాలు జిల్లాలోకి ప్రవేశించగానే విత్తనాలు వేసేందుకు రైతులందరూ సిద్ధంగా ఉన్నారు. అయితే ఇప్పటి వరకు విత్తన ప్రణాళిక గురించి పాలకులు, అధికారులు ఎలాంటి ప్రకటన విడుదల చేయకపోవడం గమనార్హం.

ముందస్తు మురిపెం ముంచేనా?..

సకాలంలో వర్షాలు వస్తేనే.. పంట సరిగ్గా చేతికందుతుందని ఏ రైతును అడిగినా చెబుతారు. అయితే ఈ ముందస్తు వర్షాలు దుక్కి దున్నేందుకు పనికి వచ్చినా.. తర్వాత ముఖం చాటేస్తే పరిస్థితి ఏందని రైతన్నలు ఆందోళనలో ఉన్నారు. గతంలో చాలాసార్లు ముందస్తు వర్షాలతో నష్టం వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. ఈసారి కూడా అలాంటి పరిస్థితి ఎదురయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అయితే ముందస్తు వర్షాలతో.. దుక్కి దున్నితే.. ఆ తర్వాత వచ్చే వర్షాలకు విత్తనం వేస్తేనే పంట దిగుబడి వస్తుందని వివరించారు. ముందస్తు వర్షాలకు మురిసిపోయి.. విత్తనాలు వేస్తే పంట దెబ్బతినే అవకాశం ఉందని సలహా ఇస్తున్నారు. ఖరీఫ్‌లో ప్రధానంగా కంది, వేరుశనగ, ఆముదం, మొక్కజొన్న, వరి, రాగి, పొద్దుతిరుగుడు, పత్తి, మిరప, జొన్న, పప్పుశనగ, కొర్ర, అలసంద, పెసర తదితర పంటలు సాగు చేయనున్నారు.

విత్తనాల కోసం ఎదురుచూపు



ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తన వేరుశనగ కాయల కోసం ఎదురు చూస్తున్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయం కింద ఇవ్వాల్సిన రూ.20 వేల గురించి ప్రస్తావించలేదు. ముందస్తు వర్షాలు వస్తుండటంతో రైతులు అప్పులు చేసి విత్తనాలు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం స్పందించి గ్రామస్థాయిలోనే విత్తనకాయలు పంపిణీ చేయాలని కోరుతున్నాం. – శ్రీరామిరెడ్డి, రైతు, ఎల్లోటి, మడకశిర మండలం

త్వరలో పంపిణీ చేస్తాం



ఖరీఫ్‌లో అత్యవసరంగా వేరుశగన, జీలగ, కంది వేసుకోవచ్చు. మిగతా పంటలు కొంచెం ఆలస్యమైనా పర్లేదు. విత్తనాలు బయటి నుంచి వస్తాయి. త్వరలోనే ఆర్ఎస్‌కేల ద్వారా పంపిణీ చేస్తాం. ప్రస్తుత వర్షాలకు ఎవరూ విత్తనం వేయొద్దు. నెలాఖరులో రుతుపవనాలు వస్తాయి. జూన్ నుంచి విత్తనాలు వేసుకోవచ్చని శాస్త్రవేత్తలు సూచించారు. 40 శాతం రాయితీతో విత్తనాలు అందజేస్తాం. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదు. ఎరువులు కూడా పుష్కలంగా ఉన్నాయి. – వైవీ సుబ్బారావు, జిల్లా వ్యవసాయ అధికారి, పుట్టపర్తి

చేపను బట్టి వల!



- వేట విరామ సమయంలో బిజీబిజీగా మత్స్యకారులు
- ఒక్కో బోటుకు 16 రకాల వలలు సిద్ధం చేసే పనిలో నిమగ్నం
- జూన్ 15 నుంచి మొదలుకానున్న బతుకు వేట

కొత్తపట్నం: విరామం వేటకే కానీ తమకు కాదంటున్నారు మత్స్యకారులు. పూట గడవడానికి కొందరు పనులకు వెళ్తుండగా మరికొందరు వలలు, బోట్లు, ఇంజన్లు సిద్ధం చేసుకునే పనిలో బిజీబిజీగా గడిపేస్తున్నారు. ఏడాది పొడవునా వేట సాగించేందుకు వీలుగా అవసరమైన సామగ్రిని జాగ్రత్తగా సిద్ధం చేసుకుంటున్నారు. ప్రభుత్వం వేట విరామం తేదీ ప్రకటించగానే బోట్లను ఒడ్డుకు చేర్చిన మత్స్యకారులు.. కొద్ది రోజులకే కొత్త వలలు కొనుగోలు చేశారు. వాటిని క్రమ పద్ధతిలో అల్లుకుంటున్నారు. సముద్రంలో లభించే దాదాపు 52 రకాల చేపలు వేటాడేందుకు మత్స్యకారులు 16 రకాల వలలను వినియోగిస్తారు. వేట విరామం గడువు ముగిసిన తర్వాత సాగర గర్భంలో మత్స్య సంపద విరివిగా లభించే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో వేటకు వీలుగా అన్ని రకాల వలలను సమకూర్చుకుంటున్నారు. ఒక్కో బోటుకు 16 రకాల వలలు తయారు చేసుకుంటున్నట్లు జిల్లాలోని తీరప్రాంత మత్స్యకారులు చెబుతున్నారు. వంజరం వలలు, చందువా, బంక సీదలు, సీదలు, గుల్ల రొయ్యల వలలు, గేరకాళ్లు, పెద్ద రొయ్యల వలలు, అడస రొయ్యల వల, పూసల వల, జాయింట్ వల.. ఇలా వివిధ రకాల వలలను రూ.లక్ష నుంచి రూ. 2.5 లక్షల వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. పెద్ద కూనాం చేపలను వేటాడేందుకు వినియోగించే రింగు వలలు రకం, పరిమాణాన్ని బట్టి రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షలకు పైగా, బోటు రూ.3.5 లక్షల వరకు ఉంటుంది. మూడు ఇంజన్లు వినియోగించే ఈ బోట్లు, రింగు వలలు భారీ ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో మత్స్యకారులు బృందంగా ఏర్పడి వేట సాగిస్తున్నారు.

సబ్సిడీ పెంపుపై గంపెడాశలు

వలలు, బోట్లు, ఇంజన్లు తదితర వేట సామగ్రిని 70 శాతం సబ్సిడీపై ఇస్తే ఆర్థికంగా ఎదిగేందుకు ప్రయోజనకరంగా ఉంటుందని మత్స్యకారులు ఆశిస్తున్నారు. గతంతో పాటు ప్రస్తుతం ఇస్తున్న 40 శాతం సబ్సిడీని 70 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఇచ్చే 40 శాతం సబ్సిడీలో అన్ని ఖర్చులు పోగా వర్తించేది 30 శాతమేనని, మొత్తం సబ్సిడీ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తే ఎప్పటి నుంచో నిల్వ ఉన్న వేట సామగ్రి అంటగడుతున్నారని మత్స్యకారులు వాపోతున్నారు. వేట విరామ సమయంలోనే వలలు, బోట్లు, ఇంజన్లు సబ్సిడీపై ఇస్తే మళ్లీ వేట మొదలయ్యేనాటికి సిద్ధం చేసుకునేందుకు అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

● మీకు తెలుసా?

పాచికల గుట్టు విప్పుదాం పదండి



పరమపద సోపాన పటం ఆడాలంటే పాచికలు కావాల్సిందే. పాచికల్ని ఆడించి, నేల మీద విడిచి, అందులోని సంఖ్యను చూసి పావును ముందుకు జరుపుతాం. పాచికలు రకరకాల ఆకృతుల్లో ఉన్నా ఎక్కువగా మనకు కనిపించేవి పొడుగ్గా ఉండే పాచికలు, చతురస్రాకారంలో చుక్కలు ఉండే పాచికలు (డైస్). వీటి చరిత్రేమిటో తెలుసుకుందామా?

క్రీస్తు పూర్వం ఎన్నో ఏళ్ల నుంచే పాచికలు వాడుకలో ఉన్నాయని, మానవులు తయారు చేసుకున్న ఆట పరికరాల్లో ఇవే మొదటివని చరిత్రకారులు అంచనా వేస్తున్నారు. అప్పట్లో గొర్రె, గేదె కాలి ఎముకలతో పాచికలు తయారు చేసేవారు. అయితే వీటిని భవిష్యత్తు చెప్పేందుకు వినియోగించేవారు. ఈ పాచికల్లో పడ్డ అంకెను బట్టి వారి భవిష్యత్తు ఎలా ఉండబోతోందో అంచనా వేసేవారు. ఆ తర్వాత గ్రీకు, రోమన్ సామ్రాజ్యలలో రాగి, రాతి, చెక్క వంటి ఇతర వస్తువులతో పాచికలు తయారు చేయడం ప్రారంభించారు. ఇవన్నీ రకరకాల ఆకృతుల్లో ఉండేవి. ఇవాళ మనం చూస్తున్న పాచికలు క్రీ.పూ 2000లో ఈజిప్టులో వాడిన పాచికలకు సమాన రూపంలో ఉండేవి. దీన్ని బట్టి పాచికలకు చాలా సుదీర్ఘమైన చరిత్ర ఉందని తెలుస్తోంది.

అనంతర కాలంలో ఆటలు ఆడటంతోపాటు జూదం ఆడేందుకూ ఈ పాచికల్ని వినియోగించడం మొదలుపెట్టారు. ఇందుకు సంబంధించిన పురాణ గాథలు కూడా ఉన్నాయి. పాచికలు మన సంస్కృతిలో ఒక భాగంగా మారిపోయాయి. ప్రస్తుతం మార్కెట్లో అనేక రకాల పాచికలు దొరుకుతున్నాయి. చిన్నారులు వాటితో సరదాగా ఆడుకుంటున్నారు.



● వండర్ వరల్డ్



గంట సేపు సముద్రం చీలుతుంది

చూడగలగాలే గానీ ఈ ప్రకృతి అనేక వింతలను మన కళ్ళ ముందు ఉంచుతుంది. అలాంటి ఒక వింతే దక్షిణ కొరియాలోని మిరాకిల్ ఆఫ్ జిండో. ఏంటి దీని ప్రత్యేకత అని అనుకుంటున్నారా?

సౌత్ కొరియాలోని జిండో సముద్రంలో ఆటుపోట్లు అసాధారణ స్థాయిలో మార్పు చెందడం వలన నీరు రెండు పాయలుగా విడిపోయి, జిండో ద్వీపం నుండి మోడో ద్వీపం వరకు ఒక ఇసుక దారి ఏర్పడుతుంది. ఈ దారి సుమారు 2.8 కిలోమీటర్ల పొడవు, 40 మీటర్ల వెడల్పు కలిగి ఉండి కేవలం ఒక గంట పాటు మాత్రమే ఉంటుంది. ఈ సమయంలో వేలాది మంది పర్యాటకులు, స్థానికులు ఈ ఇసుక దారిపై నడిచి, మోడో ద్వీపాన్ని చేరుకుంటారు. దారి ఏర్పడిన గంట తర్వాత, సముద్రం మళ్లీ సాధారణ స్థితికి చేరుకుని ఈ దారి నీటిలో మునిగిపోతుంది. ఈ అరుదైన దృశ్యం సంభవించే సమయంలో, స్థానికులు 'జిండో మిరాకిల్ సీ రోడ్ ఫెస్టివల్' పేరుతో పండుగ జరుపుకుంటారు.

ఈ పరిస్థితిని పరిశోధించడానికి వచ్చిన ఫ్రెంచ్ అంబాసిడర్ Pierre Landi, ఆశ్చర్యానికి గురై, బైబిల్‌లో మోసెస్ సముద్రాన్ని చీల్చే సన్నివేశంతో పోలుస్తూ 'కొరియన్ మిరాకిల్ ఆఫ్ మోసెస్' అనే పేరుతో ఫ్రెంచ్ పత్రికలో వ్యాసం రాశాడు. దీంతో ఈ జిండో సముద్రానికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించింది. జిండో సముద్ర విభజన గురించి దక్షిణ కొరియా సాహిత్యంలో అనేక కథలు ప్రచారంలోకి వచ్చాయి. అందులో ఒక జానపద కథను స్థానికులు బలంగా విశ్వసిస్తారు. ఒకప్పుడు జిండో ద్వీపంలో ''హోలాంగి'' అనే భయంకరమైన పులి నివసించేది. ఈ పులి దాడుల నుండి తప్పించుకోవడానికి ద్వీపవాసులు సముద్రం గుండా మోడో ద్వీపానికి పారిపోతారు. అయితే, ఒక వృద్ధ మహిళ అనుకోకుండా వెనుకబడి పోవడం వల్ల ఆమె భయంతో సముద్ర దేవతకు ప్రార్థన చేస్తుంది. అప్పుడు ఆ దేవత ఆమెను రక్షించడానికి సముద్రాన్ని విభజించి, ఒక దారిని సృష్టిస్తుంది. ఈ దారి ద్వారా ఆ ముసలమ్మ మోడో ద్వీపానికి చేరుకుని ఆమె కుటుంబంతో తిరిగి కలుస్తుంది.



● మహనీయులు

తెలుగు పత్రికారంగ ప్రముఖుడు..

ముట్నూరి కృష్ణారావు



పిల్లలూ! రోజూ పొద్దున్న లేవగానే దినపత్రికలు చదివే అలవాటు చాలామందికి ఉంటుంది. ఒక పత్రిక తయారవ్వాలంటే అందుకు ఎంతో మంది కృషి చేయాలి. అలాంటి విశిష్టమైన కృషి చేసి ఎనలేని పేరు తెచ్చుకున్న ఓ మహనీయుడి గురించి ఇవాళ తెలుసుకుందాం. ఆయనే ముట్నూరి కృష్ణారావు.

ముట్నూరి కృష్ణారావు 1879 నవంబరు 18న కృష్ణా జిల్లా దివిసీమ తాలూకా ముట్నూరులో జన్మించారు. ఆయన పుట్టిన వెంటనే తల్లి మరణించింది. కొద్దిరోజులకే తండ్రి కూడా మరణించారు. దీంతో ఆయన బాబాయి వద్ద పెరిగారు. బందరులోని హిందూ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక విద్య పూర్తి చేశారు. ఆ తర్వాత నోబుల్ కళాశాలలో ఎఫ్.ఏ కోర్సులో చేరారు. అక్కడ తెలుగు, సంస్కృతం, ఇంగ్లిష్ భాషల్లో నిష్ణాతుడిగా మారారు. ఆ సమయంలోనే సంఘ సంస్కర్త రఘుపతి వెంకటరత్నం నాయుడికి కృష్ణారావు శిష్యుడిగా మారారు.

బందరులో చదువు పూర్తి చేసిన ఆ తర్వాత మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో బీఏలో చేరి అక్కడే బెంగాల్ స్వాతంత్ర్య సమరయోధుడు బిపిన్ చంద్రపాల్‌ను కలిశారు. ఆయనతో కలిసి బెంగాల్ వెళ్ళారు. 1903లో బందరు తిరిగివచ్చి అప్పటికే అక్కడ నడుస్తున్న కృష్ణా పత్రికలో సహాయ సంపాదకుడిగా చేరారు. 1907లో ఆయనే ఆ పత్రికకు సంపాదకుడిగా మారారు. జాతీయోద్యమ కాలంలో కృష్ణా పత్రిక చురుకుగా వ్యవహరించేందుకు కృష్ణారావు ఎంతో కృషి చేశారు. పత్రిక కార్యాలయలంలో రాజకీయ, కళా, సాంస్కృతిక, సాంఘిక విషయాలపై పలు చర్చలు నిర్వహించేవారు. 1945లో మరణించేవరకు ఆ పత్రికకు కృష్ణారావే సంపాదకుడు. కొంతకాలం 'ఆంధ్రభారతి' అనే సాహిత్య పత్రిక కూడా నిర్వహించారు.

● వండర్ కిడ్

వీడియో గేమ్స్‌లో జీనియస్



చిన్నారులకు వీడియో గేమ్స్ అంటే చాలా ఇష్టం. వాటితో ఆడుకుంటూ ఉంటే వారికి టైం తెలియదు. కానీ ఆరేళ్లకే వీడియో గేమ్ తయారు చేసి గిన్నిస్ రికార్డు సాధించింది ఓ చిన్నారి. తనే కెనడాకు చెందిన సిమర్ ఖురానా.

కెనడాలోని ఒన్‌టరియో ప్రాంతానికి చెందిన సిమర్ చిన్నప్పటి నుంచి వీడియో గేమ్స్‌పై ఆసక్తి చూపించేది. గంటల తరబడి వాటిని ఆడేది. ఈ క్రమంలో వాటిని ఎలా తయారు చేస్తారు, వాటికోసం ఎలా పని చేస్తారనే విషయాలను తల్లిదండ్రుల దగ్గర తెలుసుకుంది. తను కూడా అలా ఓ గేమ్ తయారు చేస్తే బాగుంటుందని అనిపించింది. ఆ విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో వారు ఓ టీచర్‌ను ఏర్పాటు చేసి తనకు కోడింగ్ నేర్పించారు.



వారానికి నాలుగు క్లాసులకు వెళ్లి, రోజూ ఇంట్లో రెండు గంటలపాటు సాధన చేసేది. ఈ క్రమంలో విసుగు, నిరాశలను దగ్గరికి రానీయలేదు.

కోడింగ్ రాయడం వచ్చాక ఎలాంటి వీడియో గేమ్ తయారు చేస్తే బాగుంటుందనే ఆలోచన మొదలైంది. సిమర్‌కి తినడం ఎక్కువగా నచ్చేది కాదు. అయితే ఆ వయసులో పిల్లలు ఎదిగేందుకు ఆహారం బాగా తీసుకోవాలని వైద్యులు తనకు సూచించారు. దీంతో ఆహారంపై అవగాహన కల్పించే ఓ గేమ్ తయారు చేయాలని అనుకుంది. అలా "Healthy Food Challenge' అనే వీడియోగేమ్ తయారు చేసింది. అప్పటికి తన వయసు ఆరేళ్లు. తన గేమ్‌ను పరీక్షించిన గిన్నిస్ ప్రతినిధులు 'అతి చిన్నవయసులో వీడియోగేమ్ తయారు చేసిన వ్యక్తి'గా రికార్డు అందించారు.

ప్రస్తుతం సిమర్‌కు ఎనిమిదేళ్లు. ఖాళీ సమయాల్లో డ్యాన్స్ చేయడం, కరాటె, జిమ్నాస్టిక్స్ క్లాసులకు వెళ్లడం తనకు అలవాటు. "Simars World' పేరుతో ఓ యూట్యూబ్ ఛానెల్ కూడా నడుపుతోంది. భవిష్యత్తులో బెస్ట్ వీడియో గేమ్ క్రియేటర్‌గా పేరు తెచ్చుకోవడమే తన లక్ష్యం అంటోంది.

● బాలల కథ

వేళాకోళం


అనగనగా ఒక ఊరిలో రామయ్య, సోమయ్య అనే స్నేహితులు ఉన్నారు. రామయ్యది గంభీరమైన స్వభావం. ఎవరితోనూ అనవసరంగా మాట్లాడేవాడు కాదు. సోమయ్య మాత్రం అందరితోనూ మాట్లాడుతూ సరదాగా ఉండేవాడు. ఎవరైనా అమాయకులు కనిపిస్తే వారితో వేళాకోళం ఆడుతూ ఆటపట్టించేవాడు. ఇది రామయ్యకు నచ్చకపోయినా స్నేహితుణ్ని ఏమీ అనేవాడు కాదు.

ఒకరోజు దూరంగా ఉన్న ఓ ఊరిలో జాతర జరుగుతుందని వారికి తెలిసింది. అక్కడికి వెళ్లాలని ఇద్దరూ నడక ప్రారంభించారు. మధ్యాహ్నానికి ఓ ఊరు చేరుకున్నారు. కడుపులో ఆకలి దహించేస్తోంది. ఆ ఊరిలో ఉన్న పూటకూళ్లమ్మ ఇంటికి వెళ్లారు. అక్కడున్న అవ్వ వారికి వేడివేడి అన్నం, పప్పు, పచ్చడి, పులుసు, పెరుగుతో కడుపునిండా భోజనం పెట్టింది. సాయంత్రం రామయ్య, సోమయ్య ప్రయాణమవుతూ అవ్వకు డబ్బులు ఇవ్వబోయారు. అవ్వ తనకు డబ్బు అక్కరలేదని చెప్పింది. తనకు ఏదో విధంగా సాయం చేయాలని వారు అనుకున్నారు. అప్పుడు ఆ అవ్వ తనకు విపరీతమైన నడుమునొప్పి ఉందని, అది తగ్గడానికి ఏదైనా చిట్కా ఉంటే చెప్పమని అడిగింది.

సోమయ్య వెంటనే 'నీ పెరట్లో ఉన్న చింతచెట్టుకు తాడు కట్టి, మరోవైపు తాడును నీ నడుముకు కట్టుకొని రెండుసార్లు ఊగు. నీ నొప్పి ఇట్టే తగ్గిపోతుంది. అక్కడికీ తగ్గకపోతే, నీ ఎత్తు గొయ్యి తీసి అందులో ఒక పూటంతా ఉండు. తప్పకుండా తగ్గుతుంది' అన్నాడు. సోమయ్య ఆ అవ్వతో వేళాకోళం చేశాడని రామయ్యకు అర్థమైంది. కానీ ఏమీ అనలేక ఊరుకున్నాడు. ఆ తర్వాత వాళ్లు జాతర దగ్గరికి నడక ప్రారంభించారు.

ఏడాది తర్వాత రామయ్య, సోమయ్యలను వెతుక్కుంటూ ఊరికి కొందరు మనుషులు వచ్చారు. వారిని విచారించగా, ఆ పూటకూళ్లమ్మ తాలూకు మనుషులు అని తెలిసింది. సోమయ్య చెప్పినట్లు ఆ అవ్వ పెరట్లో ఉన్న చింతచెట్టుకు తాడు కట్టి, మరోవైపు తాడును తన నడుముకు కట్టుకొని ఊగబోతుంటే పైన చెట్టు తొర్రైలో ఏనాడో దొంగలు దాచిన బంగారం బయటపడింది. ఆ తర్వాత పెరట్లో గొయ్యి తీస్తుండగా అందులో లంకె బిందెలు బయటపడ్డాయి. దీంతో అవ్వ ధనవంతురాలయ్యింది. తన నడుము నొప్పికి వైద్యం చేయించుకుంది. సోమయ్య వల్లే తనకు ఈ అదృష్టం పట్టిందని, తన తదనంతరం తన ఆస్తంతా అతనికే చెందాలని వీలునామా రాయించి కన్నుమూసింది.

ఇదంతా విన్న రామయ్య, సోమయ్య చాలా ఆశ్చర్యపోయారు. అవ్వ కన్నుమూసినందుకు బాధపడ్డారు. ఆ ఊరికి వెళ్లి, తన ఆస్తిలో కొంత భాగంలో అవ్వ పేరిట సత్రం కట్టించి, మిగిలిన ఆస్తితో స్నేహితులిద్దరూ సంతోషంగా జీవించారు.





● సినిమా చూద్దామా!


వుయ్ కెన్ బి హీరోస్...

డూ యు వాంట్ టు బి హీరో?



హేయ్ కిడ్స్.... మీరు చాలా మూవీస్‌లో సూపర్ పవర్స్ ఉన్న సూపర్ హీరోస్‌ని చూసే ఉంటారు కదా. అప్పుడు మీకు కూడా సూపర్ పవర్స్ వస్తే బాగుండనిపిస్తుంది కదా. సో అలాంటి జానర్‌తోనే నెట్ ఫ్లిక్స్‌లో 'వుయ్ కెన్ బి హీరోస్' అనే మూవీ ఉంది. కాకపోతే ఈ స్టోరీ కొంచం డిఫరెంట్. అదేంటంటే మన ఎర్త్‌ని ప్రొటెక్ట్ చేస్తున్న సూపర్ హీరోస్ పిల్లలందరూ అమెరికాలోని ఓ స్కూల్‌లో చదువుకుంటుంటారు. ఇంతలో ఏలియన్స్ సూపర్ హీరోస్‌తో ఫైట్ చేస్తూ ఉంటాయి. అప్పుడు అమెరికా గవర్నమెంట్ సూపర్ హీరోస్ పిల్లలందరినీ ఓ అండర్ గ్రౌండ్ రూమ్‌లోకి సేఫ్టీ కోసం షిఫ్ట్ చేస్తారు. కాని ఇంతలో ఏలియన్స్ తమతో ఫైట్స్ చేస్తున్న సూపర్ హీరోస్‌ని బంధిస్తాయి. అప్పుడు అక్కడున్న పిల్లలందరూ ఆ సేఫ్టీ రూమ్ నుండి బయటకు వచ్చి ఏలియన్స్‌తో ఫైట్ చేస్తారు. మరి ఈ ఫైట్ పిల్లలు గెలుస్తారా లేదా అన్నది మాత్రం నెట్ ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతున్న 'వుయ్ కెన్ బి హీరోస్' మూవీ లో చూడాలి. 2005లో రిలీజ్ అయిన 3డి మూవీ అడ్వెంచర్స్ ఆఫ్ షార్క్ బాయ్ అండ్ లావా గర్ల్‌కి సీక్వెల్. సినిమా మొత్తం సూపర్ థ్రిల్లింగ్‌గా ఉంటుంది. సో లేటెందుకు గ్రాబ్ యువర్ రిమోట్ అండ్ ట్యూన్ టు నెట్ ఫ్లిక్స్ ఫర్ బికమింగ్ ఎ సూపర్ హీరో.


- హరికృష్ణ ఇంటూరు



భీమన్న చేసే పనులు.. భలే భలే

మీకు కథల పుస్తకాలు చదవడం ఇష్టమా? ఆద్యంతం ఆసక్తిగా చదివించే కథల మీద మీకు ఆసక్తి ఉందా? అయితే మీకోసమే 'కథాప్రపంచం' వారు ఈ పుస్తకాన్ని తీసుకొచ్చారు. 1960 ప్రాంతంలో చందమామ మాసపత్రికలో వచ్చిన ఈ కథలు పాఠకుల్ని ఎంతో అలరించాయి. ఇప్పుడు మరోసారి మిమ్మల్ని ఆకట్టుకునేందుకు పుస్తకంగా వచ్చాయి. భీమన్న చేసే పనులు మీకు భలే ఆసక్తిగా అనిపిస్తాయి.

బాల్యాన్ని పట్టి చూపే గొంగళి పురుగు కథ



గొంగళిపురుగు సీతాకోక చిలుకగా మారుతుందన్న విషయం మీకు తెలుసు కదా? అయితే ఆ గొంగళిపురుగు బాల్యం మనలాగే ఉంటే ఎలా ఉంటుంది? ఈ ఆలోచనతో రాసిన పుస్తకం ఇది. ఎరిక్ కార్లె 1969లో రాసిన ఈ పుస్తకంలో బాల్యానికి సంబంధించిన అనేక విషయాలున్నాయి. అవన్నీ గొంగళిపురుగు చర్యల ద్వారా చెప్పించడం విశేషం. ఈ పుస్తకం ఇప్పటికి 5 కోట్ల కాపీలు అమ్ముడుపోవడం అంతకన్నా విశేషం.

ఐపీవో స్ట్రీట్...

స్కోడా ట్యూబ్స్ @ రూ. 130-140

- ఈ నెల 28-30 మధ్య ఐపీవో
- రూ. 220 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: స్టెయిన్‌లెస్ స్టీల్ ట్యూబ్స్, పైపుల తయారీ కంపెనీ స్కోడా ట్యూబ్స్ పబ్లిక్ ఇష్యూకి రూ. 130-140 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 28న ప్రారంభమై 30న ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 27న షేర్లను విక్రయించనుంది. ఇష్యూలో భాగంగా రూ. 220 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. తద్వారా రూ. 220 కోట్లు అందుకోనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 100 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. ఇష్యూ నిధులను సీమ్‌లెస్, వెల్డెడ్ ట్యూబ్స్, పైప్స్ ఉత్పత్తి సామర్థ్య విస్తరణకు వెచ్చించనుంది. అంతేకాకుండా వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు నిధులను కేటాయించనుంది. ధరల శ్రేణి ప్రకారం కంపెనీ విలువను రూ. 840 కోట్లుగా బ్రోకరేజీలు అంచనా వేశాయి. ఈపీసీ, ఇండస్ట్రియల్ కంపెనీలకు ఉత్పత్తులను సరఫరా చేస్తుంది. ఆయిల్ అండ్ గ్యాస్, కెమికల్స్, ఫెర్టిలైజర్స్, విద్యుత్ తదితర రంగాలలో వీటిని వినియోగిస్తారు.

27 నుంచి బ్లూ వాటర్ లాజిస్టిక్స్ ఐపీవో

- ధరల శ్రేణి 132-135



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ట్రాన్స్‌పోర్ట్ ఆపరేటర్ బ్లూ వాటర్ లాజిస్టిక్స్ ప్రతిపాదిత ఐపీవో మే 27న ప్రారంభమై 29న ముగుస్తుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు మే 26 బిడ్డింగ్ తేదీగా ఉంటుంది. పబ్లిక్ ఇష్యూ కోసం ఒక్కో షేరు ధర శ్రేణి 132-135గా నిర్ణయించారు. ఈ ఇష్యూ ద్వారా రూ. 40.50 కోట్లు సమీకరించనున్న బ్లూ వాటర్ సంస్థ ఎన్ఎస్ఈ ఎమర్జ్ ప్లాట్‌ఫాంలో లిస్ట్ కానుంది. ఇష్యూ ద్వారా సమీకరించిన నిధులను వాహనాల కొనుగోలు, వర్కింగ్ క్యాపిటల్ అవసరాల కోసం ఉపయోగించుకోనుంది.

ఈవీలకు 'హైబ్రిడ్' దన్ను

- రెండింటి కస్టమర్ల సెగ్మెంట్లు వేర్వేరు
- కొత్త మోడల్స్ రాకతో పెరిగిన ఎలక్ట్రిక్ వాహన విక్రయాలు
- హెచ్ఎస్‌బీసీ గ్లోబల్ రీసెర్చ్ నివేదిక



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ వాహనాలతో హైబ్రిడ్ వాహనాలు పోటీపడటం కాకుండా వాటి విక్రయాలకు ఇతోధికంగా దోహదపడుతున్నాయని హెచ్ఎస్‌బీసీ గ్లోబల్ రీసెర్చ్ ఒక నివేదికలో తెలిపింది. ఈ రెండు రకాల కస్టమర్ల సెగ్మెంట్లు వేర్వేరుగా ఉంటున్నాయని పేర్కొంది. భారత్ పూర్తిగా ఎలక్ట్రిక్ వాహనాల వైపు మళ్లే క్రమంలో.. మధ్యకాలికం నుంచి దీర్ఘకాలికంగా చూస్తే హైబ్రిడ్లు, సీఎన్‌జీలు, బయోఇంధనాలతో నడిచే వాహనాలకు ప్రాధాన్యం కొనసాగుతుందని వివరించింది. 'స్ట్రాంగ్ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వాహనాలు (ఎస్‌హెచ్ఈవీ), బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాలు (బీఈవీ) ఒకదాని మార్కెట్‌ను మరొకటి ఆక్రమించకుండా, వేర్వేరు వర్గాల కస్టమర్ల అవసరాలను తీర్చే విధంగా ఉంటున్నాయి. ఎస్‌హెచ్ఈవీలకు ప్రోత్సాహకాలు ఇస్తున్న రాష్ట్రాల్లో బీఈవీల అమ్మకాలు కూడా పటిష్ట వృద్ధిని సాధించాయి. దేశంలోనే అత్యధికంగా ప్యాసింజర్ వాహనాలు అమ్ముడయ్యే ఉత్తర్ ప్రదేశ్‌లో ఎస్‌హెచ్ఈవీలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇచ్చినప్పటికీ, 2025 ఆర్థిక సంవత్సరంలో ఎస్‌హెచ్ఈవీ విక్రయాలకు సరిసమాన స్థాయిలో ఈవీల అమ్మకాల వృద్ధి నమోదైంది. ఎస్‌హెచ్ఈవీల విక్రయాలు, బీఈవీల అమ్మకాలపై సానుకూల ప్రభావం చూపుతున్నాయని ఈ ధోరణితో తెలుస్తోంది' అని నివేదిక వివరించింది. ఎస్‌హెచ్ఈవీలను ప్రోత్సహిస్తే, ఈవీల విక్రయాలు తగ్గిపోతాయనేది అపోహ మాత్రమేనని తెలిపింది. కొత్త మోడల్స్ రాకతో గత ఆరు నెలల్లో ఈవీల వినియోగం గణనీయంగా పెరిగినట్లు పేర్కొంది.

మరిన్ని ముఖ్యాంశాలు..

- గత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 1.9 శాతంగా ఉన్న ఫోర్ వీలర్ ఈవీల విక్రయాలు, ఆఖరు త్రైమాసికంలో 2.5 శాతానికి పెరిగాయి.
- మొత్తం ప్యాసింజర్ వాహనాల్లో (పీవీ) ఎస్‌హెచ్ఈవీల వాటా 2025 ఆర్థిక సంవత్సరంలో 2.4 శాతానికి చేరింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఇది 2.1 శాతంగా ఉంది.
- ధరకు తగ్గ విలువను అందించే విధంగా ఉంటే ఈవీలను కొనుగోలు చేసేందుకు కస్టమర్లు సుముఖంగానే ఉంటున్నారు. విండ్సర్ కస్టమర్లు 7-8 ఏళ్ల తర్వాత బ్యాటరీ రీప్లేస్‌మెంట్ వ్యయం గురించి ఆందోళన చెందకుండా ఎంజీ సంస్థ లీజింగ్ ఆప్షన్లను ప్రవేశపెట్టడం, రేంజి గురించి ఆలోచించాల్సిన అవసరం లేకుండా ఎంఅండ్ఎం తమ బీఈవీల్లో భారీ బ్యాటరీని అందించడం మొదలైనవి సానుకూలాంశాలుగా ఉన్నాయి.
- మారుతీ సుజుకీ (ఎంఎస్ఐఎల్), టయోటా కిర్లోస్కర్ కంపెనీలు ప్రవేశపెట్టిన ఎస్‌హెచ్ఈవీలు 2023 అలాగే 2024 ఆర్థిక సంవత్సరాల్లో డీజిల్ వేరియంట్ల మార్కెట్ వాటాను ఆక్రమించాయి. గత ఆర్థిక సంవత్సరంలో డీజిల్ వేరియంట్లు, హైబ్రిడ్‌ల వాటా స్థిరంగా నమోదైంది.
- కొత్త మోడల్స్, ప్రభుత్వ ప్రోత్సాహకాలు సమీప భవిష్యత్తులో హైబ్రిడ్ వాహనాల వినియోగం పెరిగేందుకు దోహదపడనున్నాయి.

టారిఫ్‌లు, వలస విధానాల ఎఫెక్ట్

- ఆదాయాన్ని దెబ్బతీసే చాన్స్
- ఐటీ దిగ్గజం విప్రో అంచనాలు



న్యూఢిల్లీ: టారిఫ్‌లు, యూఎస్ వలస విధానాలు ఆదాయంపై ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశమున్నట్లు ఐటీ సేవల దిగ్గజం విప్రో తాజాగా అంచనా వేసింది. భారీ ఆర్థిక వ్యవస్థలు కలిగిన దేశాల టారిఫ్‌లు, వాణిజ్య విధానాలు కంపెనీ ఆదాయం, బిజినెస్‌లను దెబ్బతీయవచ్చని పేర్కొంది. ప్రస్తుతం నెలకొన్న ప్రపంచ వాణిజ్య ఆందోళనలు, నియంత్రణల వాతావరణం కంపెనీ కార్యకలాపాలకు ప్రస్తావించదగ్గ స్థాయిలో రిస్కులను కల్పించే వీలున్నట్లు తెలియజేసింది. కంపెనీ ఆదాయంలో వృద్ధికి అంతర్జాతీయ మార్కెట్లపై అధికంగా ఆధారపడే ఐటీ సేవల దిగ్గజం విప్రో 2024-25 వార్షిక నివేదికలో ఈ అంశాలను వివరించింది. అమెరికా, యూరప్ దేశాలలో క్లయింట్లు అధికంగా కలిగిన కంపెనీ కొన్ని రంగాల క్లయింట్ల నుంచి అధికంగా బిజినెస్ లభిస్తుందని పేర్కొంది. అయితే ఆర్థిక మందగమనం, యూఎస్ ఆర్థిక పరిస్థితులు వంటి అంశాలు ప్రతికూల పరిస్థితులకు కారణంకావచ్చని అభిప్రాయపడింది. కంపెనీ ఆదాయంలో 62 శాతం యూఎస్, 27 శాతం యూరప్ నుంచి లభించే సంగతి తెలిసిందే. కంపెనీ సిబ్బంది సంఖ్య 2,33,346 కాగా.. గతేడాది (2024-25)లో రూ. 89,088 కోట్ల ఆదాయం అందుకుంది. నికర లాభం 19 శాతం ఎగసి రూ. 13,135 కోట్లను దాటింది. ఈ ఏడాది (2025-26) క్యూ1(ఏప్రిల్-జూన్)లో త్రైమాసికవారీగా 250.5-255.7 కోట్ల డాలర్ల ఆదాయం అంచనా వేస్తోంది.

బీఎస్ఈలో విప్రో షేరు 0.6 శాతం బలపడి రూ. 247 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

24-5-2025

విశాఖ	545-00
చిత్తూరు	603-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	517-00
విజయవాడ	530-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	500-00
వరంగల్	502-00
రిటైల్ ధర	5.60

ఫండ్స్ ఏయూఎంలో 22 % వృద్ధి

ఇక్రా అనలైటిక్స్ వెల్లడి



కోల్‌కతా: దేశ మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ నిర్వహణలోని ఆస్తుల (ఏయూఎం) విలువ గత ఆర్థిక సంవత్సరంలో 22.5 శాతం పెరిగి రూ.70 లక్షల కోట్లకు చేరినట్లు ఇక్రా అనలైటిక్స్ వెల్లడించింది. ముఖ్యంగా ఓపెన్ ఎండెండ్ విభాగంలో ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్‌లు) నిర్వహణ ఆస్తుల విలువ గత ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా 24 శాతం వృద్ధి చెందినట్లు తెలిపింది. ఆ తర్వాత ఇతర ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ ఫండ్స్ ఆస్తుల విలువలో మెరుగైన వృద్ధి నమోదైనట్లు పేర్కొంది. ఫండ్స్ పరిశ్రమలో మొత్తం ఫోలియోలు 2024-25లో 30 శాతం పెరిగాయని.. విడిగా చూస్తే డెట్ పథకాలకు సంబంధించి ఫోలియోలు 1.15 శాతం తగ్గినట్లు వెల్లడించింది.

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ETERNAL	237.34	3.63
HDFCLIFE	780.65	3.28
JIOFIN	281.4	2.49
POWERGRID	298.05	2.46
ITC	436	2.32

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SUNPHARMA	1,689.10	-1.72
GRASIM	2,656.00	-0.7
BHARTIARTL	1,831.00	-0.02
BEL	383.35	-0.01
BAJAJ-AUTO	8,740.00	0.07

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,552
ఎన్ఎస్ఈ	95,245
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,11,411
ఎఫ్ఐఐ	+ 1,750
డీఐఐ	+ 300

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	61.56	$ 61.02
బ్రెంట్	64.74	$ 64.44

తెలంగాణపై పియర్సన్ ఫోకస్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: విద్య సంబంధ సేవలు, ఉత్పత్తులను అందించే పియర్సన్ ఇండియా తెలంగాణలో తమ కార్యకలాపాలను విస్తరించడంపై దృష్టి పెడుతోంది. ఇప్పటికే 100కు పైగా ఉన్నత విద్యా సంస్థలతో కలిసి పని చేస్తున్నట్లు కంట్రీ హెడ్ వినయ్ స్వామి తెలిపారు. వీటిలో ఐఎస్‌బీ, ఐఎంటీ, మహీంద్రా యూనివర్సిటీ మొదలైనవి ఉన్నాయని చెప్పారు. బీటెక్, మేనేజ్‌మెంట్, ఇంజినీరింగ్ కోర్సులకు సంబంధించి కంటెంట్ అందిస్తున్నామని వివరించారు. ఇంగ్లీష్ భాషా నైపుణ్యాల ప్రోగ్రాం 'మీప్రో'ను కూడా ప్రవేశపెట్టినట్లు స్వామి తెలిపారు.

ఐదేళ్లలో వజ్రాల డిమాండ్ రెట్టింపు

- డీబీర్స్ గ్రూప్ సీఈవో కుక్
- ఫరెవర్ మార్క్ బ్రాండ్ విడుదల



ముంబై: భారత్‌లో వజ్రాల వినియోగం 2030 నాటికి రెట్టింపు అవుతుందని భావిస్తున్నట్లు డీబీర్స్ గ్రూప్ (డైమండ్ కంపెనీ) సీఈవో అల్‌కుక్ తెలిపారు. భారత్‌లో ఫరెవర్‌మార్క్ బ్రాండ్‌ను విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సహజ వజ్రాభరణాలకు భారత్ ప్రపంచంలో రెండో అతిపెద్ద మార్కెట్‌గా ఉన్నట్లు తెలిపారు. గతేడాది చైనాను అధిగమించినట్లు చెప్పారు. ఏటా 12 శాతం చొప్పున డిమాండ్ పెరుగుతున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం భారత్‌లో సహజ వజ్రాభరణాల డిమాండ్ 10 బిలియన్ డాలర్లలోపు ఉన్నట్లు చెప్పారు. భవిష్యత్ వృద్ధి పట్ల ఆశావహంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఢిల్లీ ముంబైలో రెండు చొప్పున మొత్తం నాలుగు ఫరెవర్‌మార్క్ స్టోర్లను తెరవనున్నట్లు.. వచ్చే ఐదేళ్లలో 100 స్టోర్లను లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రకటించారు. కంపెనీ సొంత స్టోర్లతోపాటు, ఫ్రాంచైజీ రూపంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల పరిధిలో ఇవి ఉంటాయన్నారు. ఫరెవర్‌మార్క్ బ్రాండ్‌కు ఓమ్నిఛానల్ (ఆన్‌లైన్, ఆఫ్‌లైన్) విధానం అనుసరిస్తామని డీబీర్స్ ఇండియా ఎండీ అమిత్ ప్రతిహారి తెలిపారు. ''ఈ కామర్స్‌తోపాటు స్టోర్లను కూడా తెరుస్తున్నాం. భౌతిక స్టోర్ల అందుబాటు కూడా కీలకమే''అని చెప్పారు.

ఎల్‌జీడీలకు భవిష్యత్

ల్యాబ్ గ్రోన్ వజ్రాలకు (ఎల్‌జీడీ) వాణిజ్య పరంగా భవిష్యత్ ఉంటుందని అంచనా వేస్తున్నట్లు కుక్ చెప్పారు. ఎల్‌జీడీల టోకు ధరలు 90 శాతం వరకు పడిపోయినట్లు తెలిపారు. ''సహజ వజ్రాలు-ఎల్‌జీడీలకు మధ్య వ్యత్యాసంపై వినియోగదారుల్లో అవగాహన కల్పిస్తాం. దీంతో ఈ రెండింటి మధ్య తేడా చెప్పలేరన్న అపోహ తొలగిపోతుంది. వజ్రం ధ్రువీకరణ ప్రభావం ఇక మీదట పెరిగేదే''అని వివరించారు. భారత్‌లో సహజ వజ్రాలకున్న డిమాండ్ నేపథ్యంలో మార్కెటింగ్‌పై ఇన్వెస్ట్ చేస్తున్నట్లు కుక్ తెలిపారు. సజహ వజ్రాలను టారిఫ్ పరిధి నుంచి అమెరికా మినహాయిస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. అమెరికాలో సహజ వజ్రాల గనులు లేకపోవడంతో అక్కడ ఉత్పత్తికి అవకాశం లేదన్నారు.

మార్చి త్రైమాసిక ఫలితాలు

గ్రాసిమ్ మెరుగైన పనితీరు

- మార్చి క్వార్టర్‌కు రూ.2,973 కోట్ల లాభం
- ఒక్కో షేరుకు రూ.10 చొప్పున డివిడెండ్

న్యూఢిల్లీ: ఆదిత్య బిర్లా గ్రూప్ ప్రధాన సంస్థ గ్రాసిమ్ ఇండస్ట్రీస్ మార్చితో అంతమైన త్రైమాసికానికి బలమైన పనితీరును నమోదు చేసింది. లాభం 9 శాతానికి పైగా వృద్ధితో రూ.2,973 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.2,721 కోట్లుగా ఉండడం గమనార్హం. ఆదాయం ఇదే కాలంలో 17 శాతానికి పైగా పెరిగి రూ.44,267 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.37,727 కోట్లుగా ఉంది. ఇక మార్చితో ముగిసిన గత ఆర్థిక సంవత్సరానికి గ్రాసిమ్ లాభం అంతక్రితం ఆర్థిక సంవత్సరంతో పోల్చి చూసినప్పుడు 22 శాతం క్షీణించి రూ.7,756 కోట్లుగా నమోదైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో లాభం రూ.9,925 కోట్లుగా ఉంది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఆదాయం 13 శాతానికి పైగా పెరిగి రూ.1,48,478 కోట్లకు చేరింది. అల్ట్రాటెక్ సిమెంట్, ఆదిత్య బిర్లా క్యాపిటల్, టెక్స్‌టైల్స్, కెమికల్స్, బిల్డింగ్ మెటీరియల్స్ వ్యాపార గణాంకాలన్నీ ఇందులో కలసి ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో బిల్డింగ్ మెటీరియల్స్, ఆర్థిక సేవల వ్యాపారాలు బలమైన పనితీరు నమోదు చేసినట్టు కంపెనీ తెలిపింది. వీటి ఎబిటా రూ.20,023 కోట్లుగా ఉంది. అయితే అధిక వడ్డీ వ్యయాలు, పెట్టుబడుల విలువ క్షీణత ఫలితంగా పూర్తి ఆర్థిక సంవత్సరంలో లాభం కొంత తగ్గినట్టు వివరించింది. బిల్డింగ్ మెటీరియల్స్ ఆదాయం 21 శాతం పెరిగి రూ.25,232 కోట్లుగా నమోదైంది. సిమెంట్ అమ్మకాలు 17 శాతం పెరిగి 41.02 మిలియన్ టన్నులుగా ఉన్నాయి. ప్రతీ షేరుకు రూ.10 చొప్పున డివిడెండ్‌ను కంపెనీ బోర్డు ప్రకటించింది.

బీఎస్ఈలో గ్రాసిమ్ షేరు అర శాతం నష్టపోయి రూ.2659 వద్ద ముగిసింది.

సుందరం లాభాలకు గండి

60 శాతం తగ్గిన లాభం



చెన్నై: సుందరం ఫైనాన్స్ హోల్డింగ్స్ గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికి (2025 జనవరి-మార్చి) బలహీన పనితీరు నమోదు చేసింది. రూ.107 కోట్ల లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన లాభం రూ.269 కోట్లతో పోల్చి చూస్తే 60 శాతం తగ్గిపోయింది. కన్సాలిడేటెడ్ ఆదాయం సైతం ఇదే కాలంలో రూ.218 కోట్ల నుంచి రూ.51 కోట్లకు తగ్గింది. ఇక 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి లాభం రూ.412 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.533 కోట్లతో పోల్చితే 20 శాతానికి పైనే తగ్గింది. ఆదాయం సైతం ఇదే కాలంలో రూ.297 కోట్ల నుంచి రూ.160 కోట్లకు పరిమితమైంది. ప్రతి షేరుకు రూ.60 చొప్పున రెండో మధ్యంతర డివిడెండ్‌ను, రూ.1.55 చొప్పున తుది డివిడెండ్ పంపిణీకి కంపెనీ బోర్డు సిఫారసు చేసింది. డెల్ఫి టీవీఎస్ టెక్నాలజీస్ లిమిటెడ్‌లో తనకున్న మొత్తం వాటాను మార్చి త్రైమాసికంలో సుందరం ఫైనాన్స్ హోల్డింగ్స్ విక్రయించింది. ఫోర్జింగ్, ప్రెస్సింగ్, స్టాంపింగ్ వ్యాపారంలోని 'ఫోర్జ్ 200 ప్రైవేటు లిమిటెడ్'లో 100 శాతం వాటాను సొంతం చేసుకుంది. ఎన్ఎస్ఈలో కంపెనీ షేరు రూ.358 వద్ద ముగిసింది.

జేఎస్‌డబ్ల్యూ స్టీల్ లాభం అప్

- క్యూ4లో రూ. 1,501 కోట్లు
- షేరుకి రూ. 2.8 డివిడెండ్



ముంబై: ప్రయివేట్ రంగ మెటల్ దిగ్గజం జేఎస్‌డబ్ల్యూ స్టీల్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 14 శాతం ఎగసి రూ. 1,501 కోట్లకు చేరింది. వ్యయాలు తగ్గడం ఇందుకు ప్రధానంగా సహకరించింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 1,322 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 2.8 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 46,511 కోట్ల నుంచి రూ. 45,049 కోట్లకు నీరసించింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 44,401 కోట్ల నుంచి రూ. 43,032 కోట్లకు తగ్గాయి. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 61 శాతం క్షీణించి రూ. 3,491 కోట్లకు పరిమితమైంది. 2023-24లో రూ. 8,973 కోట్ల లాభం ఆర్జించింది. ఎన్‌సీడీలు, వారంట్ల జారీ ద్వారా రూ. 7,000 కోట్లు, ఈక్విటీ షేర్లు, తదితరాల జారీతో మరో రూ. 7,000 కోట్లు, ఎన్‌సీడీల జారీ ద్వారా రూ. 5,000 కోట్లు సమీకరించేందుకు బోర్డు అనుమతించినట్లు జేఎస్‌డబ్ల్యూ స్టీల్ వెల్లడించింది. అనుబంధ సంస్థ భూషణ్ స్టీల్ అండ్ పవర్ 0.98 మిలియన్ టన్నుల(ఎంటీ) ముడిస్టీల్ ఉత్పత్తి, 0.94 ఎంటీ అమ్మకాలు సాధించినట్లు పేర్కొంది. సంస్థ ఆదాయం రూ. 5,635 కోట్లుకాగా.. నికర లాభం రూ. 42 కోట్లకు చేరినట్లు తెలియజేసింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 0.3% పుంజుకుని రూ. 1,009 వద్ద ముగిసింది.

దేవయాని ఇంటర్నేషనల్‌కు తగ్గిన నష్టం



న్యూఢిల్లీ: క్విక్ సర్వీస్ రెస్టారెంట్ (క్యూఎస్ఆర్) సేవల సంస్థ దేవయాని ఇంటర్నేషనల్ మార్చి త్రైమాసికంలో నష్టాలు తగ్గించుకుంది. రూ.17 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో నష్టం రూ.49 కోట్లతో పోల్చితే గణనీయంగా తగ్గింది. ఆదాయం ఇదే కాలంలో 16 శాతం పెరిగి రూ.1,213 కోట్లుగా ఉంది. పిజ్జా హట్, కేఎఫ్‌సీ, కోస్టా కాఫీ తదితర బ్రాండ్ల ఉత్పత్తులను ఈ సంస్థ విక్రయిస్తుంది. వ్యయాలు 13 శాతానికి పైగా పెరిగి రూ.1,248 కోట్లుగా ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరానికి దేవయాని ఇంటర్నేషనల్ నష్టం రూ.6.9 కోట్లకు పరిమితమైంది. భారత్‌లో స్టోర్ల విస్తరణ ఆదాయంలో మెరుగైన వృద్ధికి దారితీసినట్టు కంపెనీ నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రవి జైపూరియా తెలిపారు. ముంబైలో ఇటీవలే సంస్థ తొలి 'న్యూ యార్క్ ఫ్రైస్ స్టోర్'ను ప్రారంభించడం గమనార్హం. 2024-25లో కొత్తగా 257 స్టోర్లను పెంచుకుంది. మొత్తం స్టోర్ల సంఖ్య 2,039కి పెరిగింది.

బీఎస్ఈలో షేరు అరశాతం నష్టంతో రూ.180 వద్ద ముగిసింది.

ఎంటార్ టెక్నాలజీస్ లాభం రూ. 14 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రెసిషన్ ఇంజినీర్డ్ సిస్టమ్స్ సంస్థ ఎంటార్ టెక్నాలజీస్ గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రూ. 14 కోట్ల లాభం ప్రకటించింది. క్రితం క్యూ4లో నమోదైన రూ. 5 కోట్లతో పోలిస్తే ఇది సుమారు 183 శాతం అధికం. ఆదాయం రూ. 143 కోట్ల నుంచి 28 శాతం పెరిగి రూ. 183 కోట్లకు చేరింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను ఆదాయం రూ. 581 కోట్ల నుంచి 16 శాతం వృద్ధితో రూ. 676 కోట్లకు చేరింది. లాభం రూ. 56 కోట్ల నుంచి సుమారు 6 శాతం క్షీణించి రూ. 53 కోట్లకు పరిమితమైంది. గత కొన్నాళ్లుగా ప్రవేశపెట్టిన కొత్త ఉత్పత్తులతో దాదాపు రూ. 200 కోట్ల ఆదాయం వచ్చినట్లు సంస్థ ఎండీ పర్వత్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

బీఎస్ఈలో శుక్రవారం ఎంటార్ టెక్నాలజీ షేరు స్వల్పంగా క్షీణించి రూ. 1,662.80 వద్ద ముగిసింది.

ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ లాభం జంప్



న్యూఢిల్లీ: ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ మార్చి త్రైమాసికంలో రూ.26 కోట్ల లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 138 శాతం పెరిగింది. ఆదాయం 35 శాతం పెరిగి రూ.726 కోట్లకు చేరింది. డిజిటల్ బ్యాంక్‌గా తమ స్థానం మరింత బలపడినట్టు పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరం మొత్తం మీద ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ లాభం 81 శాతం పెరిగి రూ.63 కోట్లకు చేరగా, ఆదాయం 47 శాతం వృద్ధితో రూ.2,709 కోట్లుగా నమోదైంది. కస్టమర్ అకౌంట్ బ్యాలన్స్‌లు రూ.3,659 కోట్లకు చేరినట్టు.. అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 31 శాతం పెరిగినట్టు ప్రకటించింది. సురక్షితమైన రెండో ఖాతాను స్వీకరించే వారి సంఖ్య గణనీయంగా పెరిగినట్టు.. డిజిటల్ చెల్లింపులకు ప్రత్యామ్నాయ బ్యాంక్ ఖాతాకు కస్టమర్లు ప్రాధాన్యం ఇస్తున్నట్టు సంస్థ ఎండీ, సీఈవో అనుబ్రత బిశ్వాస్ తెలిపారు.



డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్ రిఫరీగా శ్రీనాథ్

దుబాయ్: ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ మ్యాచ్‌ను పర్యవేక్షించే అధికారుల వివరాలను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) శుక్రవారం ప్రకటించింది. భారత జట్టు మాజీ పేస్ బౌలర్, అనుభవజ్ఞుడైన జవగళ్ శ్రీనాథ్‌కు గొప్ప గౌరవం లభించింది. జూన్ 11 నుంచి 15వ తేదీ వరకు లండన్‌లోని విఖ్యాత లార్డ్స్ మైదానంలో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా, తొలిసారి తుది పోరుకు చేరిన దక్షిణాఫ్రికా జట్ల మధ్య డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ ప్రతిష్టాత్మక పోరుకు శ్రీనాథ్ మ్యాచ్ రిఫరీగా వ్యవహరిస్తాడని ఐసీసీ తెలిపింది. ఆన్ ఫీల్డ్ అంపైర్లుగా రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్ (ఇంగ్లండ్), క్రిస్ గాఫెనె (న్యూజిలాండ్)... టీవీ అంపైర్‌గా రిచర్డ్ కెటిల్‌బొరో (ఇంగ్లండ్)... ఫోర్త్ అంపైర్‌గా నితిన్ మీనన్ (భారత్) పేర్లను ఐసీసీ ఖరారు చేసింది. మూడు డబ్ల్యూటీసీ ఫైనల్స్‌లో ఆన్ ఫీల్డ్ అంపైర్‌గా వ్యవహరించిన తొలి అంపైర్‌గా ఇల్లింగ్‌వర్త్ గుర్తింపు పొందనున్నాడు. 2021, 2023 డబ్ల్యూటీసీ ఫైనల్స్‌లోనూ ఇల్లింగ్‌వర్త్ అంపైర్‌గా వ్యవహరించాడు.

అడ్రియన్‌కు మరో పతకం



బెర్లిన్: అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) జూనియర్ ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో భారత్‌కు నాలుగో పతకం లభించింది. శుక్రవారం జరిగిన పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో అడ్రియన్ కర్మాకర్ కాంస్య పతకాన్ని సాధించాడు. ఎనిమిది మంది మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో అడ్రియన్ 446.6 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. రొమైన్ అవుఫ్రెరె (ఫ్రాన్స్; 459.7 పాయింట్లు) స్వర్ణ పతకాన్ని దక్కించుకోగా... జెన్స్ ఒసెట్లి (నార్వే; 459.1 పాయింట్లు) రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ టోర్నీలో అడ్రియన్‌కిది రెండో పతకం కావడం విశేషం. ఇంతకుముందు అడ్రియన్ 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ ఈవెంట్‌లో రజత పతకాన్ని గెల్చుకున్నాడు. 2012 లండన్ ఒలింపిక్స్‌లో 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ ఈవెంట్‌లో నాలుగో స్థానంలో నిలిచి త్రుటిలో కాంస్య పతకాన్ని కోల్పోయిన జాయ్‌దీప్ కర్మాకర్ తనయుడే అడ్రియన్. 20 ఏళ్ల అడ్రియన్‌కిదే తొలి ప్రపంచకప్ టోర్నీ కావడం విశేషం. ప్రస్తుతం భారత్ ఖాతాలో ఒక స్వర్ణం, రెండు రజతాలు, ఒక కాంస్యం ఉన్నాయి.

100వ టైటిల్‌కు గెలుపు దూరంలో

జెనీవా ఓపెన్ ఫైనల్లో జొకోవిచ్



జెనీవా: ఒక్క విజయం సాధిస్తే... సెర్బియా టెన్నిస్ దిగ్గజం నొవాక్ జొకోవిచ్ అద్భుత మైలురాయిని అందుకుంటాడు. కెరీర్‌లో ఇప్పటి వరకు 99 సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన జొకోవిచ్ 100వ టైటిల్‌కు విజయం దూరంలో నిలిచాడు. జెనీవా ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలో 38 ఏళ్ల జొకోవిచ్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో జొకోవిచ్ 6-4, 6-7 (6/8), 6-1తో కామెరాన్ నోరీ (బ్రిటన్)పై విజయం సాధించాడు. నేడు జరిగే ఫైనల్లో హుబెర్ట్ హుర్కాజ్ (పోలాండ్)తో జొకోవిచ్ తలపడతాడు. హుర్కాజ్‌పై జొకోవిచ్ గెలిస్తే తన ఖాతాలో 100వ టైటిల్‌ను జమ చేసుకుంటాడు. కేవలం జిమ్మీ కానర్స్ (అమెరికా; 109 టైటిల్స్), రోజర్ ఫెడరర్ (స్విట్జర్లాండ్; 103 టైటిల్స్) మాత్రమే 100 కంటే ఎక్కువ సింగిల్స్ టైటిల్స్ సాధించారు. నోరీతో 2 గంటల 14 నిమిషాలపాటు జరిగిన సెమీఫైనల్లో జొకోవిచ్ 11 ఏస్‌లు సంధించి, 3 డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు.

జోరు కొనసాగించాలని...

తొమ్మిదో విజయంపై పంజాబ్ కింగ్స్ దృష్టి

- నేడు ఢిల్లీ క్యాపిటల్స్‌తో పోరు
- రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం



పంజాబ్ జట్టు

జైపూర్: సుదీర్ఘ విరామం అనంతరం 'ప్లే ఆఫ్స్'కు చేరిన పంజాబ్ కింగ్స్ జట్టు ఇప్పుడు పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలవడంపై దృష్టి పెట్టింది. 2014లో చివరిసారి 'ప్లే ఆఫ్స్'కు చేరి రన్నరప్‌గా నిలిచిన పంజాబ్ కింగ్స్... ఆ తర్వాత 11 ఏళ్లకు మళ్లీ ఈ సీజన్‌లో శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో 'టాప్-4'లో చోటు దక్కించుకుంది. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ శిక్షణలో తొలి టైటిల్ వేట దిశగా సాగుతున్న పంజాబ్ కింగ్స్... ఇప్పటికే 'ప్లే ఆఫ్స్' రేసు నుంచి నిష్క్రమించిన ఢిల్లీ క్యాపిటల్స్‌తో శనివారం తలపడనుంది. ఇరు జట్ల మధ్య ఈ నెల 8న ధర్మశాల వేదికగా మ్యాచ్ జరుగుతున్న సమయంలో... పాకిస్తాన్ క్షిపణి దాడులు చేయడంతో ఆ మ్యాచ్‌ను అర్ధాంతరంగా నిలిపివేశారు. ఇప్పుడు దాన్నే తాజాగా తటస్థ వేదిక జైపూర్‌లో నిర్వహించనున్నారు. ఈ సీజన్‌లో 12 మ్యాచ్‌లాడిన పంజాబ్ 8 విజయాలు, 3 పరాజయాలు, ఒక మ్యాచ్‌లో ఫలితం తేలకపోవడంతో... 17 పాయింట్లతో పట్టికలో మూడో స్థానంలో ఉంది. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లోనూ పంజాబ్ నెగ్గితే... పాయింట్ల పట్టికలో టాప్-2లో నిలవడం ద్వారా ఫైనల్‌కు చేరేందుకు అదనంగా మరో అవకాశం పొందనుంది. మరోవైపు గత మ్యాచ్‌లో ముంబై చేతిలో ఓడి 'ప్లే ఆఫ్స్' రేసు నుంచి తప్పుకున్న ఢిల్లీ క్యాపిటల్స్‌కు లీగ్‌లో ఇదే చివరి మ్యాచ్. ఆడిన 13 మ్యాచ్‌ల్లో 6 విజయాలు, 6 ఓటములు, ఒక మ్యాచ్‌లో ఫలితం తేలకపోవడంతో 13 పాయింట్లతో ఐదో స్థానంలో ఉంది. మరి పంజాబ్ జోరు కొనసాగిస్తుందా... లేక ఢిల్లీ సత్తా చాటుతుందా చూడాలి!

టాపార్డర్ ఫుల్ జోష్‌లో...

ఇప్పటి వరకు రెండు వేర్వేరు జట్లను 'ప్లే ఆఫ్స్'కు తీసుకెళ్లిన శ్రేయస్ అయ్యర్‌పై పంజాబ్ కింగ్స్ భారీగా ఆశలు పెట్టుకుంది. 2019, 20లో ఢిల్లీ జట్టును 'ప్లే ఆఫ్స్' చేర్చిన శ్రేయస్... 2024లో కోల్‌కతాకు మూడోసారి కప్పు అందించాడు. తాజా సీజన్‌లో అతడు 174.69 స్ట్రయిక్‌రేట్‌తో 435 పరుగులు చేశాడు. గతేడాదితో పోల్చుకుంటే అతడి బ్యాటింగ్‌లో దూకుడు పెరిగింది. ఈ సీజన్‌లో పవర్‌ప్లే ముగిసిన తర్వాత అత్యధిక స్ట్రయిక్ రేట్‌తో పరుగులు చేసిన రెండో ఆటగాడు శ్రేయస్ అయ్యరే. నికోలస్ పూరన్ 211.51 స్ట్రయిక్ రేట్‌తో పరుగులు రాబడితే... శ్రేయస్ 182.19 స్ట్రయిక్‌రేట్‌తో దంచి కొట్టాడు. ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ సింగ్ జట్టుకు వరంగా మారారు. నిలకడ కొనసాగిస్తున్న ఈ జోడీ... ఢిల్లీతో ఈ నెలారంభంలో జరిగిన పోరులోనూ అదిరిపోయే ఆరంభం అందించింది. వీరిద్దరు తొలి వికెట్‌కు కేవలం 10 ఓవర్లలోనే 122 పరుగులు జోడించారు. ఈ సమయంలో అనివార్య కారణాల వల్ల మ్యాచ్ నిలిచిపోయింది. ఈ సీజన్‌లో ప్రభ్‌సిమ్రన్ 38.17 సగటుతో 458 పరుగులు చేయగా... ప్రియాన్ష్ ఆర్య 356 పరుగులు సాధించాడు. ఇన్‌గ్లిస్, నేహల్ వధేరా, స్టొయినిస్, శశాంక్ సింగ్, యాన్సెస్ రూపంలో కింగ్స్‌కు మెరుగైన బ్యాటింగ్ దళం ఉంది. బౌలింగ్‌లో అర్ష్‌దీప్, యుజువేంద్ర చాహల్, యాన్సెన్, జేమీసన్ కీలకం కానున్నారు. భారత్, పాకిస్తాన్ సరిహద్దుల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో... లీగ్ నుంచి తిరుగు పయనమైన విదేశీ ఆటగాళ్లంతా తిరిగి అందుబాటులోకి రావడంతో పంజాబ్ కింగ్స్ మరింత బలంగా తయారైంది.

అక్షర్ పటేల్ అనుమానమే!

సీజన్ ఆరంభంలో వరుస విజయాలతో ఒకదశలో సునాయాసంగా 'ప్లే ఆఫ్స్' చేరుతుందనిపించిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు... ముంబై చేతిలో ఓటమితో రేసు నుంచి నిష్క్రమించింది. ఇక మిగిలిన ఏకైక మ్యాచ్‌లో మెరుగైన ఆటతీరు కనబర్చి గౌరవంగా సీజన్‌కు గుడ్‌బై చెప్పాలని చూస్తోంది. సీనియర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ 56.00 సగటు, 148.67 స్ట్రయిక్‌రేట్‌తో 504 పరుగులు చేసి జట్టు తరఫున టాప్ స్కోరర్‌గా ఉండగా... అభిషేక్ పొరెల్ 301 పరుగులు చేశాడు. జ్వరం కారణంగా గత మ్యాచ్‌కు అందుబాటులో లేకపోయిన రెగ్యులర్ కెప్టెన్ అక్షర్ పటేల్ ఈ మ్యాచ్‌లో ఆడతాడో లేదో చూడాలి. అతడు అందుబాటులో లేకపోతే మరోసారి డు ప్లెసిస్ ఢిల్లీ జట్టును నడిపించనున్నాడు. డు ప్లెసిస్, ట్రిస్టన్ స్టబ్స్, సమీర్ రిజ్వీ, అశుతోష్ శర్మ, విప్రాజ్ నిగమ్‌తో జట్టుకు మెరుగైన ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. అయితే ఢిల్లీ అసలు సమస్య మాత్రం నిలకడగా వికెట్లు తీయగల ప్రధాన బౌలర్ లేకపోవడమే. ఆసీస్ పేసర్ మిచెల్ స్టార్క్ దూరమవడంతో ఢిల్లీ బౌలింగ్ డీలా పడింది. ముకేశ్ కుమార్, ముస్తఫిజుర్, చమీరా, కుల్దీప్ యాదవ్ ఎలాంటి ప్రదర్శన చేస్తారనేది ఆసక్తికరం.

తుది జట్లు (అంచనా)

పంజాబ్ కింగ్స్: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ సింగ్, జోష్ ఇన్‌గ్లిస్, నేహల్ వధేరా, స్టొయినిస్, శశాంక్ సింగ్, మార్కో యాన్సెన్, జేమీసన్, హర్‌ప్రీత్ బ్రార్, అర్ష్‌దీప్ సింగ్, యుజువేంద్ర చహల్. **ఢిల్లీ క్యాపిటల్స్:** అక్షర్ పటేల్ (కెప్టెన్), కేఎల్ రాహుల్, డు ప్లెసిస్, అభిషేక్ పొరెల్, స్టబ్స్, సమీర్ రిజ్వీ, అశుతోష్ శర్మ, విప్రాజ్ నిగమ్, కుల్దీప్ యాదవ్, చమీరా, ముస్తఫిజుర్, ముకేశ్ కుమార్.

వారిద్దరు లేకపోవడం లోటే కానీ...

ఇతర ఆటగాళ్లకు మంచి అవకాశం • కోచ్ గంభీర్ వ్యాఖ్య


న్యూఢిల్లీ: టెస్టు క్రికెట్‌కు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించడం వారి వ్యక్తిగత నిర్ణయమని, ఇందులో ఇతరుల పాత్ర ఏమీ లేదని భారత జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అభిప్రాయపడ్డాడు. వారిద్దరు లేకపోవడం జట్టుకు లోటే అయినా...వారి స్థానాల్లో వచ్చే ఆటగాళ్లకు ఇది మంచి అవకాశమని అతను అన్నాడు. 'ఒక ఆటగాడు కెరీర్ మొదలు పెట్టినప్పుడు తన ఇష్ట ప్రకారమే ముగింపు కూడా ఇవ్వాలనుకుంటాడు. అది పూర్తిగా వ్యక్తిగత నిర్ణయం. కోచ్, సెలక్టర్ లేదా దేశంలో ఎవరికి కూడా అతడు ఎప్పుడు రిటైర్ కావాలో ఎప్పుడు రిటైర్ కాకూడదో చెప్పే హక్కు లేదు. కాబట్టి వారిది తమ స్వంత నిర్ణయంగానే భావించాలి. ఈ ఇద్దరు అనుభవజ్ఞులు లేకపోవడం కొంత వరకు కష్టమే. అయితే ఇతర ప్లేయర్లకు ఇది చాలా మంచి అవకాశం. నేను సిద్ధంగా ఉన్నాను అన్నట్లుగా వారు బాధ్యత తీసుకోవాలి. చాంపియన్స్ ట్రోఫీకి బుమ్రా దూరమైనప్పుడు కూడా నేను ఇదే చెప్పాను. ఇతర బౌలర్లు సత్తా చాటి జట్టును గెలిపించారు కదా. ఈసారి కూడా ఎంతో మంది తమ అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు' అని గంభీర్ వ్యాఖ్యానించాడు. కోహ్లి, రోహిత్ 2027 వన్డే వరల్డ్ కప్ ఆడే విషయంపై తాను ఇప్పుడే ఏమీ చెప్పలేనని, అందుకు చాలా సమయం ఉందని భారత కోచ్ స్పష్టం చేశాడు.



ఫాలోఆన్‌లో జింబాబ్వే

- తొలి ఇన్నింగ్స్‌లో 265 ఆలౌట్
- ఓపెనర్ బ్రియాన్ బెనెట్ అద్భుత సెంచరీ

నాటింగ్‌హామ్: ఇంగ్లండ్‌తో 22 ఏళ్ల తర్వాత టెస్టు మ్యాచ్ ఆడుతున్న జింబాబ్వే జట్టుకు ఓటమి తప్పేలా లేదు. నాలుగు రోజుల ఈ ఏకైక టెస్టులో రెండో రోజు కూడా ఇంగ్లండ్‌దే పైచేయిగా నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 498/3తో శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ 96.3 ఓవర్లలో 6 వికెట్లకు 565 పరుగులవద్ద డిక్లేర్ చేసింది. తన ఓవర్‌నైట్ స్కోరుకు మరో రెండు పరుగులు జోడించి ఓలీ పోప్ (166 బంతుల్లో 171; 24 ఫోర్లు, 2 సిక్స్‌లు) అవుటయ్యాడు. హ్యారీ బ్రూక్ (50 బంతుల్లో 58; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించాడు. జింబాబ్వే బౌలర్లలో ముజరబాని 3 వికెట్లు తీయగా... చివాంగ, సికందర్ రజా, మధెవెరెలకు ఒక్కో వికెట్ లభించింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన జింబాబ్వే జట్టు 63.2 ఓవర్లలో 265 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ బ్రియాన్ బెనెట్ (143 బంతుల్లో 139; 26 ఫోర్లు) వీరోచిత సెంచరీ చేశాడు. కెప్టెన్ క్రెయిగ్ ఇర్విన్ (64 బంతుల్లో 42; 6 ఫోర్లు), సీన్ విలియమ్స్ (41 బంతుల్లో 25; 4 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. ఇంగ్లండ్ బౌలర్లలో స్పిన్నర్ షోయబ్ బషీర్ 3 వికెట్లు తీయగా... అట్కిన్సన్, బెన్ స్టోక్స్‌లకు రెండు వికెట్ల చొప్పున లభించాయి. స్యామ్ కుక్, జోష్ టంగ్ ఒక్కో వికెట్ పడగొట్టారు. 300 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించిన ఇంగ్లండ్ జట్టు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించకుండా జింబాబ్వేకు ఫాలోఆన్ ఇచ్చింది. ఫలితంగా రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన జింబాబ్వే రెండో రోజు ఆట ముగిసే సమయానికి 10 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 30 పరుగులు చేసింది. మరో రెండు రోజుల ఆట మిగిలి ఉన్న ఈ మ్యాచ్‌లో జింబాబ్వే ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే మరో 270 పరుగులు చేయాలి.



బెనెట్



టెస్టులకు మాథ్యూస్ వీడ్కోలు

కొలంబో: శ్రీలంక సీనియర్ ఆల్‌రౌండర్ ఏంజెలో మాథ్యూస్ టెస్టు ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. వచ్చే నెలలో బంగ్లాదేశ్‌తో తొలి టెస్టు ఆడిన అనంతరం సుదీర్ఘ ఫార్మాట్ నుంచి తప్పుకోనున్నట్లు మాథ్యూస్ శుక్రవారం వెల్లడించాడు. యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వడం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు 37 ఏళ్ల మాథ్యూస్ తెలిపాడు. అయితే పరిమిత ఓవర్ల క్రికెట్‌లో మాత్రం కొనసాగాలనుకుంటున్నట్లు పేర్కొన్నాడు. 'టెస్టు క్రికెట్‌లో ఎన్నో మరపురాని జ్ఞాపకాలు ఉన్నాయి. జట్టును వీడే సమయం వచ్చేసింది. బంగ్లాదేశ్‌తో జూన్ 17 నుంచి 21 వరకు జరగనున్న టెస్టు అనంతరం వీడ్కోలు తీసుకుంటా. సెలెక్టర్లతో మాట్లాడా. వన్డే, టి20 ఫార్మాట్లకు అందుబాటులో ఉంటా' అని మాథ్యూస్ తెలిపాడు. 2009లో అరంగేట్రం చేసిన మాథ్యూస్ 118 టెస్టులు ఆడి 8,167 పరుగులు చేయడంతో పాటు 34 వికెట్లు పడగొట్టాడు. ఇందులో 16 సెంచరీలు, 45 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. కుమార సంగక్కర (12,400), మహేళ జయవర్ధనే (11, 814) తర్వాత శ్రీలంక జట్టు తరఫున టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన మూడో ప్లేయర్‌గా మాథ్యూస్ నిలిచాడు.

విండీస్, ఐర్లాండ్ మ్యాచ్ రద్దు



కేసీ కార్టీ



మాథ్యూ ఫోర్డ్

డబ్లిన్: ఐర్లాండ్ చేతిలో తొలి వన్డేలో ఎదురైన ఓటమి నుంచి తేరుకున్న వెస్టిండీస్ రెండో వన్డేలో అదరగొట్టింది. భారీ స్కోరు చేసి విజయంపై ఆశలు పెంచుకున్న వెస్టిండీస్‌ను వరుణదేవుడు కరుణించలేదు. ఫలితంగా ఈ రెండు జట్ల మధ్య జరిగిన రెండో వన్డే ఫలితం తేలకుండానే ముగిసింది. వెస్టిండీస్ ఇన్నింగ్స్ ముగిశాక భారీ వర్షం రావడంతో ఐర్లాండ్ ఛేజింగ్ సాధ్యపడలేదు. వెరసి మూడు వన్డేల సిరీస్‌లో ఐర్లాండ్ ప్రస్తుతం 1-0తో ఆధిక్యంలో ఉంది. టాస్ గెలిచిన ఐర్లాండ్ కెప్టెన్ పాల్ స్టిర్లింగ్ ఫీల్డింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 352 పరుగులు సాధించింది. వన్‌డౌన్ బ్యాటర్ కేసీ కార్టీ (109 బంతుల్లో 102; 13 ఫోర్లు, 1 సిక్స్) కెరీర్‌లో రెండో సెంచరీ నమోదు చేయగా... చివర్లో మాథ్యూ ఫోర్డ్ (19 బంతుల్లో 58; 2 ఫోర్లు, 8 సిక్స్‌లు) శివమెత్తాడు. కేవలం 16 బంతుల్లోనే ఫోర్డ్ అర్ధ సెంచరీ సాధించాడు. ఈ క్రమంలో వన్డేల్లో ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ చేసిన ప్లేయర్‌గా ఏబీ డివిలియర్స్ (16 బంతుల్లో) పేరిట ఉన్న రికార్డును ఫోర్డ్ సమం చేశాడు. కెప్టెన్ షై హోప్ (57 బంతుల్లో 49; 5 ఫోర్లు, 1 సిక్స్) పరుగు తేడాతో అర్ధ సెంచరీని చేజార్చుకోగా... జస్టిన్ గ్రీవెస్ (36 బంతుల్లో 44 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడాడు. ఐర్లాండ్ బౌలర్లలో బ్యారీ మెకార్తీ, జోష్ లిటిల్ రెండు వికెట్ల చొప్పున తీయగా... లియామ్ మెకార్తీకి మూడు వికెట్లు దక్కాయి. ఈ రెండు జట్ల మధ్య చివరిదైన మూడో వన్డే ఆదివారం జరుగుతుంది.

చూపు లేకున్నా.. ఎవరెస్ట్‌పై కాలు మోపింది!

మొట్టమొదటి భారతీయ అంధురాలు ✦ హిమాచల్ ప్రదేశ్ గిరిజన మహిళ ఘనత



సిమ్లా: ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించాలనే సంకల్పాన్ని సాకారం చేసుకునేందుకు అంధత్వ సైతం అడ్డంకి కాదని నిరూపించిందీ ధీర. హిమాచల్ ప్రదేశ్‌లోని మారుమూల పల్లెకు చెందిన గిరిజన మహిళ ఛోంజిన్ అంగ్మో త్రివర్ణ పతాకాన్ని ప్రపంచంలోనే ఎత్తయిన శిఖరంపై రెపరెపలాడించారు. ఈ ఘనత సాధించిన మొట్టమొదటి భారతీయ మహిళగా, ప్రపంచంలోనే ఐదో వ్యక్తిగా రికార్డు నెలకొల్పారు. హెలెన్ కెల్లర్‌నే ఆదర్శంగా తీసుకున్న అంగ్మో..చూపున్నా దార్శనికత లేకపోవడం అంధత్వం కంటే ఘోరమైన విషయమని చెబుతున్నారు..! ఇండో–టిబెటన్ సరిహద్దులకు సమీపంలోని మారుమూల చంగో గ్రామంలో జన్మించిన అంగ్మో ఎనిమిదేళ్ల వయసప్పుడు చూపు పూర్తిగా కోల్పోయారు. అయినప్పటికీ చదువు ఆపలేదు. పట్టుదలతో ఢిల్లీ వర్సిటీ పరిధిలోని మిరాండా హౌస్‌లో డిగ్రీ, పీజీ పూర్తి చేశారు. ఢిల్లీలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో కస్టమర్ సర్వీస్ అసోసియేట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

గర్వించిన పుట్టిన ఊరు

అంగ్మో తండ్రి అమర్ చంద్ ఏమంటున్నారంటే..'నా కుమార్తె సాధించిన ఘనతను చూసి నాకు ఆనందంగాను, గర్వంగాను ఉంది. ఎవరెస్ట్‌పై విజయం సాధించిన ఆమె రాక కోసం ఎదురుచూస్తున్నా'అని తెలిపారు. అంగ్మో సాధించిన రికార్డుతో ఆ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చిన్ననాటి నుంచే అంగ్మో ఎంతో ధైర్యవంతురాలు, పట్టుదల కలిగిన వ్యక్తి అని బంధువు యమ్చిన్ తెలిపారు. జీవితంలో ఎన్ని ఎదురుపోట్లు ఎదురైనా వెరువక ప్రతి సవాల్‌ను ఒక అవకాశంగా మల్చుకున్నారు అంగ్మో. 'నా కథ ఇప్పుడే మొదలైంది. అంధత్వం నా బలహీనత కాదు, బలం'అని చెప్పారు. 'ఎత్తయిన శిఖరాలను అధిరోహించడం నా చిన్ననాటి కల. ఈ విషయంలో ఆర్థికపరమైన అవరోధాలను అధిగమించాను. మిగతా శిఖరాలను సైతం అధిరోహించాలని ఇప్పుడు లక్ష్యంగా పెట్టుకున్నాను'అని వివరించారు.

కల సాకారమైందిలా..

చిన్ననాటి కలను సాకారం చేసుకునేందుకు 2016లో బేసిక్ మౌంటెయినీరింగ్ కోర్సు పూర్తి చేసి, ఉత్తమ ట్రెయినీగా నిలిచారు అంగ్మో. 2018లో ఈమె 5,486 మీటర్ల ఎత్తులో ప్రపంచంలోనే ఎత్తయిన మనాలి–ఖర్దుంగ్ లా రోడ్డులో అతిశీతల పరిస్థితుల్లో పది రోజులపాటు సైక్లింగ్ చేశారు. 2019లో ఆరు రోజులపాటు మూడు రాష్ట్రాల్లోని నీలగిరి కొండల్లో సైక్లింగ్ చేశారు. గతేడాది జూలైలో మనాలి నుంచి కాల్పా వరకు ఏడు రోజులపాటు సైక్లింగ్ సాగించారు. 2021లో సియాచిన్ గ్లేసియర్‌ను చేరుకున్న దివ్యాంగుల బృందంలో ఏకైక అంధురాలుగా ప్రపంచ రికార్డు నెలకొల్పారు. సుమారు 5,634 మీటర్ల ఎత్తయిన ఎవరెస్ట్ బేస్‌క్యాంప్ వరకు అధిరోహించిన మొట్టమొదటి అంధురాలైన భారతీయ మహిళగా అంగ్మో 2024 అక్టోబర్‌లో రికార్డు సాధించారు. అనంతరం, లద్దాఖ్‌లోని 6,250 మీటర్ల ఎత్తయిన కాంగ్ యాట్సే2 శిఖరాన్ని ఎక్కారు. దివ్యాంగ్ అధిరోహణ బృందంలో సభ్యురాలిగా 6 వేల మీటర్ల ఎత్తయిన మరో శిఖరంపై త్రివర్ణ పతాకం ఎగరేశారు. ఆటల్లోనూ ప్రావీణ్యం చూపే అంగ్మో స్విమ్మింగ్‌లో రాష్ట్ర స్థాయిలో బంగారు పతకం, జూడోలో జాతీయ స్థాయి చాంపియన్ షిప్, జాతీయ మారథాన్‌లలో రెండు రజత పతకాలు సాధించారు. జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో సైతం పాల్గొన్నారు. అంగ్మో సాధించిన విజయాలను ప్రధాని మోదీ 'మన్‌కీ బాత్'లో కూడా ప్రస్తావించడం విశేషం. గతేడాది రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా సర్వశ్రేష్ఠ దివ్యాంగ్‌జన్ జాతీయ అవార్డును అందుకున్నారు.

అర్థంలేని యుద్ధం చేయను

గాజాపై పోరుకు ఇజ్రాయెల్ సైనికాధికారి నిరాకరణ

- ఆయనను, మరో సైనికున్ని జైల్లో పెట్టిన ప్రభుత్వం

జెరూసలెం: ఇజ్రాయెల్ బందీల విడుదలపై స్పష్టత లేకుండా, గాజాలో పసిపిల్లల ప్రాణాలు తీస్తున్న అర్థంలేని యుద్ధం చేయలేనని ఆ దేశ సైనికాధికారి ఒకరు కుండబద్దలు కొట్టారు. అమాయక ప్రజల మరణాలు అంతులేని కొనసాగుతున్నాయి. ఓ రాజకీయ దృక్పథమంటూ లేని ఈ యుద్ధం చేయలేను''అని కెప్టెన్ హోదాలో ఉన్న రాన్ ఫీనర్ స్పష్టం చేశారు. ఆయనతో పాటు డేనియల్ యాహలోం అనే మరో సైనికుడు కూడా యుద్ధానికి నిరాకరించారు. దాంతో వారిని ఇజ్రాయెల్ ప్రభుత్వం జైల్లో పెట్టింది. వారిద్దరూ 'సోల్జర్స్ ఫర్ ది హోస్టేజెస్'అనే సంస్థలో పని చేస్తున్నారు. ఫీనర్ గాజాలో మూడు దశల క్రియాశీల పోరాటంలో పాల్గొన్నారు. దళాలకు నాయకత్వ బాధ్యతల్లో ఉన్నారు. తమ హమాస్ వద్ద ఇంకా బందీలుగా ఉన్న ఇజ్రాయెలీలను విడిపించడం ప్రధాన లక్ష్యం కాదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇటీవలే ప్రకటించడం తెలిసిందే. గాజాను పూర్తిగా నేలమట్టం చేసి, హమాస్‌ను రూపమాపడమే లక్ష్యమని ఆయన అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన 'గాజా స్వాధీన ప్రణాళిక'మేరకు పాలస్తీనియన్లను గాజా నుంచి పూర్తిగా వెళ్లగొట్టినప్పుడే యుద్ధం ముగుస్తుందన్నారు. దాంతో మళ్లీ యుద్ధ విధుల్లో చేరేందుకు ఫీనర్ నిరాకరించారు.

గాజాలో జనం దుస్థితి చూడలేక

''గాజాలో అంతులేని యుద్ధం నన్ను దిగ్భ్రాంతికి గురిచేసింది. అమాయక ప్రజల అంతులేని మరణాలకు ఇది కారణమవుతోంది. మా ప్రభుత్వానికి ఓ దృక్పథం లేదు. గాజాలో ఎప్పటికీ అంతం కాని యుద్ధం సాగుతోంది. నేను దేశాన్ని ప్రేమిస్తున్నా. కానీ ఇక్కడ నా భవిష్యత్తు నా చేతి వేళ్లలోంచి జారిపోతున్నట్టు అనిపిస్తుంది. ఇజ్రాయెల్ ప్రాధాన్యత జాబితాలో బందీలు అట్టడుగున ఉన్నారని ప్రభుత్వం బహిరంగంగా ప్రకటించింది. గాజావాసులు ఆకలితో అలమటిస్తున్నారు. నా ప్లాటూన్‌లోని యోధులను వందల రోజుల పాటు రిజర్వ్ డ్యూటీకి పిలిచారు. వారిని ఇకపై విధుల్లో పాల్గొనేలా ఒప్పించలేను. ఈ దారుణ పరిస్థితులు మారనంత వరకు నేను నైతికంగా సేవలో కొనసాగలేను. ఇజ్రాయెల్ భద్రతకు ముప్పుగా మారింది ఈ మతిలేని యుద్ధమే తప్ప విధి నిర్వహణకు నిరాకరించే నా లాంటి వ్యక్తులు కాదు. ప్రభుత్వ విధానం ఇజ్రాయెల్ విలువలను ప్రతిబింబించడం లేదు. మా ప్రభుత్వం నిజమైన దేశ రక్షణకు దోహదపడే పరిస్థితి తిరిగి వచ్చినప్పుడు తిరిగి నా సేవలందిస్తా''అని ఫీనర్ వెల్లడించారు.

గాజాలోకి 90 ట్రక్కులు: ఐరాస

డెయిర్ అల్ బలాహ్: మూడు రోజుల ఆలస్యం తరువాత గాజాలోకి ఎట్టకేలకు 90 సహాయక ట్రక్కులు వచ్చినట్టు అక్కడి ఐక్యరాజ్యసమితి సహాయ బృందం తెలిపింది. పిండి, పిల్లల ఆహారం, వైద్య పరికరాలతో అవి కెరెమ్ షాలోమ్ క్రాసింగ్ ద్వారా గాజాలో ప్రవేశించినట్టు ధ్రువీకరించింది. ఆ వెంటనే సహాయ పంపిణీ ప్రారంభమైంది. అందుబాటులోకి వచ్చిన పిండితో బేకరీలు తెరుచుకున్నట్టు సహాయ బృందం వెల్లడించింది. గాజాలోకి మానవతా సాయంపై 11 వారాల దిగ్బంధాన్ని ఇటీవలే ఇజ్రాయెల్ పాక్షికంగా ఎత్తేసింది. అది ఏమాత్రమూ చాలదని, గాజా అత్యవసరాలతో పోలిస్తే సరఫరా చాలా తక్కువగా ఉందని ఐరాస ఆక్షేపించింది. సంఘర్షణకు ముందు గాజా రోజుకు సగటున 500 సహాయ ట్రక్కులు వచ్చేవి. ''ప్రస్తుతం 140,000 టన్నులకు పైగా ఆహారం డెలివరీకి సిద్ధంగా ఉంది. మొత్తం గాజా జనాభాకు ఇది రెండు నెలల పాటు సరిపోతుంది. కానీ లోనికి ప్రవేశమే గగనంగా మారింది''అని ప్రపంచ ఆహార కార్యక్రమం అధికారి ఒకరు తెలిపారు. గాజాలో ఇటీవల కాలంలో కనీసం 29 మంది పిల్లలు, వృద్ధులు ఆకలి చావుల పాలయ్యారు. 100కు పైగా ట్రక్కులను అనుమతించినట్టు ఇజ్రాయెల్ చెబుతోంది.

ఐరాసను తప్పించే యోచన

గాజాలో ఐరాస సహాయ వ్యవస్థను పూర్తిగా తప్పించేందుకు ఇజ్రాయెల్ యోచిస్తోంది. సహాయ సరఫరాలను హమాస్ మళ్లిస్తోందని ఆరోపిస్తోంది. ఐరాసను పక్కన పెట్టి అమెరికా మద్దతుతో ఇరు దేశాల సంస్థల ద్వారా సాయం అందిస్తామని ప్రతిపాదించింది. రెడ్‌క్రాస్‌తో సహా అంతర్జాతీయ మానవతా సంస్థలన్నీ ఆ ప్రణాళికను తిరస్కరించాయి. ఇజ్రాయెల్ ప్రతిపాదనకు ఒప్పుకుంటే సాయం రాజకీయ ప్రతీకారానికి మార్గంగా మారే ప్రమాదముందని ఆందోళన వెలిబుచ్చాయి.

దాడులకు 107 మంది బలి

గాజా అంతటా ఇజ్రాయెల్ వైమానిక దాడులు, క్షేత్రస్థాయి ఆపరేషన్లు నిర్నిరోధంగా కొనసాగుతున్నాయి. గత 24 గంటల్లో వాటికి కనీసం 107 మందికి పైగా బలైనట్టు పలు నివేదికలు చెబుతున్నాయి. డ్రోన్, వైమానిక దాడులు జనాన్ని బెంబేలెత్తిస్తున్నాయని గాజా ఆరోగ్య శాఖ వాపోయింది. వాటిలో అల్ ఔదా ఆస్పత్రి తీవ్రంగా దెబ్బ తిన్నట్టు పేర్కొంది. మార్చి నుంచి దాదాపు 6 లక్షల మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. వారిలో 1.61 లక్షల మంది గత వారం రోజుల్లోనే గాజా వీడారు.

జంతు వధ వద్దన్నందుకు బంగ్లా దౌత్యాధికారి నియామకం రద్దు

ఢాకా: మహ్మద్ యూనస్ సారథ్యంలోని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం కోల్‌కతా కాన్సులేట్‌గా షబాబ్ బిన్ అహ్మద్ నియామకాన్ని రద్దు చేసింది. రానున్న బక్రీద్ సమయంలో ఆవులు, గొర్రెలను బలి ఇవ్వరాదంటూ కాన్సులేట్ సిబ్బందికి ఆయన సూచనలను జారీ చేశారు. ఈ నేపథ్యంలో తక్షణమే ఆయన్ను వెంటనే ఢాకాలో రిపోర్టు చేయాలంటూ బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ కోరింది. కోల్‌కతా కాన్సులేట్‌లో బంగ్లాదేశ్ హై కమిషనర్‌గా జూన్ మొదటి వారంలో అహ్మద్ విధుల్లో చేరాల్సి ఉంది. అదే సమయంలో బక్రీద్ పండుగ జరుపుకోనున్నారు. అందుకే, బాధ్యతలు చేపట్టకముందే జంతు వధ వద్దంటూ కాన్సులేట్ అధికారులకు సూచనలు జారీ చేయడం యూనస్ ప్రభుత్వం ఆగ్రహానికి కారణమైంది. సున్నితమైన విషయమైనందున జాగ్రత్తగా వ్యవహరించాలంటూ కాన్సులేట్ అధికారులు హెచ్చరించినా ఆయన పట్టించుకోలేదని సమాచారం.

'పాపి'స్తాన్!

- ఇండిగో విమానానికి అనుమతి నిరాకరణ
- ప్రమాదంలో చిక్కి వేడుకున్నా పట్టించుకోని వైనం
- లాండయ్యేదాకా రక్షణగా నిలిచిన ఐఏఎఫ్

న్యూఢిల్లీ: ఢిల్లీ నుంచి శ్రీనగర్‌కు పలువురు ఎంపీలు సహా 220 మంది ప్రయాణికులతో టేకాఫ్ తీసుకున్న ఇండిగో విమానం మార్గమధ్యంలో ప్రమాదంలో చిక్కుకుంది. పాక్ గగనతలంలోకి ప్రవేశించేందుకు అనుమతివ్వాలంటూ పైలట్ చేసిన వినతిని ఆ దేశం అధికారులు తిరస్కరించారు. అదే సమయంలో భారత వాయుసేన అండగా నిలిచింది. ఈ నెల 21వ తేదీన ఈ ఘటన చోటుచేసుకుంది. ఇండిగోకు చెందిన 6ఈ–142 విమానం ఆకాశంలో ఉండగా అకస్మాత్తుగా వాతావరణంలో మార్పులు సంభవించాయి. బలమైన ఈదురు గాలులతో ముందు భాగం దెబ్బతింది. దీంతో, విమానం పైలట్ అననుకూల వాతావరణం నుంచి తప్పించుకునేందుకు కొద్ది సమయంపాటు గగనతలాన్ని వాడుకునేందుకు అనుమతివ్వాలని పాక్ అధికారులను కోరారు. ఆయన వినతిని లాహోర్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ విభాగం తిరస్కరించింది. భారత విమానాలపై పాక్ గగనతల నిషేధం అమల్లో ఉందని వాయుసేన తెలిపింది. ఈ పరిస్థితుల్లో ఇండిగో విమానం ప్రతికూల వాతావరణం మధ్య ఐఏఎఫ్ విమానం వెంట రాగా తిరిగి గమ్యం దిశగా ప్రయాణం సాగించింది. శ్రీనగర్ సమీపిస్తున్న సమయంలోనే వడగండ్ల వాన కూడా కురిసింది. పైలట్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కు సమాచారం అందించి సాయంత్రం 6.30 గంటలకు సురక్షితంగా ల్యాండ్ చేయగలిగారు. ప్రయాణికులు, సిబ్బంది అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ముందు భాగం తీవ్రంగా దెబ్బతిన్న ఆ విమానాన్ని అత్యవసర మరమ్మతుల కోసం తరలించారు. ఈ ఫ్లయిట్‌లో టీఎంసీ నేతలు డెరెక్ ఒ బ్రియాన్, నదీముల్ హక్, సాగరికా ఘోష్, మానస్ భునియా, మమతా ఠాకూర్ ఉన్నారు.

ముంగిట్లోకి దూసుకొచ్చిన నౌక



తన ఇంటి ముంగిట ఓ భారీ కంటైనర్ షిప్ ముందు నిలబడి ఆనందంగా పోజిస్తున్న ఇతని పేరు జొహాన్ హెల్‌బర్గ్. గురువారం రాత్రి అతను మంచి నిద్రలో ఉండగా 135 మీటర్ల పొడవైన ఈ నౌక అదుపు తప్పి ఒడ్డుకు దూసుకొచ్చింది. నేరుగా మనవాడి ఇంట్లో దూరినంత పని చేసినా గట్టి రాతి భాగాన్ని తాకి నెమ్మదించి ఇలా నిలిచిపోయింది! లేదంటే ఇంటిని నిలువునా చీల్చేసేదట. ఈ ఉదంతం నార్వేలోని బైనెసెట్‌లో జరిగింది.

హార్వర్డ్‌కు ఆరు షరతులు

ఒప్పుకోకుంటే విదేశీ విద్యార్థులపై నిషేధమే

- 72 గంటల్లోగా తేల్చుకోండి ట్రంప్ సర్కారు అల్టిమేటం
- గందరగోళంలో 10 వేల మంది విద్యార్థుల భవితవ్యం
- వారిలో 788 మంది భారతీయ విద్యార్థులు

ప్రభుత్వ నిర్ణయంపై కోర్టు స్టే

వాషింగ్టన్: హార్వర్డ్ విశ్వవిద్యాలయంపై ఆంక్షలకు ట్రంప్ సర్కారు మరింగా పదును పెడుతోంది. హార్వర్డ్‌లో విదేశీ విద్యార్థుల ప్రవేశానికి వీలు కల్పించే యూనివర్సిటీ స్టూడెంట్ ఎక్స్చేంజ్ విజిటర్ ప్రోగ్రాం (ఎస్ఈవీపీ) సర్టిఫికేషన్‌ను తాజాగా రద్దు చేయడం తెలిసిందే. దాన్ని పునరుద్ధరించాలంటే ఆరు కఠినమైన షరతులను పాటించాలంటూ వర్సిటీపై ఒత్తిడి తెస్తోంది. ''గత ఐదేళ్లలో విదేశీ విద్యార్థులు క్యాంపస్‌లో లేదా వెలుపల పాల్పడ్డ చట్టవిరుద్ధ, ప్రమాదకర, హింసాత్మక కార్యకలాపాలు, ఇతర విద్యార్థులపై లేదా సిబ్బందిపై బెదిరింపులు, క్యాంపస్‌లో లేదా బయట ఇతర క్లాస్‌మేట్స్ లేదా వర్సిటీ సిబ్బంది హక్కులను హరించడం వంటివాటికి సంబంధించిన అన్ని రికార్డులనూ తక్షణం ప్రభుత్వానికి అందజేయాలి. గత ఐదేళ్లలో వలసేతర తదితర విద్యార్థులందరికీ సంబంధించిన క్రమశిక్షణ రికార్డులు సమర్పించాలి. క్యాంపస్‌లో వలసేతర విద్యార్థులు నిరసన కార్యకలాపాల్లో పాల్గొని ఉంటే అందుకు సంబంధించిన అన్నిరకాల ఆడియో, వీడియో ఫుటేజీలు, అధికారిక, అనధికారిక రికార్డులన్నీ సమర్పించాలి''అని డీహెచ్ఎస్ స్పష్టం చేసింది. ఇందుకు 72 గంటల గడువు విధించింది. ''హింస, యూదు వ్యతిరేకత, క్యాంపస్‌లో చైనా కమ్యూనిస్ట్ పార్టీతో సమన్వయం వంటి వాటికి హార్వర్డ్ బాధ్యత వహిస్తోంది. అందుకే విదేశీ విద్యార్థులను చేర్చుకునే అర్హత కోల్పోయింది. చట్టాన్ని పాటించడంలో విఫలమైంది. వర్సిటీపై దర్యాప్తు కొనసాగుతోంది. అందుకే సర్టిఫికేషన్ రద్దు చేశాం'' అని డీహెచ్ఎస్ కార్యదర్శి క్రిస్టి నోయెమ్ అన్నారు. హార్వర్డ్‌కు ఎస్ఈవీపీ సర్టిఫికేషన్ రద్దుపై ఫెడరల్ కోర్టు తాజాగా స్టే విధించింది.

వర్సిటీ మారాల్సిందే

ట్రంప్ సర్కారు నిర్ణయం హార్వర్డ్‌లో చదువుతున్న 10,158 మంది విదేశీ విద్యార్థులు, స్కాలర్ల భవితవ్యాన్ని గందరగోళంలో పడేసింది. వీరిలో 788 మంది భారతీయులున్నారు. కోర్సు పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు పొందే విషయంలో ఇబ్బందులేమీ ఉండవు. కోర్సుల మధ్యలో ఉన్న వారు మాత్రం ఇతర వర్సిటీల్లోకి మారాల్సిందే. లేదంటే అమెరికాలో ఉండేందుకు చట్టపరమైన హోదా కోల్పోయి దేశ బహిష్కరణకు గురవుతారని నోయెమ్ స్పష్టం చేశారు. 2025–26 విద్యా సంవత్సరానికి హార్వర్డ్‌లో ప్రవేశం దొరికిన 6,800 మంది విదేశీ విద్యార్థులకు కూడా నిరాశ తప్పనట్టే.

చట్ట విరుద్ధం: హార్వర్డ్

ప్రభుత్వానికి ప్రతీకార చర్య అంటూ హార్వర్డ్ మండిపడింది. ''ఇది చట్టవిరుద్ధం. వర్సిటీకి తీవ్ర హాని కలిగించే నిర్ణయం''అని విమర్శించింది. వర్సిటీకి నిధులను స్తంభింపజేయడం, అంతర్జాతీయ విద్యార్థులను చేర్చుకునే హక్కును రద్దు చేయడంపై కోర్టులో దావా వేసింది. ఈ చర్య చట్టవిరుద్ధమని, ప్రభుత్వ అధికార పరిధికి మించినదని ఆరోపించింది. ''140 పై చిలుకు దేశాల నుంచి వచ్చే విద్యార్థులు, పండితులకు ఆతిథ్యమిచ్చే సామర్థ్యం హార్వర్డ్‌ది. దాన్ని సజావుగా కొనసాగించడానికి కట్టుబడి ఉన్నాం. ఈ విదేశీ ప్రతిభావంతులు వర్సిటీని, దేశాన్ని సుసంపన్నం చేస్తారు. ప్రభుత్వ ప్రతీకార చర్య వర్సిటీ హార్వర్డ్ విద్య, పరిశోధన లక్ష్యాలను దెబ్బతీస్తుంది. అమెరికాకు కూడా తీవ్ర హాని కలిగించే ప్రమాదముంది''అని హార్వర్డ్ ప్రతినిధి జాసన్ న్యూటన్ ఒక ప్రకటనలో తెలిపారు. బాధిత విద్యార్థులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నట్టు చెప్పారు.

విమర్శల వెల్లువ

హార్వర్డ్‌పై తాజా ఆంక్షలను వర్సిటీకి చెందిన దక్షిణాసియా విద్యార్థుల సంఘం (ఎస్ఏఏ)తో పాటు పలు దేశాలు తీవ్రంగా ఖండించాయి. ప్రతిభావంతులైన విద్యార్థులకు గమ్యంగా కొనసాగాలన్న ఆకాంక్ష అమెరికాకు బహుశా లేనట్టుగా ఉందని చైనా దుయ్యబట్టింది. హార్వర్డ్‌లో 1,203 మంది చైనా విద్యార్థులున్నారు. భారత విద్యార్థులపై ప్రభావాన్ని అంచనా వేస్తున్నట్టు మన దౌత్య వర్గాలు తెలిపాయి. ప్రభావిత విద్యార్థులను చేర్చుకునేందుకు హాంకాంగ్‌లోని అత్యున్నత వర్సిటీలు ముందుకొచ్చాయి. వారికి అన్నివిధాలా సాయమందిస్తామని ఎస్ఏఏ ప్రకటించింది.

నష్టం అమెరికాకే: భుటోరియా

ట్రంప్ సర్కారు నిర్ణయాన్ని మాజీ అధ్యక్షుడు జో బైడెన్ విద్యా సలహాదారు అజయ్ భుటోరియా తీవ్రంగా తప్పుబట్టారు. భారత విద్యార్థుల వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఏటా ఏకంగా 900 కోట్ల డాలర్ల మేరకు ఆదాయం సమకూరుతోందని ఆయన గుర్తు చేశారు. ''ఇన్నోవేషన్, టెక్నాలజీ, వైద్య తదితర రంగాల్లో అమెరికా అగ్రస్థానంలో ఉండటం వెనక భారత విద్యార్థుల కృషి ఎనలేనిది. ఇలాంటి అణచివేత చర్యలను అమెరికన్లు కూడా హర్షించడం లేదు. వారు కోరుకుంటున్నది ఇలాంటి దేశాన్ని కాదు''అని స్పష్టం చేశారు. ''ప్రతిభావంతులైన భారత విద్యార్థులకు వచ్చే నష్టమేమీ లేదు. వారికి రెడ్‌కార్పెట్ పరిచేందుకు బ్రిటన్, కెనడా తదితర దేశాలు సిద్ధంగా ఉన్నాయి. వారిని ఇలా వెళ్లగొడితే అంతిమంగా తీవ్రంగా నష్టపోయేది అమెరికానే''అని హెచ్చరించారు. విదేశీ విద్యార్థుల హక్కుల కోసం కాంగ్రెస్‌లో పోరాడాలని డెమొక్రాట్లకు పిలుపునిచ్చారు.

కోటాలో మాత్రమే ఎందుకు చనిపోతున్నారు?

విద్యార్థుల ఆత్మహత్యలపై రాజస్తాన్ తీరును తప్పుబట్టిన సుప్రీం

న్యూఢిల్లీ: రాజస్తాన్‌లోని కోటాలో పోటీ పరీక్షలకు శిక్షణ పొందేందుకు వచ్చే విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడటంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పరిస్థితి తీవ్రమైందంటూ అభివర్ణించింది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 14 మంది ఆత్మహత్యకు పాల్పడటాన్ని ప్రస్తావించిన జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌ల ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించింది. 'మీ ప్రభుత్వం ఏం చేస్తోంది? ఈ పిల్లలంతా కోటాలోనే ఎందుకు చనిపోతున్నారు? దీనిని అడ్డుకునేందుకు ఏమైనా ఆలోచన చేస్తోందా?'అని నిలదీసింది. ఖరగ్‌పూర్ ఐఐటీ విద్యార్థి ఒకరు ఈ నెల 4న హాస్టల్ గదిలో ఉరేసుకుని చనిపోగా, కోటాలో నీట్‌కు ప్రిపేరవుతున్న ఓ అభ్యర్థిని తన గదిలో ఉరేసుకుంది. ఈ రెండు ఘటనలపై విచారణ సందర్భంగా ధర్మాసనం పలు అంశాలను ప్రస్తావించింది. ఖరగ్‌పూర్ ఐఐటీలో విద్యార్థి చనిపోయిన నాలుగు రోజుల తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు కావడమేంటని నిలదీసింది. 'ఇటువంటి ఘటనలను తేలిగ్గా కొట్టిపారేయకండి. చాలా తీవ్రమైన విషయాలివి'అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఉన్నత విద్యా సంస్థల్లో విద్యార్థుల బలవన్మరణాల విషయంలో మార్చి 24వ తేదీన వెలువరించిన తీర్పును అనుసరించి ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయాలని స్పష్టం చేసింది. చట్ట ప్రకారమే, వేగవంతంగా విచారణ కొనసాగించాలని ఆదేశించింది. అలా వ్యవహరించని పక్షంలో ధిక్కరణగా పరిగణించి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. అదేవిధంగా, కోటా ఘటనకు సంబంధించి అసలు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడమేంటని రాజస్తాన్ ప్రభుత్వ లాయర్‌ను ప్రశ్నించింది. తమ తీర్పును ధిక్కరిస్తున్నారంటూ మండిపడింది. సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారికి సమన్లు జారీ చేస్తూ, తదుపరి విచారణను జూలై 14వ తేదీకి ధర్మాసనం వాయిదా వేసింది.

అది పబ్లిసిటీ ఇంటరెస్ట్ లిటిగేషన్: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ తొలిసారి మహారాష్ట్రకు వెళితే ప్రోటోకాల్ పాటించని ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలైంది. అయితే, ఈ వ్యాజ్యాన్ని సీజేఐ బి.ఆర్.గవాయ్, న్యాయమూర్తి జస్టిస్ అగస్టీన్ జార్జి మాసిహ్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం తిరస్కరించింది. పిటిషనర్ శైలేంద్రమణి త్రిపాఠిపై ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇది పబ్లిక్ ఇంటరెస్ట్ పిటిషన్ కాదు.. పబ్లిసిటీ ఇంటరెస్ట్ లిటిగేషన్ అంటూ మండిపడింది. ప్రచారం కోసం ఇలాంటి పిటిషన్లు దాఖలు చేయడం తగదని తేల్చిచెప్పింది. పత్రికల్లో పేరు చూసుకోవడానికి కోర్టులో పిటిషన్లు వేయడం ఏమిటని ప్రశ్నించింది. అంతేకాకుండా పిటిషనర్ శైలేంద్రమణి త్రిపాఠికి రూ.7,000 జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ సొమ్మును లీగల్ సర్వీసు అథారిటీ వద్ద డిపాజిట్ చేయాలని పేర్కొంది. జస్టిస్ గవాయ్ ఈ నెల 14న సీజేఐగా ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే. ఈ నెల 18న ఆయన ఓ సన్మాన కార్యక్రమం కోసం మహారాష్ట్రకు వెళ్లారు. అయితే, ప్రోటోకాల్ ప్రకారం మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ లేదా పోలీసు కమిషనర్ ఆయనకు స్వయంగా స్వాగతం పలకాల్సి ఉండగా, వారు హాజరు కాలేదు. ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.

మూడో కాన్పుకూ ప్రసూతి ప్రయోజనాలు

చరిత్రాత్మక తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: మూడో కాన్పు అయినంత మాత్రాన ప్రసూతి ప్రయోజనాలు వర్తించకుండా పోవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తమిళనాడుకు చెందిన కె.ఉమాదేవి అనే ప్రభుత్వ ఉపాధ్యాయురాలి పిటిషన్‌పై శుక్రవారం ఈ మేరకు చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. తమిళనాడులో ప్రసూతి ప్రయోజనాలు రెండు కాన్పులకే వర్తిస్తాయి. ఈ కారణంగా మూడో కాన్పుకు ప్రసూతి సెలవులు నిరాకరించడాన్ని ఉమాదేవికి హైకోర్టులో సవాలు చేయగా ఏకసభ్య ధర్మాసనం ఆమెకు అనుకూలంగా తీర్పు వెలువరించింది. ''తొలి వివాహం ద్వారా ఇద్దరు సంతానం కలిగే నాటికి ఆమె ఉద్యోగంలోనే చేరలేదు. పైగా ఆ పిల్లలు ఇప్పుడు మాజీ భర్త సంరక్షణలోనే ఉన్నారు'' అని గుర్తు చేసింది. ఆ తీర్పును డివిజన్ బెంచ్ కొట్టేయడంతో ఉమాదేవి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. డివిజన్ బెంచ్ తీరును జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం తప్పుబట్టింది. మహిళల పునరుత్పత్తి హక్కుల్లో, ప్రసూతి ప్రయోజనాల్లో ప్రసూతి సెలవులు అత్యంత కీలకమైనవని స్పష్టం చేసింది. పైగా ప్రభుత్వోద్యోగిగా ప్రసూతి ప్రయోజనాలను ఆమె తొలిసారి కోరుతోందని హైకోర్టు సింగిల్ జడ్జి వ్యాఖ్యలను ఉటంకిస్తూ గుర్తు చేసింది. ఉమాదేవికి ప్రసూతి సెలవులు, ఇతర ప్రయోజనాలు కల్పించాల్సిందేనని ఆదేశాలు జారీ చేసింది.

గ్యాంగ్ రేప్ కేసు నిందితుల బెయిలోత్సవం

సాక్షి బెంగళూరు/ శివాజీనగర: గ్యాంగ్ రేప్ కేసులో జైలు నుంచి బెయిల్‌పై విడుదలైన నిందితులు విజయ యాత్ర జరుపుకొన్నారు. బెయిల్ నిబంధనలను ఉల్లంఘించినందుకు వీరిని మళ్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన కర్ణాటకలోని హావేరిలో జరిగింది. 2024 జనవరి 8న హానగల్ శివార్లలో ఓ వివాహితపై (26) గ్యాంగ్ రేప్ జరిగింది. ఈ కేసులో జైలుపాలైన 19 మందిలో 12 మందికి 10 నెలల క్రితమే బెయిలొచ్చింది. ప్రధానమైన ఏడుగురు నిందితులు అఫ్తాబ్ చందన కట్టి, మదార్‌సాబ్ మండక్కి, సమీవుల్లా లాలనవర్, మొహమ్మద్ సాదిక్ అగసిని, షోయబ్ ముల్లా, తౌసిఫ్ చోటి, రియాజ్ సెవికేరిలకు మూడు రోజుల క్రితమే బెయిల్ మంజూరైంది. సబ్‌జైలు నుంచి విడుదలై తమ ఊరు హక్కి ఆలూరుకు వెళ్లారు. బంధుమిత్రులతో కలిసి ఐదు కార్లలో ఊరేగింపు జరిపారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి. దారుణాలకు పాల్పడి ఉత్సవాలు చేసుకుంటారా? అంటూ ప్రజల నుంచి ఆగ్రహం వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో పోలీసులు బెయిల్ నిబంధనలను అతిక్రమించారంటూ ఏడుగురు నిందితులకుగాను ఐదుగురిని అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

104 ఏళ్ల వృద్ధుడికి 43 ఏళ్ల తర్వాత విముక్తి

కౌశాంబి: హత్య, హత్యాయత్నం నేరాల కింద 43 ఏళ్లపాటు జైలు జీవితం అనుభవించిన తర్వాత 104 ఏళ్ల వృద్ధుడికి ఎట్టకేలకు విముక్తి లభించింది. అలహాబాద్ హైకోర్టు ఆదేశాల మేరకు కౌశాంబి జిల్లా జైలు అధికారులు ఆయన్ను విడిచిపెట్టారు. కౌశాంబి జిల్లా గౌరయె గ్రామానికి చెందిన లఖన్ 1921 జనవరి 4వ తేదీన జన్మించినట్లు జైలు రికార్డుల్లో ఉంది. 1977 ఆగస్ట్ 16వ తేదీన గ్రామంలో రెండు వర్గాల మధ్య జరిగిన కొట్లాట సమయంలో ప్రభు సరోజ్ అనే వ్యక్తిని చంపడంతోపాటు మరొకరిపై హత్యాయత్నం ఆరోపణలపై లఖన్, మరో ముగ్గురిపై ఆరోపణలున్నాయి. ఈ మేరకు ఆయన్ను అరెస్ట్ చేశారు. ఆరోపణలు రుజువు కావడంతో 1982లో ప్రయాగ్‌రాజ్ సెషన్స్ కోర్టు ఈ నలుగురికీ యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. దీనిపై లఖన్ అలహాబాద్ హైకోర్టుకు అప్పీల్ చేసుకున్నారు. దిగువ కోర్టులో ఈ కేసు విచారణ కొనసాగుతుండగానే నిందితుల్లో ముగ్గురు చనిపోయారు. తాజాగా, అలహాబాద్ హైకోర్టు లఖన్ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఆయన్ను విడుదల చేయాలని మే 2వ తేదీన ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జైలు అధికారులు మంగళవారం లఖన్‌ను విడుదల చేసి, కౌశాంబి జిల్లాలోని షరీరా ప్రాంతంలో ఉంటున్న ఆయన కుమార్తె ఇంటి వద్దకు తీసుకెళ్లి అప్పగించారు.

కుప్పకూలిన భారత విదేశాంగ విధానం

ఎస్.జైశంకర్ కాదు.. ఆయన 'జైచంద్ జైశంకర్': రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: నరేంద్ర మోదీ ప్రభుత్వ పాలనలో భారత విదేశాంగ విధానం కుప్పకూలిందని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపించారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత కూడా పాకిస్తాన్ పట్ల సానుకూల ధోరణితో ఎందుకు ఉంటున్నారో చెప్పాలని విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్‌ను ప్రశ్నించారు. భారత్–పాకిస్తాన్‌ల నడుమ మధ్యవర్తిగా పని చేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఎవరు కోరారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాహుల్ శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఎస్.జైశంకర్‌ను 'జైచంద్ జైశంకర్'గా అభివర్ణించారు. ప్రాచీన గాథ 'పృథ్వీరాజ్ రాసో'ను ప్రస్తావించారు. ఇందులో రాజ్‌పుత్ పాలకుడు జైచంద్ అప్పట్లో భారతదేశాన్ని కొల్లగొట్టడానికి వచ్చిన మహమ్మద్ ఘోరీతో చేతులు కలిపాడు. మరో రాజ్‌పుత్ రాజు పృథ్వీరాజ్ చౌహాన్‌కు వ్యతిరేకంగా కుట్రలు చేశాడు. రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా శుక్రవారం ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆపరేషన్ సిందూర్‌పై బాధ్యతారహితంగా వ్యాఖ్యలు చేయొద్దని హితవు పలికారు.

దేశ విభజనకు దారి తీసిన చట్టం ఏది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

భారత కౌన్సిల్ చట్టాలు

1857 సిపాయిల తిరుగుబాటు తర్వాత దేశంలో పరిపాలనా సంస్కరణలను ప్రవేశపెట్టడానికి, భారతీయుల సహకారాన్ని పొందడానికి బ్రిటిష్ ప్రభుత్వం అనేక చట్టాలను రూపొందించింది. వీటినే కౌన్సిల్ చట్టాలు లేదా శాసన చట్టాలు అంటారు.

కౌన్సిల్ చట్టం-1861

భారతదేశంలో శాసన నిర్మాణ ప్రక్రియలో మొదటిసారిగా భారతీయులకు ప్రాతినిధ్యం కల్పించారు.

- ఈ చట్టం ప్రకారం కొంతమంది భారతీయులను అనధికార సభ్యులుగా కౌన్సిల్‌లోకి వైస్రాయ్ నామినేట్ చేస్తారు. ఇలా నామినేట్ అయిన వారిలో బెనారస్ రాజు, పాటియాలా మహారాజు, శ్రీ దినకర్‌రావు ఉన్నారు.
- 1773 చట్టం ద్వారా రద్దయిన బాంబే,మద్రాస్ ప్రెసిడెన్సీల శాసనాధికారాలను పునరుద్ధరించారు. ఆ విధంగా ఈ చట్టాన్ని 'వికేంద్రీకరణ ప్రక్రియ'కు నాందిగా చెప్పొచ్చు. బెంగాల్, పంజాబ్, ఈశాన్య సరిహద్దు ప్రావిన్సులతో నూతన లెజిస్లేటివ్ కౌన్సిళ్లను ఏర్పాటు చేశారు.
- కౌన్సిల్‌లో కార్యక్రమాలను సజావుగా నిర్వహించడానికి అవసరమైన సూత్రాలు, నియమాలను జారీ చేసే అధికారాన్ని వైస్రాయ్‌కి ఇచ్చారు. 1859లో లార్డ్ కానింగ్ ప్రవేశపెట్టిన పోర్ట్‌ఫోలియో (మంత్రిత్వ శాఖలుగా విధుల కేటాయింపు) పద్ధతిని గుర్తించి కొనసాగించారు. తద్వారా వైస్రాయ్ కౌన్సిల్ మరిన్ని శాఖలను నిర్వహించే అవకాశాన్ని ఈ చట్టం కల్పించింది. శాసన కౌన్సిళ్ల సమ్మతి లేకుండానే ఆర్డినెన్సులు జారీ చేసే అధికారాన్ని వైస్రాయ్‌కు కల్పించారు. 1860లో బడ్జెట్ పద్ధతి ప్రవేశపెట్టారు.


కౌన్సిల్ చట్టం-1892

కౌన్సిల్ చట్టం-1861లోని లోపాలను సరిదిద్దడానికి ఈ చట్టం చేశారు. ముఖ్యంగా 1885లో భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పడటం, విద్యావంతులైన భారతీయులు బ్రిటిష్ పాలనలోని లోపాలపై ప్రజలను చైతన్యవంతుల్ని చేస్తుండటంతో ఈ చట్టాన్ని రూపొందించారు.

కేంద్ర శాసనసభలో అనధికార సభ్యుల సంఖ్య 10కి తగ్గకుండా 16 కంటే మించకుండా.. రాష్ట్ర శాసనసభల్లో 8 మందికి తక్కువ కాకుండా 20 మందికి మించకుండా నియంత్రించారు. కేంద్రశాసన మండలికి ఎంపికైన భారతీయ ప్రముఖులు.. గోపాలకృష్ణ గోఖలే, ఫిరోజ్ షా మెహతా, సురేంద్రనాథ్ బెనర్జీ, రాస్ బిహారీ ఘోష్.

ఈ చట్టం ద్వారా శాసన మండలి అధికారాలను విస్తృతం చేశారు. బడ్జెట్‌పై చర్చించడం లాంటి అధికారాలను కల్పించారు.

ప్రజా ప్రయోజనాల దృష్ట్యా, శాసనసభల్లో ప్రభుత్వాన్ని ఉద్దేశించి ప్రశ్నలు వేయడానికి సభ్యులకు అవకాశం కల్పించారు. అయితే ఈ ప్రశ్నలు అడిగేందుకు గవర్నర్, గవర్నర్ జనరల్‌ల ముందస్తు అనుమతి పొందాలి. శాసనసభల్లో తమ స్థానం నామమాత్రమేనని గ్రహించిన భారతీయులు ఈ చట్టాన్ని వ్యతిరేకించారు.



భారత కౌన్సిల్ చట్టం-1909 లేదా మార్లే-మింటో సంస్కరణలు

1892 చట్టంలోని లోపాలను సవరించాలని, దేశంలో తీవ్రవాద జాతీయవాదంతో ఏర్పడిన పరిస్థితిని ఎదుర్కొనాలనే ఉద్దేశంతో ఈ చట్టానికి రూపకల్పన చేశారు. భారత రాజ్య కార్యదర్శి లార్డ్ మార్లే, భారత వైస్రాయ్ మింటో పేర్లతో ఈ చట్టాన్ని సూచించారు. అందువల్ల దీన్ని మార్లే- మింటో సంస్కరణ చట్టం అంటారు. కాంగ్రెస్‌లోని మితవాదులను మచ్చిక చేసుకోవడానికి బ్రిటిష్‌వారు ఈ చట్టం ద్వారా ప్రయత్నించారని చెప్పవచ్చు.

ముఖ్యాంశాలు

- కేంద్ర, రాష్ట్ర శాసన మండళ్లలో సభ్యుల సంఖ్యను పెంచారు.
- శాసన ప్రక్రియ కోసం వైస్రాయ్ కార్యనిర్వాహక కౌన్సిల్‌లోని సభ్యుల సంఖ్యను 16 నుంచి 60కి పెంచారు. అదేవిధంగా మద్రాస్, బెంగాల్, యునైటెడ్ ప్రావిన్స్, బిహార్, ఒరిస్సా రాష్ట్రాల శాసన మండళ్లలో సభ్యుల సంఖ్యను 50కి, పంజాబ్, అస్సాం, బర్మాల్లో 30కి పెంచారు.
- గవర్నర్ జనరల్ ఆధీనంలోని శాసన మండలిలో 4 రకాల సభ్యులు ఉంటారు.
  1. నామినేటెడ్ అధికార సభ్యులు
  2. నామినేటెడ్ అనధికార సభ్యులు
  3. హోదా రీత్యా సభ్యులు
  4. ఎన్నికైన సభ్యులు

మెజారిటీ సభ్యులు అధికార సభ్యులు కావడం వల్ల బిల్లుల ఆమోదం ప్రభుత్వానికి సులభమయ్యేది. వైస్రాయ్, గవర్నర్ల కార్యనిర్వాహక మండలిలో తొలిసారిగా భారతీయులకు సభ్యత్వం కల్పించారు. ఇలా సభ్యత్వాన్ని పొందిన తొలి భారతీయుడు సత్యేంద్ర ప్రసాద్ సిన్హా.

ముస్లింలు, వ్యాపార సంఘాల సభ్యులకు ప్రత్యేక ప్రాతినిధ్యాన్ని కల్పించారు. ముస్లిం జనాభాకు మించిన ప్రాధాన్యాన్ని ఈ చట్టం కల్పించింది. ముస్లిం సభ్యులను ముస్లింలే ఎన్నుకునే వీలు కల్పించింది. దీని కోసం ప్రత్యేక మతపరమైన నియోజక గణాలను ఏర్పాటు చేశారు.

ఈ చట్టం మతతత్వానికి చట్టబద్ధత కల్పించింది. అందుకే లార్డ్ మింటోను 'మత నియోజక గణాల పితామహుడి'గా పేర్కొంటారు.

ప్రెసిడెన్సీ కార్పొరేషన్లు, విశ్వవిద్యాలయాలు, భూస్వాములు, వ్యాపార సంస్థలకు కూడా ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించారు. కేంద్ర, రాష్ట్ర శాసనమండళ్లలో సభ్యులు సైనిక, దౌత్య, మతపరమైన విషయాలు మినహా ఇతర ఏ అంశంపైనైనా ప్రశ్నలు, అనుబంధ ప్రశ్నలు అడగడానికి అధికారం లభించింది. కేంద్ర, రాష్ట్ర శాసనమండళ్లలో పోటీ చేసే అభ్యర్థులకు ఈ చట్టం కచ్చితమైన అర్హతలను నిర్ణయించింది.

విమర్శ: ఈ చట్టంలోని అంశాలు 'అసలైన స్వరూపానికి బదులు కేవలం నీడ లాంటి ఆకారా'న్ని మాత్రమే అందించడం వల్ల 1909 చట్టాన్ని చంద్రకాంతితో పోల్చారు. ఈ చట్టం హిందూ, ముస్లింల మధ్య వేర్పాటు బీజాలు నాటి అడ్డుగోడలు సృష్టించిందని, దేశవిభజనకు దారి తీసిందని నెహ్రూ అభిప్రాయపడ్డారు.

భారత ప్రభుత్వ చట్టం-1919 లేదా మాంటెగు-ఛెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు

భారతదేశంలో బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి బ్రిటిష్ ప్రభుత్వం 1917 ఆగస్టు 20న ఒక ప్రకటన చేసింది. అందులో భాగంగా భారత రాజ్య కార్యదర్శి లార్డ్ మాంటెగు 1917 నవంబర్‌లో భారతదేశాన్ని సందర్శించాడు. వైస్రాయ్ ఛెమ్స్‌ఫర్డ్‌తోపాటు భారతీయ నాయకులతో ఆయన చర్చలు జరిపి ఈ సంస్కరణలను ప్రకటించాడు. అందువల్ల వీటిని మాంటెగు-ఛెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు అంటారు.

ముఖ్యాంశాలు

- భారత రాజ్య కార్యదర్శి జీతభత్యాలను భారత ఆదాయం నుంచి కాకుండా బ్రిటిష్ నిధి నుంచి చెల్లిస్తారు.
- రాష్ట్ర స్థాయిలో ద్వంద్వ పాలన ప్రవేశపెట్టారు. రాష్ట్రాల అధికారాలను రిజర్వ్‌డ్, ట్రాన్స్‌ఫర్డ్‌గా విభజించారు. రిజర్వ్‌డ్ విభాగంలో 28 పాలనా అంశాలను చేర్చారు. విత్తం, భూమి శిస్తు, న్యాయం, నీటి పారుదల, పరిశ్రమలు, మొదలైన వాటిని ఇందులో పేర్కొన్నారు.
- ఈ అంశాలకు సంబంధించిన పరిపాలనా వ్యవహారాలను బ్రిటిష్ కౌన్సిలర్ల సహాయంతో ఆయా రాష్ట్ర గవర్నర్లు నిర్వహిస్తారు. అయితే బ్రిటిష్ కౌన్సిలర్లు తమ విధి నిర్వహణలో రాష్ట్ర శాసనసభకు బాధ్యత వహించరు.
- ట్రాన్స్‌ఫర్డ్ విభాగంలో 22 అంశాలను పేర్కొన్నారు. స్థానిక పాలన, వ్యవసాయం, ప్రజా ఆరోగ్యం, విద్య, సహకారం, మొదలైన అంశాలు ఇందులో ఉన్నాయి.
- రాష్ట్ర గవర్నర్ ఈ అంశాల పాలనా వ్యవహారాలను భారతీయ మంత్రుల సహాయంతో నిర్వహిస్తారు. భారతీయ మంత్రులు ఆయా రాష్ట్ర శాసనసభల్లో సభ్యులై ఉంటారు. తమ విధుల నిర్వహణలో శాసనసభకు బాధ్యత వహిస్తారు.
- దేశంలో మొదటిసారి కేంద్ర స్థాయిలో ద్విసభా పద్ధతిని ప్రవేశపెట్టారు. ఎగువసభను రాష్ట్రాల మండలి(కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్), దిగువ సభను కేంద్ర శాసనసభ(సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ)గా వ్యవహరిస్తారు.
- ఎగువసభ అయిన కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్‌లో 60 మంది సభ్యులు ఉంటారు. ఇందులో 34 మంది ఎన్నికైనవారు, 26 మందిని గవర్నర్ జనరల్ నియమిస్తారు. వీరి పదవీకాలం అయిదేళ్లు. అధ్యక్షుడిని వైస్రాయ్ నియమిస్తారు. దిగువసభ అయిన సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో 145 మంది సభ్యులుంటారు. ఇందులో 104 మంది ఎన్నికైనవారు, 41 మంది నియమితులైనవారు ఉంటారు. ఈ సభ పదవీకాలం మూడేళ్లు.
- మత ప్రాతినిధ్యాన్ని సిక్కులు, క్రిస్టియన్లు, ఆంగ్లో-ఇండియన్లు, ఐరోపా వారికి కూడా వర్తింపజేశారు.
- ఆస్తి పన్ను చెల్లింపు ప్రాతిపదికపై పరిమిత ఓటు హక్కును కల్పించారు. లండన్‌లో భారత వ్యవహారాలను, ముఖ్యంగా రెవెన్యూ, పరిపాలన మొదలైన అంశాలను పర్యవేక్షించడానికి భారత హై కమిషనర్ పదవిని సృష్టించారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లను వేరు చేశారు.
- లీ కమిషన్ (1923–24) సూచన మేరకు భారతదేశానికి విడిగా ఒక ఆడిటర్ జనరల్‌ను, 1926లో ఒక పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ఏర్పాటు చేశారు.
- కేంద్ర, రాష్ట్రాల మధ్య, వివిధ రాష్ట్రాల మధ్య ఉత్పన్నమయ్యే వివాదాలను పరిష్కరించే అధికారం వైస్రాయ్‌కి ఇచ్చారు. ఈ చట్టం అమలు తీరును సమీక్షించడానికి పదేళ్ల తర్వాత చట్టబద్ధత ఉన్న కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

విమర్శ: ఈ చట్టం ప్రతిపాదించిన అంశాలపై అనేక విమర్శలు వచ్చాయి.

- 1919 సంస్కరణలు అసంతృప్తి, నిరాశతో పాటు 'సూర్యుడు లేని ఉదయం'లా ఉన్నాయని బాలగంగాధర్ తిలక్ అభిప్రాయపడ్డారు.
- ఈ సంస్కరణలను బ్రిటిష్‌వారు ప్రకటించి ఉండాల్సింది కాదని, ఈ చట్టాన్ని భారతీయులు స్వీకరించడం తగదని అనిబిసెంట్ వ్యాఖ్యానించారు.
- భారతదేశంలో ద్వంద్వ పాలన దాదాపు దూషణ పదంగా మారింది. ఒక వ్యక్తి, ఇంకొక వ్యక్తిని నీవు 'డైయార్కి'వి అని అరవడం విన్నానని సర్ బట్లర్ అనే రచయిత తెలిపాడు.
- ద్వంద్వ పాలనను ఎప్పటికీ ఆదర్శంగా భావించలేం. మరో ఉత్తమ ప్రయోజన స్థితికి ఇది ఓ మెట్టు మాత్రమే. ఆ ఉత్తమ ప్రయోజనమే 'పరిపూర్ణ స్వపరిపాలిత భారతదేశం' అని పలాండే అనే రచయిత పేర్కొన్నారు.

ఈ సంస్కరణలు స్వపరిపాలన దిశగా చెప్పుకోదగ్గ ... గ చరిత్రలో ముఖ్య ... పరిగణిస్తారు. ప్రేరణను, భవితవ్యం కోసం అనుభవం సంపాదించడానికి ఈ చట్టం తగిన అవకాశం ఇచ్చిందని కూడా చెప్పవచ్చు.

సైమన్ కమిషన్ - నవంబర్ 1927

భారత ప్రభుత్వ చట్టం 1919 ద్వారా ప్రవేశపెట్టిన రాజ్యాంగ సంస్కరణలను సమీక్షించడానికి నిర్ణీత సమయం కంటే రెండేళ్ల ముందే బ్రిటన్ ప్రధాని స్టాన్లీ బాల్డ్‌విన్ 1927 నవంబర్‌లో సర్ జాన్ సైమన్ నాయకత్వంలో ఆరుగురు సభ్యులతో ఒక రాయల్ కమిషన్‌ను నియమించారు.

ఇందులోని సభ్యుడైన క్లిమెంట్ అట్లీ భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చే సమయానికి ఇంగ్లండ్ ప్రధానిగా ఉన్నారు. ఈ కమిషన్‌లో సభ్యులందరూ ఆంగ్లేయులు కావడం వల్ల భారతీయులు దీన్ని పూర్తిగా వ్యతిరేకించారు.

ఈ కమిషన్ భారతదేశంలో రెండు సార్లు పర్యటించింది. 1928 ఫిబ్రవరి 3 నుంచి మార్చి 31 వరకు తొలిసారి, 1928 అక్టోబర్ 11 నుంచి 1929 ఏప్రిల్ 6 వరకు రెండోసారి పర్యటించింది. ఈ కమిషన్ 1930లో నివేదికను సమర్పించింది.

ముఖ్యాంశాలు

- రాష్ట్రాల్లో ప్రవేశపెట్టిన ద్వంద్వ పాలనను రద్దు చేయడం, మంత్రులు శాసనసభకు బాధ్యత వహించేలా చేయడం.
- ప్రభుత్వ నిర్వహణలో భారతీయులకు పూర్తి స్వయంప్రతిపత్తి కల్పించడం.
- రాష్ట్ర శాసన మండళ్లలో సభ్యత్వ సంఖ్యను పెంచడం.
- ఏక కేంద్ర వ్యవస్థ భారతదేశానికి సరిపడదు కాబట్టి సమాఖ్య వ్యవస్థను అభివృద్ధి చేసుకోవడం.
- హైకోర్టుపై కేంద్ర ప్రభుత్వానికి పాలనాపరమైన నియంత్రణ ఏర్పాటు.
- సార్వజనీన వయోజన ఓటు హక్కు వెంటనే సాధ్యం కాదు కాబట్టి దీన్ని కాలానుగుణంగా విస్తృతం చేయడం.
- కమ్యునల్ ప్రాతినిధ్యం సమంజసం కాకపోయినా, దీనికి ప్రత్యామ్నాయం లేని దృష్ట్యా కొనసాగించడం.

పేదలకు లబ్ధి చేకూర్చేందుకే భూసంస్కరణలు



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఎకానమీ

జాతీయ స్థాయిలో భూసంస్కరణలు

భూ సంస్కరణలలోని వివిధ అంశాలను పరిశీలించడానికి 1972లో తొమ్మిది మంది సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సూచనలకు అనుగుణంగా.. 1972లో జరిగిన ముఖ్యమంత్రుల సమావేశంలో మొదటిసారిగా భూ సంస్కరణలను జాతీయ అంశంగా గుర్తించి, జాతీయస్థాయిలో కొన్ని మార్గదర్శకాలను రూపొందించారు.

జాతీయ మార్గదర్శక సూత్రాలు

- సంవత్సరానికి రెండు పంటలు పండే భూమి గరిష్ఠ పరిమితి 10 నుంచి 18 ఎకరాలు.
- సంవత్సరానికి ఒక పంట పండే భూమి (నీటిపారుదల సౌకర్యాలున్న భూమి) గరిష్ఠంగా 27 ఎకరాలకు మించకూడదు.
- మిగతా రకాల భూముల గరిష్ఠ పరిమితి, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో తప్ప (ఎడారి ప్రాంతాలు మొదలైనవి) 54 ఎకరాలకు మించరాదు.
- కమతం పరిమాణాన్ని నిర్ణయించేటప్పుడు ఐదుగురు సభ్యులున్న కుటుంబాన్ని లెక్కలోకి తీసుకోవాలి. కుటుంబం అంటే భార్యా భర్త, ముగ్గురు మైనర్ పిల్లలుగా గుర్తించాలి. అంతకంటే ఎక్కువ మంది సభ్యులుంటే కొంత భూమిని అదనంగా పొందవచ్చు. కానీ ఆ మొత్తం కుటుంబ కమతానికి రెండు రెట్ల కంటే ఎక్కువ ఉండ కూడదు.
- భార్యాభర్త పేర్ల మీద వేర్వేరుగా భూములున్నప్పటికీ వారిద్దరి భూములను కలిపి గరిష్ఠ పరిమితిని నిర్ణయించాలి.
- మేజర్ అయిన కుమారుడిని ప్రత్యేక కుటుంబంగా గుర్తించాలి.
- నూతన సవరణలతో భూ సంస్కరణల చట్టాలను 1972 డిసెంబర్ 31లోగా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించాలి.
- ఈ నూతన సవరణలతో చట్టాలను ఎప్పుడు రూపొందించినా అమలు మాత్రం 1971 జనవరి 24 నుంచే జరగాలి.

మినహాయింపులు

- కాఫీ, తేయాకు, రబ్బరు, కోకో మొదలైన తోట పంటలను పండించే భూములకు గరిష్ఠ పరిమితి నుంచి మినహాయింపు ఇవ్వాలి.
- భూదాన ఉద్యమ భూములు, సహకార బ్యాంకులు, జాతీయ బ్యాంకులు, కేంద్ర, రాష్ట్ర, స్థానిక సంస్థల భూములకు గరిష్ఠ పరిమితి వర్తించదు.
- వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలు, పరిశోధనా కేంద్రాల భూములకు మినహాయింపు ఉండాలి.
- రాష్ట్ర ప్రభుత్వాల అభీష్టం మేరకు మతపరమైన సంస్థలు, చారిటబుల్ ట్రస్టులు, విద్యాలయాల భూములకు మినహాయింపు ఇవ్వవచ్చు.
- చెరకు పండించే కమతాలకు మినహాయింపులు ఉండరాదు. పరిశోధన కోసం ఉపయోగపడే భూములు, పంచదార ఫ్యాక్టరీ పరిధిలో ఉండే భూముల విషయంలో మినహాయింపు వంద ఎకరాలకు మించకూడదు.

మిగులు భూమి పంపకం - ప్రాధాన్యం

- మిగులు భూమిని పొందే పేద వర్గాల కొనుగోలు శక్తిని దృష్టిలో ఉంచుకొని నష్టపరిహారాన్ని మార్కెట్ విలువ కంటే తక్కువగా నిర్ణయించాలి.
- మిగులు భూమి పంపిణీలో భూమిలేని వ్యవసాయ కార్మికులు ముఖ్యంగా హరిజన, గిరిజనులకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- భూ సంస్కరణలను అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. దీని కోసం అధికారులతో వివిధ స్థాయుల్లో కమిటీలను ఏర్పాటు చేయాలి. పటిష్ఠమైన పాలనా వ్యవస్థను ఏర్పర్చుకోవాలి.

మొదటి దశ భూ సంస్కరణలు (1947-1970)

భూ సంస్కరణల అమలును ముఖ్యంగా మూడు అంశాలుగా పేర్కొనవచ్చు. అవి...

- మధ్యవర్తుల తొలగింపు చట్టాలు
- కౌలు సంస్కరణలు
- కమతాల గరిష్ఠ పరిమితి

మధ్యవర్తుల తొలగింపు చట్టాలు

భారతదేశంలోని వివిధ రాష్ట్రాల్లో అఖిల భారత కాంగ్రెస్ వ్యవసాయ సంస్కరణల కమిటీ (కుమారప్ప కమిటీ) లేదా ప్రణాళిక సంఘం సూచనల మేరకు భూ సంస్కరణలు అమలు చేశారు. కానీ తెలంగాణ ప్రాంతంలో పోలీసు చర్య తర్వాత(కుమారప్ప కమిటీ సూచనలకు ముందే) జాగీర్దార్ల రద్దు, కౌలు సంస్కరణల చట్టాలను అమలు చేశారు.

షక్మీదార్లు (శాశ్వత కౌలుదార్లు)	అసామి షక్మీదార్లు
హైదరాబాద్ ప్రాంతంలో 12 ఏళ్లు సాగు చేసే వారిని షక్మీదార్లుగా గుర్తించేవారు. వీరు శాశ్వత కౌలుదార్లు.	వీరికి భూమిపై అధికారం ఉండదు.
రక్షణ, భూమిని సాగు చేసే హక్కు ఉన్న కౌలుదార్లను షక్మీదార్లు అనేవారు.	వీరు ఏ హక్కులు లేని కౌలుదార్లు.
	కౌలుభూమి 12 ఏళ్లపాటు అసామి షక్మీదార్ల స్వాధీనంలో ఉంటే వారు షక్మీదార్లుగా గుర్తింపు పొందుతారు.

తెలంగాణ ప్రాంతంలో జాగీర్దార్ల రద్దు

తెలంగాణ(హైదరాబాద్ రాష్ట్రం)లో జాగీర్ల రద్దు చట్టాన్ని 1949 ఆగస్టు 15న ప్రకటించారు. ఈ చట్టం ద్వారా రూ.18 కోట్లను నష్ట పరిహారంగా చెల్లించి జాగీర్దార్లను, సంస్థానాధీశులను తొలగించారు.

తెలంగాణ ప్రాంతంలో ఇనాందార్ల రద్దు

1955లో తెలంగాణ ప్రాంతంలో ఇనాంల రద్దు చట్టం చేశారు. కానీ ఈ చట్టంలో దేవాదాయ, ధర్మాదాయ భూములకు మినహాయింపులు ఇచ్చారు.

- 1967 నుంచి ఈ చట్టాన్ని అన్ని రకాల ఇనాంలకు వర్తింపజేశారు.
- సరైన నష్ట పరిహారం ప్రకటించలేదనే కారణంతో 1970 ఏప్రిల్ 3న హైకోర్టు ఈ చట్టాన్ని కొట్టివేసింది.
- 1973 నవంబర్ 1న ప్రభుత్వం ఈ చట్టాన్ని పునరుద్ధరించి ఇనాం భూములను సేద్యం చేస్తున్న రైతులకు పట్టాలు ఇచ్చింది.

కౌలు సంస్కరణలు

షక్మీదార్లు (శాశ్వత కౌలుదార్లు)

- హైదరాబాద్ ప్రాంతంలో 12 ఏళ్లుగా సాగు చేసే వారిని షక్మీదార్లుగా గుర్తించేవారు. వీరు శాశ్వత కౌలుదార్లు.
- రక్షణ, భూమిని సాగు చేసే హక్కు ఉన్న కౌలు దార్లను షక్మీదార్లు అనేవారు.

అసామి షక్మీదార్లు

- వీరికి భూమిపై అధికారం ఉండదు.
- వీరు ఏ హక్కులు లేని కౌలుదార్లు.
- కౌలుభూమి 12 ఏళ్లపాటు అసామి షక్మీదార్ల స్వాధీనంలో ఉంటే వారు షక్మీదార్లుగా గుర్తింపు పొందుతారు.
- భరూచా కమిటీ సిఫారసుల మేరకు హైదరాబాద్ సంస్థానంలో 1944లో 'అసామి షక్మీ చట్టం' చేశారు.
- ఈ చట్టం ప్రకారం ఆరు సంవత్సరాలు భూమిని కౌలుకు చేసే వారు అసామి షక్మీదార్లు(రక్షిత కౌలుదార్లు) అవుతారు. వీరిని తొలగించే వీలుండదు. భూస్వాముల ఒత్తిడి కారణంగా ఈ చట్టం అమల్లోకి రాలేదు.
- అసామి షక్మీ చట్టం ద్వారా చట్ట వ్యతిరేక లెవీ పద్ధతిని, సెస్‌లను, పన్నులను, వెట్టిచాకిరీని నిషేధించారు. కానీ ఈ చట్టం వల్ల తీవ్ర దుష్ఫలితాలు తలెత్తాయి.
- హైదరాబాద్ లేదా తెలంగాణ ప్రాంతంలో మూడు రకాల కౌలు చెల్లింపు పద్ధతులు ఉండేవి. అవి.

బటాయి: కౌలుగా ధాన్యం చెల్లిస్తారు. ఇది పంటలో 20 శాతం నుంచి 40 శాతం ఉండేది.

నగదు రూపకౌలు: నగదు రూపంలో చెల్లించే కౌలు. ఇది ద్రవ్యరూప కౌలు, స్థిరమైన కౌలు.

గల్లామక్తా: ఉత్పత్తితో సంబంధం లేకుండా ఒక ఎకరానికి కనీస మొత్తంగా ధాన్యరూపంలో చెల్లించే కౌలు(స్థిరమైంది). కొన్ని సందర్భాల్లో 2/3వ వంతు ఉండేది.

ఈ మూడు పద్ధతుల్లోనూ కౌలు పరిమాణం అధికంగా ఉండేది.

- ఈ కౌలు రేట్లు నికర ఉత్పత్తిలో 2/3వ వంతు కంటే ఎక్కువగా ఉండేవని, నగదు రూపంలో చెల్లించే కౌలు భూమి అసెస్‌మెంట్ కంటే 5 నుంచి 12 రెట్లు వరకు ఉండేదని భరూచా కమిటీ నివేదిక తెలిపింది. ఇవే కాకుండా భూమిని కౌలుకు తీసుకునే ముందు, రెన్యూవల్ కోసం నజరానాలు కూడా చెల్లించాల్సి ఉండేది.

హైదరాబాద్ (తెలంగాణ) కౌలు వ్యవసాయ భూముల చట్టం 1950

- 1944 నాటి 'హైదరాబాద్ వ్యవసాయ సంస్కరణల కమిటీ' సూచనల మేరకు 1950 జూన్ 10న ఈ చట్టాన్ని ప్రకటించారు.

ముఖ్యాంశాలు

1. ఆరేళ్ల కౌలుదార్లుగా ఉన్నవారిని రక్షిత కౌలుదార్లుగా పేర్కొంటారు.
2. కౌలు ఒప్పందం మౌఖిక రూపంలో కాకుండా ఎంఆర్‌వో సమక్షంలో రాత పూర్వకంగా ఉండాలి.
3. కౌలు పరిమాణం భూస్వామి ప్రభుత్వానికి చెల్లించే శిస్తు కంటే 3–5 రెట్లు మాత్రమే ఉండాలి. అంత కంటే ఎక్కువ ఉండొద్దు.

- ఈ చట్టంలోని లోపాలను సవరించి హైదరాబాద్ ప్రివెన్షన్ ఆఫ్ ఎవిక్షన్ ఆర్డినెన్స్ –1952ను జారీ చేశారు.
- భూస్వాములు భారీ సంఖ్యలో కౌలుదార్లను తొలగించారు. దీంతో కౌలుదార్లను తొలగించవద్దని, వారికి భూములను వెనక్కి ఇప్పించాలని, కౌలుదార్ల అనుమతి లేకుండా అమ్మిన భూములకు గుర్తింపు లభించదని ఈ ఆర్డినెన్స్‌లో పేర్కొన్నారు.
- 1955లో ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో ఈ ఆర్డినెన్స్‌ను అమలు చేశారు. తెలంగాణ అంతటా దీన్ని వర్తింపజేయగా భూస్వాములు కోర్టుకు వెళ్లారు.
- ఈ చట్టం ప్రకారం భూస్వాములు తొలగించిన కౌలుదార్లందరికీ మళ్లీ భూమిని అప్పగించడంతో పాటు కౌలు పరిమాణాన్ని కూడా ప్రభుత్వమే నిర్ణయించింది.
- మాగాణి భూమికి – 1/3వ వంతు
- మెట్ట భూమికి – 1/4వ వంతు.

కమతాల గరిష్ఠ పరిమితి

- కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు వార్షికంగా రూ. 3,600 నికర ఆదాయం సంపాదించే కమతం ఆధారంగా కమతాల గరిష్ఠ పరిమితి చట్టాన్ని 1961లో చేశారు.

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ భూముల గరిష్ఠ పరిమితి చట్టం - I

- ఈ చట్టం 1961 జూన్ 1 నుంచి అమల్లోకి వచ్చింది.
- ఈ చట్టంలో మాగాణి భూమిని ఐదు రకాలుగా, మెట్ట భూమిని మూడు రకాలుగా వర్గీకరించారు.

భూమి రకాలు	రెండు పంటలు పండే భూమి	ఒక పంట పండే భూమి
మాగాణి ఐదు రకాలు		
క్లాస్ - ఎ	6	27
క్లాస్ - బి	8	36
క్లాస్ - సి	10	45
క్లాస్ - డి	12	54
క్లాస్ - ఇ	24	108
మెట్ట మూడు రకాలు		
క్లాస్-ఎఫ్	36	162
క్లాస్ - జి	48	216
క్లాస్-హెచ్	72	324



- ఈ చట్టం ప్రకారం ప్రతి కుటుంబంలోని ప్రతి సభ్యుడిని యూనిట్‌గా తీసుకొని, ప్రతి యూనిట్‌కు కుటుంబ కమతానికి 4 1/2 రెట్ల భూమిని గరిష్ఠ పరిమితిగా నిర్ణయించారు.
- ఈ చట్టం ప్రకారం ఒక కుటుంబానికి ఆరు ఎకరాల నుంచి 324 ఎకరాల మధ్య భూమి ఉండవచ్చు.
- దేశంలోని రాష్ట్రాలన్నీ గరిష్ఠ పరిమితి విషయంలో సీఎల్ఆర్‌ను పాటించాయి. అయితే సీలింగ్‌లో రాజస్థాన్‌లో ఎక్కువ గరిష్ఠ పరిమితి ఉండగా, పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాల్లో తక్కువ పరిమితి ఉంది.
- ఈ చట్టం ద్వారా 2,384 ఎకరాల మిగులు భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకుగానూ నష్టపరిహారం చెల్లించారు.
- ఈ చట్టంలో గరిష్ఠ పరిమితి ఎక్కువగా ఉండటం వల్ల ఆశించిన రీతిలో మిగులు భూమి లభించలేదు.
- అందువల్ల కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు 1961 చట్టం స్థానంలో 'భూ గరిష్ఠ పరిమితి చట్టం – 1973'ను ప్రవేశపెట్టారు.

వేయి స్తంభాల గుడి నిర్మాత ఎవరు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర



1. శ్రీముఖ శాతవాహనుడి కాలంనాటి నాణేలు ఎక్కడ లభించాయి?
ఎ) వరంగల్ బి) ఉట్నూరు
సి) కరీంనగర్ డి) చెన్నూరు
2. 'వాత్సాయనుడు' ఏ పాలకుల ఆస్థానంలో ఉండేవారు?
ఎ) కాకతీయులు
బి) విజయనగర రాజులు
సి) తూర్పు చాళుక్యులు
డి) శాతవాహనులు
3. శాతవాహన వంశ స్థాపకుడెవరు?
ఎ) గౌతమీపుత్ర శాతకర్ణి
బి) శ్రీముఖుడు
సి) యజ్ఞశ్రీ శాతకర్ణి డి) హాలుడు
4. కాకతీయులు మొదటగా ఏ రాజులకు సేనానులుగా పనిచేశారు?
ఎ) తూర్పు చాళుక్యులు
బి) కళ్యాణి చాళుక్యులు
సి) రాష్ట్రకూటులు డి) పాండ్యులు
5. మొదటిసారిగా ఏ శాసనంలో కాకతీయుల ప్రస్తావన కనిపించింది?
ఎ) హాతిగుంఫా శాసనం
బి) మాగల్లు శాసనం
సి) బయ్యారం చెరువు శాసనం
డి) పాకాల శాసనం
6. కాకతీయులు మొదట ఏ ప్రాంతాన్ని పాలించారు?
ఎ) కొరివి బి) ఓరుగల్లు
సి) ముదిగొండ డి) హన్మకొండ
7. తూర్పు చాళుక్య రాజైన దానర్ణవుడికి సహాయం చేసిన కాకతీయ సేనాని?
ఎ) బేతరాజు బి) ప్రోలరాజు
సి) కాకర్త్యగుండన డి) రుద్రదేవుడు
8. పల్నాటి యుద్ధంలో జోక్యం చేసుకున్న కాకతీయ పాలకుడెవరు?
ఎ) రుద్రదేవుడు బి) గణపతిదేవుడు
సి) మహాదేవుడు డి) ప్రతాపరుద్రుడు
9. 'చలమర్తి గండ' అనే బిరుదు ఎవరిది?
ఎ) కాకర్త్యగుండన బి) దుర్గరాజు
సి) మొదటి బేతరాజు
డి) మొదటి ప్రోలరాజు
10. కాకతీయుల మొదటి రాజధాని ఏది?
ఎ) హన్మకొండ బి) ఓరుగల్లు
సి) కొరివి డి) కోటిలింగాల
11. ఓరుగల్లు పట్టణ నిర్మాత?
ఎ) గణపతి దేవుడు బి) రుద్రదేవుడు
సి) కాకర్త్యగుండన డి) మహాదేవుడు
12. కాకతీయుల పాలనా కాలం?
ఎ) క్రీ.శ. 950 నుంచి 1300 వరకు
బి) క్రీ.శ. 1000 నుంచి 1368 వరకు
సి) క్రీ.శ. 1000 నుంచి 1323 వరకు
డి) క్రీ.శ. 950 నుంచి 1342 వరకు
13. 'ఆంధ్రదేశాధీశ్వర' బిరుదు పొందిన పాలకులెవరు?
ఎ) కాకతీయులు బి) శాతవాహనులు
సి) ఇక్ష్వాకులు
డి) విజయనగర రాజులు
14. రామప్ప ఏ జిల్లాలో ఉంది?
ఎ) నల్గొండ బి) ఖమ్మం
సి) వరంగల్ డి) కరీంనగర్
15. ఎవరి పాలనా కాలంలో 'మార్కోపోలో' మోటుపల్లి రేవును సందర్శించాడు?
ఎ) ప్రతాపరుద్రుడు బి) రుద్రమదేవి
సి) గణపతి దేవుడు డి) మహాదేవుడు
16. కాకతీయుల కాలంలో ఏ మతం ఆధిపత్యంలో ఉండేది?
ఎ) శైవం బి) వైష్ణవం
సి) బౌద్ధం డి) జైనం
17. హనుమకొండ ప్రాంతంపై పూర్తి వంశపారంపర్య హక్కులను మొదటి ప్రోలరాజు ఎవరి ద్వారా పొందాడు?
ఎ) చాళుక్య దానర్ణవుడు
బి) కాలచూరి బిజ్జలుడు
సి) చాళుక్య రెండో తైలపుడు
డి) చాళుక్య మొదటి సోమేశ్వరుడు
18. 'బయ్యారం చెరువు శాసనాన్ని' వేయించిన వారు?
ఎ) రుద్రమదేవి బి) మైలమదేవి
సి) గణపాంబ డి) అనితల్లి
19. కిందివారిలో కాకతీయ రాజ్య పునఃస్థాపనకు సహాయపడినవారెవరు?
ఎ) రుద్రమదేవి బి) మైలాంబ
సి) కామసాని డి) అనితల్లి
20. కాకతీయ వంశ మూలపురుషుడు?
ఎ) వెన్ననృపుడు బి) కాకర్త్యగుండన
సి) మొదటి బేతరాజు డి) కాకతీరాజు
21. ఏకవీర దేవి ఆలయం ఎక్కడ ఉంది?
ఎ) ఘణపురం బి) కొలనుపాక
సి) మొగిలిచర్ల డి) ఇనుగుర్తి
22. కిందివాటిలో సరికాని జత ఏది?
ఎ) వల్లభా చార్యుడు - నీతిసార యోగం
బి) రుద్రదేవుడు - నీతిసారం
సి) విద్యానాథుడు - ప్రతాపరుద్ర యశోభూషణం
డి) జాయపసేనాని - నృత్త రత్నావళి
23. మొదటగా చెరువులను తవ్వించిన కాకతీయ రాజు?
ఎ) మొదటి బేతరాజు
బి) మొదటి ప్రోలరాజు
సి) రుద్రదేవుడు డి) రుద్రమదేవి
24. వేయి స్తంభాల గుడి నిర్మాత ఎవరు?
ఎ) గణపతి దేవుడు బి) ప్రతాపరుద్రుడు
సి) రుద్రదేవుడు డి) మహాదేవుడు
25. దేవాలయాలను నిర్మించిన మొదటి కాకతీయ పాలకుడెవరు?
ఎ) రుద్రదేవుడు బి) మహాదేవుడు
సి) మొదటి ప్రోలరాజు
డి) మొదటి బేతరాజు
26. స్వతంత్రంగా కాకతీయ రాజ్య పాలనను ప్రారంభించినవారెవరు?
ఎ) కాకర్త్యగుండన బి) వెన్ననృపుడు
సి) మొదటి ప్రోలరాజు
డి) రెండో ప్రోలరాజు
27. హనుమకొండలో కాకతీయ వంశ పాలనను ప్రారంభించినవారు?
ఎ) మొదటి ప్రోలరాజు
బి) మొదటి బేతరాజు
సి) రుద్రదేవుడు డి) కాకర్త్యగుండన
28. కరీంనగర్ ప్రాంతాన్ని కాకతీయుల కాలంలో ఏ పేరుతో పిలిచేవారు?
ఎ) ముల్కినాడు బి) సబ్బినాడు
సి) రేనాడు డి) పాకనాడు
29. కాకతీయుల కాలంలో గ్రామపాలనను పర్యవేక్షించేవారిని ఏమని పిలిచేవారు?
ఎ) ఆయగారు బి) ఇనామ్‌దార్
సి) గ్రామణి డి) గోమేయక
30. కాకతీయుల శిల్పకళకు సంబంధించి ప్రత్యేకమైన నిర్మాణాలేవి?
ఎ) కోటగుళ్లు
బి) తోరణ స్తంభాలు
సి) త్రికూటాలయాలు
డి) ఆలయాల ప్రాకారాలు
31. పాకాల సరస్సును తవ్వించిన వారెవరు?
ఎ) బయ్యన నాయకుడు
బి) రేచర్ల రుద్రుడు
సి) మల్యాల గొండప్ప
డి) జగదల ముమ్మడి నాయకుడు
32. 'భట్టారకులు' అంటే ఎవరు?
ఎ) సైనికులు బి) వ్యాపారులు
సి) ప్రభుత్వ ఉద్యోగులు
డి) రాయబారులు
33. తెలుగు ప్రాంత విమోచన ఉద్యమ నాయకుడెవరు?
ఎ) ముసునూరి ప్రోలయ నాయకుడు
బి) ముసునూరి కాపయ నాయకుడు
సి) అద్దంకి వేమారెడ్డి
డి) రాచకొండ పద్మనాయకుడు
34. కాకతీయుల చివరి రాజు?
ఎ) రుద్రదేవుడు బి) రుద్రమదేవి
సి) ప్రతాపరుద్రుడు డి) గణపతిదేవుడు
35. 'ఆంధ్ర సుల్తాన్‌లు'గా పేరు పొందిన పాలకులు ఎవరు?
ఎ) బహమనీ సుల్తాన్‌లు
బి) నిజాం షాహీలు
సి) అసఫ్ జాహీలు
డి) కుతుబ్ షాహీలు
36. హుస్సేన్‌సాగర్ (హైదరాబాద్) చెరువును తవ్వించినవారు?
ఎ) నిజాం అలీఖాన్ బి) సాలార్‌జంగ్
సి) ఇబ్రహీం కుతుబ్ షా
డి) అబుల్ హసన్ తానీషా
37. హైదరాబాద్ నగర నిర్మాత ఎవరు?
ఎ) మహమ్మద్ కులీ కుతుబ్‌షా
బి) అసఫ్ జా మీర్ ఉస్మాన్ ఖాన్
సి) ఇబ్రహీం కుతుబ్‌షా
డి) సుల్తాన్ కులీ కుతుబ్‌షా
38. చార్మినార్‌ను నిర్మించినవారు?
ఎ) అబుల్ హసన్ తానీషా
బి) సుల్తాన్ కులీ కుతుబ్‌షా
సి) ఇబ్రహీం కుతుబ్ షా
డి) మహమ్మద్ కులీ కుతుబ్‌షా
39. హైదరాబాద్‌లోని పురాతనమైన కట్టడాలు ఎక్కువగా ఏ రకమైన సంస్కృతికి సంబంధించినవి?
ఎ) ఇండో - ఆర్యన్ బి) ఇండో-గ్రీకు
సి) ఇండో - యూరోపియన్
డి) ఇండో - పర్షియన్
40. తెలంగాణలో అసఫ్ జాహీల పాలన ఏ సంవత్సరంలో ప్రారంభమైంది?
ఎ) 1723 బి) 1724
సి) 1725 డి) 1726
41. 'మహత్‌సిబ్' అనే అధికారి ప్రధాన విధి?
ఎ) రాజు ముఖ్య సలహాదారుడు
బి) గూఢచర్యం సి) ముఖ్య లేఖకుడు
డి) నైతిక విలువల ప్రచారం
42. దాశరథీ శతకాన్ని ఎవరు రచించారు?
ఎ) అద్దంకి గంగాధర కవి
బి) కందుకూరి రుద్రకవి
సి) పొన్నెగంటి తెలగనార్యుడు
డి) కంచెర్ల గోపన్న
43. గోల్కొండపై మొట్టమొదటి కోటను నిర్మించినవారు?
ఎ) కాకతీయులు బి) కుతుబ్ షాహీలు
సి) నిజాం షాహీలు డి) అసఫ్ జాహీలు
44. తెలుగు కవులు 'మల్కిభరాముడు'గా ఎవరిని కీర్తించారు?
ఎ) భక్త రామదాసు
బి) అబుల్ హసన్ తానీషా
సి) ఇబ్రహీం కుతుబ్ షా
డి) సుల్తాన్ కులీ కుతుబ్ షా
45. గోల్కొండ రాజ్యాన్ని సందర్శించిన ఫ్రెంచి యాత్రికుడు?
ఎ) నికోలో కాంటె బి) న్యూనిజ్
సి) టావెర్నియర్ డి) మార్కోపోలో
46. కాకతీయుల కాలంలో గోల్కొండను ఏమని పిలిచేవారు?
ఎ) మంగళపురం బి) రుద్రారం
సి) చాపల బండ డి) గోవుల కొండ
47. కోహినూర్ వజ్రం ఎక్కడ లభించింది?
ఎ) వజ్రకూరు బి) నేలకొండపల్లి
సి) కొల్లూరు డి) చెన్నారం
48. గోల్కొండ నుంచి రాజధానిని హైదరాబాద్‌కు మార్చిన కుతుబ్ షా పాలకుడు?
ఎ) ఇబ్రహీం బి) మహమ్మద్ కులీ
సి) సుల్తాన్ కులీ
డి) అబుల్ హసన్ తానీషా
49. అసఫ్ జాహీల మొదటి రాజధాని ఏది?
ఎ) హైదరాబాద్ బి) ఔరంగాబాద్
సి) రాయచూర్ డి) పర్బనీ
50. ఔరంగాబాద్ నుంచి తన రాజధానిని హైదరాబాద్‌కు మార్చిన అసఫ్ జాహీ రాజు?
ఎ) నాసర్‌జంగ్ బి) నిజాం అలీఖాన్
సి) మీర్ ఉస్మాన్ అలీఖాన్
డి) నిజాం ఉల్ ముల్క్
51. సికింద్రాబాద్ నగరాన్ని ఎవరి పేరు మీద నిర్మించారు?
ఎ) మొదటి అసఫ్ జా
బి) రెండో అసఫ్ జా
సి) మూడో అసఫ్ జా
డి) నాలుగో అసఫ్ జా
52. ఉస్మానియా విశ్వ విద్యాలయ స్థాపకుడు?
ఎ) మీర్ ఉస్మాన్ అలీఖాన్
బి) నిజాం అలీఖాన్
సి) మీర్ మహబూబ్ అలీఖాన్
డి) నిజాం అలీఖాన్
53. 'కాశీయాత్ర చరిత్ర'ను రాసిందెవరు?
ఎ) దాశరధి
బి) కొనగంటి సత్యనారాయణ
సి) ఏనుగుల వీరస్వామి
డి) కోలా శేషాచలం
54. 'హైదరాబాద్ అంబేద్కర్'గా పేరు పొందిన వారెవరు?
ఎ) భాగ్యరెడ్డి వర్మ
బి) అరిగే రామస్వామి
సి) బొజ్జం నర్సింహులు
డి) బి.ఎస్. వెంకటరావు
55. చార్మినార్ ఎత్తు ఎంత?
ఎ) 52 మీ. బి) 50.2 మీ.
సి) 49.8 మీ. డి) 48.7 మీ.
56. మహాత్మాగాంధీ 'వరంగల్'ను సందర్శించిన రోజు?
ఎ) 1947 జనవరి 2
బి) 1947 ఫిబ్రవరి 20
సి) 1946 ఫిబ్రవరి 5
డి) 1946 జనవరి 8
57. 'హైదరాబాద్' వారపత్రిక సంపాదకుడు?
ఎ) మందుముల నర్సింగరావు
బి) భాగ్యరెడ్డి వర్మ సి) వామన్ నాయక్
డి) మాడపాటి హనుమంతరావు
58. 'తెలంగాణా సర్దార్' బిరుదు ఎవరిది?
ఎ) జమలాపురం కేశవరావు
బి) రావి నారాయణరెడ్డి
సి) బూర్గుల రామకృష్ణారావు
డి) సురవరం ప్రతాపరెడ్డి

సమాధానాలు

1) సి	2) డి	3) బి	4) సి	5) బి
6) ఎ	7) సి	8) ఎ	9) బి	10) ఎ
11) బి	12) సి	13) ఎ	14) సి	15) బి
16) ఎ	17) డి	18) బి	19) సి	20) ఎ
21) సి	22) ఎ	23) బి	24) సి	25) డి
26) డి	27) బి	28) బి	29) ఎ	30) బి
31) డి	32) సి	33) ఎ	34) సి	35) డి
36) సి	37) ఎ	38) డి	39) డి	40) బి
41) డి	42) డి	43) ఎ	44) సి	45) సి
46) డి	47) సి	48) బి	49) బి	50) బి
51) సి	52) ఎ	53) సి	54) డి	55) డి
56) సి	57) బి	58) ఎ.		

A minor is admitted to the partnership firm as?

Model Questions

1. The payment of a lost demand draft is made to the ______?
a) Purchaser b) Payee
c) Nominee d) Any of the above
e) None of these
2. In the case of granting loan against a life insurance policy, the banker should see ______?
a) The existence of insurable interest
b) The surrender value
c) The admission of age
d) All of the above
e) None of the above
3. When a debtor owes several debts to a banker and makes a payment, the right to appropriation lies with ______?
a) The banker b) The debtor
c) The court d) All of the above
e) None of the above
4. In terms of Section 31 of the Reserve Bank of India Act, 1934 a demand draft payable to bearer may be issued only by ______?
a) Nationalized Banks
b) Scheduled Commercial Banks
c) Reserve Bank of India
d) Foreign Banks
e) None of the Above
5. Unsigned demand draft is presented for payment, the drawee branch will ______?
a) Honour it
b) Dishonour it since it does not have a mandate of the drawer bank to pay it.
c) Honour it after seeking confirmation from the collecting bank
d) Honour it if it is for small amount
e) None of the above
6. When was SBI established?
a) 1st April 1935
b) 31st July 1969
c) 5th May 1955
d) 1st July 1955
e) None of the above
7. The maximum number of partners in a non-banking partnership firm is ______?
a) 20 b) 10 c) 25 d) 11
e) None of the above
8. Which of the following agencies /organizations has recently decided that all the Stock Exchanges would introduce physical settlement of Equity Derivatives?
a) Reserve Bank of India
b) Bombay Stock Exchange
c) Registrar of Companies
d) Securities & Exchange Board of India
e) All of the above
9. How much bad loans was accumulated with the public sector banks as on 31st March 2015 as disclosed by the Finance Ministry on 21st July 2015?
a) Rs. 2.76 lakh crore
b) Rs. 2.54 lakh crore
c) Rs. 2.67 lakh crore
d) Rs. 2.27 lakh crore
e) None of the above
10. In Mutual Funds, NAV is the price of ______?
a) Entire fund value
b) One unit of a fund
c) Surrender value
d) Average value of shares
e) Dividends paid in a year
11. Presently which Indian Bank has the largest number of foreign branches?
a) SBI b) Canara Bank
c) Bank of Baroda
d) Bank of India
e) None of the above
12. Cash deposit ratio means____ ?
a) The percentage of cash-in-hand-balance with the Central Bank to the aggregate deposits
b) The percentage of total deposits received by Banks
c) The percentage of total cash money received as deposits by banks
d) All the above
e) None of the above
13. Central Government has appointed Sriram Kalyanaraman as the Managing Director (MD) and Chief Executive Officer (CEO) of which of the following organisations.
a) NABARD
b) National Housing Bank (NHB)
c) I.F.C d) IDRBT e) B.I.R.D
14. In case of a usance bill a grace period of........ Will be allowed to calculate due date of payment.
a) 3 days b) 2 days
c) 1 day d) 4 days
e) None of the above
15. In the case of FCNR accounts the payment of interest is effected in ____?
a) Indian Rupee
b) Only in Pound (£)
c) Same currency in which deposit stands
d) Yen e) None
16. Working capital requirement depends upon ______?
a) Level of activity
b) Types of business carried
c) Nature of Production cycle
d) All the above e) None
17. In which of the Acts, specimen of the cheque, bill, promissory note is given?
a) Negotiable Instruments Act
b) Banking Regulation Act
c) Mercantile Law
d) All of the above e) None
18. RBI permitted CBS-enabled Cooperative Banks to issue ATM cards in tie-up with:
a) State Bank of India
b) Any Nationalised Bank
c) a sponsor bank.
d) NABARD e) b &c



19. Who headed the RBI panel that has submitted its report titled 'Data Format for Furnishing of Credit Information to Credit Information Companies'.
a) Urjit Patel b) A.K.Sharma
c) Aditya Puri d) R.Gandhi
e) None of these
20. India's first post office savings bank ATM facility has been recently inaugurated in which of the following places?
a) Chennai b) Bengaluru
c) Mumbai d) Delhi
e) None of these
21. The main function of an Asset Management Company is to:
a) hold the securities of various schemes
b) manage the funds by making investments in various types of securities
c) hold its property for the benefit of the unit holders
d) act on behalf of SEBI
e) All the above
22. Which country on 30 June 2015 became the first-ever developed economy to default on a loan with the International Monetary Fund (IMF)?
a) Afganisthan b) Australia
c) Bangaladesh d) Greece
e) Canada
23. The minimum period under which a term deposit under Reinvestment Plan can be issued is____?
a) 24 months b) 12 months
c) 6 months d) 9 months
e) None
24. A minor is admitted to the partnership firm as ______?
a) Agent b) Partner
c) Minor d) Beneficiary
e) None
25. Which bank on 4th July 2015 became the first in the country to launch the MUDRA Card, under the Pradhan Mantri MUDRA Yojana (PMMY) scheme?
a) Andhra Bank
b) Bank of Baroda
c) Central Bank
d) Corporation Bank
e) Union Bank of India
26. Who was named as the first Chairman of the Bandhan Bank, which announced its Board of Directors on 9th July 2015?
a) Ashok K. Lahiri
b) Subir Gokaran
c) S.S.Mundra
d) Pratik Choudhary
e) T.S.Vijayan
27. What is the limitation of the number of persons in a joint savings bank account?
a) Two b) Four c) Five
d) Twenty e) No limit
28. After acceptance of a bill, the primary liability on a Bill of Exchange is that of ______?
a) Payee b) Acceptor
c) Drawee d) Endorsee
e) All of the above
29. The full form of SREP used in Basel framework is :
a) Standard Review and Evaluation Process
b) Supervisory Review and evaluation Process
c) Standardised Revision and Evaluation Practice
d) Supervisory Review and Electronic Process e) None
30. In order to enable private sector banks to attract and retain professional directors, the Reserve Bank has issued guidelines on compensation for non-executive Directors for implementation by private sector banks, that will reflect market realities and will be within the parameters specified in the:
a) Banking Regulation Act, 1949
b) The Indian Companies Act, 2013 (Amended)
c) RBI Act 1934
d) As per the directives of Indian Banks Association
e) Both a&b
31. An executor of deceased account is appointed under ______?
a) Trust b) Court c) Will
d) Family tradition
e) None of the above
32. Relationship between the RBI and the bank maintaining currency chest will be of ______?
a) Trustee and beneficiary
b) Principal and agent
c) Licensor and licensee
d) Creditor and debtor
e) None of the above
33. The Reserve Bank has advised all public sector banks and select private sector and foreign banks to appoint an internal Ombudsman. The internal Ombudsman would be designated as ______:
a) Chief Ombudsman Service Officer
b) Chief Customer Ombudsman Officer
c) Internal Ombudsman Customer Service Officer
d) Chief Customer Service Officer
e) Chief Transaction Audit Officer

Answers

1) a	2) d	3) b	4) c	5) b
6) d	7) a	8) d	9) c	10) b
11) a	12) a	13) b	14) a	15) c
16) d	17) e	18) c	19) c	20) a
21) b	22) d	23) c	24) d	25) d
26) a	27) e	28) b	29) b	30) e
31) c	32) b	33) d.		